
A-PDF Merger DEMO : Purchase from www.A-PDF

# యజ్ఞగానం



1173

# యక్షగానం

'శ్రీకృష్ణకుంజ్'
దేదీప్యమానంగా వెలుగుతూ ఉంది.

'కృష్ణం భజరాధా !' అని కొన్ని కంఠాలు రకరకాల రాగాలు కలిపి పాడుతున్నాయి.

ఆవరణ అంతా అగరత్తుల సువాసన. పువ్వుల సువాసనతో ఏవో లోకాలకు తీసుకుపోతుంది.

గేటు ముందునుండి వెడుతున్న జనం ఒక్క క్షణం ఆగి కృష్ణభజన విని వెళుతున్నారు. కొందరు లోపలికి వెళ్ళి ఏమిటని చూస్తున్నారు.

ఇంటి ఆవరణలో పెద్ద తూగుటుయ్యాల కట్టి ఉంది. ఉయ్యాల చేర్లకు మల్లెలు, కనకాంబరాలు కట్టి ఉన్నాయి. ఆ తూగుటుయ్యాలపై అపర శ్రీకృష్ణుడిలా పడుకున్నాడో వ్యక్తి. పసుపురంగు ధోవతి, నీలం చొక్కా వేసుకున్నాడు. అతని మెడలో పూలదండ, పింఛము, చేతిలో మురళి ఉన్నది. తెల్లచీర కట్టుకున్న ఒక స్త్రీ కృష్ణ పరమాత్మ కాళ్ళు ఒత్తుతున్నది. మరో స్త్రీ తలవైపు కూర్చుని తాంబూలం అందిస్తోంది.

అతని ఎదురుపీటపై కూర్చున్న స్త్రీ పన్నీరు చిలకరిస్తూ, మధ్య, మధ్య గంధం పూస్తున్నది. వెనకవైపు నిలబడిన మరో స్త్రీ విసనకర్రతో వీస్తున్నది. ఆ ఉయ్యాల ఎదురుగా, స్త్రీ, పురుషులు బారులు తీరి కూర్చు

న్నారు. ఆ ఉయ్యాలకు కొద్ది దూరంలో ఓ యువతి కూర్చుని ఉంది. ముందుకు జరిగిన ప్రతి భక్తుడు, భక్తురాలు ఆ యువతి ముందున్న వెదురు కర్రలు అయిదు రూపాయలిచ్చి కొంటున్నారు. కొందరు ఒక గ్లాసుపాలు, తులసి ఆకులు పదిహేను రూపాయలు ఇచ్చి కొంటున్నారు. అప్పుడే ఓ యువకుడు మాసిన గుడ్డలతో, పెరిగిన గడ్డంతో, తూలుతూవచ్చి ఆ ఆవరణలో పడిపోయాడు.

అతని చెవులు చిల్లులు పడ్డట్టుగా ఒకేసారి కొన్ని గొంతుకలు అరిచాయి.

"కృష్ణహరే...కృష్ణహరే...!"

"గోవిందా...గోపాలా!"

"రాధేముకుందా! గోవిందా!"

ఆ యువకుడు లేచి ఆ గుంపులోకి పోబోయాడు. ఒకతను వచ్చి అతడిని పట్టుకున్నాడు.

"మురళి కొన్నావా!"

"మురళి కొనాలా! ఎందుకు!"

"మరి కృష్ణభగవానుడి దర్శనము కావాలంటే మురళిగాని, పాలుగాని కొనాలి. మురళి ఖరీదు అయిదు రూపాయలు, పాల ఖరీదు పదిహేను రూపాయలు..." అన్నాడతను.

యువకుడు నీరసంగా నవ్వాడు.

"పిచ్చి పట్టిందా! అలా నవ్వుతావేం."

"ఏకే పిచ్చి, అయిదు రూపాయలుంటే, సినిమా టికెట్ల దగ్గర క్యూలో నిలబడి, టికెట్టు కొనుక్కునేవాడిని. అయిదు రూపాయలది పది రూపాయలకమ్మి పొట్ట నింపుకునేవాడిని..." అతను మాట్లాడలేక ఎగ...నమ్మ పీల్చాడు.

"ఎవరయ్యా బాబూ?"



"ఎవరినా..." మాట్లాడలేనట్టు మంచి నీళ్ళని సైగచేసాడు. భక్తులలో ఎవరూ కదలలేదు.

అమ్మో! కదిలితే ఇంకేం ఉంది! క్యూ పోదూ! క్యూ పోతే దర్శనం ఆలస్యం అవదూ! దర్శనం కాకపోతే పాపం చుట్టుకోదూ! వెదురు పుల్లలమ్ముతున్న యువతే చటుక్కున లేచి, తన ప్రక్కనున్న పాలు ఓ గ్లాసులో తెచ్చి అతనికి త్రాగించింది.

"హమ్మ... అమ్మయ్య..." అతనక్కడున్న స్తంభానికి చేరబడిపోయాడు. ఆ కలకలం చూచి, ఆ యువతి వెంటనే వెనక్కు తిరిగింది. భక్తులు భగవానుని ముందు తమ, తమ కష్టాలను ఏకరువు పెడుతున్నారు. భగవానుడు తలాడించి విని పరిష్కారాలు చెబుతున్నాడు.

కొందరు తృప్తిగా భగవంతుడి పాదాలపై పడి నమస్కరించి వెళ్ళిపోతున్నారు. మరికొందరు ప్రాధేయపడి విసిగిస్తున్నారు.

"నా బిడ్డ కాపురం నిలబెట్టు స్వామి. అడిగిందల్లా ఇచ్చినా అల్లుడికి తృప్తిలేదు."

భగవంతుడు చిద్విలాసంగా నవ్వాడు.

"చిల్లర, మల్లర బహుమతులెందుకు! హాయిగా ఒకేసారి స్కూటరు ఇవ్వు. కూతురిని ఏలుకుంటాడు. మనవడిని అంపిస్తాడు."

"అంతేనా స్వామీ!"

"అంతేనమ్మా! భగవంతుడయినా ముడుపుకే ఆశీస్సులు విడుపు చేస్తాడు." ఆమె వెళ్ళిపోబోయింది. భగవంతుడు చిరునవ్వుతో ప్రక్కనున్న వెండిగిన్నెలోని పాలు ఆమె చేతిలో పోసాడు.

"మహాప్రసాదం..." ఆమె అవి త్రాగి, చేయి తలకు రుద్దుకుని వెళ్ళిపోయింది, ముందుకు.

ఆమె వెనుకనున్న పురుషుడు దేకుతూ ముందుకు వచ్చాడు.

అతడిని చూస్తూనే భగవంతుడు ఆగ్రహించాడు.

"తెలివితక్కువ పనులుచేసి, అనామకులను వ్యాపారంలో పెట్టుకుని నష్టం, నష్టం అంటావ్. నా కళ్ళముందునుండి పో...పొమ్మంటే..."

"స్వామి !"

"వెళ్లు." నీళ్లు తీసి పైన చిలుకరించాడు స్వామి.

అతని పాదాలు ఒత్తుతున్న స్త్రీ చటుక్కున లేచి, ఆ పురుషుడిని ప్రక్కకు తీసుకువెళ్ళింది.

"తరువాత మాట్లాడుదువు. స్వామివారికి ఆగ్రహం వచ్చింది."

"యెందుకు !"

"అది మళ్ళీ వారం అడగాలి"

"సరే..." ఆ పురుషుడు వెళ్ళిపోయాడు.

మరో పదహారేళ్ళ అమ్మాయి, ఒక వృద్ధుడు వచ్చారు. ఆ వృద్ధుడు అమాంతంగా తూగుటుయ్యాల ముందు సాగిలబడి పోయాడు.

"కృష్ణా ! ఆపత్ బాంధవా ! అనాధ రక్షకా ! నా కూతురి పిచ్చి నయం చేసావా తండ్రీ..." అంటూ స్తోత్రం మొదలు పెట్టాడు.

ఉయ్యాలలో కృష్ణపరమాత్మ ఈసారి గంభీరంగా నవ్వాడు.

"నాయనా ! అంతా కర్మఫలం. కర్మఫలం తీరిపోయింది, ఆమె ఆరోగ్యవంతురాలయింది" అని గ్లాసు పాలలో ముంచగానే, యువతి నోరు తెరిచింది. గుక్కెడుపాలు పోసి, అభయహస్తం చూపి ఆశీర్వదించాడు.

ఆ యువతి, వృద్ధుడు బయటికి వచ్చారు. మరో స్త్రీ భగవానుని చరణాలలో వాలిపోయింది.

నీరసంగా స్థంభానికి ఉన్న యువకుడు కళ్లు విప్పాడు.

"యెవరు బాబూ ! అనారోగ్యంతో వచ్చావా ! రావలసిన చోటుకే వచ్చావు. ఆ స్వామి కరుణాకటాక్షం ఉంటే ఉష్మని ఊదినట్టుపోదూ ఏ జబ్బు !" అన్నాడా వృద్ధుడు.

"ఇది ఎవరూ తీసివేయలేని జబ్బండి. నిరుద్యోగం, ఆకలి..." అన్నాడు.



"అన్ని జబ్బులు నయం చేస్తాడా స్వామి... నీ పేరు ?"

"నా పేరు ఆదిత్య. బి. కాం. పాసయ్యాను. మూడేళ్లుగా తిరుగుతున్నా ఉద్యోగం దొరకలేదు." అన్నాడు కాస్త ఆవేశంగా.

"ఆ స్వామి సన్నిధికి వచ్చావు. అన్నీ దొరుకుతాయి. నిశ్చింతగా ఉండు."

"ఈ స్వామి యెవరండీ !"

"సాక్షాత్తు ఆ శ్రీకృష్ణపరమాత్ముడు."

"మీరే యుగంలో ఉన్నారు సర్ ! ఇది ద్వాపరయుగం కాదు కలియుగం. కలియుగంలో అంతా స్వాహా స్వాములే ఉంటారు." అన్నాడు.

"తెలుసు నాయనా, కాని పాపం పెరిగితే భగవంతుడు అవతారం ఎత్తుతాడు" అన్నాడా వృద్ధుడు.

"ఇదెక్కడి మాయండీ బాబూ. ఎవరండీ ఈ కృష్ణుడు, ద్వారకలో పుట్టాడా, మధురలోనా !" ఆదిత్య వెటకారం చేసాడు.

"అదిగో...అదిగో ఆ వెటకారము వద్దు. ఈ ఊళ్ళోనే పుట్టారు స్వామి. ఆయన అసలు పేరు ముకుందాదేవి..."

"ఏమిటి స్వామి స్త్రీయా ?" ఆదిత్య ఉలిక్కిపడ్డాడు.

"అవునయ్యా బాబూ ! ప్రతీ సోమ, గురు, శని వారాలు మాత్రం ఆ కృష్ణపరమాత్మ ఆమెను ఆవహిస్తాడు. అడిగింది చెబుతారు."

"ట్రాష్ !"

"ఉష్ ! గట్టిగా అరవకు, భక్తులు విన్నారంటే నీ బుర్ర రామకీర్తన పాడిస్తారు"

"భక్తి అంత ముదిరిపోయిందా ?"

"కాదు. ఆయన శక్తి" అన్నాడు వృద్ధుడు.

ఆదిత్య అతనివంక చూచి మళ్ళీ ఇంటివంక చూచాడు. భక్తుల క్యూ

తరగనే లేదు. అందరూ మూర్ఖులా! కాకపోతే కృష్ణపరమాత్మ ఏమిటి?

విద్యావంతులు, సంస్కారవంతులు కూడా ఉన్నారు.

విద్య డిగ్రీలతో, సంస్కారం వేషభాషలతో కొలువలేమని అర్థం అయింది.

"మీదీ ఊరా సర్!"

"కాదయ్యా, సామర్లకోట. రైల్వేలో ఉద్యోగం చేస్తాను. లలిత నా కూతురు. సంవత్సరంనుండీ పిచ్చి. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. స్వామివారి చరణాలలో వేశాను. ఆరు వారాలకే తగ్గిపోయింది." అన్నాడు.

ఆదిత్య ఆశ్చర్యంగా చూచాడు. మరోసారయితే గంటలు, గంటలు ఉపన్యాసం ఇచ్చి, రియలిజమ్, రేషనలిజమ్ అంటూ గొంతు చించుకునేవాడు.

ఆ వృద్ధుడు తన కూతురుకి బాగయిన విషయము మరెవరికో చెబుతున్నాడు. ఆదిత్య అలసటగా కళ్ళు మూసుకున్నాడు.

"స్వామివారి కెందుకే అంత ఆగ్రహం అబ్బో జానకిని చూస్తూనే మండిపడ్డాడు..." ఓ స్త్రీ గొంతు వినిపించింది.

"ఆయన లీలామానుష విగ్రుడు...ఇది అపబిడ్డను సతాయించేది గ్రహించదా!"

"అవునే. మొన్న మా రమ పాపకు ఒళ్లుతెలియని జ్వరమే. ఆరోజు డాక్టర్ల సమ్మె. ఏ డాక్టరు దొరకలేదు. స్వామివారి దగ్గరకు వచ్చాం. గరిటెడు పాలతో బాగుచేశాడు."

"అవి పాలు కావే. అమృతధారలు, ఇలాంటి కారణజన్ములుండబట్టే ఇంకా ధర్మం కుంటుతూనయినా నడుస్తుంది" అన్నది.

"చంద్రశేఖా! ఇది విన్నావా! మా శేఖర్ ఫారిన్ ఈ సంవత్సరం వెళ్తాడట!" అన్నాడో నడివయసు అతను.

"ఈ సంవత్సరం అంటే డిసెంబర్ వరకే కదా."



"అవును. నాలుగునెలలు ఎంతలో వస్తాయి." అన్నదో స్త్రీ కంఠము.

"మావాడు అమెరికా వెళ్తే కనకాభిషేకం చేయిస్తాను" అన్నది మరో స్త్రీ. ఇలా రక, రకాలుగా స్వామివారి మహిమలు మాట్లాడుకుంటూ వెళ్తున్నారు జనం.

ఆదిత్య అయోమయంగా చూచి, లేచి వారితో మాట్లాడాలంటే శక్తి చాలటం లేదు.

"అందరికి అన్నీ చెబుతున్నారు. నేనేం పాపం చేశాను..." ఒక స్త్రీ కన్నీరు, మున్నీరుగా ఏడుస్తూ నిరాశగా వెళ్తుంది.

కృష్ణకుంజ్ ఊడ్చే మల్లమ్మట. సానుభూతిగా ఆ స్త్రీ కళ్ళు ఒత్తింది.

"ఏం కష్టం వచ్చింది తల్లీ?"

"మా ఆయన తాగుబోతు. ఉన్న భూములు అమ్ముతున్నాడు. పిల్లలున్నారు. నేనేం చేయను! అదికాక పిల్లడు రెండుసార్లు పరీక్ష తప్పాడు" అన్నది వల, వల ఏడుస్తూ.

"మరో రెండు వారాలు స్వామిని దర్శించు" సలహా ఇచ్చింది మల్లమ్మ. ఆ స్త్రీలు వెళ్ళిపోయారు.

ఆదిత్య ఓపిక చేసుకుని లేచి, ప్రక్కనున్న గుమ్మంగుండా లోపలికి తొంగి చూచాడు.

ఒకతను వాలు కుర్చీలో కూర్చుని ఎదురు స్టాండుపై ఉన్న పుస్తకం చదువుతున్నాడు. ఆదిత్య నిలబడలేక తలుపుపై వాలిపోయాడు. తలుపు కిర్రుమన్నది.

"యెవరూ!"

"నే...నే...ఇక్కడ పాటలు వినిపిస్తే..." ఏం చెప్పాలో తెలియలేదు.

"కళ్ళు మసకలా!" అతను నవ్వాడు. అతని ఒంటరి మూర్తి, మరింత ఒంటరైపోయింది.

"ఎందుకు ?"

"పాటలు, భజనలు అక్కడ జరుగుతాయి."

"అక్కడ చూచాను. భక్తులు చాలామంది ఉన్నారు. మీరు..." అనుమానంగా చూచాడు ఆదిత్య.

"నా పేరు నందనరావు. ముకుందాదేవి...అదే శ్రీకృష్ణ పరమాత్మ భర్తను" అన్నాడు.

ఆదిత్యకు అతడిని చూస్తే చదువు, సంస్కారమున్నట్టు అనిపించింది.

"మనిషిని, భగవంతుడని మీరు నమ్ముతారా ?"

"యెవరయ్యా బాబూ. సి. ఐ. డి. వా ?"

"మీ అనుమానం నిజం అయితే కనీసం రెండుసార్లు భోజనం చేస్తాను" అన్నాడు ఆదిత్య ఆర్తిగా.

"నేను లేచి ఇవ్వలేను. నువ్వు ఆకలిమీద ఉన్నట్టున్నావు. ఆ బల్ల మీద పండున్నది తీసుకో" అన్నాడు నందనరావు.

"వద్దు సార్. ఆ భక్తులలో యెవరో కాసిన్ని పాలు పోసి పుణ్యం కట్టుకున్నారు" అన్నాడు.

"మా నీలిమే అయి వుంటుంది."

"నీలిమ. ఆమె ఎవరండి ?"

"నా కూతురు బాబూ" అన్నాడు ఆయన.

"మీకు..." అతని చెయ్యివంక చూచాడు.

"పక్షవాతం వచ్చింది బాబూ. నీవెవరు ?"

"మాది కరీమ్‌నగర్ జిల్లా సర్. బి.కాం. పాసయ్యాను. మూడేళ్ళుగా ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు."

"ఈ దేశంలో న్యాయంగా బ్రతికేవాడి కేం దొరకదు బాబూ." నందనరావుతో కబుర్లు చెబుతుంటే, తండ్రి గుర్తుకువచ్చాడు ఆదిత్యకు.

# 2

"**అమ్మా !** అవతారం చాలించు."

కృష్ణపరమాత్మ కళ్ళువిప్పి చుట్టూ చూచాడు. **అందరూ వెళ్ళి** పోయారు. డబ్బులపెట్టె పట్టుకుని నీలిమ నిల్చుంది.

దూరంగా చీపురు పట్టుకుని మల్లమ్మ నిల్చుంది.

"అమ్మా ! అవతారం చాలించు."

కృష్ణపరమాత్మ వరండానానుకుని ఉన్న హాల్లోకి వెళ్ళి అలంకారాలన్నీ తీసివేసి, నీలంరంగు వెంకటగిరి చీర కట్టుకుని వేలుముడి వేసుకుంటూ వచ్చింది.

"టైమెంత నీలూ."

"పది, పది నిమిషాలు."

"అబ్బ ! ఈ రోజు త్వరగానే తెమిలింది." నడుము సవరించుకున్నది.

"అంతా ఊడ్చి గేటు వెయ్యి మల్లమ్మా."

"అట్టాగేనమ్మ..."

ముకుందాదేవి, కూతురితో ఇంట్లో అడుగుపెట్టేసరికి భర్త చదువుకుంటున్నాడు. ప్రక్కనే ఉన్న కుర్చీలో పడి ఆదెత్య నిదురబోతున్నాడు.

"అతనెవరండీ ?"

"నిరుద్యోగిట ముకుందా !"

"ఇక్కడెందుకు పడుకున్నాడు."

"లేచివెళ్ళే శక్తిలేక," అన్నాడు అతను.

"అవునమ్మా ! అర్చన జరిగేటప్పుడు వచ్చాడు." అస్నది నీలిమ. ముకుందాదేవి మాట్లాడక లోపలికి వెళ్ళింది.

"నీలూ! మీ నాన్నగారిని తీసుకునిరా, భోజనం చేద్దాం." అన్నదామె లోపలినుండి.

"ఆ కుర్రాడు ఆకలిమీదున్నాడు నీలూ." అన్నాడు నందనరావు.

"ఏం పేరన్నారు నాన్నా?"

"ఆదిత్య అటమ్మా. కబుర్లలో బయటపడింది. నా హైస్కూల్ క్లాసుమేటు కమలాకరం కొడుకు." అన్నారాయన సంతోషంగా.

"అలాగా!... ఆదిత్యగారూ...ఓ ఆదిత్యగారూ."

ఆదిత్య ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"పిలిచారా సర్?"

"సర్ ఏమిటయ్యా సర్! హాయిగా బాబాయ్ అను. మీ నాన్నను ఏడ్పించటానికి అన్న, అన్న అనేవారం."

"వస్తానండి." లేచాడు ఆదిత్య.

"భోజనం చెయ్యకుండానా! మొదట వెళ్ళి స్నానం చెయ్యి" అన్నాడు.

"థాంక్స్...సర్...కాదు అంకుల్."

"నీలూ! నా బట్టలు చాలాకాలం క్రితం కుట్టించుకున్నవి పనికివస్తాయేమో చూడు..." అన్నాడు.

ఆదిత్య స్నానం చేసి వచ్చేసరికి నీలిమ బట్టలు తెచ్చి ఇచ్చింది. వాళ్ళతో కూర్చుని భోజనం చేస్తున్నా అతని దృష్టి అంతా ముకుందాదేవి పైనే ఉంది. ఆమె ఇబ్బందిగా చూచింది.

"భోజనం చెయ్యి" హెచ్చరించింది.

తల వంచుకున్నాడు. అతని తలలో కందిరీగలు రొద పెడుతున్నాయి. నిజంగా...నిజంగా ఆమెను కృష్ణుడు ఆవహిస్తాడా! అదంతా నటనా! నటనే అయితే ఇంతమంది భక్తులు ఎలా గూడారు?

1173



"ఆదిత్యా! మీ అమ్మకో తమ్ముడుండాలి." గుర్తు చేసాడు నందనరావు.

"ఉన్నాడండి. అతను పెద్ద కంట్రాక్టరు. మాలాంటివారిని ఆయన కూలిగాకూడా అంగీకరించడు."

"మీ నాన్నకోసం వచ్చేవాడు." అన్నాడు.

ఆదిత్య మరోసారి ముకుందాదేవిని చూచాడు. ఆమె చిన్నగా చిరునవ్వు నవ్వింది.

"చూడు బాబూ! నువ్వు యెవరో నాకు తెలియదు. ఏ పని చేసేటప్పుడు, ఆ పనిలో శ్రద్ధ చూపించటం కనీస లక్షణం" అన్నది. ఆ మాటలలో మార్దవమే తప్ప మరో భావంలేదు.

భోజనాలు కాగానే ఆదిత్యకు పనికుర్రాడు వరండాలో పడక వేశాడు.

ముకుందాదేవి, నీలిమ, వారి, వారి గదులలోకి వెళ్ళారు. నీలిమ తలుపులు, కిటికీలు వేసింది. తన వెదురు బొంగులు, పాలు అమ్మిన డబ్బు లెక్కచూచింది.

పంద యాభై వెదురు బొంగులు అమ్ముడయ్యాయి.

నలభై గ్లాసుల పాలు అమ్ముడయినా, లెక్క ముప్పై తొమ్మిదికే వచ్చింది. అప్పుడు గుర్తుకు వచ్చింది. ఒక్కగ్లాసు పాలు ఆదిత్యకు ఇచ్చిందని. డబ్బులన్నీ బొత్తిగాపెట్టి, పది రూపాయలు, అయిదు రూపాయలు, రూపాయినోట్లు విడిగా తీసి పెట్టింది. చిల్లరంతా ఒక సంచీలో వేసింది.

మెల్లగా బీరువా తీసింది. బీరువాలో ఒక ప్రక్కన చిన్న తలుపుంది. అవి తీసి, అక్కడినుండి ఏర్పడిన ద్వారంగుండా లోపలికి వెళ్ళింది. లోపల చిన్న స్టోర్ గది ఉంది. ఆ గదిలో వెండి గిన్నెలు, పళ్ళాలు, బంగారు నగలు, డబ్బు ఉంది.

పది రూపాయలనోట్ల బొత్తి వాటి స్థలంలో, అయిదు రూపాయల

బొత్తి వాటి స్థలంలో ఉంచింది. ఓ చిన్ననోటు పుస్తకంతీసి, ఆనాటి డబ్బు వివరాలు రాసింది. వచ్చిన తరువాత యథావిధిగా బీరువా మూసింది. ఆవులిస్తూ మంచంలో వాలిపోయింది. ఆమెకు అలసటగా ఉన్నది.

"నీలూ !"

ఆమె లేచి కూర్చుంది. తల్లి గుమ్మంలో నిలబడింది.

"పిలిచావా అమ్మా ?"

"అవును నీలూ. నా బ్రతుకులో సగభాగం నీ గురించే నేను ఆలోచించాను. ఆరాటపడ్డాను. నీకు పెళ్ళి చేయాలని అనుకున్నాను" అన్నది.

"నువ్వు చేయాలనుకుంటే చేసుకునే వారుండవద్దూ ?"

"నీలూ."

"అవునమ్మా. లోగడ మీరు రెండు మూడు ప్రయత్నాలు చేశారు. 'మాకు మనుష్యుల పిల్లలు కావాలి, దేవతల పిల్లలు వద్దు' అన్నారు. ఆ విషయాలు మరిచిపోయారా."

"ఇప్పుడు ఇక్కడి సంబంధం కాదమ్మా. నా చిన్ననాటి స్నేహితురాలుంది. అమెరికా నుండి వచ్చింది. దాని కొడుక్కు అయితే, మాకు దూరంగా ఉంటావు."

"అమ్మా." దెబ్బతిన్నట్టు చూచింది.

"అవును నీలూ. నేను ఇంత శ్రమలకోర్చి నిన్ను కని, పెంచింది నీ జీవితం గాలికి వదిలివేయాలని కాదు" అన్నదామె.

"అది కాదమ్మా. నీకండగా ఎవరుంటారు. వెదురుబొంగులు మరెవరికిచ్చినా ఆ కృష్ణపరమాత్మ ఆగ్రహించడూ" అన్నదామె.

"పిచ్చిపిల్లా." నవ్వింది ముకుందాదేవి. ఆమె ముఖంపై విచిత్రమైన నవ్వు నర్తించింది.

"అవతారమే చాలిస్తాను."

"అవతారం చాలిస్తావా ?" అదిరిపడింది నీలు.



"అవును. అవతారమే చాలిస్తాను. నీకోసం నేను ఎన్నో తప్పులు చేశాను నీలు. అవతారం చాలించటం చాలా తేలిక. రేపు సావిత్రి వస్తుంది. ఆ విషయమే చెప్పాలనుకుంటున్నాను" అన్నది గంభీరంగా.

"సరే..." అన్నది నీలు నిట్టూరుస్తూ. ఆమెకు ఆ విషయం అంత సంతోషాన్ని కల్గించలేదు. ప్రతి విషయానికి పరమాత్ముని అవతారమైనా తన సహకారం లేనిదే గడపలేని తల్లి, పక్షపాతంతో తీసుకుంటున్న తండ్రిని యెలా వదిలి వెళుతుంది ?

"నీలూ..."

అదిరిపడి బయటికి వచ్చింది. తండ్రి విపరీతంగా కదిలిపోతున్నాడు.

"ఏమిటి నాన్నగారూ."

"ఏమిటో...ఆ మాత్ర..." అన్నాడు ఊపిరి అందనట్టు సతమతం అవుతూ.

ఆమె మాత్ర ఇచ్చి మంచినీళ్ళు త్రాగించింది. అయిదు నిమిషాలకు పడుకున్నాడు.

అలాగే అతన్ని చూస్తూ కూర్చుంది. తండ్రి దిండు దగ్గర రామకృష్ణ పరమహంస జీవిత చరిత్ర దొరికింది.

అది చదువుతూ అలాగే కూర్చుంది. హాల్లోని గడియారం పన్నెండుసార్లు పిట్టలా అరిచింది. ఆ గడియారం ముకుందాదేవి భక్తులు తెచ్చారు. చెక్కతో చేశారు. సరిగ్గా గంట, గంటకు చెక్కపెట్టె తలుపు తీసుకుని, ఒక చిన్న పిట్టవచ్చి, కూసి పోతుంది.

నీలిమ లేవబోయింది. ఆమె పమిట నందనరావు భుజం క్రింద ఉంది.

ఆమె విదిలించుకుని లేచింది. దాంతో ఆయన మేలుకున్నాడు.

"నువ్వింకా నిదురపోలేదా నీలూ !"

"ఇదిగో వెళాను నాన్నా" లేచిందామె.

"వారం రోజులనుండి, రామకృష్ణ పరమహంస జీవిత చరిత్ర చదువాలని యెంతో ప్రయత్నం చేస్తున్నా నా, ఎందుకో చదువలేకపోతున్నాను. మీ అమ్మకు, నీకు భారంగా ఎన్నాళ్ళు బతకాలో" ఆయన నిట్టూర్చాడు.

"నాన్నగారూ! ఆ మాటంటే నే నూరుకోను. మొగవారికి తామే సంపాదించి, కుటుంబాన్ని నడపాలన్న అహంభావం ఎప్పుడు పోతుందో..."

"అహంకాదు...ఆవేదన. నా ఆవేదన నీకు అర్థంకాదు."

ఆమె ఏదో అనబోయేటంతలో కాలింగ్‌బెల్ మోగింది. ఏం జరిగిందోనని వెళ్ళింది నీలిమ.

మల్లమ్మ కొడుకు 'అమ్మా' 'అమ్మా' అంటూ పిలిచాడు కిటికీ తలుపు తీసింది.

"యెవరు యాదగిరీ?"

"కంట్రాక్టర్ బాబమ్మా..."

"యెవరయితేనేం? యాదగిరి ఉన్నాడుకదా" అని తలుపుతీసింది నీలిమ.

దాదాపు నల్గురు మోసుకు వచ్చారో యువకుడిని. అతని వెనుకే కంట్రాక్టరు కనకరాజు నిల్చున్నాడు.

"భగవంతుడేడి!... ఆ కృష్ణపరమాత్మ ఏడి?"

"కనకరాజుగారూ? అబ్బాయికి ప్రమాదంగా ఉన్నది. హాస్పిటలికి తీసుకువెళ్ళు." అన్నది నీలిమ.

"వద్దమ్మా...ఆ మాటే అనకు. ఆ స్వామి పాదధూళి చాలు."

"అమ్మ నిదురబోతుండండీ..."

"మీ అమ్మ నిదురబోతుండేమో. ఆ భగవంతుడు ఎప్పుడూ భక్తులకు పలుకుతాడు. పాహిమామ్...రక్షమామ్...పరమాత్మా...మా అత్మవు నీవే..." అంటూ పాట ఎత్తుకున్నాడు కనకరాజు.



"భయంలేదు కనకరాజూ..." గుమ్మంలో [illegible] బడింది. కనకరాజు అమాంతంగా ఆమె కాళ్ళపై పడిపో[illegible] వాడు.

ముకుందాదేవి గ్లాసులోని పాలు అతని కిచ్చింది.

"ఈ పాలు త్రాగించగల్గితే నీ కొడుకు నీవాడు."

"అమ్మా..." నీలిమ వారించబోయింది. ముకుందాదేవి తీక్షణంగా చూచింది.

నీలిమ మాట్లాడక తమాషా చూడసాగింది.

యెలాగయితేనేం అతని చేతి పాలు త్రాగించారు. అరగంటకు అతను కదిలాడు.

"కనకరాజూ! భక్తిని వ్యక్తంచేసే శక్తి ఉండాలి. అబ్బాయిని ఏదయినా నర్సింగ్‌హోమ్‌లో పెట్టండి" అన్నది ముకుందాదేవి.

"అజ్ఞ భగవాన్..." అతను మరోసారి ఆమె పాదాలపై పడిపోయాడు.

ఆమె మౌనంగా వెనక్కు తిరిగింది. భక్తులు వెళ్ళాక తలుపులు వేసి వచ్చేసరికి, పిట్టగోడ్ము రెండుసార్లు కూచింది. అలసటగా ఎవరి పడకలు వారు చేరారు. నీలిమను నిదుర వెలివేసింది– అటు, ఇటు దొర్లింది. మనిషికి ఆలోచనా శక్తి లేకపోతేనే హాయి. నిదురావస్తలో హాయిగా బతికేస్తాడు. అనుకుంది.

డాక్టర్ శివాజీ మాన్వీకర్ నర్శింగ్‌హోమ్ అది. అతని హస్తవాసి చాలా మంచిదని అందరూ అనుకుంటారు. అదే విషయంమీద కంట్రాక్టరు కనకరాజు, మరో వ్యక్తి ఘర్షణ పడుతున్నారు. "డాక్టరు బాగుచేసాక భగవంతుడు అంటావేమయ్యా" అన్నాడు అతను. అతను ఆ ప్రదేశంలో సోషియల్ వర్కర్. అతని అసలు పేరేమిటోగాని అందరు గాంధి అని పేరు పెట్టారు.

"ఇదిగో చూడవయ్యా! నీ పేరు గాంధీయో, నెహ్రూనో నాకు తెలియదు. ఆ భగవంతుడు ఇక్కడికి పంపితే వచ్చాను."

"ఏమిటేమిటి కనకరాజుగారూ!" గాంధీ అడిగాడు.

"సాక్షాత్తూ, స్వయంగా ఆ భగవంతుడే పంపాడీ నర్సింగ్‌హోమ్‌కి"

"ఓహో! అంటే భగవంతుడికి తనమీద తనకు నమ్మకం లేదన్న మాట."

"నీకు చెప్పినా అర్థం కాదయ్యా."

వారి సంభాషణకు ఫుల్‌స్టాపు పెడుతూ వాకిట్లో ఒక టొయోటో కారు వచ్చి ఆగింది. అక్కడున్న వాచ్‌మెన్ వచ్చి కారు తలుపుతీశాడు. తెల్లగా, హుందాగా, అందంగా, పిల్లికళ్ళతో ఉన్న నలభై ఏళ్ళ వ్యక్తి దిగాడు. అతను తెల్లటి బట్టలు ధరించాడు. అతని చేతిలో ఒక గులాబి పువ్వు ఉంది.

"నమస్తే డాక్టర్‌గారూ"

"నమస్తే డాక్టర్ సాబ్..."

"నమస్తే..." అక్కడున్నవారంతా నమస్కరించారు. డాక్టర్ శివాజి ఎవరి వంకా చూడలేదు. హాల్లో అడుగుపెట్టాడు. అస్పష్టంగా ఉన్న ఒక పాలరాతి స్త్రీ మూర్తికి, చేతిలో ఉన్న గులాబి పువ్వు సమర్పించి, భక్తిగా నమస్కరించాడు. ఒక్క నిముషం మౌనంగా ఉండి, చిరునవ్వుతో అందరినీ గ్రీట్ చేసాడు.

"ఏమిటి గాంధీగారూ! ఉదయమే ఉపన్యాస కార్యక్రమము పెట్టుకున్నారు" అన్నాడాయన.

"అబ్బే...రోగాలను భగవంతుడు బాగుచేస్తాడా, డాక్టరా అని చర్చిస్తున్నాం. మన కనకరాజుగారికి భగవంతుడు కనిపించాడట."

"ఓ అయిసీ..." చిన్నగా నవ్వాడు శివాజి.



"అబ్బే...మీరలా నవ్వటం బావుండ్లా...జవాబు చెప్పాలి" అన్నాడు గాంధి. డాక్టరు గదికి వెళ్తుంటే అందరూ అనుసరించారు.

"భగవంతుని సహకారం లేనిదే మీరు ప్రాణాలు పోస్తారా డాక్టర్ గారూ!" కనకరాజు అడిగాడు.

అతను గదిలోకి అడుగు పెట్టగానే, నర్స్ "గుడ్‌మార్నింగ్ సర్" అని, తెల్లకోటు అందించింది.

"థాంక్యూ..." అతను కోటు తీసుకుని, స్టెత్ మెడలో వేసుకున్నాడు.

"డాక్టరుగారూ..."

"గాంధిగారూ! ఈరోజు సాయంత్రం వై. ఎమ్. సి. హాలులో ఏదో మీటింగ్ ఉంది. నాకు గుర్తుంది" అన్నాడు.

"మీకు గుర్తున్నా, ఒక్కసారి గుర్తు చేయాలని అంతకంటే ఏం లేదు" గాంధిగారు లేచారు.

కనకరాజు నోట్లు డాక్టరుగారి బల్లమీద పెట్టి, పేపర్ వెయిట్ పెట్టాడు.

"అబ్బాయిని ఈ పూట తీసుకు వెళ్తున్నాను."

"మంచిది. బలహీనతవల్ల ఫిట్స్ వస్తాయి. బలమైన ఆహారం, వ్యాయామముండాలి." అన్నాడు నోట్లు డ్రాయరులో వేసి, తాళం వేస్తూ.

"అట్లాగే..." అతని వెనుక బయటికి వచ్చారు.

"డాక్టరుగారూ! కనకరాజుగారి భగవంతుని మాటేమిటి?"

శివాజీ చిన్నగా నవ్వాడు.

"భగవంతుడు ఉన్నాడో లేడో తెలియదు. నా అసహాయ స్థితిలో ఆదుకున్నదో స్త్రీ. ఈనాడు నా ఈ స్థితికి, నా ఉన్నతికి కారణం ఆమె

అందుకే ఆమెను ఆ పాలరాతి విగ్రహంలో దర్శిస్తాను. ఆమె..." అంటుంటే అతని కంఠం బొంగురుపోయింది.

"ఆమె మీ భార్యా ?"

"ఛ...డాక్టరుగారి శ్రీమతిగారు ఈమధ్యే పోయారు" అన్నాడు గాంధి.

"స్త్రీ రూపాలు చాలా ఉన్నాయి. తల్లి, చెల్లి, ప్రియసల్లి...నాకు ఆమె ఏమవుతుందని చెప్పను. సర్వస్వమననా !" అన్నాడు ఎటో చూస్తూ.

"మనిషే కదా. నేను అంగీకరిస్తాను డాక్టరుగారూ ! మనుషులు మానవత్వం ప్రదర్శించి, మానవాతీతమైన కార్యక్రమాలు చేబడితే దేవుడంటాము. మన కనకరాజు అతనికి భగవంతుడు కనిపిస్తాడని అంటాడు"

"అదో రకమైన ఇమాజినేషన్."

"డాక్టరుగారూ ! అలా అవమానం చెయ్యొద్దు. మా దేవుడిని చూపిస్తాను రండి" అన్నాడు కనకరాజు.

"మీ దేవుడు, మా దేవుడు అంటూ ఇంకా పార్టీలు ఉన్నాయా !" నవ్వాడు శివాజి. అర్జంటు అంటూ యెవరో రావటంతో అతను వెళ్ళిపోయాడు. కనకరాజు, గాంధి చర్చించుకుంటూ బయటికి వచ్చారు.

డాక్టరు శివాజికి అమెరికా నుండి రాగానే అత్తగారింట్లో పరిచయం అయ్యాడు గాంధి. అతనే నర్సింగ్ హోమ్‌కు స్థలం చూపించాడు.

కంట్రాక్టర్ కనకరాజు, అతని నర్సింగ్ హోమ్ కట్టి, ఇచ్చాడు. అలా వారిద్దరికి డాక్టర్ శివాజి దగ్గర చనువు ఎక్కువ. శివాజి కూడా ఇతరుల దగ్గర చాలా రిజర్వ్‌గాను, గంభీరంగా ఉంటాడు. వీళ్ళిద్దరి దగ్గర హాయిగా నవ్వుతాడు.

శివాజి మహారాష్ట్రీయుడు. అతని తల్లి విధవగా వచ్చి హైద్రాబాద్‌లో టీచర్‌గా చేస్తూ, శివాజి బొంబాయిలో మెడిసన్ చదువుతూండగా పోయింది.



ఒంటరి వాడయిన శివాజి మెడిసన్ పూర్తిచేసి, విదేశాలకు వెళ్ళి, ఆరేళ్ళ క్రితమే స్వదేశం తిరిగివచ్చి నర్సింగ్‌హోమ్ పెట్టాడు.

అతనికి అమెరికాలో ఆంధ్ర కుటుంబంతో పరిచయం అయింది. అతని పేరు డాక్టర్ పార్థసారథి. అతని కూతురు మాధవితో వివాహం అయింది. ఒక్క కొడుకు పుట్టగానే మాధవి ఆరోగ్యం దెబ్బతిన్నది. అమెరికా స్పెషలిస్టులంతా పెదవి విరిచారు. అప్పుడు మార్చుకని హైద్రాబాద్ వచ్చాడు. మాధవి తల్లితండ్రులు వచ్చారు. హోమియో మందులు వాడారు. ఆయుర్వేద హాస్పత్రిలో చేర్పించారు. యునాని మందులు వాడారు. లాభం లేకపోయింది. డాక్టరయిన శివాజే ఆశ్చర్యపోయాడు. అతనికి తెలియకుండా ఉన్న ఒక్క కూతుర్ని దక్కించుకోవాలని పార్థసారథి దంపతులు మంత్రాలు, తంత్రాలు చేయించారు. పూజలు పునస్కారాలు చేశారు లాభం లేకపోయింది.

ఆరేళ్ళ అరవింద్‌ను, శివాజిని, తల్లితండ్రులను దుఃఖసముద్రంలో ముంచి మాధవి చనిపోయింది.

"మీకు కొడుకున్నాడు కోడలు పోయిందనుకోండి" అని ఓదార్చాడు శివాజి. వాళ్ళు శివాజి ఆప్యాయతలో కన్నవారి ప్రేమను పొందారు. నర్సింగ్‌హోమ్‌కి తనకి తోచనప్పుడల్లా వస్తాడు పార్థసారథి.

గాంధి, కనకరాజు వాదించుకుంటూ వెళ్ళిపోయారు. శివాజీ తన రౌండ్స్ ముగించుకుని వచ్చాడు.

అతనికి అరవింద్ గుర్తుకు వచ్చాడు. అతనికి జ్వరం వచ్చింది. జ్వరం వస్తే అమ్మమ్మను ఆటలాడిస్తాడు. ఇంటికి డయల్ చేశాడు.

"హల్లో మమ్, నేను శివాజీని!... నిదురపోయాడా... ఈ పూటకు పాలు సూప్ ఇవ్వండి... అదేంలేదు డైజస్ట్ కాదని...బై" ఫోన్ పెట్టేశాడు.

అతనికి టీ వచ్చింది.

"సిస్టర్! రూమ్ నంబర్ ఫైవ్ దగ్గర యెవరయినా ఉండాలని చెప
అలాగే డాక్టర్ సురమాళికి ఫోన్‌చేసి రమ్మన్నానని చెప్పండి."

"ఎస్ డాక్టర్ ! నాకు రెండురోజులు సెలవు కావాలి."

"అలాగే, ఈ రెండు రోజుల కోసం నాన్సీని రమ్మనండి."

"అలాగే డాక్టర్."

ఫోన్ మ్రోగింది. శివాజీ ఫోన్ ఎత్తాడు.

"హల్లో...డాక్టర్ శివాజీ హియర్ !... నమస్తే... పంపించండి.
ఎక్కడ, మెల్లి, మెల్లగా అన్ని ఏర్పాట్లు చేస్తాను... థాంక్యూ.
థ్యాంక్యూ" అతను ఫోన్ పెట్టేశాడు. అతని నర్సింగ్‌హోమ్‌లో జన
పేషెంట్లకే బెడ్స్ ఉన్నాయి.

రోజుకు ఒకరు ఫోన్ చేస్తారు.

"కాన్పుల వార్డు ఉండాలండి."

"ఆర్థోపెడిక్ వార్డు ఉండాలండి."

"కను, ముక్కు, చెవుల స్పెషలిస్టులు లేరా !"

"పిల్లల డాక్టరుండాలి" అంటారు. అవన్నీ ఏర్పాట్లు చేయటా
మరో అయిదారు సంవత్సరాలు కావాలి. అతను ఆలోచిస్తూ లేచాడు. స
చీటి తీసుకుని వచ్చింది. మంత్రిగారికి అనారోగ్యమట. ఇంటికి రమ
ఆహ్వానం.

"కారు పంపారు సర్ !"

"పద వస్తున్నాను."

ఇద్దరూ బయలుదేరారు.

"సిస్టర్ ! బి. పి. ఆపరేటస్ తీసుకో. వాళ్ళకు తరచుగా వచ్చే జబ
అది" అన్నాడు.

సిస్టర్ నవ్వి బి. పి. ఆపరేటస్ తీసుకువచ్చింది. శివాజి మంత్రిగా



ఇంటి ఆవరణలో కాసేపు ఆశ్చర్యంగా నిలబడిపోయాడు. ఆశ్రిత జనంతో
ఆవరణ కిటకిటలాడిపోతోంది.

ఒక్కొక్క మంత్రికి ఇంత ఎస్టాబ్లిష్‌మెంటు అవసరమా !

"రండి డాక్టరుగారూ !" పి. ఎస్. ఎదురువచ్చి ఆహ్వానించాడు.

అతనివెంట వెళ్ళాడు.

"నమస్తే సర్ ఏమిటి సుస్తీ !" వెళ్ళి మంత్రిగారి ప్రక్కన కూర్చు
న్నాడు.

"ఏమి లేదయ్యా, జరంత బలహీనం చెమటలొస్తున్నాయి."

శివాజీ పరీక్షచేసి మందులు వ్రాసిచ్చాడు. టెన్షన్ తప్ప ఏంలేదు.
ఆ మాటే చెప్పాడు.

"అవును డాక్టరు! నువ్వు మహారాష్ట్రపు మనిషివికదా బొంబాయిలో
సద్వినావు, అమెరికాలో కొల్వుజేసినావు. గింతబాగ తెలుగు మాట్లాడుత
వేందయ్యా" అన్నాడాయన.

కాఫీ వచ్చింది. శివాజి పకపక నవ్వాడు.

"అభ్యాసం సర్ ! మీరు ప్రయత్నించండి వస్తుంది. మా ఆవిడవల్ల
నాకి భాష అలవడింది" అన్నాడు కాఫీ అందుకుని.

"మీ మామ నాకు బాగ తెలుసయ్యా. పార్థసారథి..."

"ఆయనకంటే ఆయన కూతురికి తెలుగు నేర్చుకోవాలని పట్టుద
ఎక్కువ. అందుకే నేను నేర్చుకున్నాను" అన్నాడు.

"పరీక్షలు, బోరీక్షలు చేయించాల్నా."

"అక్కరలేదండి. నాల్గురోజులు కాస్త సభలు – సమావేశాలు తగ్గ
చండి" అన్నాడు.

"మా బతుకేగది..." పక్కున నవ్వాడు మంత్రిగారు. అంద
అదేదో పెద్ద జోకయినట్టు నవ్వారు.

వాళ్ళను చూస్తే జాలివేసింది. అధికారానికి హారతిపట్టే పెద్దలు, భట్రాజు పనిచేసి పబ్బం గడుపుకునే ప్రజాసేవకులు నిట్టూర్చాడు శివాజీ.

అతను ఇంటికి వచ్చేసరికి అరవింద్ నిదురబోతున్నాడు. అదిచూచి అతను చాలా రిలీఫ్‌గా కూర్చున్నాడు. మమ్మి వచ్చింది.

"మీ మామయ్య ఆలస్యంగా వస్తారేమో నీకు వడ్డించమనేదా?"

"ఆగనియ్యండి, తొందరేం..." పేపరు తిరగేస్తూ కూర్చున్నాడు.

"బాబూ శివా! నువ్వు కొడుకులేని లోటు తీరుస్తున్నావుకాని, నీకు తల్లిలేని లోటు నేను తీర్చటం లేదు" అన్నది అతని ప్రక్కన కూర్చుంటూ.

"అదేంమాట మమ్! మీరెప్పుడూ అలా అనుకోవద్దు. నాకేం తక్కువయింది!" అన్నాడు బాధగా.

"మీ తల్లి అయితే ఇలా వదిలేస్తుందా! మళ్ళీ పెళ్ళి చేయదూ!"

అతను ఒక్కసారి ఆమెవంక చూచాడు. మాధవిని మరిచిపోలేను అంటే ఆత్మవంచనే అని తెలుసు. అందుకే మెల్లగా తన అభిప్రాయం చెప్పాడు.

"చూడండి మమ్! ఆ వచ్చే ఆవిడ నాకు భార్యగా వస్తుందిగాని, మీకు కూతురుగా, అరవింద్‌కు తల్లిగా రావటానికి ఇష్టపడదు" అన్నాడు.

"అలాంటి సాకు పెట్టకు శివాజీ! మాకు ఏమయింది! పనిమనుషుల్ని పెట్టి చేయించుకుంటాము" అన్నదామె.

"సాకు కాదు...సరే, మీరీ విషయంలో అంత పట్టుదలగా వుంటే మంచి సంబంధం మీరే చూడండి" అన్నాడు, పేపర్‌పడేసి లేస్తూ. అతను హాస్పత్రినుండి రాగానే స్నానంచేస్తాడు. క్రింద ఒక చిన్న గది ఉంది. అందులో తన హాస్పత్రి సరుకంతా పెట్టటమేకాక, హాస్పత్రినుండి వచ్చి బట్టలు మార్చుకుని, ఆ గదిలోనే వదిలివేస్తాడు. అతను స్నానానికి వెళ్ళగానే ఆమె లేచి వంటామెతో వడ్డించమని చెప్పింది. పార్థసారథి కూడా వచ్చాడు.



అందరూ భోజనాలు చేశారు.

"పార్థూ! శివాజీ అమ్మాయిని చూడమన్నాడు."

"ఇంతవరకు అమ్మాయిల్ని చూడద్దు, కళ్ళు మూసుకొమ్మన్నాడా మేడమ్!"

"చాల్లెండి" ముఖం తిప్పుకుంది.

"అదికాదు మామయ్యా! అసలు నా పెళ్ళి విషయంలో చాలా బెంగగా ఉన్నది" అన్నాడు.

"తెలుసు శివా! నా దృష్టి ఎప్పుడూ అమ్మాయిలమీదే ఉంటుంది. ఈరోజు అందుకే ఆలస్యం అయింది. హౌస్ సర్జన్సీ చేసిన ఒక డాక్టరు వచ్చింది..." అతను సంతోషంగా చెప్పుకుపోతున్నాడు.

"మామయ్యా! నాకు అసిస్టెంటుకాదు– ఇల్లాలు కావాలి" అన్నాడు.

"శివా! నీకు అనుభవం లేదు. బయటివారిని అసిస్టెంటుగా పెట్టుకుంటే చాలా ప్రాబ్లమ్స్ వస్తాయి."

"అయినా ఫరవాలేదు. నేను వ్యాపారం కోసం, సంపాదన కోసం కాదు. [illegible]కోసం, నా కోసం..." అంటుండగానే అరవింద్ లేచాడు.

"డాడీ...డాడీ..."

"అరవింద్! అక్కడే ఉండు...వస్తున్నా..." చెయ్యి కడుక్కొని వెళ్ళి కొడుకును ఎత్తుకున్నాడు.

"నాకు...నాకు...అన్నం కావాలి డాడీ..."

"వంటామెతో చెబుతాను. సాయంత్రం అన్నీ నీకిష్టమయినవి చేస్తుంది. ఇప్పుడు బ్రెడ్ తినాలి." అన్నాడు అనునయింపుగా.

అరవింద్ ముఖం ముడుచుకున్నాడు.

"నీకు జ్వరం తగ్గగానే అయిస్‌క్రీమ్ తెస్తాను." అని బుజ్జగించి రెండు స్లైసుల బ్రెడ్డు పెట్టాడు.

అతను కొడుకుతో మాట్లాడుతుండగానే, సీరియస్ కేసు వచ్చిం

దంటూ, నర్సింగ్‌హోమ్ నుండి ఫోన్ వచ్చింది. హడావిడిగా అరవింద్‌ను వదిలి అతను వెళ్ళిపోయాడు.

## 4

**ముకుందాదేవి** తలంటుకుని కూర్చుంది. పనికుర్రాడు గ్లాసుతో పాలుతెచ్చి ఇచ్చాడు. పాలు త్రాగింది.

"నీలిమ లేచిందా ?"

"చిన్నమ్మగారు నిదురపోతున్నారండి."

"అయ్యగారు లేచారా !"

"లేచారండీ, ఆ సుట్టం అయ్య లేదండి. ఆయనేమో, అయ్యగారిని నడిపిస్తున్నారు," అన్నాడు పనివాడు, చిన్న.

ముకుందాదేవి వేలు ముడివేసుకుని లేచింది. మెల్లగా కూతురు గది వైపు నడిచింది. ఆమె గుండెలమీద రాత్రి చదువుతున్న పుస్తకం అలాగే ఉంది. ఆ పుస్తకం అక్కడపెట్టి, కూతురు ముంగురులు సవరించింది. ఆమె కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి. ఆమె పమిటతో తుడుచుకుంది.

"అమ్మా ! యెవల్లో వచ్చారు." చిన్న చెప్పాడు.

"ఉష్..." అల్లరి చెయ్యకాదన్నట్టు నోటికి చెయ్యి అడ్డంపెట్టి, మెల్లగా బయటికి వచ్చింది. హాలును ఆనుకుని ఉన్న గదిలోకి వెళ్ళిందామె. అక్కడ కూర్చున్న నల్గురు లేచి ఆమె కాళ్ళపై పడిపోయారు.

"లేవండీ..." ఆ కంఠంలో గాంభీర్యానికి, కరుణత్వానికి కరిగిపోయినట్టు అయ్యారు. వారు లేచారు.

"ఇదేం బానిసత్వం !"



"భగవంతుడిని దర్శించి, పాదాభివందనం చేయటం బానిసత్వమా ! లేదు భగవాన్..."

అతని మాటలు మధ్యలోనే త్రుంచేసిందామె.

"నేను ముకుందాదేవిని – ఉత్త ముకుందాదేవిని." అన్నది.

"మీరలా అన్నా, మేం అంగీకరించం..."

"దయచేసి ఇప్పుడా విషయాలు మాట్లాడవద్దు." అంటుండగానే ఓ స్త్రీ వచ్చి ముకుందాదేవికి నమస్కరించింది.

"సత్యా ! వీరికేం కావాలో అడుగు..." లేచి వెళ్ళిపోయింది ముకుందాదేవి.

"కూర్చోండి." అన్నది సత్యవతి.

అందరూ కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పండి, నేనేం చేయగలనో ?"

"మా వాడిని ఫారన్ పంపాలని ఉంది. డాక్టరి పాసయి రెండేళ్ళయింది..." అన్నాడో పెద్ద అతను.

"అయితే..." సత్యవతికి అర్థం కాలేదు.

"ఇప్పుడు డాక్టర్లు, పరీక్షలు వ్రాయాలి. అది చాలా టఫ్..." అన్నాడు. సత్యవతి తల పంకించింది.

"మీ పేరేమిటో..."

"నా పేరు నాగలింగం అండి. ఒక్కగానొక్కడు..." అతను బాధపడ్డాడు.

"ఇప్పుడు, ఇక్కడేం చెప్పవద్దండీ. గురువారం, శనివారం, సోమవారాలు భగవత్ దర్శనం అవుతుంది. అక్కడ వెదురుబొంగులు అమ్ముతారు. బొంగులు ఆ పరమాత్మకు అర్పణచేస్తే మీ కష్టాలకు ఓ దారి చూపుతాడు" అన్నది.

"అది కాదండీ..."

"ఇక్కడేం చెప్పవద్దండీ, అంతా ఆ భగవంతుడు గ్రహించ గలడు," ఇక వెళ్ళవచ్చని సత్యవతి పంపించింది. ఆమె అక్కడున్న పేపరు తీసుకుని, గబ గబా ఏదో రాసింది.

"సత్యవతమ్మా..." తల యెత్తిందామె. గుమ్మంలో చైనులు నిల బడి ఉన్నాడు.

"ఏమిటి చైనులూ !"

"ఏం లేదమ్మా. శ్రీహరిరావుకు ఆఫీసులో పిల్లతో ప్రేమంట, ఆ భార్యకు మంటంట... ఆ మంటే ఆమెను పిచ్చిదాన్ని చేస్తుంది."

సత్యవతి అతని మాటలు వింటున్నా ఆమె చేతులు వ్రాస్తున్నాయి. చైనులు వెళ్ళిపోయాడు.

సత్యవతి ఏదో రాసుకుంటుండగానే ఇద్దరు వ్యక్తులు వచ్చారు. అతను నాటకాలరాయుడు, అతని భార్య మాలతి వచ్చారు.

"సత్యవతమ్మా ! ఓ రెండు వందలు కావాలమ్మా."

"ఇప్పుడంత డబ్బు దేనికి ?"

"నీకంటే పెళ్ళి పెటాకులు లేవు. నాకెన్ని ఖర్చులు." అన్నాడు రాయుడు. సత్యవతి లోపలకి వెళ్ళి డబ్బు తెచ్చి ఇచ్చింది.

"సత్యమ్మా ! అమ్మ రమ్మంటుంది." చిన్న చెప్పాడు.

సత్యవతి డైనింగ్ హాలులోకి వెళ్ళింది. టేబుల్ ముందు ముగ్గురు కాక, నాల్గో వ్యక్తిని చూచి ఆశ్చర్యపోయింది.

"రా సత్యా ! ఇతను ఆదిత్య అని నిరుద్యోగిట. మావారి స్నేహి తుని కొడుకుట. ఉద్యోగం దొరికేవరకు ఏదైనా పని చూపించాలి" అన్నది ముకుందాదేవి.

సత్యవతి డైనింగ్ హాల్లో ఉన్న చిన్న కుర్చీ లాక్కుని కూర్చుంది.

"నీ ఉపహారం అయిందా ?"



"ఆహా ! దట్టంగా ఉప్మా పట్టించాను. సావిత్రమ్మగార్ని రిసీవ్ చేసుకోవటానికి మీరు రాకపోతేనే బావుంటుంది" అన్నది సత్యవతి.

"సరే..." అన్నది ముకుందాదేవి.

"రాయుడి ఖర్చు పెరిగిపోతోంది మేడమ్ !" అన్నది సత్యవతి.

ముకుందాదేవి ఏమి తోచనిదానిలా ఒక్క నిముషం అసహాయంగా చూచింది.

"ఈసారి డబ్బు అడిగితే నా దగ్గరకు పంపించు."

"ఇతన్ని అకౌంట్స్ మేంటేన్ చేస్తూ బ్యాంకు పనులు చెయ్య మనండి. చైనులిని బ్యాంకుకు పంపితే చాలు, ఖర్చులు గుర్తుకు వస్తున్నాయి" అన్నది.

"ఈ మధ్య తాగుడు కూడా ఎక్కువయినట్టుంది."

"ఈ మధ్య త్రాగి మీ కంట పడుతున్నాడు. ఎప్పుడూ తాగుడు ఎక్కువే" అన్నది సత్యవతి.

చిన్న అందరితోపాటు, సత్యవతికి కాఫీ తెచ్చి ఇచ్చాడు. ఆమె కాఫీ త్రాగుతుండగానే, బిలబిలమంటూ మరో నల్గురు స్త్రీలు వచ్చారు. అందరూ లోపల హాల్లోకి వెళ్ళారు. హాలులో నిలువెత్తు కృష్ణ విగ్రహ ముంది. దానిముందు పరిచిన తివాచీలో అందరూ కూర్చున్నాక, నీలిమ బయటికి వచ్చింది.

"అంకల్ ! ఇదంతా మీరు నమ్ముతారా !"

"ఎవరి నమ్మకం వారిది ఆదిత్యా ! నువ్విలా మొండికేస్తే నీకు ఎక్కడా ఉద్యోగమే దొరకదు" నందనరావు చెప్పాడు.

"అది కాదంకల్..."

"ఇదిగో నువ్వేం మాట్లాడకు. నీకే రోజు ఉద్యోగం దొరికితే ఆ రోజు జాబ్ వదిలిపేద్దువుగాని."

"థాంక్యూ అంకల్ !"

"థాంక్స్ చెప్పాల్సింది నాకు కాదు."

"తెలుసు ఆంటీకి. అయినా మీరే ప్రతిపాదించి ఉంటారు" అన్నాడు.

"అదేం లేదు. నీలూ, ఇతనికేదయినా పని చెప్పు" అన్నారు సంద రావు. ఆదిత్య లేచి నీలు వెంట వెళ్లాడు.

"ఆదిత్యగారూ! ఈ ఉత్తరం తీసుకుని దానికి, అయిదారు కాపీల తీసి, ఈ దిగువ అడ్రసులకు పోస్టు చెయ్యండి" అంది.

"అలాగే..." అని సత్యవతి ఇందాక కూర్చున్న గదిలోకి వె కూర్చున్నాడు.

ఉత్తరం తీశాడు. వివిధ సంస్థలు, వ్యక్తులు భగవంతుడుకి భక్తితో సమర్పించిన కానుకలను థాంక్స్ చెబుతూ వ్రాశారు. దాని కాపీలుతీసి ఫర్ అని ముకుందాదేవి పేరుపెట్టి, పోస్ట్ చేయబోతూ, అన్ని అడ్రసుల మరొక్కసారి చూచాడు.

శ్రీకృష్ణ సేవా సంస్థనుంచి వెయ్యినూట పదహార్ల విరాళం ఉంది అది చూచిన ఆదిత్య హృదయం భగ్గుమన్నది. అలాగే ఉత్తరాలు పట్టుక కూర్చున్నాడు.

"ఇదిగో ఈ లెక్కలుచూచి, మనము ఎవరికి ఎంత ఇవ్వాలి, మనకు వాళ్ళెంత ఇవ్వాలో చూడండి," ఓ బౌండు పుస్తకం అతని ముందు ఉంచింది.

"ఆఁ!... ఏమన్నారు? ఇది చూడాలా? అలాగే..." సర్దుకుని కూర్చున్నాడు.

"ఏమిటి మీరింకా ఏమో ఆలోచిస్తున్నారు?"

"అబ్బే... ఏంలేదు." అన్నాడు కంగారుగా.

"అభిప్రాయాలు కలవనంత మాత్రాన, మిమ్మల్ని నిందించి, నిష్క



రాలు ఆడే అల్పులంకాము. అసలు విషయం చెప్పండి." అన్నది. ఆమె చెప్పనిదే కదలనన్నట్టు, అతని ముందు తిష్ఠ వేసుకుని కూర్చుంది.

"శ్రీకృష్ణ సేవా సంస్థలో ఆరు నెలలు పనిచేశాను..." మిగతా విషయాలు చెప్పటానికి జంకాడు.

"అర్థం అయింది." నీలిమ ముసి, ముసిగా నవ్వింది. 'ఈవిడకేం అర్థం అయింది చెప్మా' అనుకున్నాడు.

"అక్కడ మీకు రెండు వందల యాభైరూపాయలకు సంతకం పెట్టించుకుని, యాభై రూపాయలు ముట్టజెప్పేవారు. అదికూడా అప్పుడప్పుడు అవునా!"

"అరే... మీకెలా తెలుసు?" ఈసారి ఆదిత్య ఆశ్చర్యంతో చూచాడు.

"అదేం అని యెవరయినా అడిగితే, వాళ్ళపై దొంగతనం మోపి పంపివేస్తారు." అన్నది

"అంతటి నీచులు, దుర్మార్గులని తెలిసికూడా ఆ డబ్బెలా తీసుకున్నారు!" ఆదిత్య ముఖంలో ఏహ్యత కొట్టవచ్చినట్టు కనిపించింది.

"అవతలవాడు యెలాంటివాడు అని మేము చూడము. అతని భక్తే చూస్తాం." అన్నది.

"అతను హంతకుడయినా ఫరవాలేదా?"

"హంతకుడయినా అభ్యంతరంలేదు. ఇప్పటికే యెందరో హంతకులు భక్తబృందంలో ఉండి ఉంటారు."

"ఐసీ..."

"తప్పక చూద్దురుగాని." ఆమె లేచి వెళ్ళిపోయింది, ఆదిత్య అశాంతిగా, ఏం తోచనట్టు చూచాడు. అతనికి అక్కడే ఒక్క నిమిషం ఉండాలనిపించలేదు. కాని ఆకలిబాధ తెలిసినవాడు, అందుకే లాలాజలంతో పాటు తన ఏహ్యత కూడా మింగాడు.

నమస్కరించింది. వ్యక్తిగతంగా పరిచయం లేకపోయినా, ఫోటోలు చూచింది.

"నీలూ..." సావిత్రమ్మ గబుక్కున వచ్చి, నీలిమను హృదయానికి హత్తుకుంది.

అందరూ హాల్లోకి వెళ్ళి కూర్చున్నారు.

"చిన్నా !" ముకుందాదేవి కేకవేసింది.

"ఎస్... ఆంటీ !" చిన్నా పలికాడు. ముకుందాదేవి ఒక్క నిముషం తెల్లబోయింది

"నిన్ను పిలువలేదు బాబూ ! మా పనివాడు చిన్నే ! సావిత్రి ! వాడికి పేరే పెట్టలేదా ?" అన్నది.

"బడిలో చేర్పించేటప్పుడు వాళ్ళ నాన్న, మా నాన్న పేరు అంటూ కొట్టుకుచచ్చాం. 'శ్రీ రామాంజనేయమూర్తి' అని పెట్టాం. ఆ పేరుతో యెవరూ పిలువరు." అన్నది.

"చిన్నబాబు అనాలన్న మాట."

అందరూ నవ్వుకున్నారు. నీలిమ వెళ్ళి అందరికీ కూల్‌డ్రింక్స్ ఇచ్చింది. పంటావిడకు ఆదేశాలు ఇచ్చింది.

"ముకుందా ! కొడుకులు, కొడుకులు అనుకుంటాం గాని, కూతుళ్ళే నయం అనిపిస్తుందే నిన్ను చూస్తుంటే..." అన్నది.

"నీకు ఎప్పుడూ ఎదుటివారి బ్రతుకు అందంగా కనిపిస్తుంది కదా." అన్నది ముకుందాదేవి. చిన్నబాబు అక్కడున్న పత్రిక తిరగవేస్తూ కూర్చున్నాడు.

"ఏమిటీ చిన్నబాబూ ! వసపిట్టలా వాగే వాడివి. అంత మౌనంగా ఉన్నావేం ?" ముకుందాదేవి పలుకరించింది. ఆమెకు చిన్నప్పటి బాబే కనిపిస్తాడు.



"ఆంటీ ! స్తంభాలు లేక ఆకాశం యెలా నిలబడిందంటావ్ ?"

"దేవుడు ఊస్తే వర్షం వస్తుందా ?"

"మీ పాపాయి నా పెళ్ళామా! ... పెళ్ళాం అంటే వంట చేయాలి కదా... మీ పాప పసుదునే ఉంటుంది."

"ఆంటీ పెళ్ళాం అంటే ఏమిటి ?"

ఇలాంటి ప్రశ్నలతో వేధించేవాడు. అలాంటివాడు మవునంగా కూర్చుంటే తమాషాగా అనిపించింది.

"వాడు చిన్నప్పటి నిన్నాయేనా అని నేను ఆశ్చర్యపోతుంటానే అంత మౌనంగా ఉంటుంటాడు. చదువు, వ్యాపారం, తప్ప మరేం పట్టదు." అన్నది సావిత్రమ్మ.

"చాలా సంతోషం నాయనా ! ఉన్న ఒక్క పిల్లవాడు విద్యావంతుడు, బుద్ధిమంతుడుకావాలి. అంతకంటె ఎవరయినా కోరేది ఏముంది?" అన్నది తృప్తిగా.

"అవునూ ! బ్యాగేజ్ ఏది అత్తయ్యా ?" నీలు అడిగింది.

"విదేశాలలో ఉన్నవారం చప్పున ఇళ్ళల్లోకి వెళ్ళి ఇబ్బంది పెట్టలేమే. హోటల్లో దిగాము." అన్నదామె.

"హోటల్లోనా !" ముకుందాదేవి ముఖం చిన్నబోయింది. ఆమెకు సావిత్రి గుణం బాగా తెలుసు. తన కూతురు పట్ల ఆసక్తి లేదని అర్థం చేసుకుంది.

"అదేదో పెద్ద ప్రమాదం అయినట్టు బాధపడతావేమే. కొన్ని అలవాట్లు తప్పవు" అన్నది. సావిత్రమ్మకు ముకుందాదేవి గురించి ఉన్న ఊహ వేరు. ఆర్థికంగా ఆమె బాగా దెబ్బతిని ఉంటుందని ఊహించింది. ఆ హంగు, పనివారు, కారును చూచాక, కాస్త స్థిమితపడింది. అయినా తన కొడుక్కి అమ్మాయిని చేసుకోవాలా వద్దా, అన్నది ఇంకా తేల్చుకోలేకపోయింది.

"ఏం పద్ధతులో, నాకున్న దెవరు ?" కళ్ళలో నీరూరింది ముకుందా

దేవికి. ఆమెతో ఏకాంతంగా ఎన్నో మాట్లాడాలనిపుంది సావిత్రికి. నీలి అందరిని భోజనాలకు పిలిచింది. అందరూ వెళ్ళారు.

"అత్తయ్యా! మీరు తిండి దగ్గర అయినా స్వదేశీ అలవాట్లున్నాయా! లేకపోతే టోస్ట్ – బట్టర్ ఉన్నాయి." నీలిమ అడిగింది. నందనరావు, ఆదిత్య ప్రసన్నంగా చూచారు.

"నీ కూతురు జాణేనే" సావిత్రమ్మ నవ్వింది. స్వచ్ఛమైన తెలుగు భోజనం చేశారు.

"ఆయనను నల్లవారు అనవసరంగా పొడిచి చంపారన్నయ్యా! ఆ తరువాత మా కష్టాలు ఏం చెప్పను ! నేను కాబట్టి తట్టుకున్నాను."

"సాధారణంగా నల్లవారికి మన పట్ల సద్భావం ఉంటుందని విన్నాము" అన్నాడు నందనరావు.

"వాళ్ళు పగతో చంపలేదు. ఒకేసారి చుట్టుముట్టి, మన దగ్గరున్న డబ్బు, వస్తువులు అడుగుతారు. వారి బలం కనిపెట్టి, మనం ఇచ్చేయాలి. బ్యాడ్‌లక్ ! ఆయన ఎదిరించారు – అంతే పొడిచారు" అన్నది కళ్ళు నులుముకుని.

"మీరు వెంటలేరా ?"

"ఒక ఫ్రెండ్ ఇంట్లో సీమంతం జరుగుతోంది. అక్కడ 'షవర్' అంటూ చేస్తారు. దానికని వెళ్ళాను. వచ్చేసరికి రక్తం మడుగులో పడి ఉన్నారు" అన్నది బాధగా.

"ఎవరికెలా రాసి పెట్టి ఉందో అలా జరగక తప్పదు సావిత్రీ !" ముకుందాదేవి ఓదార్చింది.

"అలా అనే సరిపెట్టుకున్నాను. ఉన్న ఒక్క పిల్లడిని చదివించు కోవాలి. అలాగే వాడిని ఎవరి అండనయినా వ్యాపారంలో చేర్పించాలని ఉంది" అన్నది.

'మా వాడిపై మీరు ఆశలు పెట్టుకోవద్దని' మరో రకంగా చెప్పా



రావిడ. అది గ్రహించలేనంత మూర్ఖురాలు కాదు ముకుందాదేవి. అయినా తను గంభీరంగా ఉండిపోయింది.

"డబ్బుకేం తక్కువ ! మనకున్న ఇద్దరి పిల్లలను చూచుకుంటూ గడుపుదాం. నువ్వేం దిగులుపడకు" అన్నది.

నీలిమకు ఈ వాతావరణం చాలా ఇబ్బందిగా ఉన్నది. తను ఎంత భారం అయ్యిందో అర్థం చేసుకుంది. తల్లి దేవుడు, తండ్రి రోగిష్ఠి. ఆమె స్నేహితుల కోసం–స్నేహం కోసం తపించిపోయింది మళ్ళీ మౌన, గంభీరంగా ఉండే వ్యక్తిని పెళ్ళాడి తనేం సుఖపడగలదు! తల్లి అంతగా ప్రాధేయపడి, ప్రాకులాడవల్సినంత గొప్పవారేవరూ కారు అనుకుంది.

"మమ్మీ ! వెళ్దామా !" చిన్నబాబు లేచాడు.

ముకుందాదేవి మరోసారి బ్రతిమాలి, ఇక మాట్లాడక ఊర్కుంది.

వాళ్ళు వెళ్ళిపోయారు.

"సావిత్రి చాలా మారిపోయింది."

"మనము మారిపోలేదూ !" నవ్వాడు నందనరావు. కాలం తెచ్చిన మార్పు, విదేశాలలో ఉండి వచ్చిన తీరు అన్నట్టు ధ్వనించిందా నవ్వు.

"ఆమెను ఇక్కడుంటే బలవంతంగా అమ్మాయినిచ్చి చేస్తామేమో నన్న భయంలా ఉంది" సత్యవతి అన్నది.

"నువ్వెళ్ళు సత్యా! రేపు సోమవారం– అన్నీ తయారుచేసుకోవాలి" అన్నది ముకుందాదేవి. ఆమె అంచనాలు తప్పాయి.

ఆమె దీర్ఘంగా ఆలోచిస్తూంది.

సావిత్రి ఇంటి ప్రక్కన ఉండేది తను. తండ్రిపోయి, తల్లికి దూరం బంధువయిన మేనమామ పంచన చేరారు. అతనింట్లో పనిమనుషులకంటే హీనంగా చూడబడేది తాను. అప్పుడే సావిత్రి అన్న దగ్గరకు వచ్చే నందనరావు కంటపడింది. నందనరావు ధనవంతుల ఏకైక పుత్రుడు. ముకుందాదేవికి అందం ఒక్కటే ఆస్తి. నందనరావుకు మొదటి భార్య పోయిందట.

ఆమెకంటే వయసులో చాలా పెద్దవాడు. సావిత్రే ప్రస్తావన తెచ్చింద రోజులలో.

"నిన్ను ఇస్తే కాని కట్నం లేక చేసుకుంటాడట నందన్నయ్య. కా మరీ వయసు తేడా కదే. నీకు పద్దెనిమిది, ఆయనకు ముప్పైరెండు" అన్నది.

అప్పుడు ముకుందాదేవిది మాట్లాడే వయసుకాదు, చిన్నది. అ తల్లి ప్రస్తావన విని మండిపడింది. కాని పరిస్థితులు చూస్తే అతడిని పె చేసుకోవటమే మేలేమో అనిపించింది. తల్లి దబ్బయినా, ఆ ఇంటివా నీచంగా మాట్లాడేవారు. అప్పుడే గుండెపోటుతో తల్లి పోయింది. ముకుంద దేవి ధైర్యంచేసి, సావిత్రితో తన అభిప్రాయం చెప్పించి.

"సావిత్రీ! ఆయనతో చెప్పవే. ఈ పెళ్ళి నాకిష్టం అని. నా కింత కంటే మంచి సంబంధం వస్తుందనుకోను." అన్నది.

సావిత్రి అన్నతో చెప్పింది. వారంరోజులలో క్లుప్తంగా ముకుంద దేవి వివాహం గుడిలో జరిగింది. మరో నెలకు సావిత్రి వివాహం ఓ సంపన్ను డితో జరిగింది. ఆ నాటి సావిత్రి కాదీసావిత్రి, మారింది. తనకు కొడుకు పుట్టినా స్నేహితురాలికి పిల్లలు కాలేదని యెంత బాధపడింది. యెంత సహాయం చేసింది. అలాంటిది యెందుకలా మారింది! ఆమెకేం అర్థం కాలేదు.

"రేపు ఉదయమే లేవాలి – పడుకోమ్మా." అన్నది నీలిమ లైటు తీసివేస్తూ.

ముకుందాదేవి కళ్ళు మూసుకుంది.

# 6

**తలంటుతో** ప్రారంభం అయింది భగవంతుని సేవ. సత్యవతి, మరో నల్గురు స్త్రీలు ముకుందాదేవికి తలంటారు. తలను దువ్వి కిరీటం పెట్టారు – నెమలిపింఛం పెట్టారు – కస్తూరి తిలకం దిద్దారు.

మల్లమ్మ మల్లెలు, కనకాంబరాలు కలిపి కట్టిన దండ తెచ్చి మెడలో వేసి నమస్కరించింది. వంటవాడు చిన్నా పాలలో తులసిఆకులు పంచదార కలిపి ఇచ్చాడు. ఆమె వెళ్ళి తూగుటుయ్యాలపై కూర్చుంది. అర్చన చేసే భక్త బృందం పసుపుపచ్చ పట్టుధోవతులు నీలం చొక్కాలు పెట్టారు. అవి ధరించి వచ్చిందామె. చంద్రవంక, చంద్రహారం ధరించింది. చేతికి మువ్వల మురళి అందించింది. అది తీసుకుని ముకుందాదేవి ఉయ్యాలపై పవళించింది. సత్యవతి మెల్లగా ఉయ్యాల చేరు ఊపింది. అంతే దూరంగా పీటమీద కూర్చున్న ఒక వ్యక్తి వేణువుపై మోహనరాగం ఆలాపించాడు. మధురాతి మధురంగా, మనుష్యుల్ని అలౌకిక ఆనందంలో ముంచి వేస్తున్నాయి ఆ పరిసరాలు.

సుమధురమైన పరిమళాలు ధూపంనుండి చుట్టూ వ్యాపించాయి. మల్లెలు, గులాబీలు, సంపెంగలు తమ అందాలను దాచుకోమన్నట్టు, ఆ పరిసరాలను మైకంలో ముంచెత్తాయి.

"కృష్ణం భజరాధా... కృష్ణం భజరాధా !" అంటూ సత్యవతి ఎత్తు కున్నది.

అందరూ గొంతులు కలిపారు.

ఒక పదకొండేళ్ళ పాప వచ్చి నాట్యం ప్రారంభించింది. ఆ కార్య క్రమము ఓ గంట గడిచింది. అర్చనకు వచ్చినవారు మొదట, వెండిపళ్ళెంలో కోవాబిళ్ళలు, పాయసం, కొబ్బరిలవుజు పెట్టి భగవంతుడి ముందు ఉంచారు.

అరమోడ్పు కన్నులతో ఒక్కసారి చూచి, ఒక కోవాబిళ్ళ తీసుకుని నోట్లో వేసుకుంది.

వెంటనే హర్షం వెలిబుచ్చే సంగీతం వినిపించింది. వారు కోవాబిళ్ళలనే అందరికీ పంచిపెట్టారు. భగవానుడు లేచి కూర్చున్నాడు. ఆయన పాదాలు ఒక పళ్ళెంలో పెట్టారు. పాదపూజ జరిగాక, మల్లమ్మ వచ్చి, ఆ వెండి పళ్ళెం తీసుకువెళ్ళింది. ప్రక్కనే కూర్చున్న సత్యవతి వెండి చెంబు ఇచ్చింది. పట్టుబట్టలు పెట్టారు. పూలు మెడలోవేసి, బంగారపు గొలుసు మెడలోవేసి, ఆ కుటుంబ సభ్యులు ఒక్కొక్కరే భగవంతునికి పాదాభివందనం చేశారు.

"మీ దయవల్లే, మీ ఆశీర్వాదంవల్లే మా అమ్మాయికి విదేశీ సంబంధం దొరికింది." అని ఆ ఇంటి పెద్ద ముకుందాదేవి పాదాలముందు తల ఆనించి మొక్కాడు.

"శుభమస్తు!" భగవంతుడు అభయహస్తాలతో ఆశీర్వదించాడు.

"లేవండి. మిగిలినవారు నమస్కరించాలి కదా." అన్నది సత్యవతి. అతను లేచాడు. అతని కుటుంబసభ్యులు ఒక్కరొక్కరే తమకు తోచిన చిరుకానుకలు అర్పించుకున్నారు.

ఈ క్రతువును ఇద్దరు వ్యక్తులు మాత్రం దూరంనుండి తీక్షణంగా చూస్తున్నారు.

ఒకరు అక్కడి ఉద్యోగి ఆదిత్య!

రెండవవారు ముకుందాదేవి ప్రాణస్నేహితురాలు సావిత్రి.

మల్లమ్మ చిన్న స్టీలు బిందెతో నీళ్ళుతెచ్చి ఆ కుటుంబం వాళ్ళకు ఇచ్చింది. ఆదిత్య ఆశ్చర్యంగా చూచాడు.

"ఆ నీళ్ళేమిటి మల్లమ్మా?"

"మీరు జర అయినంక లేచింద్రు. బగమంతుడు తానం చేసిన నీళ్ళు,



పారబొయ్యం, పట్టి పెడతాం. కొందరేమో ఆరి తానం అయితుంటే గచ్చు కాడ నిలబడి నీల్లు సల్లుకుంటారు. ఆలస్యంగా వచ్చినోల్లకు..."

ఆదిత్య అర్ధంకానట్టు చూచాడు.

"ఆదిత్యా! అవతల యెవరో ఎంక్వయరీకి వచ్చారు. మీరిక్కడుంటే యెలా? ఆ నీళ్ళు ముకుందాదేవి స్నానం చేసినవి. వాటిని తాము స్నానం చేసే నీటిలో కలుపుకుంటే, సర్వరోగాలు హరణం అవుతాయని ఆ అమాయకుల నమ్మకం." అన్నది తీక్షణంగా నీలిమ.

అతను తన ఆఫీసు గదిలోకి వెళ్ళాడు.

నందనరావుగారు ఏదో పాట హమ్ చేస్తున్నారు. కాసేపు మైమరచి విన్నాడు.

నీలిమ వెళ్ళిపోయింది.

ఆదిత్య కుతూహలంగా వచ్చి, మళ్ళీ కిటికీ దగ్గర నిల్చున్నాడు.

అర్చన జరిపించిన వారంతా వెళ్ళిపోయారు. జనం వచ్చి కూర్చుంటున్నారు. అక్కడొక క్యూ ఏర్పడింది.

"ఏదో మహత్తు లేకపోతే ఇంతమంది వచ్చి ఇన్ని పూజలు చేస్తారా!" అని ఒక పురుషుడు లెంపలు వాయించుకున్నాడు.

"అవును, మా రమణ భగవంతుని పాదాలు ముట్టుకున్న తరువాతే కూతురు పుట్టిందట." మరెవరో అన్నారు.

"ఏమిటో! మా అబ్బాయి గురించి ఏమంటాడో భగవంతుడు" నిట్టూర్చింది లావుపాటి స్త్రీ.

"జరుగండి... జరుగండి..." అందరినీ నెడుతూ ఓ పండు ముసలి వడుగు, వడుగున వచ్చి, భగవంతుని ముందు సాష్టాంగ పడ్డాడు.

"భగవంతునికి ప్రీతిపాత్రమైన వెదురు బొంగులు కొన్నావా!" నీలిమ అడిగింది.

"ఆయనకు ప్రీతి అంటే నా తల అయినా ఇస్తానమ్మా" అన్నాడు. లెంపలు వాయించుకుని, నడుముకు దోపిన ప్లాస్టిక్ కవరు తీసి అందులో దాచిన డబ్బుతీసి, వందరూపాయల నోటుతీసి, ఆమె ముందుకు గిరాటు వేశాడు.

ఆమె వెదురుబొంగులు, చిల్లర ఇచ్చింది.

"అది ఆ స్వామి హుండీలో వెయ్యండి. నా సంసారం నిలబెట్టిన వారు" అతను మరోసారి సాష్టాంగ పడ్డాడు.

చిరునవ్వుతో భగవంతుడు అభయహస్తం చూపాడు. అక్కడున్న వారు అతడిని తీసుకువెళ్ళి క్యూలో కూర్చోబెట్టారు.

నాగలింగం వెదురు బొంగులు కొనుక్కోబోయిన వాడల్లా ఆగి డబ్బెక్కువ ఇచ్చి పాలు కొని భగవంతుడిని స్పెషల్‌గా దర్శించుకున్నాడు. సరాసరి వెళ్ళి ఆ కృష్ణపరమాత్మ కాళ్ళు పట్టసాగేడు.

"లే..." హుందాగా ఆజ్ఞాపించాడు కృష్ణపరమాత్మ.

"స్వామీ...నా ఒక్కగానొక్క కొడుకు..."

"నాకంతా తెలుసు. నీ కొడుకు విదేశాలకు వెళ్ళాలి. ఇంటా, బయట అఖండ ఖ్యాతి గడించాలి, అంతేనా!" ఆ దేవుడు చిరునవ్వు చిందించాడు.

"అంతేస్వామీ అంతే...నా మనసులో మాట కనిపెట్టారు..." అన్నాడు ఆనందంతో తల మునకలవుతూ.

"నీ కుమారుడు విదేశాలకు వెళ్తాడు. కొందరికి అదృష్టరేఖ అర్ధాంగి వల్ల సంక్రమించుతుంద. అబ్బాయికి వివాహం చెయ్యి. అదికూడా విదేశాలలో స్థిరపడిన అమ్మాయితోనే వివాహం చేయాలి."

"ఆజ్ఞ స్వామి...ఆజ్ఞ..." అతను లెంపలు వాయించుకున్నాడు. అతను అందించిన గ్లాసుడు పాలు నోటిదగ్గర పెట్టుకుని, ఒక గుక్క పాలు తాగి తిరిగి ఇచ్చేశాడు కృష్ణుడు.

అది మహా ప్రసాదం అన్నట్టు తను తాగాడు. మరోసారి సాష్టాంగ



నమస్కారం చేసి వెళ్ళిపోయాడు. పోతూ, లౌడ్‌స్పీకర్లా ఒకటే అనౌన్స్‌మెంట్లు.

"అబ్బ! అవి పాలుగావు, అమృతధారలు. భగవంతుని పెదవిని తాకిన పాలు ఎంత రుచో..." అనుకుంటూ వెళ్ళిపోయాడు. అలాగే మరి కొందరు బాధాతప్తులు ముందుకు జరిగారు.

వాళ్ళలో శ్రీహరిరావు అన్న ఆఫీసరు, అతని భార్య, అత్తగారు ఉన్నారు. శ్రీహరిరావుని చూస్తూనే కృష్ణపరమాత్మ ఫక్కున నవ్వాడు.

అతను నవ్వాడంటే అది కోపంఅని భక్తులందరికి తెలుసు. అందరు ఊపిరి బిగబట్టారు.

"ఏమయ్యా! నా అంశ కావాలనుకున్న వాడు ఇంత బలహీనుడవు కాదా! ఆ పిల్లను ఇంట్లో ఏడిపిస్తూ, ఆఫీసులో అమ్మాయితో ప్రేమకలాపాలు సాగిస్తావా!"

"స్వామీ!" శ్రీహరి ఉలిక్కిపడ్డాడు.

"స్వామినే! నిన్నే నమ్ముకుని వచ్చిన ఇల్లాలిని అలక్ష్యంచేసి, అమ్మాయిలతో తిరుగుతావా! నీకు బుద్ధి ఉందా అసలు..."

"క్షమించండి" కాళ్ళమీద పడిపోయాడు శ్రీహరి.

"క్షమించాం. నీ భార్యకు మతి చాపల్యం ఏ: లేదు. నీ ప్రవర్తనతో విసిగిపోయింది."

"అట్లాగా..." అన్నాడు ఉక్కిరి బిక్కిరి అవుతూ.

"ఏమ్మా! మీ ఆయనను దులిపి, బాగుచేసుకోవాలిగాని, మతి చలించినట్టు తిరుగుతారా!" అని మందలింపుగా హెచ్చరించి చేయిచాపింది చేతిలో చిన్న, చిన్న పొట్లాలు పెట్టింది నీలిమ.

"ఇదిగో ఓ పదిహేను రోజులు ఈ విభూతి వాడండి. పాలలో, నీళ్ళలో వేసి తాగించండి" అని పొట్లాలు ఇచ్చిందామె. కొందరి విన్నపాలు పోస్ట్‌పోన్ అయ్యాయి.

అలా కొద్దిసేపు చూసేసరికి విసుగువచ్చిన సావిత్రి ఇంట్లోకి వెళ్ళి పడుకుంది. కొడుకు సినిమాకు వెళ్ళాడు. ఆదిత్య మాత్రం పరిసరాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు. వచ్చే, పోయేవారిని గమనిస్తున్నాడు. ఆరోజు సత్యవతితో పాటు నీలిమకు భోజనం లేదు.

భక్తులిచ్చే ప్రసాదాలు సరిపోతాయి అనుకున్నాడు. అతనికి నిలబడి, నిలబడి విసుగువచ్చి, గదిలో కూర్చున్నాడు.

"హలో బ్రదర్! మీరు కొత్తగా వచ్చారనుకుంటాను" చైనులు వచ్చాడు. అతనికంటే ముందే సిగరెట్టు వాసన గుప్పుమంది. అతను కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"హల్లో..." అన్నాడు అతనితో ఏం మాట్లాడాలో తెలియలేదు.

"జేబులో ఏమన్నా చిల్లర ఉందా ?"

"లేదు" అన్నాడు ముక్తసరిగా.

"ఉండదు. మనలాంటి దేవుడి సేవకుల దగ్గర డబ్బుండదు" అన్నాడు.

ఏమంటే ఏం గొడవోనని నవ్వేశాడు ఆదిత్య.

"అబ్బ! ఎంత స్వీట్‌గా నవ్వుతావు." టప్పున ఆదిత్య బుగ్గపై ముద్దు పెట్టుకున్నాడు చైనులు.

"ఛ...ఛ...ఇదేం పరిహాసం!"

"ముకుందాదేవి మగవాడి అవతారం ఎత్తినప్పుడల్లా నాకు స్త్రీనయి పోదాం అనిపిస్తుంది. ఇప్పుడు స్త్రీని..." వయ్యారాలు పలికించాడు.

"నాకు అలాంటి పరిహాసం గిట్టదు" తీవ్రంగా అన్నాడు, ఆ సిగరెట్టు కంపుకి వాంతి వచ్చినట్టు అయింది.

"పోనీలే అంత ముడుచుకు పోకు. జీతమెంత!"

"నేను అడగలేదు."



"భలేవాడివి, జీతం, బాతం అడక్కుండా ఎలా చేరావయ్యా బాబూ!"

దానికి జవాబు ఇవ్వలేదు. అతను ఇక్కడ లాభంలేదని చిన్నాదగ్గర హస్కు మొదలుపెట్టాడు. అయిదు నిముషాల తరువాత బెల్ వినిపించింది. ఆదిత్య లేచి నందనరావు గదికి వెళ్ళాడు.

ఆ ఇంట్లో రెండు కాలింగ్‌బెల్స్ ఉన్నాయి. ఒకటి బయటివారు పిలవటానికి, రెండవది నందనరావు పడక ప్రక్కన ఉంటుంది. అది ఆయన పిలవాలనుకుంటే నొక్కుతాడు.

"నువ్వు భోజనం చేశావా బాబూ!"

"లేదండి."

"ఈ రోజు ఎవరూ రారు. ఆరోగ్యరీత్యా నేను తినను, నువ్వెళ్ళి భోజనం చెయ్యి నాయనా!"

"అలాగేనండి" అతనికి తనంటే ఎంత శ్రద్ధ. వెళ్ళి చిన్నా వడ్డించగా భోజనం చేశాడు.

హడావుడిగా చిన్నబాబును సినిమానుండి తీసుకురావటానికి వెళ్ళాడు ఆదిత్య.

"హల్లో! మా మమ్మీ రాలేదా ?"

"వారు నిదురపోతున్నారు. అందుకే నేను వచ్చాను."

"ఓ స్టుపిడ్! నా పనులకంటే నిదుర ముఖ్యమా!" అని చిరాకుగా వచ్చి కార్లో కూర్చున్నాడు. కారు కదిలింది.

"వీళ్ళకు ఆస్తిపాస్తులు ఏ మాత్రం ఉన్నాయి?"

ఆదిత్య ఉలిక్కిపడ్డాడు. ఒక్కసారి చిన్నబాబు వంక చూచాడు. అతను నిజంగానే అడిగాడనిపించింది.

"నాకు తెలియదండీ"

"అకౌంట్స్ నువ్వే చూస్తావేమో."

"అవును. నేను ఈమధ్యే చేరాను. నాకు ఆస్తి వివరాలు తెలియవు."

"అమ్మ కూపీలు లాగమంటుంది. ఎలా లాగటం! మా ఆస్తి అంతా పోయిందయ్యా. మా మమ్మీ స్పెండ్ థ్రిఫ్ట్!" అన్నాడు.

"అలాగా!"

"అందుకే ఓ ధనవంతుల అమ్మాయిని చేసుకుందామని. నేను పెద్దగా చదువుకోలేదు" అన్నాడు.

ఆదిత్యకు నవ్వు వచ్చింది. చిన్నబాబుకు నీలిమకు పెళ్ళి అయితే గమ్మత్తుగా ఉంటుంది. నీలిమ అతి తెలివయినది. ఇతను శుద్ధ అమాయకుడులా ఉన్నాడు.

కారువచ్చి ఇంటిముందు ఆగింది. సుమధురంగా వేణుగానం వినిపించింది. వాళ్ళిద్దరికి దగ్గరుండి భోజన సదుపాయాలు చూచి, మర్యాదలు చేశాడు ఆదిత్య.

స్వామివారి సేవ సాయంత్రం వరకు జరుగుతుందని తెలుసు. అతను ఆఫీసులో ఉండగా, ఇద్దరు 'నమస్కారం' చేస్తామని మరో ఇద్దరు 'కనకాభిషేకం' చేస్తామని రసీదులు తీసుకున్నారు. ఒకమంత్రి తాలూకు ఫోన్‌వచ్చింది.

"వచ్చే శనివారం సమర్పణ చేస్తాం. స్వామివారికి చెప్పండి" అని ఫోన్ పెట్టేశాడు.

ఆదిత్య నికోలాస్ నవల పట్టుకుని కూర్చున్నాడు.

## 7

**డాక్టరు** శివాజీకి రోజూ తలనొప్పిగా ఉంది, అత్తమామలతో ఎక్కడో అమ్మాయిని చూస్తారు. పెళ్ళిచూపులంటారు. తీరా వెళ్తే అక్కడ అమ్మాయి వయసులో చిన్నదో, మరీ పల్లెటూరు అమ్మాయో ఉంటుంది. అతను ఆపరేషన్‌చేసి – అలసివచ్చి కూర్చున్నాడు.



డ్రైవరు వచ్చాడు.

"పెద్దమ్మగారు మిమ్మల్ని అర్జంటుగా రమన్నారు" అన్నాడు వినయంగా. అతనికి చిరాకు వేసింది.

"నాకు సాయంత్రం వరకు పని తీరదని చెప్పు."

డ్రైవరు వెళ్ళిపోయాడు. అతను తలపట్టుకున్నాడు. అతనేం ప్రవరాఖ్యుడు, ఏక పత్నీ వ్రతుడు కాడు. అతనికి సంకోచాలు అతనికి ఉన్నాయి. వచ్చినావిడ పిల్లవాడిని బాగా చూస్తుందన్న నమ్మకం ఏముంది. రెండువైపులనుంచి వచ్చే ఒత్తిడికి తను సాండ్‌విచ్ అయిపోతాడు. తన అవసరాలు తీరుతున్నాయి. ఇంట్లో కూడా ఇబ్బంది లేదు.

"హల్లో డాక్టర్ ..."

"హల్లో! గుడ్ మార్నింగు మిసెస్ డిజోజా! రండి" అన్నాడు.

"మీరు ఆ మార్వాడి వారికి కచ్చితంగా చెప్పాలి."

"ఏమని!"

"విజిటర్స్‌ని రిస్ట్రిక్ట్ చేయమని. నిన్న పదిహేను మంది ఒకే సారి..." ఆమె ముఖం కోపంతో జేవురించింది.

"మిసెస్ డిజోజా! మిమ్మల్ని అప్పాయింట్ చేసింది. అక్కని స్టేషన్ చూచుకొమ్మని. నన్ను అడిగి అదుపులో పెట్టవద్దు. రోగాలు నిర్ణయించి, మందులు వ్రాయటం వరకు నాపని. ఆ తరువాత అంతా మీరు చూచుకోవాల్సింది." అన్నాడు.

"థాంక్‌యూ! థాంక్‌యూ డాక్టర్!" ఆమె వెళ్ళిపోయింది. రౌండ్స్ ముగించుకుని వచ్చాడు.

అతను టీ సిప్ చేస్తుండగా ఫోన్ వచ్చింది.

"హల్లో! డాక్టర్ శివాజి హియర్!"

"నేను వసంతని ... ఏమిటి బాబూ! అంత తీరికలేని పనులు.

నీ కోసము తపించే ప్రాణి ఒకరున్నారని మరచిపోతావు. నువ్వు ఒక తెల్ల రాయివి." అన్నది నిష్ఠూరంగా.

"అదేం లేదు వసూ ... మరో గంటలో అక్కడ ఉంటాను." అతను ఫోన్ పెట్టేశాడు. సమయం చూస్తే ఏడు గంటలయింది. అతను మరో గంటవరకు అక్కడే కూర్చున్నాడు.

"సిస్టర్ ! ఎమర్జన్సీ కేసులువస్తే ఈ నంబరుకు ఫోన్ చెయ్యండి." అని వసంత నంబరిచ్చి, తన కారు తను తీసుకుని బయలుదేరాడు. అనా రోగ్యంవల్ల సాయంత్రం పార్థసారథి రావటం లేదు.

అతనికి వసంత పరిచయం గుర్తుకువచ్చింది. ఒకసారి ఓ పె ఇంపాలా కారొచ్చి, అతడిని తీసుకు వెళ్ళింది. పట్టణంలో ధనవంతుల ఒకరయిన చంద్రసేన్‌గారిది. ఆయన భార్యకు జబ్బుట. చంద్రసేన్‌గా సాదరంగా ఆహ్వానించారు.

"చదువుతూ...చదువుతూ పడిపోతుంది, డాక్టరుగారూ ! ఆ ఫిట్ వస్తే నాకు భయం..." ఇద్దరూ కలిసి గదిలోకి వెళ్ళారు. శివాజీ భా భర్తల్ని మార్చి మార్చి చూచాడు. చంద్రసేన్ గారికి యాభై, అరవ సంవత్సరాల వయసు ఉంటుంది. భార్యకు ఇరవైకి మించి లేవు ఏళ్ళు !

"ఈవిడ..." అనుమానం తీరక అడిగాడు.

"నా భార్య వసంత ..."

"ఐసీ ..." పరీక్షలు మొదలుపెట్టాడు.

అలా పరిచయమైన వసంత జీవితం పూర్తిగా అవగాహన చే కున్నాడు. చంద్రసేన్‌కు సంపాదన తప్ప మరేం అక్కరలేదు. భా అతని దృష్టిలో ఒక కుర్చీ, టి. వి, ఫ్రిజ్‌లాంటి అలంకార ప్రాయం. త కోరికలను అణుచుకోలేక, ఆ అమ్మాయి అప్పుడప్పుడు విరుచుకు ప తుంది.

జాలిగా చూచాడు.



ఒకరోజు వసంతకాలంలో వసంత ఫోన్ వచ్చింది. ఆమెకు గుండె దడ అంటూ చేసింది. అతను నర్సింగ్‌హోమ్ మూసి, ఆమె ఇంటి వెళ్లాడు. విరహిణి, క్రొత్త వసంత దర్శన మిచ్చింది.

"డాక్టర్‌గారూ ! ... డాక్టరుగా ... నా జబ్బు తెలుసు..." అంటూ స్పష్టంగా మాట్లాడలేక అతని ఒడిలో వాలిపోయింది.

"మిసెస్ వసంతా ..." ఆమెను లేపే ప్రయత్నం చేశాడు. ఆమె అతడిని మరింత గట్టిగా అల్లుకుపోయింది.

"ఐ వాంట్ యు . . . ప్లీజ్ . . . ఐ వాంట్ యు" అన్నది. ఆ బలహీనమైన క్షణంలో ఆమె జీవితంలో ప్రవేశించాడు. ఆ ఇంట్లో డాక్టరుకు, నౌకర్లకే ఆమెగదిని చేరే అవకాశం ఉంది. ఆమె ఫోన్ చేసినప్పు డల్లా వెళ్తాడు. వీళ్ళిద్దరి అనుబంధం చంద్రసేన్‌కు తెలుసో, లేదోగాని, ఇంతవరకు, సాఫీగా సాగిపోతోంది.

యెప్పటికప్పుడు ఈ వలయం నుండి బయటపడాలి. అది ఇద్దరికీ మంచిది కాదు అనుకుంటాడు కాని, వసంత సమక్షంలో సర్వం మరిచి పోతాడు.

అతను కారు పార్క్ చేసి లోపలికి అడుగు పెట్టగానే ఆ ఇంట్లో ఉన్న కేరళ నౌకరు నాయర్ ఆహ్వానించి, పిలుచుకు వెళ్ళాడు.

"అమ్మగారేరి ?"

"అనారోగ్యం ... పన్నె ..." అని పడుకున్నది అన్నట్టు సైగ చేశాడు. శివాజీ మెల్లగా పైకి వెళ్ళాడు. వసంత పెద్ద బోర్డరున్న పింక్ కాటన్ చీర, కలకత్తా కాటన్ చీరలో మెరిసిపోతుంది.

"నాయర్ ! అయ్యగారిక్కడే భోజనం చేస్తారు." అన్నది వసంత. నాయర్ వెళ్ళిపోయాడు.

వసంత చటుక్కున వచ్చి, అతని పెదవులపై గాఢంగా చుంబించింది. అప్రయత్నంగా అతని చేతులు ఆమె చుట్టూ పడ్డాయి.

"స్నానం చెయ్యి." అన్నది.

అతను బాత్ టబ్‌లో దూరి సిగరెట్టు వెలిగించుకున్నాడు. ఆమె అతని దగ్గరగా వెళ్ళింది.

"అబ్బా త్వరగా తెములు డార్లింగ్ ! నీ వడిలో పడుకుని కబుర్లు చెప్పుకోవాలి."

"కబుర్లు చెబుతుండగా చంద్రసేన్‌గారు వస్తే ..."

"ఆయన బొంబాయి వెళ్ళాడు."

"యెన్నాళ్ళీ దొంగచాటు వ్యవహారం !"

"సాగినన్నాళ్ళు..." అన్నది. అతను బయటికి రాగానే తుండుతో అతని ఒళ్ళు అద్దింది. లైటుగా పౌడరు వేసుకుని, అప్పుడున్న సిల్కు లుంగీ, షర్ట్ వేసుకున్నాడు.

"నా కెందుకో ఇది నచ్చటం లేదు వసూ ! దొంగతనంగా రావటం, నన్ను డాక్టర్‌గా నమ్మి, నిన్ను అప్పగించిన చంద్రసేన్‌గారిని మోసగించటం ..." అన్నాడు వచ్చి సోఫాలో కూర్చుని.

వసంత వచ్చి అతని వడిలో వాలిపోయింది.

"శివా ! నా పరంగా యెందుకు ఆలోచించవు ! అతను నా భర్త, తన విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా ?" అన్నది కాస్త అలక ప్రదర్శిస్తూ.

"కాదని నేను అనటంలేదు. కాని దానికి పరిష్కారం మాత్రం ఇది కాదు" అన్నాడు. మాట్లాడనియ్యకుండా అతని పెదవులు తన పెదవులతో అద్దింది.

అతను ఉత్తేజితుడయినట్టు ఆమె తనూలతను చేతులలో బంధించాడు.

"నన్ను పిచ్చివాడిని చేస్తున్నావ్."



"అంత బాధ దేనికి ! నేను అతనికి విడాకులిచ్చి నీవెంట వస్తాను." అన్నది. అతను నవ్వి ఆమె నుదురు చుంబించి, వెంట్రుకలు రేపాడు.

"నన్ను చంపనయినా చంపుతాడు కాని, విడాకులు ఇవ్వటానికి అంగీకరించడు. నువ్వు స్టేటస్‌కి సింబల్‌వి" అన్నాడు.

"నాకీ మాత్రం సుఖశాంతులు లేకుండా చేస్తావా ?"

అతను జవాబు ఇవ్వలేకపోయాడు. దీనంగా అడిగే ఆమె తీరుకు చలించిపోయాడు.

"నో..." తల పంకించి ఆమె అందమైన కళ్ళల్లోకి చూస్తూ కూర్చున్నాడు.

ఆమె చటుక్కున లేచింది.

"నువ్వు టైమ్‌కు వెళ్ళాలేమో - భోజనం తీసుకురమ్మంటాను" అని లేచి బెల్ కొట్టింది. నాయర్ వచ్చి బయట నిలబడ్డాడు.

"పై డైనింగ్‌హాల్లో భోజనం వడ్డించు" అన్నది.

అతను వెళ్ళిపోయాడు. క్రింద మూడు పడకగదుల ఇల్లుంది. బయట పెద్ద ఆఫీసు గది ఉంది. పైన బెడ్‌రూమ్‌తోపాటు అటాచ్డ్ డ్రాయింగ్ రూమ్, డైనింగ్ హాలు ఉంది. చంద్రసేన్ బాగా తాగినప్పుడు పైనే భోజనం చేస్తాడు. ఇద్దరి కామన్ ఫ్రెండ్స్, బంధువులు అయితే తప్ప క్రింది డ్రాయింగ్, డైనింగ్ వాడరు.

డైనింగ్ రూమ్‌లో లైటు వెలిగిన పది నిమిషాలకు ఇద్దరూ వెళ్ళారు. అన్నీ అక్కడ అమర్చి, నాయర్ వెళ్ళిపోయాడు.

ఆమె స్వయంగా వడ్డించింది.

"చూడు శివా ! స్త్రీ యెంతో ఫూలో ! పురుషుడు ప్రపంచం వేరని తెలిసినా అతనికి తల్లిలా వడ్డించాలని, ప్రియురాలిలా అన్నీ అందించాలని అనుకుంటుంది."

శివాజి జాలిగా చూచాడు. నిజంగా వసంత చాలా మంచిది. కాని

సన్యాసిని, సర్వసంగ పరిత్యాగినికాదు. ఆమె ఉప్పు, కారం తింటుంది, మామూలు స్త్రీ.

అతను ఆర్తిగా కలిపిన ముద్ద ఆమె నోటికి అందించాడు.

ఆమె కళ్ళలో నీరూరింది. అతని వెనుకగా వచ్చి, అతని భుజంపై తల వాల్చింది.

"శివా ! నన్ను...నన్ను అర్థం చేసుకో. నీ సహచర్యం లేకపోతే నేను ఆత్మహత్య చేసుకునేదాన్ని." ఇంకా ఏవో చెప్పాలని ఉన్నా, ఆమె నోట మాట రాలేదు.

అలా ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, రెండు గంటలు, తమ ఉనికి మరిచిపోయి, ఊహాలోకంలో, తాము భార్యాభర్తలమన్న భ్రమతో బ్రతికారు.

శివాజి బలవంతంగా, తన భుజమ్మీద ఉన్న, ఆమె తలను ప్రక్క మీదకు చేర్చి, ఆమె బుగ్గలు అంటీ, అంటనట్టు చుంబించి లేచాడు. అతను బట్టలు వేసుకుని క్రిందికి దిగుతుంటే, నీ నిష్క్రమణ భరించలేనన్నట్టు, కళ్ళు మూసుకుని పడుకుంది వసంత.

"గుడ్‌నైట్ ..." అనబోయి మాట మింగేశాడు. అతను వచ్చి, కారు స్టార్ట్‌చేసి, ఒక్కసారి పైకి చూచి పోనిచ్చాడు.

శివాజి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో చాలా హడావుడిగా వుంది.

"ఏమిటి ? ఏం జరిగింది."

"అమ్మగార్కి హార్టు అటాక్ వచ్చింది." పనివాడు చెప్పాడు.

అదిరిపోయాడు శివాజి. తన నిర్లక్ష్యానికేనా ! అతని మనసులోని మాటకు, జవాబు పార్థసారథి నుండి వచ్చింది.

"బాబూ ! నీకిష్టంలేనిది ఏవి జరగదు. నీ నిర్లక్ష్యంతో ఆ ముసలి ప్రాణిని యెందుకు బాధపెడతావు ?"

"మామయ్యా !"



"అవును. పెళ్ళిచూపులంటూ వారిని పిలిచింది. నువ్వు రాలేదు. పిచ్చిది. వాళ్ళముందు యెంత ఇన్‌సల్ట్‌గా ఫీలయింది !" అతను అన్నాడు.

"సారీ మామయ్యా ? అయామ్ సారీ..." అతను గబ గబ వదక గదిలోకి వెళ్ళాడు. మమ్మి నిదురబోతుంది. ప్రక్కనే కుర్చీలో అరవింద్ కూర్చున్నాడు. కూర్చునే నిదురబోతున్నాడు అరవింద్. శివాజి కొడుకును ఎత్తి మంచంలో పడుకోబెట్టాడు.

ఆ గదిలో తాత, అమ్మమ్మల మంచం ప్రక్కనే అరవింద్ మంచం ఉంటుంది.

"అమ్మమ్మా...నువ్వు...నువ్వేం గాభరా పడకు...డాడీకి ఫోన్ చేస్తాను" నిదురలో కలువరించేస్తున్నాడు. అది చూచాక, అతనెంత అప్‌సెట్ అయ్యాడో అర్థం అయింది.

అతను వెళ్ళి తన గదిలో పడుకున్నాడు. ఏదో ఒకటి త్వరగా నిర్ణయించుకుంటేగాని తను నిశ్చింతగా ఉండలేడు. ఓ నిశ్చయానికి వచ్చి నిశ్చింతగా నిట్టూర్చాడు.

## 8

"**ఏమిటే** ఏమన్నావ్ ?" ఆడపులిలా లేచింది ముకుందాదేవి.

"ముకుందా ? ప్రాక్టికల్‌గా ఆలోచించు. నా కొడుక్కు లక్షాధికార్ల సంబంధం కావాలే. భుక్తికోసం నాటకాలు ఆడే నువ్వు...నువ్వు నాతో వియ్యం అందుతావా !"

"సావిత్రీ ! జాగ్రత్త ! నోరు జారితే వెనక్కు తీసుకోలేవు. నా కూతురు కోరితే బంగారుగోడలుపెట్టి ఇల్లు కట్టగలనే...వా." ముకుందాదేవి బరబర స్నేహితురాలిని ఈడ్చుకు వెళ్ళింది. బీరువా తొలగించింది.

"పదవే..."

"ఏమిటే నన్ను చంపుతావా ఏం ?" అంటూనే లోపలకి వెళ్ళింది. సినిమాలలో చూపించినట్టు భూగృహంలో బంధించి, బలవంతపెట్టి త కొడుక్కు పెళ్ళి చేయించదుకదా ! కళ్ళు విప్పిన సావిత్రికి మైకం కమ్మి నట్టు అయింది. గదినిండా వెండి, బంగారం, నోట్లు, పట్టుచీరలు, రకరకాల బహుమతులు.

"ఇది...ఇది..."

"ఇదంతా నా సంపద. నా కూతురికి చెందుతుంది. బ్యాంకులో పెడితే ఇన్‌కమ్ టాక్సులు అడుగుతారు. ఎన్నో ఆరాలు, ఎన్నో విచారణలు కావాలి" అన్నది ఒగరుస్తూ.

"అవునవునూ." సావిత్రి పూర్తిగా తగ్గిపోయింది.

"ఇదంతా ఇస్తే కోటిమంది కోటీశ్వరులు వస్తారు. కాని నాకు కావా ల్సింది కొడుకులాంటి అల్లుడు. నా జీవితం అర్థం చేసుకుని, నన్ను అ రించేవాడు. మన ఇద్దరి బిడ్డలకు పెళ్ళిచేసి, మనం వాళ్ళ దగ్గర హాయిగా ఉండవచ్చునని అనుకున్నాను."

సావిత్రి మాట్లాడలేదు. ఆమె ఆలోచిస్తుంది. తనను తాను తిట్టుకుంది. తనెంత మూర్ఖురాలు ? ముకుందను చాలా తక్కువ అంచనా వేసుకుంది.

"అమ్మా..." చిన్నబాబు వచ్చాడు.

"పద..." ఇద్దరూ బయటికి వచ్చాక, అలమర మూసివేసింది ముకుందాదేవి.

ఇద్దరూ వచ్చి కూర్చున్నారు.

"ఆంటీ ఆ డబ్బు...బంగారం..."

"అంతా నీలుది నాన్నా ! అదృష్టం బావుంటే నీదవుతుంది" సావిత్రి కొడుకును చెయ్యిపట్టి దగ్గరగా తీసుకుంది.

తంతే బూరెల బుట్టలో పడ్డట్టు ఉంది చిన్నబాబు పని. అతను



కూర్చుని తిన్నా తరగని ధనం. సావిత్రమ్మకి దూది పింజంలా ఎగిరి పోవాలని ఉంది. కాని తన్ను, తాను సంభాళించుకుంది. చంకలో బిడ్డను పెట్టుకుని ఊరంతా దేవుళ్ళాడుకున్నట్టు అయింది తన పని.

"సావిత్రీ ! రేపు శుక్రవారం మంచిరోజు. నిశ్చితార్థం చేసుకుందాము. నిశ్చితార్థం రోజు, నా అల్లుడికి కానుకగా ఓ ఇల్లు కొని ఇస్తానే" అన్నది.

"ఇల్లా ! నీకు బొత్తిగా ఘనత... తెలియదు... ఘనంగా మేడ అను."

"మేడ అని ఇల్లు ఇస్తే అలుక సాగిస్తావు. ఇల్లని మేడ ఇవ్వటం మంచిది అమెరికా నుండి వచ్చిన దానవు. నీ అర్హత పెరుగుతుంది."

"ఏమిటే వెటకారం చేస్తున్నావా !" సావిత్రమ్మ నవ్వేసింది. పరి సరాలు ప్రాణం పోసుకున్నట్టు అయింది.

నీలిమ మాత్రము గంభీరంగా ఉండిపోయింది. చిన్నబాబు సంతో షానికి అంతులేదు.

"ముకుందాదేవి..." చైనులు వచ్చాడు. అతని చేతిలో సిగరెట్టు వెలుగుతుంది.

కంపరంగా చూచిందామె. అతను ఏనాడూ అలా అంత విచ్చల విడిగా ఆమె ముందు ప్రవర్తించలేదు.

"నాకో యాభై వేల రూపాయలు కావాలి." అన్నాడు. అదేదో యాభైరూపాయలు కావాలన్నట్టు.

"మతి ఉండే మాట్లాడుతున్నావా !"

"గతి లేదు. మతికేమయింది ! మా అమ్మాయికి డొనేషన్ కట్టి చదివించాలి." అన్నాడు అతిశయంగా.

"నీకు జీతం ఇస్తున్నాను."

"మేము చేసే పనికి మీరిచ్చే జీతం భిక్షం వేసినట్టు కాదు – నాకు యాభై వేలరూపాయలు కావాలి..."

"చైనులూ! బెదిరిస్తున్నావా! ఇవ్వకపోతే."

"ఇంకా ఏం చేయాలన్నది ఆలోచించలేదు, ఇస్తారనే ఆశించాను. గాజు మేడలో ఉండేవారు, ఇతరులపై రాళ్ళు రువ్వరని నా అభిప్రాయం." అన్నాడు సిగరెట్టు పొగ రింగు, రింగులు వదులుతూ.

"చాలా వరకు వచ్చిందే వ్యవహారం! ఒక్క పైసా ఇవ్వను" అన్నది.

"అంతేనా..." చైనులు వెళ్ళిపోయాడు.

"ఆశకు అంతూ పొంతు ఉంటుంది. వెయ్యి, రెండు, అయిదు నుండి యాభై వేల వరకు వచ్చింది. ఛీ...ఛీ..." ఆమె విసుక్కుంది.

"ముకుందా! ఇక వీళ్ళ అవసరం లేదు. ఆ ఆదిత్యగాడిని పంపించెయ్యి. నీలును ఒంటరిగా పట్టుకుని కబుర్లు చెబుతాడు" అన్నది ఈర్ష్యగా సావిత్రమ్మ.

అలాంటి కొడుకు లేడని ఆమెకు మహా మంటగా ఉంది. వాళ్ళు మాట్లాడుకుంటుండగా సత్యవతి వచ్చింది. ఆమె ముకుందాదేవిని లోపలికి తీసుకువెళ్ళింది. ఏం మాట్లాడుకున్నారోగాని, పదిహేను నిమిషాల తరువాత సత్యవతి వచ్చి, చైనుల్ని పిలిచింది. పదివేల రూపాయలు ఇచ్చి పంపి వేసింది.

సావిత్రమ్మకు మంటగా ఉంది. ఒకరొకరిని పంపించి వేయటానికి నిశ్చయించుకుంది. అందుకే పరిస్థితులు అవగాహన చేసుకోవటంలో నిమగ్నురాలయింది.

# 9

**నీలిమ** లైటు ఆర్పటానికి తండ్రి గదిలోకి వచ్చింది. ఆయన హాయిగా నిదురబోతున్నాడు. ఆదిత్య వచ్చాక అతను ఎందుకో, హాయిగా ఉంటున్నాడనిపించింది.

"నీలిమగారూ..."

ఆదిత్య బయటి వరండాలో నిలబడి పిలిచాడు.

నీలిమ బయటికి వచ్చింది. శుక్లపక్షమి రోజులు, పిండారబోసినట్టు ఉన్నది వెన్నెల.

"చెప్పండి గారేగారు..."

"మీరు నీలిమ అనమన్నా, యజమానులను అలా పిలువటం సాహసం అవుతుంది" అన్నాడు.

ఆమె మెల్లగా 'వంశీ కుంజ్' వైపు దారి తీసింది. అదొక పొద. నీలిమ దాన్ని చక్కగా ఒక గుడిసెలా అమర్చి, రాళ్ళతో కట్టింది. అది చూడటానికి చాలా బావుంటుంది. అయిదు రంగుల బోగన్‌విల్లీ పొదలు కలిశాయి. ఆ దారిన వెళ్ళేవారు ఒక్క క్షణం ఆగి వాటివంక చూచి వెళ్ళి పోతారు.

వంశీ కుంజ్ ముందు కూర్చున్నది. ఆమెకు కాస్త దూరంగా కూర్చు న్నాడు ఆదిత్య.

"చెప్పండి" అన్నది నీలిమ.

"నీలిమగారూ..."

"గారే, బూరే వద్దుగాని నీలిమ అనండి చాలు."

"నీలిమా! చిన్నబాబు గురించి మీరు ఇంకా కొంత స్టడీ చేయాలి."

నీలిమ చిన్నగా నవ్వింది.

"నేను స్టడీ చేస్తున్నానా ?"

"ఐమీన్...చేయటం కాదు. అదే అతనికి మీకు పెళ్ళి నిశ్చయ అయిందట. కాని అతని ఆరోగ్యం... అదే మానసిక స్థితి బాపున్న అనిపించలేదు" అన్నాడు.

నీలిమ తల ఎత్తింది.

"నీలిమా! నాకు జలసీ అనుకుంటున్నావేమో! వాళ్ళ అ ముందు నోరు విప్పడు. ఒక్క పెగ్గు కొడితే చాలు... ఏం మాట్లాడుతా అతనికే తెలియదు..." అన్నాడు.

"మీరూ పెగ్గులు కొడతారన్న మాట..."

"అబ్బా కాదండీ. అతడిని తీసుకురమ్మని మీ అత్తగారు పంపించా అన్నాడు.

"మీరంత కంగారుపడవల్సిన పని లేదు." అన్నది నవ్వుతూ.

"త్రాగుడు అంటే నేటి యువకులు ఏదో తిరుగుతున్నారు అ వచ్చుకాని, అతని మాట వింటుంటే అతను ఏం చదువుకున్నట్టు లే ఒక్కమాటకు, మాట పొంతనలేదు." అన్నాడు.

అకస్మాత్తుగా నీలిమ చేతులలో ముఖం కప్పుకుని బావురుమన్న ఆదిత్య కంగారుగా చూచాడు.

"నీలిమగారూ ... నీలిమగారూ ... నేను మీకు బాధ కల్గించేనా ఆమెను అడిగాడు.

జవాబు రాలేదు. అతనామె ముఖంపై చేతులు తొలగించాడు

"ప్లీజ్ ..." అర్థింపుగా చూచాడు.

"ఆ గాదే, ఖూరే నన్నెంత బాధిస్తాయో మీకు తెలియదు."

"ఓ...అదా...సరే...సరే...నీలిమా అసలేం జరిగింది ?"

"ఆదిత్యగారూ !..."



"మీకు గారెలు ఇష్టంలేదుకాని నా కిష్టం అనుకుంటున్నారా ?"

"ఆదిత్యా! ఈ జీవితం, ఈ ఇల్లు, ఈ పరిసరాలు నాకెంత అసహ్యాన్ని కల్గిస్తున్నాయో చెప్పలేను. నన్ను దూరంగా యెవరికి తెలియని చోటుకి తీసుకువెళ్ళండి."

"నీలిమా !"

"నీలిమ కళ్ళల్లోని నీలి నీడలు మీకు కనిపించలేదా! మీరు దర్శించలేదా !" అన్నది ఎమోషనల్‌గా.

"నీలిమా ! మీరు ఎక్సయిట్ కావద్దు..."

"నా మనసు, నేనేమిటో నేనెలా చెప్పను, నేనిల మనిషిని కాను ఆదిత్యా... మనిషిని కాను. నా పేరు...వద్దు. నేను దేవుడి కూతుర్ని. నాకు స్నేహితులు లేరు – ఆత్మీయులు లేరు..." మోకాళ్ళపై తల వాల్చుకుని వెక్కి, వెక్కి ఏడ్చింది.

"నీలిమా ! నీకు అమ్మా, నాన్న అయినా ఉన్నారు. నాకు వాళ్ళు లేరు. ఏం చెయ్యాలో చెప్పు." అన్నాడు అనునయింపుగా.

"అమ్మ...ఆమెతో ఆత్మీయత మాట్లాడలేని అమ్మ, అవిటివాడు నాన్న. ఓ సినిమా, షికారు, నవ్వూ, ఏంలేదు" అన్నది కళ్ళు తుడుచుకుంటూ.

"అయామ్ సారీ...నీవు ఇంత ఒంటరిదానవని తెలియదు. నేను అంతకంటే ఒంటరివాడ్ని" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"మీరు ఒక్కసారి నా జీవితం చూస్తే, మీ కష్టాలముందు నావి పెద్దవిగా అవుతాయి."

"నాకు...నాకు...విసుగ్గా వుంది. ఈ రొటీన్ నుండి వెళ్ళిపోదాం" అన్నది. అతను ఒక్క నిముషం ఆలోచించాడు.

"నీలూ... నిజంగా అంటున్నావా ?" అన్నాడు అనుమానం తీరక.

"నిజం ఆదిత్యా ! నాకు తోబుట్టువుల ప్రేమ తెలియదు. అమ్మ అనురాగం తెలియదు. అంతా యాంత్రికంగా జరుగుతుంది" అన్నది ఆ దనగా.

"మనిషి యెప్పుడూ తోడు కోరుకుంటాడు నీలిమా ! మీకు తోడు కావాలన్నా, నీడగా నిలువాలన్నా, నేను మొదట నా కాళ్ళపై నిలబడాలి."

"ఇప్పుడు మీ కాళ్ళపై నిలబడిలేరా !"

"తమాషా చేయకండి. నాకే టికానాలేదు - మీకు తోడు ఉండగ నేమో కాని..."

"నీడ కల్పించలేను అంటారు. మరేం ఫరవాలేదు. నా కున్న సీ మనిద్దరికి సరిపోతుంది. నాన్నగారి అభిప్రాయం అదే కాని అమ్మ అంగీ రిస్తుందో లేదో అని సంశయిస్తున్నారు" అన్నది.

"నీలూ..." చప్పున ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఆమె చెయ్యి తీసుకువెళ్ళి తన పెదవులకు తాకించుకున్నది.

"ఆదిత్యా ! ఆ చిన్నబాబును గెస్టుగా కూడా భరించలేనిదాన్ని భర్తగా భరించగలనని యెలా అనుకున్నావు ! అమ్మకు తన జీవిత అర్థంచేసుకున్న మనుష్యులు కావాలి. అందుకే సావిత్రి ఆంటీ వెం పడింది" అన్నది నిట్టూరుస్తూ. అతను ఆమె చేయి అలాగే పట్టుకు కూర్చున్నాడు.

"ఆదిత్యా ! మన జీవితాలు ఒకటి కాబోయే ముందు, మా చరిత్ర కొంత వినాలి" అన్నది.

"చెప్పు నీలూ ! నీ చరిత్ర వింటానన్నది, నీ కుటుంబ గౌరవ యెలాంటిదో బేరీజు వెయ్యటానికి కాదు- నీ హృదయ భారం తగ్గుతుందని..."



ఆ పండువెన్నెలలో అతని కళ్ళల్లో ఆప్యాయత, ఆరాధనా కనిపించింది నీలిమకు.

చటుక్కున వంగి, అతని వడిలోకి వరిగిపోయింది. అతని శరీర మంతా విద్యుత్ ప్రవహించినట్టు అయింది. తనను తాను సంబాళించుకుని ఆప్యాయంగా ఆమె వెన్ను తట్టాడు.

"ఆదిత్యా ! అది నాటకమో, నిజమో తెలియదు కాని అమ్మంటే జనానికి విపరీతమైన భక్తి. అది వారి బలహీనత. దాన్ని మా అమ్మ క్యాష్ చేస్తున్నారు" అన్నది.

"అదేమిటి ? నిజంగా కృష్ణపరమాత్మ."

"అది అమ్మ ఆత్మకే తెలియాలి. నాన్నగారి వ్యాపారం దెబ్బతిని, ఆస్తులు పోగానే ఒక సాధువుద్వారా ఉపదేశం పొంది భగవంతుడిని ప్రత్య క్షము చేయించుకుందంటారు కొందరు. ఆ నాటి నుండే అవతారమని నాటకం ఆడుతుందంటారు మరికొందరు."

"నువ్వెప్పుడూ అమ్మను అడగలేదా ?"

"యెన్నోసార్లు అడగాలని వెళ్ళి వెనుకకు తిరిగి వచ్చాను. ఆమె కళ్ళలోకి సూటిగా చూచి మాట్లాడలేను. అది నా బలహీనత." అన్నది. అతనింకేదో అడగబోయాడు.

"ప్లీజ్, అమ్మ గురించి యేవరేమనుకున్నా ఫరవాలేదు, కాని మీరు మాత్రం ఆమెను అర్థం చేసుకోండి. అవసరం అనుకుంటే ఇద్దరం కలిసే అడుగుదాం." అన్నది.

"సరే..." అంగీకరించాడు ఆదిత్య. అతనికి ఈ కొన్ని నెలల పరిచయంతో నీలిమ గురించి సదభిప్రాయమే ఏర్పడింది. నిక్కచ్చి మనిషని అర్థం అయింది. ఆమె అంటే ఆరాధన, అభిమానం ఉన్నా, అంతస్తులు గమనించి మాట్లాడలేదు.

"నీలిమా ! లే... ఈ వాతావరణం ... ఏకాంతం ..." అంటూ

చటుక్కున లేచాడు. అమె ఒక్కసారి అతనివంక చూచి, ఇంట్లోకి వెళ్ళింది. ఆ రాత్రి ఇద్దరికి రంగు, రంగుల కలలే వచ్చాయి.

మర్నాడు అందరూ కాఫీ త్రాగుతుండగా, బల్లమీద ఓ బస్ టికట్ వదిలి వెళ్ళాడు ఆదిత్య. నీలిమ భ్రుకుటి ముడిపడింది, నలిపేస్తున్నట్టు అందుకుంది.

"చిన్నబాబు గురించి స్వయంగా అమ్మ నిరాకరించేలా చూడు." అని ఉంది. నీలిమ చిన్నగా నవ్వుకున్నది.

"నీలూ ! నేను, ఆంటి వెళ్ళి, మీకు కావలసిన ఇల్లు చూచివస్తాం." అన్నది.

"మంచిది"

"బాబుకూడా వస్తాడే ముకుందా !" అన్నదామె.

"వాళ్ళెందుకు ! ఇల్లు నచ్చితే యెటూ రాక తప్పదు."

"పోనీలేమ్మా ? ఆంటి కొడుకును ఒంటరిగా వదిలివేస్తే, కొరుక్కుంటామేమోనని భయం." ఎత్తి పొడుపుగా అన్నది నీలు.

"ఇది నీ కూతురుకాదే, అచ్చు మీ అత్తగారి పోలికే."

ముకుందాదేవి ముఖం గంభీరంగా మారిపోయింది. మరేం మాట్లాడక యిందుకు కదిలింది.

"సారీ ముకుందా !" సావిత్రి ఆమెను అనుసరించింది.

వీవాళ్ళు వెళ్ళిపోయారు. వెళ్ళేటప్పుడు సావిత్రి కొడుకును కళ్ళతో హెచ్చరించటం నీలిమ గమనించకపోలేదు.

"బాబూ..." వాళ్ళు వెళ్ళగానే ఆప్యాయంగా దగ్గరకు వెళ్ళింది. నీలిమ.

"ఏమిటి ?" అన్నాడు కాస్త చిరాకుగా.

"ఏం లేదు. బజారు వెళ్దామా !"

"దేనికి"



"యువతీ యువకులు బజారు దేనికి వెళ్తారు ! హాయిగా తిరిగి రావటానికి" అన్నది.

"నాకు...ఐ డోంట్ లైక్."

"నన్నా, బజారునా !"

"రెండింటినీ..." అన్నాడు కాస్త కోపంగా.

"మరి రేపు జీవితాంతం లైక్ చేయాలి"

"మా మమ్మి చేస్తుంది. ఆమే పెళ్లి చేసుకొమ్మని బలవంతం చేసింది. నా కిష్టం లేదు" అన్నాడు.

"అమ్మ ఏది చెయ్యమంటే అది చేస్తావా!"

"షట్ అప్..." అతను లేచి వెళ్ళిపోయాడు. తన గదిలో పడుకున్నాడు. పడుచు కుర్రవాడు పడుకోవటం ఎందుకో అర్థంకాలేదు. ఆమె తల పంకించింది.

ఆ మర్నాడు కావాలనే అందరూ భోజనం చేస్తూండగా అతను వద్దు, వద్దు అంటుంటే పచ్చడి తీసి వడ్డించింది.

"యూ ఫూల్...ఈడియెట్ బుద్ధిఉందా !" అతని ముఖం ఎర్రగా మారిపోయింది.

"బాబూ !" సావిత్రమ్మ హూంకరించింది. అది చూచి అతను కాస్త తగ్గాడు.

"అసలు ఒక్కగానొక్క పిల్లవాడయితే ఇదే సమస్య వస్తుంది ముకుందా ! వాళ్ళన్నదే సాగాలి. ఇదిగో అమ్మాయ్, వాడి కిష్టం లేనిది ఏది చెయ్యకు" అన్నది నీలిమతో.

"అడికాదు ఆంటీ ! పరిహాసానికి అన్నా, ఫూల్ - యీడియట్ అంటూ తిట్టాలా ?"

"వాడికి అలా సాగింది మరి, ఒక్కడేనను."

"బాగుందాంటీ. నేను ఒకర్తినేకదా" అన్నది హర్ట్ అయి.

"అవునే తల్లీ మగపిల్లవాడాయె. వాడిని అర్థం చేసుకో..." అన్నది.

అమెరికా వెళ్ళి వచ్చింది. ఆధునికంగా డ్రస్సులు వేసుకుంటుంది. జుట్టు కత్తిరించుకుంటుంది. అయినా తన పాత భావాలు వదలటం లేదు.

ఆ సాయంత్రం కృష్ణ మందిరం శుభ్రం చేస్తుంటే ఆదిత్య వచ్చాడు. ఆమెకు అతను సహాయం చేశాడు.

"అబ్బబ్బ ! ఈ దులపటం, ఊడ్వటం ఆడవారు చేసే పనులు" అన్నది వారిస్తూ.

"ఆడవారి పనులు, మగవారి పనులు అంటూ, వ్రాసిన డిక్షనరీ చూపించు" అన్నాడు.

ఆ ఉదాత్త భావన ఆమెకెంతో నచ్చింది.

ఆమె స్టూలు వేసుకుని, విగ్రహం తలపై పడిన పూలు దులపడానికి ప్రయత్నించింది. స్టూలు ఓ పక్కకు ఒరిగింది. 'అమ్మో' అన్నది. నేలకు కూలేదే, కాని ఆదిత్య చేతులు ఆమెను బలవంతంగా ఆపాయి.

కళ్ళు విప్పేసరికి అతని చేతులలో ఉంది.

"సారీ..." దూరం జరగబోయింది. అతను వదిలినట్టే వదిలి మరింత దగ్గరగా లాక్కున్నాడు.

"నీలూ !"

"ఊఁ..." అన్నది అరమోడ్పు కన్నులతో.

"నీ భగవంతుని సన్నిధిలో నా వడిలో పడ్డావు" అన్నాడు హెచ్చరికగా.

"నీ భగవంతుడెవరో..." అని చటుక్కున దూరం జరిగింది. గుమ్మంలో చిన్నబాబు నిలబడి ఉన్నాడు.

"ఓ ఐ సీ !"

"వ్వాట్ !" అన్నది అతిశయంగా.



"ఇందుకేనా అమ్మ నిన్ను కనిపెట్టి ఉండమన్నది. ఐ నో..." అని తల పంకించాడు.

"మా అమ్మ చెప్పిందా !"

"షిట్ ! మా మమ్మీ చెప్పింది. అతనితో లవ్..."

"షటప్ ! నన్నాఫ్ యువర్ బిజినెస్." కోపంగా అరిచింది.

"ఏయ్ బిచ్ ! నన్ను..., నన్ను షటప్ అంటావా...ఐ విల్... టీచ్‌యు నాకేం...నాకేం గతిలేక నిన్ను బెగ్ చెయ్యటంలేదు. నాకు చాలా మంది గర్ల్ ఫ్రెండ్స్ ఉన్నారు."

ఆదిత్య చిన్నగా నవ్వాడు. వచ్చి ప్రేమగా అతని భుజం తట్టాడు. నీలిమను మందలింపుగా చూచాడు.

"చూడు బ్రదర్ ! ఆ అమ్మాయిని నేను తాకాలని, తాకలేదు. తూలి పడింది. కూర్చోండి." అన్నాడు.

"ఓ ఐసీ..." ఇద్దరు వెళ్ళి కూర్చున్నారు.

"అవును బ్రదర్ ! నాకు అమెరికాలో మన వారి ప్రవర్తన గురించి, అక్కడ ఉద్యోగాల గురించి కొంత ఇన్‌ఫర్మేషన్ కావాలి."

"సారీ బ్రదర్ ! మమ్మీ నడుగు. నన్ను యెవరితో మాట్లాడనిచ్చేది కాదు. 'అయిదు నిమిషాలు మాట్లాడకురా నీకు పిచ్చి అని వసగడతారు' అనేది. మీరింత సేపటినుంచి మాట్లాడుతున్నారు కదా, యామై మ్యాడ్ !"

"నో ! యెవరన్నారు ? అన్నవారు మ్యాడ్ !"

"థాంక్యూ ! మా మమ్మీ మాటలు విని నా గర్ల్‌ఫ్రెండ్ క్యారెన్ కూడా వెళ్ళిపోయింది" అన్నాడు విచారంగా.

"క్యారెన్ అందంగా ఉంటుందా !"

"క్యారెన్‌కన్నా మరీచ చాలా బావుండేది. నన్ను మెంటల్ హాస్ప

త్రిలో చేర్చక ముందు నాతోనే తిరిగింది. ఐయ్ ఎంజాయ్డ్ ఎలాట్" అన్నాడు మైమరచిపోతూ.

"మెంటల్ హాస్పిటల్లో ఎందుకు చేర్చారు? మీరింత బాగా మాట్లాడుతుంటేను" అన్నాడు.

"నిజం చెప్పనా! మా అమ్మ ఓ మెంటల్ పేషెంటు. ఆమెకేదో అనుమానం. చిమన్‌భాయ్ పటేల్ అనే ఓ వ్యాపారస్తుడు ఉండేవాడు. వాడి కొడుకే జూనియర్ పటేల్! ఆ వెధవకి ఆంధ్రులు, మద్రాసువారు తెలియదు. అందరిని ఒకటే మాట 'మద్రాసీ...మద్రాసీ' అంటూ ఓ రోజు ఇద్దరం బాగా తాగాం మద్రాసీ అంటూ రెచ్చగొట్టాడు. చాకుతో పొడిచేశాను."

"మరి...మరి వాడు చచ్చిపోయాడా?"

"చచ్చిపోయేవాడే, కాని కొద్దిలో ప్రమాదం తప్పింది..." అన్నాడు వికృతంగా, అడవి మృగంలా నవ్వుతూ.

"అతను మీ బిజినెస్ పార్టనర్ అనుకుంటాను" అన్నాడు ఆదిత్య.

"పార్టనర్ గోటు హెల్! మా మమ్మీ మాటలు ఎవడు నమ్మమన్నాడు. నాకు వ్యాపారం రాదు. ఆమె నేను వ్యాపారం చేస్తున్నానని ఇమాజినేషన్‌తో తృప్తి పడుతుంది." పక, పక నవ్వాడు చిన్నబాబు! నీలిమ ముఖం గంభీరంగా మారింది. తలుపులో నిలబడి శ్రద్ధగా వినడి

"నిజమే బ్రదర్! వ్యాపారం అంటే నాకు బోరే. చదువుకున్న వాచం" ఈసారి ఇంటికప్పు ఎగిరిపోయేలా నవ్వాడు చిన్నబాబు.

"బ్రదర్! చదువంటే నాకెంత ఎలర్జీయో, నేను చదివేది మంచి హుషారయిన క్రైమ్, సెక్స్ నవల్స్. పూర్ మమ్మీ నేను ఎం. బి. ఏ. చేశానని తృప్తిపడుతుంది" అన్నాడు ఇంకా నవ్వుతూ.

"మీరు ఎం. బి. ఏ. చదువలేదా!"

"ఊహూ! ఫార్మ్ ఫోర్‌తో ఆపేశాను చదువు. అబ్బ బోర్. మే



ఫిజిక్స్, కెమిస్ట్రీ, లెక్కలంటే చచ్చేభయం. అందుకేగా ఈ ఊరొచ్చింది!" అన్నాడు సిన్సియర్‌గా.

"ఈ ఊళ్ళో ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదని చెప్పారా!"

"అబ్బ! నీకేం తెలియదు. ఇక్కడ అమ్మాయిల తల్లితండ్రులకు అమెరికా మానియా ఉందటకదా. అక్కడ అడుక్కుతిన్నా, అంట్లు తోమినా ఫరవాలేదుట. అమెరికా వెళ్ళాడు అంటే చాలునట, పిల్లనిస్తారుట" అన్నాడు.

ఆదిత్య, నీలిమ ముఖ ముఖాలు చూచుకున్నారు.

"నీలూ! చిన్నబాబుగారు అలసిపోయారు. టీ ఇస్తావా!" అన్నాడు ఆదిత్య.

"అబ్బ! టీ అంటే నాకు పరమ ఎలర్జీ! బ్రాందీ, విస్కీ...చివరకు బీరయినా ఫరవాలేదు. ప్లీజ్" అన్నాడు.

"అవి ఇంట్లో ఉండవు."

"లెట్ ఇట్ గోటు బార్! పెళ్ళి అయ్యేదాకా వాగొద్దురా అని మా మమ్మీ చంపుతుంది" అన్నాడు.

"ఓ...అలాగా..." అన్నాడు. నీలిమ ఏదో అనబోతే కళ్ళతోనే వారించాడు ఆదిత్య.

అంతలోనే కారొచ్చింది. చిన్నబాబు హడావుడిగా లేచాడు.

"అబ్బ! కూర్చోబాబూ! వచ్చింది మీ మమ్మీ" అన్నది నీలిమ.

"మా మమ్మీయే, యెవరితో మాట్లాడవద్దంటుంది. ఏయ్ ఆదిత్యా! నేనింతసేపు మాట్లాడానని మమ్మీతో చెప్పకు" అన్నాడు.

"అలాగే..." అన్నాడు ఆదిత్య.

"అబ్బ! ఇల్లు చాలా బావుందే" మురిసిపోయింది సావిత్రమ్మ.

"నీకు నచ్చుతుందని తెలుసు" అన్నది ముకుందాదేవి. చిన్నబాబు మాట్లాడక తల్లి ముఖం చూస్తున్నాడు.

# 10

**చైనులు** ముకుందాదేవితో వాటా అడగటానికి వచ్చాడు. ఆమె ఆశ్చర్యపోయింది. అప్పుడే భక్తులంతా వెళ్ళిపోయారు. అవతారం చాలించి కూర్చుంది. కనకాభిషేకం జరిగింది. ఒకరు కాదు ఇద్దరు భక్తులు చేశారు.

ముకుందాదేవికి ఆ రోజు ఎంతో నిశ్చింతగా ఉంది. ఒకవైపు కూతు రికి మంచి సంబంధం కుదిరింది. అన్నివిధాలా తగిన ఇల్లు దొరుకుతుంది. వారిద్దరికి పెళ్ళిచేసి, తను సంధ్యారావుతో ఏ పల్లెటూరుకో వెళ్ళి ఉంటుంది. ఆమె ఊహలను చెదరగొడుతూ చైనులు పిడుగులాంటి ప్రశ్న వేశాడు.

"ముకుందాదేవీ ! కృష్ణపరమాత్మ పేరున సంపాదించిన ధనంలో వాటా కావాలి." అన్నాడు నిర్భయంగా సిగరెట్టు కాలుస్తూ.

"అవునండీ. నేను అడగాలనుకుని తటపటాయిస్తున్నాను." అన్నాడు రాయుడు.

"రాయుడూ ! ఏమిటీ నాటకం ?"

"ముకుందాదేవీ, ఇన్నాళ్ళు ఆడింది నాటకం. నీ భక్తిని రక, రకాలుగా కీర్తించాను, యెన్నో వేషాలువేసి, నీ మహిమలు ప్రచారం చేశాను." అన్నాడు.

"ఉదారంగా చేశారా ?" తీక్షణంగా అడిగిందామె.

"ఉదాసంగా యెవరూ, ఏ పనీ చేయరు. మీరు మీ కూతురు భవిష్యత్తు ఆలోచించినట్లే, మాకున్న వారి గురించి మేము ఆలోచించవద్దా ! ఉన్నదంతా ఇచ్చి నీ కూతురికి వైభవంగా పెళ్ళిచేస్తావు. ఆమె వెళ్ళి పోతుంది. మీరు అవతారం చాలిస్తారు. మేమేగా అడుక్కు తినాల్సింది." అన్నాడు చైనులు.

"నేసంత స్వార్థపరురాలిసికాను చైనులూ ! నా కూతురు పెళ్ళి



అది సెటిలయితే. మీ అందరికి ఏదో ఒక వ్యాపారం చూపిస్తాను. మీరు నిశ్చింతగా ఉండండి." అన్నది.

"అది లాభంలేదు. మా అందరికి సరిగ్గా వాటా ఇవ్వాల్సిందే. యెంత ధారణశక్తి ఉంటే భక్తుల పేర్లు, వారు చర్చించే సమస్యలు వారి బట్టల రంగుతోసహా మీకు చెప్పగలను ! ఆ విషయం ఆలోచించండి." అన్నాడు, ఆమెకెదురుగా స్టూలు లాక్కుని కూర్చుంటూ.

"అవునండీ ! వచ్చిన భక్తులు మళ్ళీ, మళ్ళీ వస్తారు. యెవరయినా గుర్తుపడితే ప్రమాదం కద, అందుకే అరచేత ప్రాణం పెట్టుకున్నాను. మా ఇంటివాళ్ళు వద్దూ అంటూ గొడవచేశారు." అన్నాడు రాయుడు.

ముకుందాదేవి ముఖం ఎర్రగా అగ్రమణిలా అయింది.

"మీకు వాటా రావాలంటారు."

"అవునండీ."

"ఇవ్వకపోతే ?"

"ఫలితాలు దారుణంగా ఉంటాయని చెప్పటానికి విచారిస్తున్నాము" అన్నాడు రాయుడు.

"బెదిరింపు అనుకుంటాను."

"ఎలా అనుకున్నా వచ్చిన నష్టం ఏం లేదు."

"మీరేం చేస్తామన్నా నాకు వచ్చిన నష్టం ఏం లేదు. వెళ్ళండి. ఏం చేసుకుంటారో చేసుకోండి" అన్నది బెట్టుగా.

"ముకుందాదేవీ ! బాగా ఆలోచించండి. ఈ గుట్టు కాస్త రట్టయితే భక్తులు రారు" అన్నాడు చైనులు.

"నా అంతట నేనే ఈ అవతారం చాలించాలనుకున్నాను. అది మీ వల్ల అయితే సంతోషము. బుద్ధిగా నేను చెప్పినట్టు వింటే నాకు ఇన్నాళ్ళు చేసిన సహాయానికి ఏదో ఇస్తాను. బెదిరించి డబ్బు గుంజాలనుకుంటే మీరిక

వెళ్ళిపొండి" అన్నది చటుక్కున లేచి నందనరావు గదిలోకి వెళ్ళింది. వాళ్ళు వెళ్ళిపోయాక, వెనుకగా నీలిమ తలుపులు వేయటం వినిపించింది.

ఆమె వెళ్ళి భర్త మంచం దగ్గర నిలబడింది.

"ఏమిటి ముకుందా !"

"కాస్త ప్రక్కకు జరుగుతారా ! నేనిక్కడ పడుకుంటాను" అన్నది. అదేం ఆయనకు కొత్తకాదు. ఆమె మనసు బాగాలేనప్పుడల్లా వచ్చి అలాగే అడుగుతుంది.

"ముందు తలుపు వెయ్యి. వరండాలో ఆదిత్య పడుకున్నాడు." అన్నాడాయన. తలుపు వేసి వచ్చింది. అతని ప్రక్కన పడుకుని, అతని హృదయంలో తల దాచుకుంది.

"ఒక సంస్థ అన్నాక దానిలో పనిచేసే రకరకాల ఉద్యోగులు, రకరకాలుగా విమర్శిస్తారు. దానికి భయందేనికి ?"

"వాళ్ళు విమర్శించారని కాదండీ – మనమేం పాపం చేశామని ఈ శిక్ష. ఒక్కనాడయినా మనశ్శాంతిగా ఉన్నామా !" అన్నది, సన్నగా ఏడుస్తూ.

"విధి అంటే ఇదే ముకుందా ! నిదురపో" అన్నాడు ఆ ఉన్న చేత్తో తల నిమురుతూ. ఆమె మాట్లాడలేదు. త్వరగా నీలిమ వివాహం అయితే తనకు ఏ బాధ ఉండదు అనుకుంది. ఇంటా, బయటా యెన్ని విఘ్నాలో !

"ముకుందా !"

"ఏమిటండీ ?"

"చిన్నబాబు విషయం మరొక్కసారి ఆలోచించు" అన్నాడు.

"ఆలోచించే ఒక నిర్ణయానికి వచ్చేశానండి. ఇద్దరూ మన కళ్ళ ముందే ఉంటారు" అన్నది.

నందనరావు నవ్వాడు. ఒకప్పుడు అతను నవ్వితే అందంగా,



సమ్మోహనాస్త్రంలా ఉండేది. ఈ రోజు వికృతంగా కనిపించిందామెకు. కళ్ళు మూసుకుంది.

"ముకుందా ! నువ్వు మనల్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు నిర్ణయించకు, అమ్మాయి అభిప్రాయం అడిగావా ?"

"జరుగుతున్నదంతా తను చూస్తున్నది కదా ! ఇష్టం లేదంటే ఎదురు చెప్పేదే" అన్నదామె.

ఇప్పుడా ప్రసక్తి బొత్తిగా ఇష్టం లేదామెకు. ఒక తలనొప్పి తగ్గించుకుందామని మరో తలనొప్పి, తలకు చుద్దుతున్నాడు భర్త.

"నువ్వు అమ్మాయి స్వభావం గ్రహించావో లేదో మనకోసం ప్రాణాలు ఇవ్వమన్నా ఇస్తుంది. వెర్రితల్లి" అన్నాడు.

ఆమె నిదుర నటిస్తూ, ఆవులించి చిటికె వేసింది. ఆ విషయాలు చర్చించాలని లేదు.

"రేపు మాట్లాడుకుందాం" అని కళ్ళు మూసుకుంది. కాని హృదయపు మథనం, ఆలోచనల కుదింపు ఆమెను పిచ్చిదాన్ని చేస్తున్నాయి.

చిన్నప్పటినుండి నీలిమకు తన దగ్గరకంటే తండ్రి దగ్గరే చనువు. ఆయనకు అపర దుర్వాసుడనే పేరుండేది. కూతురి దగ్గరకు వచ్చేసరికి పరమ శాంతమూర్తి అయ్యేవారు. ఆమె చెప్పినట్టు వినేవారు.

పక్షవాతం వచ్చాక కూడా జీవితంపై విరక్తి పెంచుకుని మందులు తినను గాక, తినను అని మొండికేశాడు. నా బ్రతుకు నిరుపయోగమే అన్నాడు. డాక్టర్లు, ముకుందాదేవి విసిగి పోయారు. చివరకు చిన్నారి నీలిమ వెళ్ళి మందు లిచ్చింది.

"వద్దు నీలూ ! నేనిలాగే చస్తాను. యెవరికోసం బ్రతకాలి !" బావురుమన్నాడు.

"నా కోసం, నీలూ..కోసం బ్రతకాలి నాన్నా" అన్నది తన చిన్నారి చేతులతో అతని చెంపలమీద జాలువారిన కన్నీటిని ఒత్తింది.

ఆనాటి తరువాత మందులు వద్దు, చస్తాను అని అనలేదు. ఒక్కొక్క సారి ముకుందాదేవికి అసూయగా కూడా ఉంటుంది. చిన్నప్పటి నుంచి అంతే, తనకేదయినా ప్రమాదం జరిగితే తండ్రికే మొదట చెప్పుకుంటుంది నీలిమ. చిన్నబాబు ఇష్టం లేదనిచెప్పిందా!

"ఏమండీ..." లేచి కూర్చుంది ముకుందాదేవి.

"నీలు మీ కేమయినా చెప్పిందా!"

అతను కళ్ళువిప్పి చూశాడు.

"నీలు ఏం చెప్పలేదు ముకుందా! నేనే ఊహించాను. నా మనసులో ఒక్కమాట ఉంది" అన్నాడు.

ముకుందాదేవికి తెలుసు అతను మనసులోని మాట ఏమిటో. మౌనంగా ఉండిపోయింది. అతని సహచర్యంలో వెన్నెల చల్లదనం, మల్లెల సౌరభం, అమృతంలోని మాధుర్యం చవిచూడలేదు. వ్యతిరేకంగా ఏనాడు ఒక్కమాటని ఎరుగదు. దానికి ఆమె బీదరికమే కారణం.

"ఆదిత్యను చూచావు. అతని గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

"నేను అతని గురించి ఆలోచించవలసిన అవసరమేం వచ్చింది. చైనులు, రాయుడు, సత్యలాంటి ఉద్యోగి."

"పోనీలే ఉద్యోగే, కాని నా కతని సౌజన్యం. సహృదయత నచ్చాయి. అతని అండన నీలు సుఖపడుతుందన్న నమ్మకం ఉంది" అన్నాడు.

"మీరనేది ఏమిటండీ ... చిల్లుపైసా లేని..."

"ముకుందా!" తీక్షణంగా చూచాడు అతను. ముకుందాదేవి మాట్లాడ లేదు.

"నిన్ను పెళ్ళిచేసుకున్ననాడు మీ వారెంత కట్నం ఇచ్చారు?"

"దెప్పుతున్నారా!"

"లేదు. నీకు మనమేమిటో అర్థం చేస్తున్నాను."



"చిన్నబాబులో ఏమిటి లోపం! అందునా అమెరికా వెళ్ళి వచ్చాడు..."

"అమెరికా ... అమెరికా! అమెరికా? అక్కడికి వెళ్తేనే చాలా! బ్రతకటానికి అర్హత ఉండవద్దూ! వాడేం వ్యాపారం చేస్తున్నాడట? ఇంతవరకు చెప్పాడా! పోనీ ఏం చదివాడో చెప్పాడా? వాడు 'మమ్మీ' అంటూ ఆమె చెప్పిన దానికి తలాడిస్తూ కూర్చుంటాడా! మనకు కావల్సిన డబ్బుంది. దాంతో ఆదిత్య ఏదయినా వ్యాపారం చేయగల సమర్థుడు."

"అమ్మాయి కిష్టంలేదు."

"నువ్వు అడిగావా!...నీ ఊహలు, నీ ఆలోచనలు వేరు. రేపు జీవితాంతం కలిసి ఉండాల్సింది అమ్మాయి." అన్నాడు.

"అమ్మాయికి ఇతరత్రా ఆలోచనలుంటే చిన్నబాబు పేరు సూచించి, ఇల్లు కొంటాము అంటుంటే అడ్డు చెప్పేది" అన్నది.

నందనరావు దగ్గర దానికి జవాబు లేదు, అతనికి కూతురి ఆంతర్యం అంతుపట్టలేదు. ఏం మాట్లాడాలో తెలియలేదు. భార్యను శాసించలేదు.

"ఆదిత్యకిస్తే మంచిదని మీ భావం కాని, మరీ అంత దిక్కులేని వాడికివ్వటం నా కిష్టం లేదు." అన్నదామె.

అతను దుప్పటి లాక్కుని అటు తిరిగి పడుకున్నాడు. ముకుందాదేవికి కోపం వచ్చింది. ఆమె స్వార్థం ఆమెది. ఆదిత్య లాంటి వారికి స్వంత ఆలోచన ఉంది. తనమాట వినరు. చిన్నబాబు అది పట్టించుకోడు.

"ఏమండీ! నిదురబోయారా!"

జవాబు రాలేదు. ఆమెకి ఎక్కడలేని కోపం వచ్చింది. అంతకుక్రితం చైనులు, రాయుడు చేసిన ఆరోపణలు గుర్తుకు వచ్చాయి. అందరూ తన మంచితనం ఆసరాగా చేసుకుని ఆడిస్తున్నారు. ఈ అవతారం ఎత్తితే వచ్చిన

కష్ట, నష్టాలు తనకు తెలుసు. బయట సుఖంగా ఉంటున్నాను. ఉ[illegible]
ముంచుకు వచ్చింది.

"మేము నిదుర నటిస్తే నాకొచ్చిన నష్టంలేదు. ఏదో ఉద్ధరిస్తున్నా[illegible]
బీదదాన్ని అని పెళ్ళి చేసుకున్నారు. ఆనాటి నుండి సమస్యలే. ది[illegible]
మొక్కు లేదు కదా అని పిల్లలు కాలేదని మళ్ళీ పెళ్ళి అంటూ ఏడ్పించా[illegible]
అదృష్టం బావుండి ఆ పిల్ల పుట్టింది. ఆ తరువాత అడ్డం పడ్డారా[illegible]
అన్నది ఆవేశంగా.

సంపతరావు ఇటు తిరిగి నవ్వాడు. ఆ నవ్వు అంటే ఆమెకు మం[illegible]

"జబ్బు రావాలి, నీపై ఆధారపడాలని నేను కోరుకున్నానా !"

"కోరుకున్నారో ? ఏమనుకున్నారో. నన్ను అష్టకష్టాలు పెట్టా[illegible]
ఎందరి కాళ్ళు పట్టుకుని, మరెందరి కడుపులో తలదూర్చి ఈ అవతా[illegible]
నెట్టుకు వస్తున్నానో మీరు ఎరగరు, ఒక్కసారి...ఒక్కసారంటే ఒ[illegible]
సారి జాలి చూపుతారా ! అయ్యో పాపం అంటారా !"

"ఇప్పుడేమయింది ముకుందా ! నీ ఇష్టం వచ్చిన వాడికివ్వు. ఇదే[illegible]
టని అడిగితే చెప్పుచ్చుకు కొట్టు."

"అంటే మీ ఉద్దేశం !"

"కుంటివాడికి, గుడ్డివాడికి, మతిలేని వాడికిచ్చినా మాట్లాడను. కా[illegible]
చేత్తోపాటు, నోరు పడిపోతే ఎంత బావుండును" అన్నాడు.

ముకుందాదేవి ఆవేశంగా వెళ్ళి అతని చొక్కా పట్టుకుని కుదిపిం[illegible]

"అంటే...అంటే నా కూతుర్ని మతిలేని వాడికిస్తున్నానా ! అ[illegible]
న్లేండి. అంతకంటే మీకేం అర్థం కాదు."

"అమ్మా..."

చప్పున భర్త చొక్కా వదిలివేసింది ముకుందాదేవి.

"అమ్మా ! అసహాయతపై జాలి చూపాలి గాని, కోపం కాదమ్మ[illegible]
అన్నది.



"అందరూ నాకు చెప్పేవారేనే. ఆయన ఏమన్నారో విన్నావా !"

"విన్నానమ్మా ! తల్లిగా నీకెంత బాధ్యత ఉందో, నా గురించి ఆలోచించే అవసరం నాన్నగారికి ఉన్నది" అన్నది.

"నాన్నగారూ..." ఒక వ్యంగ్యపు నవ్వు నవ్వి వెళ్ళిపోయింది ముకుందాదేవి.

"నీలూ ! నేనెంత చేతకానివాడినయినా అనుబంధాలు చంపుకున్న వాడ్నికాను. ఏదో అన్నాను. చిన్నప్పటినుండి అంతే ముకుంద. నువ్వు తన స్వంతం అయినట్టు ప్రవర్తిస్తుంది" అన్నాడు బాధగా.

"మీరు అవిటివారని అతి జాగ్రత్తపడి ఉంటుంది. మీరు నిదుర పొండి." మాత్ర ఇచ్చి, మంచినీళ్ళు ఇచ్చింది నీలిమ.

"నీలూ ! ఇలా కూర్చో తల్లీ – నీ స్పర్శతో నేను శాంతి పొందు తాను." అన్నాడు.

అతని ప్రక్కన కూర్చుని, అతని పీలపడిన చేయి, కాలు మర్దనా చేస్తూ, సన్నగా కూనిరాగం తీసింది.

"నీలూ ! మొదటిసారి నిన్ను మీ అమ్మ వడిలో చూడగానే, సామ్రాజ్యాలు దొరికిన రాజులా సంబరిపడిపోయానమ్మా. ఎవరూ కనీ, వినీ యెరగనంత ఘనంగా నన్ను పెంచి పెద్దచేసి చదివించాలనుకున్నాను. కాని, విధి ఇంత అసూయ చెందుతుందని ఊహించలేదు. ఊపిరి పోసుకోక ముందే నా కలలు చెదరగొట్టి, బ్రతుకంటే బెదిరిపోయేలా చేసింది." అన్నాడు. అతని రెండు కనుల కొలుకుల్లో నీరు నిలిచింది.

"ఊర్కో నాన్నా !" ఆమె ఆర్తిగా తన పమిటతో కళ్ళు ఒత్తింది.

"అమ్మా...ఏది...ఆ పాట పాడమ్మా." అన్నాడు అభ్యర్థనగా.

"జోఅచ్యుతానంద జో జో ముకుందా !" అంటూ అన్నమాచార్యుల కీర్తన అత్యంత మధురంగా ఆలపించింది.

అతను అరమోడ్పు కన్నులతో చూచాడు.

"నీలూ ! నీవు ఎక్కడ ఉన్నా, నా అంతిమ ఘడియల్లో నా ద ఉండాలి...నీ జోలపాట పాడాలి..."

"అలాగే నాన్నా..." అతని కళ్ళు మూసింది. అతనామె చే పట్టుకుని నిదురపోయాడు. మెల్లగా లేచి, లైటు ఆర్పి, వరండాలోకి తొ చూచింది. అలసిపోయాడేమో, హాయిగా నిదురపోతున్నాడు ఆదిత్య.

ఆమె పరీక్షగా చూచింది. పచ్చని పసిమిఛాయ కాదు. అయి అందంగా ఉంటాడు. ఒత్తయిన జుట్టు చిందర, వందరగా పడి, అ ముఖాన్ని ఆకర్షణీయంగా చేసింది. ఒత్తయిన కనుబొమ్మలు, ఒత్తు మీస అని పోటీపడే మీసాలు చూస్తూ నిలబడిపోయింది.

'అందం అంటే పసిమిఛాయే అనుకుంటారు. అబ్బ ఈ మనిషి ఎంత ఆకర్షణ !' ఆ క్షణంలో వెళ్ళి అతని ఎదపై తలపెట్టి విశ్రాంతి తీ కోవాలనుకున్నది. మళ్ళీ విచక్షణ మేలుకున్నది.

అతను ఒక ప్రక్కనుండి మరో ప్రక్కకు పొర్లాడు. ఉలిక్కిప గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది. అప్పుడు తల్లి సంగతి ఆరాపచ్చింది.

"అమ్మా !" తల్లి గదిలోకి వెళ్ళింది.

ఆమె ఇంకా ఏడుస్తోంది

"అమ్మా ! నాన్నగారన్నది వాస్తవం. నువ్వు ఇంకా కొన్ని రో ఆగి, నా వివాహం నిశ్చయం చెయ్యి - చిన్నబాబు మానసిక ఆరోగ్య అంత మంచిది కాదని నా అభిప్రాయం."

"నీలూ !"

"అవునమ్మా. అందుకే ఆంటీ ఒంటరిగా వదలి వేయటానికి జం తుంది. అతని బాహ్యరూపం చూచి మోసపోవచ్చు" అన్నది. లైటు ఆ ఆమె ప్రక్కన చోటు చేసుకుని పడుకుంది నీలిమ. ఆ అమ్మాయి అ భవం లేకపోయినా కొన్ని విషయాలు ఊహించగలదు. భార్యాభర్తల మ శారీరక బంధాలు అంతంత మాత్రంగానే ఉంటాయి. ఆ దూరం తల్లి తండ్రుల మధ్య గమనిస్తుంది.

# 11

**నందనరావును** తీసుకుని నర్సింగ్‌హోమ్‌కు వచ్చిన నీలిమ, ఆదిత్యలు డాక్టరుగారు లేరని తిరిగి వెళ్ళిపోయారు. శివాజిగారు తప్ప ఇతరులు చూస్తే తృప్తిపడరు. అలాంటి పేషెంట్లలో నందనరావు ఒకరు.

"ఎప్పుడొస్తారో అడుగు నీలూ ! మళ్ళీ వద్దాము" అన్నాడు.

"వారి అత్తగారు పోయారట నాన్నా !"

"అయ్యో పాపం ! భార్య పోయింది-అత్తగారుకూడా పోయారా !" అన్నాడు. ఇంకా పదిరోజులు పడుతుందట రావటానికి. వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళు కారు వెళ్ళిపోగానే శివాజీ వచ్చారు

"గుడ్ మార్నింగ్ సర్ ! మీరు రారనుకుని, నందనరావుగార్ని పంపేశాను" అన్నది సిస్టర్.

"పదిరోజులు రావద్దనే అనుకున్నాను సిస్టర్ ! ఇంట్లో బోరుకొడుతోంది. అరవింద్ బడికి వెళ్ళిపోతాడు. పార్థసారథిగారు భజనలుచేస్తూ కూర్చుంటారు" అన్నాడు. అతను అందించిన కోటు తీసుకుని, హేంగరుకు తగిలించింది. అతను వెళ్ళి పేషెంట్లను చూచి వచ్చాడు. ఒక కప్పు టీ తాగి వసంతకు ఫోన్ చేశాడు.

"హల్లో డాక్టర్ శివాజీ...చంద్రసేన్ గారున్నారా !"

"ఊర్లో ఉన్నారు. నాకు కడుపులో నొప్పిగా ఉంది డాక్టరుగారూ ! అరగంటలో వస్తున్నాను" వసంత ఫోన్ పెట్టేసింది. శివాజి ఎదురుగావున్న ఓ పత్రిక తిరగవేస్తూ కూర్చున్నాడు. అందులో మానవ శరీరంలోని నిర్మాణం ఏం దాచకుండా ఇచ్చాడు. అదంతా తెలిసికూడా అందానికి ప్రలోభపడతాం. అనుకున్నాడు. అతనికిప్పుడు అర్జంటుగా ఒక స్త్రీ అంద కావాలి.

"మీ అత్తగారు పోయారట!" హడావుడిగా వచ్చింది వసంత.

"హాయ్ వసూ! ఆమె పోతూ, పోతూ నన్నొక సముద్రంలో ముంచిపోయింది" అన్నాడు.

"నిన్ను మునగనిస్తానా డార్లింగ్..." అతని క్రాపు చెరిపేసింది వసంత. అతను మౌనంగా తల దువ్వుకుని, బెల్ నొక్కాడు. సిస్టర్ వచ్చింది.

"సిస్టర్! మిసెస్ చంద్రసేన్‌ను డాక్టర్ లోహిత్‌కు చూపించటానికి తీసుకువెళ్తున్నాను" అన్నాడు. ఆమె కోటు అందించింది. ఇద్దరూ బయలుదేరారు.

అతను కారు తిన్నగా ఓ మామూలు హోటల్ ముందాపాడు.

"ఇక్కడ ఎందుకు!"

"కాసేపు ప్రశాంతంగా గడుపుదామని. ఈ హోటల్లో నాకొక గది ఉంటుంది యెప్పుడూ" అన్నాడు. ఇద్దరూ దిగి లోపలికి వెళ్ళారు. అతడిని చూస్తూనే బాయ్ పరుగెత్తుకువచ్చి, గది తాళం తీశాడు.

"బీరా, విస్కీ సర్!"

"బీర్! రెండు మీల్స్ పట్రా" అన్నాడు.

అతను అలసటగా మంచంపై వాలిపోయాడు. వసంత అతని దగ్గరగా వెళ్ళింది.

"నీ సమస్య ఏమిటో చెప్పు శివా!"

"మమ్మీ పోయింది వసూ! ఇల్లు చూసుకోవటానికి ఓ స్త్రీ కావాలి. అందుకే నేను పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను" అన్నాడు.

వసంత ఉలిక్కిపడింది. అతను పెళ్ళి చేసుకుంటే తను గుర్తుంటుందా! ఏమో.

"కులం, కట్నం అనే ప్రసక్తే లేదు. ఇల్లును చూసుకుని, అర



విందును కాస్త ప్రేమగా చూచుకునే వారయితేచాలు వసూ! మమ్మీ ఉండగా ఆమె చేసిన ప్రయత్నాలు తేలికగా కొట్టిపారేశాను" అన్నాడు.

"అలాగే. మా కజిన్ ఉంది. కాని దానికి కాస్త వయసు ముదిరింది" అన్నది వసంత.

"నేను బాలాకుమారుడిని కాదు" అన్నాడు.

బీర్ వచ్చింది.

అతను బీర్ త్రాగుతుంటే వసంత ఎక్కడికో ఫోన్ చేసింది. భాగ్యనగర్ ఉడ్‌వర్క్స్ అని అడిగింది.

"స్వతంత్రా! నువ్వేనా... ఒక్కసారి హోటల్ ... రా తరువాత చెబుతానే. నువ్వు రా" అన్నది ఫోన్ పెట్టేస్తూ.

"యెవరు వసూ!"

"మా కజిన్ అని చెప్పాను..."

"ఇక్కడికి రమ్మన్నావెందుకు?"

"వస్తే ఏమయింది?"

"నీకు తెలియదు వసూ! ఈ దేశంలో స్త్రీ పురుషుల స్నేహాన్ని హర్షించరు. పర్మిసివ్ సొసయిటీ అంటున్నారు. కాని అనుమానించటం, అక్రమ సంబంధాలు అంటగట్టటం పరిపాటి."

వసంత పక, పక నవ్వింది.

"మనకు సంబంధం లేదా!"

"ఉందని మెడకు బోర్డు వేసుకుని తిరుగుతామా! అసలు ఈ ఏకాంతంలో మనల్ని చూస్తే ఆ అమ్మాయి అనుమానించదూ!" అన్నాడు.

"అప్పుడే ఆ వీర ఫోజులు యెందుకట! అయితే పెళ్ళి కాగానే నన్ను మరిచిపోతావా!" అన్నది కోపంగా అతని జుట్టు చెరిపేస్తూ.

"వసూ! నువ్వు నా పేషెంటువి. అది వేరే విషయం."

"అయితే దానికేదో సర్ది చెబుతాను" అన్నది వసంత.

"కాస్త బీరు రుచి చూస్తావా ?" అన్నాడు.

"ఏం తోచనప్పుడు బీరు, విస్కీ, అన్నీ త్రాగుతాను. నీ సమక్షం నాకు బీరు, విస్కీ కంటే మత్తు కల్గిస్తాయి శివా..." అన్నది అతని హృదయంలో తల దాచుకుని.

"అంత ఆరాధించేదానవు ఒక పని చెయ్యి."

"చెప్పు..." అన్నది అతని బుగ్గపై గాటు పడేలా కొరుకుతూ.

"ఛ...మొరటు...అవునూ, మీ ఆయనకు విడాకులు ఇచ్చెయ్యి. ఇద్దరం హాయిగా పెళ్ళి చేసుకుందాము" అన్నాడు.

"అది నువ్వు వద్దన్నావు. ఒకందుకు అదీ మంచిదే, నా జీవితం నా ఒక్కదానిది కాదు. నా తరువాత ఇంకా ఇద్దరు చెల్లెండ్లు ఉన్నారు. 'అక్క భర్తకు విడాకులిచ్చిందని అంటారు' యెందుకు ఏమిటి అని ఆలోచించరు" అన్నది.

అతను మాట్లాడక చూడసాగేడు.

"పురుష పుంగవుల స్వార్థం నేను ఎరగనిది కాదు"

"ఉహూ! అయితే ఓ చెల్లెలినే ఇచ్చి చెయ్యరాదూ ! నీ చేతిలోనే ఉంటాను" అన్నాడు.

"చేసేదాన్నే కాని, చూస్తూ చూస్తూ చెల్లెలి జీవితంలో భాగం తీసుకోలేను."

"ఆడవాళ్లెంత స్వార్థపరులు. పైగా మగాళ్ళను గూర్చి కామెంటు చేస్తావు..." అతను ఆమె భుజంపై ఒకటిచ్చాడు.

ఆమె పక పక నవ్వింది. బయట బెల్ కొట్టారు. వెంటనే ఇద్దరూ సర్దుకుని కూర్చున్నారు. శివాజీ లేచి, బుగ్గపై పౌడరద్దుకున్నాడు.

వసంత వెళ్ళి తలుపు తీసింది.

"రా స్వతంత్రా...రా..." దారి చూపింది. ఇద్దరూ లోపలికి వచ్చారు.



స్వతంత్ర నమస్కరించింది.

"నమస్తే! కూర్చోండి" ఇద్దరూ అతని ఎదుట కుర్చీలో కూర్చున్నారు. అతను బెల్‌కొట్టి, రెండు కూల్‌డ్రింక్స్, మరో భోజనం తెమ్మని చెప్పాడు.

"నా క్యారియర్ ఉందండీ" నుదుట పట్టిన చెమట తుడుచుకుంది స్వతంత్ర.

"ఒక్కరోజు మరేం ఫరవాలేదు. ఏమంటారు వసంతగారూ !"

"నేనేం అన్నా వినదు డాక్టరుగారూ !"

"ఈ ఒక్కరోజు మాకు కంపెనీ ఇవ్వండి స్వతంత్రగారూ !"

"ఇతను మా ఫ్యామిలీ డాక్టరు శివాజిగారు-వారి శ్రీమతి పోయింది. ఒక్క అబ్బాయి ఉన్నాడు. మొన్నటివరకు వారి అత్త ఉండి స్త్రీ అవసరం తెలియలేదు. ఆమె ఈ మధ్య పోయారు. అర్జంటుగా ఇక్కడికి రమ్మని ఫోన్ చేశారు. 'నాకు పని ఉంది నువ్వు పో' అని మావారు వెళ్ళిపోయారు. ఏమిటోనని వస్తే తన విషయాలు చెప్పి నా పరిస్థితిని అర్థం చేసుకునే ఒక వధువును చూపించమన్నారు" అన్నది నీకబిగిన.

కూల్ డ్రింక్ వచ్చింది.

"అన్నం తింటూ ఇవన్నీ యెందుకు ?" మొహమాట పడింది స్వతంత్ర.

"ఛ...ఛ... బొత్తిగా ఎటికెట్ తెలియదే. అన్నం తింటూ అనరు, లంచ్ తీస్తూ అంటారు. సూప్, కూల్ డ్రింక్స్ అప్పిటైజర్స్ అర్థం అయిందా!... నాకు నువ్వు గుర్తుకు వచ్చావ్. తమ్ముడి చదువు, నాన్న ఆరోగ్యం అంటూ ఆగినందుకు మంచి ఛాన్సే కొట్టబోతున్నావు" అన్నది.

"వసంతగారూ ! ప్రపోజల్ ఆమెముందు పెట్టాలి. నిర్ణయం వారే తీసుకుంటారు" అన్నాడు శివాజీ.

"వాళ్ళ నాన్న చూడలేదు. ఆయన నాకే చెప్పారు. అందుకే చనువ తీసుకుంటున్నాను. ఏమీ మాట్లాడవు."

"ఏం మాట్లాడాలి! ఇప్పుడేగా విషయం చెప్పింది."

"ఇంకా ఎంతసేపు కావాలమ్మా ఆలోచించటానికి! పొగరు కా పోతే. అమ్మా, నాన్నను తమ్ముడు చూసుకుంటాడు. చూడుకోలేడు అను కుందాం, అప్పుడు నీ దగ్గర ఉంటారు" అన్నది.

"ఆమెను ఆలోచించుకోనివ్వండి."

"అదికాదు డాక్టరుగారూ! అమ్మా నాన్నలకు ఆలస్యంగా పుట్టి సంతానం మేము. నా చదువు అయ్యేసరికి నాన్న రిటైర్ అయ్యా తమ్ముడి చదువు కోసం నా వివాహం వాయిదా పడింది. నా వైపు నుంచి బాధ్యతలే తప్ప, మీకు మర్యాదలు జరుగవు" అన్నది స్వతంత్ర నిర్మో మాటంగా.

"నాకు పెట్టుబడులు, మర్యాదలు అక్కరలేదు స్వతంత్రగారూ! మీ అండదండలు కావాలి. నాకు తల్లీ తండ్రీ లేరు. మీ తల్లిదండ్రుల బాధ్య వహించటానికి నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు.

"రేపు మళ్ళీ మీకు ఫోన్ చేస్తాను" అన్నది. అతను తన ఫో నంబరిచ్చాడు. ఆమె తన ఆఫీసు నంబరిచ్చింది.

"అయితే నీ అంగీకారం రేపటివరకు వాయిదా పడిందన్నమా ఏమండోయ్! డాక్టరుగారూ! నాకు పట్టుచీర పెట్టవలసిందే" అన్నది.

"అలాగేలెండి." భోజనం వచ్చింది. ముగ్గురూ భోజనం చేశా ఆ అరగంటలో స్వతంత్ర చాలా నచ్చింది శివాజీకి. అతనికి స్త్రీల నైజ తెలుసు కాబట్టి, బయటికి ఆ విషయం చెప్పలేదు. అతను భోజనం తరువా ఇద్దరిని వదిలివేశాడు.

అతను ఆస్పత్రికి రాగానే వసంత ఫోన్ చేసింది.



"శివా! ఆశపెట్టి వంచించటం నీకే చెల్లింది..." అలక సాగించింది.

"అది కాదు వసూ! ఆ అమ్మాయి మనల్ని అనుమానిస్తే..."

"ఓహో! పెళ్ళి కాకుండానే ఇంత ప్రాముఖ్యం ఇచ్చేవాడివి - రేపు పెళ్ళి అయితే మాలాంటివాళ్ళ ముఖంకూడా చూడవు." విసురుగా ఫోన్ పెట్టేసింది.

అతను మరేం మాట్లాడలేదు. మళ్ళీ ఫోన్ చెయ్యాలని ప్రయత్నం చేయలేదు.

రాత్రి రౌండ్స్ ముగించుకుని కారు దగ్గరకు వచ్చాడు. నర్స పరుగెత్తుకు వచ్చింది.

"చంద్రసేన్‌గారి ఫోన్ డాక్టర్..." అన్నది.

అతనికి తెలుసు. తన భార్యకు అనారోగ్యం త్వరగా రమ్మంటాడు.

"అక్కడికే బయలుదేరానని చెప్పు సిస్టర్!"

ఆమె వెళ్ళింది. తిన్నగా కారు చంద్రసేన్‌గారి బంగళా ముందుకు తీసుకువెళ్ళి ఆపాడు. వసంతకు సుస్తీ అట.

"డాక్టర్‌గారూ! మా ఆవిడ సుస్తీకి పర్మనెంటు వైద్యం లేదా?"

"ఉన్నది."

"అయితే డబ్బు గురించి వెనుకాడుతున్నారా! ఎంత ఖర్చయినా చేస్తాను" అన్నాడు.

"చంద్రసేన్‌గారూ! మీ ఆవిడ సెన్సిటివ్, ఎమోషనల్. మీరు దగ్గరగా ఉండి ఆమెకు కావల్సినవి కనుక్కోండి. షి విల్ బి ఆల్‌రైట్" అన్నాడు.

"డాక్టర్..."

"అవునండీ! ధనములో కొంతభాగం ఆమెకు కేటాయించండి" మాటల్లోనే ఇద్దరూ బెడ్‌రూమ్ చేరుకున్నారు.

"డార్లింగ్ ! డాక్టరుగారు వచ్చారు."

అయిష్టంగా తిరిగినట్టు ఇటు తిరిగింది. మోడా లాక్కుని ఆమె దగ్గరగా జరిగి టెస్టులు ప్రారంభించాడు.

"అయ్యగారూ ఫోన్..." పనివాడు చెప్పాడు.

"ఎక్స్‌క్యూజ్ మి..." చంద్రసేన్ వెళ్ళిపోయాడు.

"వసూ ! ఆయనను అలా బాధపెట్టటం భావ్యం కాదు."

"ఆయన నన్ను బాధపెట్టవచ్చునేం?" అని శివాజీ చెయ్యి గట్టిగా గిల్లింది.

'అబ్బా !' అనుకోబోయి, మాట మింగేశాడు.

"శివా ! ఐ లవ్ యూ ! నేను పిచ్చిదాన్ని కాకుండా కాపాడావు. నేను పుణ్యగ్రంథాలన్నీ చదువుతున్నాను. ఎక్కడా ఏకాగ్రత కుదరదు." అన్నది ఏడుపు గొంతుకతో.

"ఉష్ ! అవతల మావారున్నారు."

"ఉండనీ ! హూ కేర్స్. స్వార్థపరుడు. నిన్ను చూడాలనిపించింది చూచాను. రాత్రికి నిశ్చింతగా నిదురబోతాను. "వెళ్ళు" అన్నది.

"ఏమిటి డాక్టర్ !" చంద్రసేన్ వచ్చాడు.

"ఏమిటి డాక్టర్ ! నేను ఎంత త్వరగా చనిపోతానో, మావారికో చెప్పండి. బ్రతికి ఉండగా తీరని కోరికలు, నా కర్మకాండ చేసి ఖర్చుపెట్టి, కన్నీరు కారుస్తూ తీరుస్తారు" అన్నది. ఆమె హాస్యానికి అనటంలేదు నిజంగా అంటున్నది.

"వసులు వదిలి తన దగ్గర కూర్చుంటే యెలా ! బొంబాయినుండి యెవరో వచ్చారట. పార్టీ అంటున్నారు."

పార్టీకి ఆమెను తీసుకువెళ్ళండి."

"ఇది ఫ్యామిలీస్ వచ్చే పార్టీకాదు. డార్లింగ్, నువ్వు హాయిగా



నిదురపో, నేను నాల్గుగంటలకు ముందే వస్తాను. గుడ్‌నైట్..." అతను వెళ్ళిపోయాడు.

"ఇదీ డాక్టరుగారూ నా బ్రతుకు ! తిరుగుబోతు, తాగుబోతులంటే ఎంత అసహ్యించుకునేదాన్నో. నేను తిరుగుబోతును, తోడు దొరకనినాడు తాగుబోతును అవుతాను" అన్నది.

"రిలాక్స్ వసూ ! అతడిని అదుపులో పెట్టుకోవాలి."

"అదే చాతకావటంలేదు" అన్నది అసహాయంగా చూస్తూ. ఒక నిట్టూర్పు వదిలి వచ్చేశాడు.

అతనింటికి వచ్చేసరికి, పార్థసారథి యెదురు చూస్తున్నాడు.

"మీరెందుకు మేలుకున్నారు !" చూచాయగా స్వతంత్ర విషయం చెప్పి, తన నిర్ణయం చెప్పాడు.

"చాలా మంచిపని చేస్తున్నావు నాయనా ! పద భోజనం చేద్దాం" అన్నాడు. ఇద్దరూ భోజనంచేసి, పడుకున్నారు.

మర్నాడు అతను పేషెంట్లతో బిజీగా ఉన్నాడు. అప్పుడు స్వతంత్ర ఫోన్ వచ్చింది.

"హల్లో ! నేను స్వతంత్రను...నిన్న..."

"మీరేం గుర్తు చేయనక్కరలేదు గుర్తున్నారు, చెప్పండి.

"ఏం లేదు నిన్న మీరు పెట్టిన ప్రపోజల్ అంగీకరిస్తున్నాను..." అతి మెల్లగా చెప్పింది. పేరులో స్వతంత్రత ఉన్నా, మాటలో లేదు, అనుకున్నాడు.

"చాలా థాంక్స్ ! మరి ఈ విషయం మీ కజిన్ ... అదే ఫ్రెండ్ వసంతగారికి చెప్పారా !"

"లేదు. ఇప్పుడు చెబుతాను, సాయంత్రం ఒక్కసారి మా ఇంటికి రాగలరా ! అమ్మా నాన్నా చూస్తారు" అన్నది స్వతంత్ర.

"అలాగే..." అడ్రసు తీసుకుని ఫోన్ పెట్టేశాడు. వెంటనే వసంతకు ఫోన్ డయల్ చేశాడు.

"మిసెస్ చంద్రసేన్ హియర్ !"

"వసూ ! డాక్టర్ శివాజీ స్పీకింగ్ ! స్వతంత్ర ఫోన్ చేసింది. ఆమెకు అంగీకారమేనట..."

"కంగ్రాచ్యులేషన్స్ ! నాకు పార్టీ ఇవ్వాలి. పార్టీ తరువాత ... ఊహూ ఏం కావాలో పర్సనల్‌గా చెబుతాను."

"తప్పకుండా, థాంక్యూ వెరిమచ్ వసూ ! నీలాంటి స్నేహితులుండటం నా అదృష్టం" అని ఫోన్ పెట్టేశాడు.

మళ్ళీ స్వతంత్ర ఆఫీసుకు తీరికగా ఫోన్ చేశాడు.

"స్వతంత్రా ! మా అత్తగారు నన్ను ఎప్పుడూ అల్లుడు అని దూరంగా చూడలేదు. ఆమె కర్మకాండ ముగిశాక వస్తాను. ఏమనుకోవు కదూ."

"అలాగేనండీ" అన్నది.

"నేను వసంతగారితో చెబుతాను. వైకుంఠ సమారాధన రోజు మీ పేరెంట్స్‌ని తీసుకునిరా" అన్నాడు.

"ష్యూర్..." అన్నది మృదువుగా. అతను ఏదయినా చెబితే బావుండును అనుకున్నదామె. అతనికేం చెప్పాలో తోచక ఫోన్ పెట్టేశాడు.

## 12

**బార్‌లో** కూర్చుని చిత్తుగా తాగాడు చిన్నబాబు. అయన ప్రక్కన చైనులు, రాయుడు చేరారు.

"చిన్నబాబూ ! మీ అత్తగారితో చెప్పి మా ఉద్యోగాలు మాకు ఇప్పించు. తొందరపడి బయటపడ్డాం..." అన్నాడు చైనులు.



"నో ... నో ... మా అత్త గాడెస్ ... గాడెస్ .." లెంపలు వాయించుకున్నాడు చిన్నబాబు.

"గాడెస్ కాదు, గాడిద గుడ్డూ కాదు. అంతా ట్రాష్, బోగస్, ఛీట్" అన్నాడు రాయుడు.

"తప్పు ... అట్లా అనరాదు."

"పేపర్‌వాళ్ళే ఆవిడిచ్చే పార్టీల కాశించి, మనం ఇచ్చిన వివరాలు వెయ్యటం లేదు. ఈ అర్భకుడు వింటాడా" చైనులు అన్నాడు.

"ఏమిట్రా...ఏమన్నావ్ !" ఒంటికాలిమీద లేచాడు చిన్నబాబు.

"మీ అత్త ఒట్టి మోసకత్తె. మమ్మల్ని మోసంచేసి తన కడుపు నింపుకుంటున్నది. నేను రోజూ, నా భార్యతో వేషాలు మార్చి, నాకే కష్టం వస్తే, రోగం వస్తే ఆ భగవంతుడే బాగుచేశాడని ప్రచారం చేశాను. అర్థం అయిందా !"

"అంతా అబద్ధం ... అంతా మోసం, పచ్చి మోసం ... మీరు లయ్యర్స్..." అన్నాడు.

"కాదయ్యా బాబూ ! నీవు కాస్త కోపం తగ్గించి, మా మాట వింటావా ! మేము ఎదురు తిరిగితే మీ అత్త వీధిలో నిలబడాలి. రోజూ వచ్చినవారిని బజార్లోనే కలుసుకుని, వారి మనస్తత్వం అర్థం చేసుకుని, వారి కష్టాలు ఏమిటో జాగ్రత్తగా ఆవిడకు చేరవేసేవాడిని. అవే ఆమె భగవంతుని అవతారంలో జనులకు చెప్పేది. అది ఎంత కష్టమైన పనో నీకు తెలియదు" అన్నాడు చైనులు.

"ఈడియట్ ! మా అత్త దేవుడు కాదా ?"

"దేవుడు కాదు, దయ్యం కాదు. మా నాటకంతో బతుకుతున్న ఓ నటి" అన్నాడు రాయుడు.

"బస్..." అన్నాడు.

"మేము సహకరించకపోతే, రేపు ఏమిటి?"

"ఆమెకు కావల్సినంత డబ్బుంది."

"మీరేం భ్రమపడవద్దు. డబ్బుఉంటే ఇంకా ఈ అవతారం ఏమిటి?"

"యూ బాస్టర్డ్స్! మా అత్తను అలా అంటారా?... హోల్డ్ యువర్ టంగ్...ఇడియెట్స్. మా అత్త దేవుడు, కుబేరుడు. గదినిండా నోట్లకట్టలు, బంగారం, వెండి...అబ్బ..." మైమరిచి చెబుతున్నాడు.

చైనులు, రాయుడు ముఖముఖాలు చూచుకున్నారు.

"అబ్బాయ్...కొయ్యకు కోతలు. మేము ఇన్‌కమ్‌టాక్స్‌వాళ్ళకు రిపోర్ట్ చేశాం. వాళ్ళకేం దొరకలేదు" అన్నాడు చైనులు.

"అది దొరకదు...నాకు, నా భార్యకే తెలుసు..." అన్నాడు.

రాయుడు, చైనులు ముఖం చూచుకున్నారు. చిన్నబాబు ఇంకేదో అంటుండగానే ఆదిత్య వచ్చి అతడిని పట్టుకుని నడిపించుకువచ్చి కార్లో కూర్చోబెట్టాడు.

"మీరిలా చేస్తే నేను...నేను అమ్మగారితో చెప్పాలి."

"అమ్మగారితో ఏం చెబుతావ్! ట్రాష్ ... ఆమెకు తెలియదా! ఆ నీలిమ కోసం...నటించాలంట...అబ్బ పెళ్ళి తొందరగా అయిపోనీ బ్రదర్." అంటూ అవాకులు, చవాకులు వాగుతున్నాడు. ఆదిత్యకు కోపం వచ్చినా మాట్లాడలేదు.

కారు ఆగగానే హడావుడిగా ఎదురువచ్చింది సావిత్రమ్మ.

"చిన్నా! ఏమిట్రా ఇది?"

"లైఫ్ మమ్మీ! మై రియల్ లైఫ్..." అంటుండగానే నీలిమ వచ్చింది. సావిత్రమ్మ ముఖం మలినమయింది.

"అబ్బాయ్ ఆదిత్యా! ఏమిటయ్యా మావాడిని తీసుకువెళ్ళి ఇం తాగించాలా!" అంటూ విరుచుకుపడింది.

"ఆంటీ! ఆదిత్య వెళ్ళి వెతుక్కుని వచ్చాడు తెలుసా?"

"యస్ మమ్మీ!...ఇంకో అర్ధబాటిల్ కొట్టేవాడిని...హి డిస్టర్బ్‌డ్ మి"



"ఏమిటి చిన్నా ... నడువు." ఇంట్లోకి లాక్కుపోయింది.

"నీలూ! ఒక చిన్న విషయం."

"ఏమిటి ఆదిత్యా?"

"చిన్నబాబుతోపాటు చైనులు, రాయుడు ఉన్నారు."

"ఎక్కడా...బార్‌లోనా?"

"అవును."

"బస్..." ఆమె ఆలోచిస్తూ నిలబడిపోయింది.

"లతా మంటపం దగ్గరకు రా, వివరాలు మాట్లాడుదాం." అతను చర చర వెళ్ళిపోయాడు. అంతగా తరుముతున్నట్టు యెందుకు వెళ్ళినట్టో అర్థం కాలేదు.

"నీలూ!" వెనకనుండి ముకుందాదేవి వచ్చింది. అతను ఎందుకు వెళ్ళిపోయాడో అప్పుడు అర్థం అయింది.

"ఏమిటమ్మా?"

"చూడు నీలూ! నేనేది చేసినా నీకొరకేనమ్మా. మీ నాన్న నన్ను ప్రేమించి వివాహం చేసుకున్నా ఆ అనుభూతి మిగలనియ్యలేదు. పిల్లలు లేరని మీ నాయనమ్మ నన్ను పెట్టరాని బాధలు పెట్టింది. చివరకు మళ్ళీ పెళ్ళి చేయటానికి కూడా వెనుతీయలేదు."

"ఇదంతా నాకు ఎందుకు చెబుతున్నావు? చిన్నబాబును అర్థం చేసుకోవటానికి కొంత సమయం ఇవ్వమన్నాను" అన్నది.

ముకుందాదేవి కూతుర్ని ఒకసారి చూచి వెళ్ళిపోయింది. నీలిమ ఆలోచిస్తూ నిలబడిపోయింది

ఆమెకు నిదుర రావటం లేదు. అంతా సద్దుమణిగాక లతామంటపం దగ్గరకు వెళ్ళింది.

"నీలూ!"

"నేనే ఆదిత్యా !" వెనుకగా వెళ్ళి అతని భుజంపై గడ్డం ఆ
కూర్చున్నది.

"చినబాబు ఉద్దేశాలు బయటపడ్డాయి. ఈసారి ఎలాగయి
అమ్మను, సావిత్రి ఆంటీని బార్‌కు రప్పించాలి" అన్నది నీలిమ.

"నీలూ ! నాకెందుకో అశాంతిగా ఉన్నది. అది ఇదీ అని చె
లేను."

"ఆదిత్యా ! నువ్వా ఆ మాట అంటోంది." లేచి వచ్చి అతని ఎ
రుగా కూర్చొని అతని రెండు చెంపలు చేతుల్లోకి తీసుకున్నది.

"మళ్ళీ నా సమక్షంలో అశాంతి, అనారోగ్యం అన్నావో..."
అన్నది బెదిరిస్తున్నట్టు. తన చెంపలపై ఆనిన ఆమె రెండు చేతులపై
చేతులు వేశాడు ఆదిత్య.

"నీలూ ! తాడూ బొంగరం లేని జీవితం అని ఆలోచిస్తున్నా"

"నాదంతా నీది కాదా ఆదిత్యా ! అమ్మ దేవుడి అవతారం
సంపాదించటం మోసం అని నువ్వంటే నేను అంగీకరించను. మోస
చెయ్యటానికి, వేషాలు వెయ్యటానికి సమాజం పురికొలుపుతుంది."

"నేనామాట అనలేదు నీలూ ! నీ డబ్బుకంటే నాకు నేనుగా చి
ఉద్యోగం సంపాదించుకోలిగ్గతే..."

"నా, నీ అని మరిచిపో. మనకున్నదంతా వెచ్చించి, నిరుద్యో
లను ఆదుకుందాం. ఒక్కసారి నా బట్టల బీరువా తిప్పు. నాకున్నదేది
అర్థం అవుతుంది..."

"అక్కరలేదు నీలూ ! నీ ఆస్తంతా ఈ రెండుకళ్ళలో దాచావు..."
అతను వంగి ఆమె కళ్ళు చుంబించాడు.

"యెన్నాళ్ళనుండి జరుగుతుందీ నాటకం ?"

ఇద్దరూ దూరం జరిగారు. ఎదురుగా ముకుందాదేవి నిల్చుంది.

"అమ్మా !"



"అమ్మ ! అమ్మ ఉందన్న జ్ఞానం ఉందా ! అరగంట క్రితం ఏం
చెప్పావ్...'చిన్నబాబును అర్థం చేసుకోవటానికి కాస్త సమయం కావా
లన్నావే'..." ఆమె కోపంతో ఊగిపోతున్నది.

"అంతేగాని అతడినే పెళ్ళి చేసుకుంటాను, అతనితోనే జీవితం
పంచుకుంటాను అని అనలేదు కదమ్మా."

"నోరు ముయ్యి...నాకో గర్వం ఉండేది. నిజాయితీగల కూతు
రుందని. నన్ను ఎందుకు మోసం చేశావే...ఆయన ముందే తేలుస్తాను,
రావే...రా..." ఆమె ఆవేశంగా చర, చర వెళ్ళిపోయింది. ఆమె వెనుకే
ఇద్దరూ, దోషుల్లా వెళ్ళారు. నందనరావు గొంతు వినిపించింది.

"ఏమిటి ముకుందా ఏమిటి ?" అతను ఒక చేతిమీద లేచి కూర్చొని
అడిగాడు.

"కొంపలంట పెడుతున్నారు. మీ స్నేహితుని కొడుకు ...
కాదేమో, ఆ అవిటి జీవితానికి ఆలంబన. మీ అశాంతిలో శాంతి, పుత్ర
సమానమయిన ఆదిత్య ఏం చేస్తున్నాడో అడగండి" అన్నది ఆమె
కోపంగా తల బాదుకుంటూ.

"అమ్మా!...ఏమిటిది..." వెళ్ళి నీలిమ తల పట్టుకుంది.

"ఇదే నన్ను మోసంచేసింది, నువ్వెంత...వెళ్ళవే వెళ్ళు..." అని
ఆమె దూరం నెట్టింది.

"ఏం జరిగింది ఆదిత్యా ?"

"నాన్నా ! నేను చెబుతాను. అమ్మ చిన్నబాబును వివాహం చేసు
కొమ్మన్నది. అతను అమ్మకూచి అని నా అనుమానం. అది నిజం అని
తెలిసింది. అదీకాక అతనికి మతిస్థిమితం లేదు."

"అతని గురించి చెపుతావేమే. నీవు చేసిన ఘనకార్యం చెప్పవే"
అన్నది.

"ముకుందా ! నువ్వు భగవత్ స్వరూపురాలివి. ఆవేశం, అనర్థ దాయకమని తెలియదా ?" అన్నాడు.

"చాల్లెండి వెటకారం."

"వెటకారం కాదు ముకుందా ! నిజం. ఏమయిందమ్మా ?"

"నాన్నగారూ ! ఈ విషయం...మీకు నేనే చెప్పాలనుకున్నాను. ఆదిత్య నాకు నచ్చాడు...అందుకే..." పూర్తిచేయలేకపోయింది.

ఒంకరగా తిరిగిన ఆయన మూతి ఒక్క క్షణం మామూలుగా అయినట్టు ఒక చిరునవ్వు నవ్వారు.

"అయితే...అయితే దాన్ని మీరే ప్రోత్సహించారన్నమాట."

"ముకుందా రిలాక్స్...మనము అనుకునేది ఒకటి, జరిగేది మరొకటి. అమ్మాయి ఇష్టాయిష్టాలతో పనిలేదా ?"

"లేదు...లేదు...లేదు. దానికి జన్మనిచ్చింది నేను. నా యిష్టం వచ్చింది అది చెయ్యాలి" అన్నది శాసిస్తున్నట్టు ముకుందాదేవి.

"ఎన్నాళ్ళుగా నీలూ !"

"మొదట ఆదిత్యను పంపించి వెయ్యండి" ఆమె అరిచింది.

"మీరు పొమ్మంటే ఇప్పుడే పోతానండీ. నాపై అనవసరంగా ఎందుకో కోపం పెంచుకున్నారు, కాని అంకుల్ ఆరోగ్యం ఇప్పుడు..."

"ఆయన ఆరోగ్యం గురించి నువ్వేం దిగులుపడకు. మరో మనిషిని పెడతాను" అన్నది నిర్లక్ష్యంగా.

"ఆ మనిషి చూస్తాడన్న నమ్మకం లేదు."

"ఇప్పుడా మనిషి చూడక, అతను లేచి తిరక్కపోయినా వచ్చిన నష్టం లేదు. నువ్వెళ్ళిపోవచ్చు."

"అమ్మా !"

"వెళ్ళాలనుకుంటే నువ్వూ వెళ్ళవే, నా బ్రతుకే అలా అయింది.



పుడుతూనే తండ్రికి భారం అయ్యాను. కడుపు పండలేదని కట్టుకున్నవాడు వేధించాడు. ఇప్పుడు నువ్వూ, నీ భాగం తీర్చుకోవద్దూ !" అన్నది.

"వద్దనసమ్మా...నువ్వు ఏడ్వకు. నీకు ఇష్టమయితే కుంటి, మూగ వాడిని చేసుకుంటాను. నాకు బాధలేదు," అన్నది నీలిమ. ఆమె ఇటు తిరిగి చేతులు జోడించింది.

"ఆదిత్యగారూ ! వెళ్ళిపొండి... ఈ ఇంటికి దూరంగా వెళ్ళిపొండి. మన విషయం మరిచిపొండి...ప్లీజ్."

ఆదిత్య మరో మాటకు తావియ్యలేదు. గబగబ తనకున్న నాల్గు బట్టలు తీసుకుని వెళ్ళిపోయాడు.

"అతను వెళ్ళిపోతే ఏమయింది ! బయట మీరు కలుసుకోరా !" అప్పుడే అక్కడికి వచ్చిన సావిత్రి అడిగింది. ఆమె ఎప్పుడు వచ్చిందో ఎవరూ గమనించలేదు.

"రావే...రా సావిత్రి" ముకుందాదేవి పిలిచింది.

"చాల్లే, పిల్లలను ఇంత విచ్చలవిడిగా పెంచుతారా ! ఇదంతా చూచి నీ స్నేహితురాలని కాబట్టి, ఏదో సహించాను, అందరూ ఎందుకు ఊరుకుంటారే" అన్నది.

"అత్తయ్యా...నీ కొడుకు ఏం చదివాడు" అని అడుగబోయింది నీలిమ.

"నీలిమా ! నువ్వు నోరు మూసుకో..." తల్లి కసురుకుంది. దాంతో ఆమె వెళ్ళిపోయింది.

ముకుందాదేవి లైటు ఆర్పేశాక సావిత్రికి వెళ్ళక తప్పలేదు.

# 13

**ఫిజియోథెరపీ** గదిలోకి వెళ్ళి, అక్కడ నడిపిస్తున్న వ్యక్తిని చూస్తూ నిలబడిపోయాడు శివాజీ. అతను కొత్తగా లేడు. ఎంతో అనుభవం ఉన్నట్టు చేయిస్తున్నాడు.

"మీ పేరు !"

"నమస్తే డాక్టరుగారూ ! నమస్తే..." కంగారుగా, పేషెంటును కుర్చీలో కూర్చోపెట్టాడు ఆ యువకుడు.

"క్యారీ ఆన్ ! ఇప్పుడే మా అంకుల్ చెప్పారు. నిన్ను అపాయింట్ చేశామని."

"నన్ను నందనరావుగారు రికమండ్ చేశారండి. ఆయనకు ఫిజియో థెరపీ చేయించేవాడిని" అన్నాడు.

"చదువుకున్నావా !"

తన పేరు, ఊరు అన్నీ చెప్పాడు.

"అంత చదువు చదివి, ఇదేంజాబ్ ! ఎనీహౌ వియ్ షల్ సీ..." అంటూండగానే ఫోన్ అతనికిచ్చాడు వార్డ్‌బాయ్.

"థాంక్స్ ! హల్లో... స్వతంత్రా...ఏమిటి ! నాతో మాట్లాడాలా! అలాగే" అన్నాడు.

"ఆదిత్యా ! నేనొక గంటలో వస్తాను. వీళ్ళను జాగ్రత్తగా చూడు" అని అతను కారు దగ్గరకు వెళ్ళాడు. మూఢం...ముహూర్తాలు లేవని పెళ్ళి వాయిదా వేశారు. తను, స్వతంత్ర చాలాసార్లు కలుసుకున్నారు. హోటల్ గదిలో కలుసుకున్నా తమిద్దరి మధ్యా శృంగారం పండలేదు. ప్రేమ నిండలేదు. అతని నర్సింగ్‌హోమ్ కబుర్లు తను చెప్పేవాడు. తన ఆఫీస్ కబుర్లు ఆమె చెప్పేది. భోజనమో, ఫలహారమో చేసేవారు.



ఒకటి రెండుసార్లు స్వతంత్రని తన ఇంటికి ఆహ్వానించాడు. ఆమె ఒక కుటుంబ సభ్యురాలిగా కలిసి; పార్థసారథితో మాట్లాడింది. అరవింద్‌తో ఆడుకున్నది. ఆషాఢమాసం వెళ్ళగానే వివాహం చేసుకోవాలనుకున్నారు.

"డాక్టర్‌గారూ ! ఫోన్..."

కారు స్టార్ట్ చేయబోయే వాడల్లా వెనక్కు వచ్చి, ఫోన్ తీసుకున్నాడు.

"హల్లో ! నేను వసుసు. అంతగా మైమరిపిస్తున్నదా మీ స్వతంత్ర !"

"వసంతగారూ ! వివరాలు కలిసినప్పుడు మాట్లాడుకుందాము."

"ఏం ? అది అక్కడే ఉందా ! మనము కలుసుకోక యెన్ని రోజులయింది. నువ్విలా నన్ను మోసం చేస్తావనుకుంటే అసలు దాన్ని పరిచయం చేసేదాన్ని కాదు..."

"వసంతగారూ ! మొదట ఫోన్ పెట్టెయ్యండి...ఊఁ..." ఉరిమాడు. అతని మనసంతా చికాకుగా ఉంది. ఏమిటీ దౌర్జన్యం ! అతను విసుగ్గా వచ్చి కారు స్టార్ట్ చేశాడు.

అతని కారు ఆగగానే బేరర్ వచ్చి, కారు తలుపులు తీసి పట్టుకున్నాడు. అతను గదిలోకి వెళ్ళేసరికి, అక్కడ స్వతంత్ర కూర్చుని ఉన్నది. ఆమె ముఖంలో రోజూ కనపించే ప్రసన్నత లేదు.

"హల్లో స్వతంత్రా !" అన్నాడు చిరునవ్వుతో.

"హల్లో..." అతడిని దీక్షగాచూచింది, పొడిగా ఉందా పలుకరింపు. అతను కూర్చున్నాడు. ఏం తెప్పించమంటారు ! అని అడగలేదు. అతని ప్రతి కదలిక గమనిస్తూ ఉండిపోయింది.

"ఏమిటి అంత మౌనంగా ఉన్నావు !"

"ఒక్క చిన్న ప్రశ్నకు జవాబు కావాలి."

"ఒక్క ప్రశ్న వెయ్యటానికి ఇంత ఆలోచనా !" నవ్వేశాడు శివాజీ.

"ప్రశ్న చిన్నదే. మీ జవాబు యెలా ఉంటుందో. మీకు ఇష్టం అయినా కాకపోయినా నాకు మాత్రం నిజం చెప్పాలి."

"చెప్పు...కాదు అడగండి."

"మీకు, ఆవిడ...అదే వసంతగారికి యెలాంటి పరిచయం !"

అతని తలపై పిడుగు పడినట్లు అయింది.

"ఆమె...ఆమె...నా పేషెంటు..." అన్నాడు నాలుక తడుపుకుంటూ.

ఆమె పక, పక నవ్వింది.

"మీ ట్రీట్‌మెంటు చాలా రకాలుగా ఉంటుందే..."

"స్టాపిట్...అనుకోకుండా ఒక బలహీన మైన క్షణంలో..." చెప్పలేకపోయాడు. తల వంచుకున్నాడు.

"మీ నిజాయితీకి నా ధన్యవాదాలు." అన్నది.

"ఈ విషయం నీ కెలా తెలుసు ! నువ్వెలా ఊహించావు !" అని అడగలేక అడిగాడు.

ఆమె అతని ఉద్దేశం గమనించిందేమో ! తనే జవాబు చెప్పింది.

"నేను ట్యాప్ చెయ్యాలని కాదు. మీతోపాటు సినిమాకు వెళ్లాలనిపించింది. ఫోన్ చేశాను. ఫోన్‌లో విచిత్రమైన సంభాషణ వినిపించింది. పెట్టెయ్యబోయాను. నా పేరు వినిపించింది. కుతూహలంగా విన్నాను. నా పేరు కూడా తరచుగా వినబడేది. అయితే ఎవరిదో అనుకునేదాన్ని." అన్నది.

"మైగాడ్..." అతను తెల్లబోయినా, సిగ్గుతో అతని ముఖం ఎర్రబారింది. అతనికి మూడు రోజులనాటి ఫోన్ సంభాషణ గుర్తు వచ్చింది. వసంత ఫోన్ చేసింది.



"హల్లో..."

"వసును ! బుగ్గలమీదా, పెదవులమీదా నా ముద్దులు..."

"వసూ ! ఏమిటి అల్లరి ?"

"నా మాటలు అల్లరి అంటున్నావా ! స్వతంత్ర వచ్చి, అప్పుడే నీ స్వాతంత్ర్యాన్ని బంధించిందా ! లేక నా కంటే తీపి ముద్దులు పెట్టిందా !"

"వసూ !...ప్లీజ్...ప్లీజ్..." అన్నాడు వారింపుగా.

"అప్పుడే భార్యంటే అంత భక్తా ! అలా అయితే ఈ పెళ్ళి చెడగొడతాను. ఒక్క విషయం గుర్తుంచుకో, స్వతంత్ర నీ ఇంటికి అధికారిణి కావాలి కాని నీ హృదయానికి కాదు. హృదయం ఎప్పుడూ నాదే" అన్నది, అతిశయంగా.

"వసూ...ప్లీజ్ అలా మాట్లాడవద్దు."

"ఆమె అప్పుడే అంత ప్రీతిపాత్రురాలయిందా !"

ఆ నిష్ఠూరాలన్నీ స్వతంత్ర వింటుందని తనేం కలగన్నాడా ! ఫోన్‌లు కూడా ఇంత ప్రమాదభరితమయినవని ఈ రోజే తెలిసింది. అతను తల ఎత్తలేకపోయాడు.

"మీరు అంతగా బాధ పడాల్సిందేం లేదు. కాని నేను వచ్చాక కూడా ఇది ఇలాగే కొనసాగితే, నాతో మీ వివాహం అర్థం లేనిదంటాను" అన్నది. ఆ నిక్కచ్చితనం అతనికి బాగా నచ్చింది.

"స్వతంత్రా ! నీకు ప్రామిస్ చేస్తున్నాను. ఇక మళ్ళీ అలాటిది జరుగదు. ఈ రోజు నుండి, నేను డాక్టరుగా అందరివాడిని–వ్యక్తిగా నీ వాడిని" అన్నాడు ఆమె చేతులు పట్టుకుని.

"థాంక్స్..." అన్నది అతని జుట్టు సవరిస్తూ.

"ఏం తీసుకుంటావ్..." అన్నాడు, ఆమెచేతులు చెంపన కానించు

కుని. ఆ స్పర్శలో ఆవేశం లేదు. ఎన్నో ఏళ్ళ పరిచయం ఉన్నట్టు అని పించింది.

"మీరు బొంకుతారేమో నాల్గు దులిపి వెళ్ళిపోదాం, అనుకున్నాను" అన్నది.

"అది కాదు వసంత ..." ఆమె చప్పున అతని నోటికి చెయ్యి అడ్డం పెట్టింది.

"ఆ విషయాలు మనమిద్దరం ఉన్నప్పుడు ఎత్తకూడదు."

"థాంక్యూ స్వతంత్ర...థాంక్యూ" ఆమె చెయ్యితీసి పెదవులకు తాకించుకున్నాడు.

"భోజనం చేద్దాం ..." చెయ్యి లాక్కుని, సర్వర్‌ను పిలిచింది. భోజనం వచ్చేవరకు ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

"పోనీ మొన్నటి సినిమా ఈ రోజు చూద్దామా ?" అన్నాడు శివాజీ. ఆమె నవ్వింది.

ఇద్దరూ సినిమా చూచాక ఆమెను ఇంటి దగ్గర దింపాడు.

"మీ పర్సులో ఎంత ఉందో చూడండి..." అన్నది. అతను పర్సు తీసి ముందు పెట్టాడు. అందులో నుండి అయిదు వందలు తీసుకుంది.

"ఎందుకని అడగరేం ?"

"అవసరం అనుకుంటే నువ్వే చెబుతావు కదా !"

"ఈ రోల్డ్ గోల్డ్ రింగులతో మీకూడా తిరగటానికి సిగ్గుగా ఉంది. ఒక జత దిద్దులు కొనుక్కుంటాను" అన్నది. అతని కళ్ళలో ఒకసారి మెరుపు మెరసి మాయం అయింది. అంత నిర్మొహమాటంగా ఉండాలి.

"ఇంకా తీసుకో."

"చాలు, మళ్ళీ కొనుక్కుంటాను. రేపు ఎప్పుడయినా మీ పనివాళ్ళ అబ్బ వచ్చేరోజు ఇత్తడి బొచ్చెలతో వచ్చింది అనకుండా ఉండాలని" నవ్వింది స్వతంత్ర.



డాక్టర్ శివాజీ వెనక్కు తిరిగాడు. ఈ యువతి తన జీవితాన్ని శాసించగలదన్న నమ్మకం కల్గింది. అతను స్నానంచేసి మళ్ళీ నర్సింగ్ హోమ్‌కు వెళ్ళాడు.

"ఫోన్ సర్ !"

"యెవరిది ?"

"వసంతగారు."

తల ఆడించాడు. అతని భావం గ్రహించింది నర్స్. అతను లేడని చెప్పింది.

"నేను చెప్పింది ... పార్థసారథిగారికండీ. రాగానే ఏమయినా చెప్పమంటారా !" ఆమె చెప్పింది విని ఫోన్ పెట్టేసింది.

"థాంక్స్ సిస్టర్ ! ఆమె చేసినప్పుడు, ఏదో ఒక వంకన తప్పించండి" అన్నాడు. వెంటనే అతని మనసు మేలుకున్నది. 'నువ్వు చేసేది అన్యాయం' అంటూ. అతను వెళ్ళి వసంతకు అసలు విషయం చెబుదాం అనుకున్నాడు. అదే మంచిది. అతని రౌండ్స్ పూర్తి అయ్యేలోపల మరో అయిదారుసార్లు ఫోన్ వచ్చింది. వసంతను తలుచుకుంటే జాలివేసింది. ఒంటరిగా వెళ్తే ఒదలదు.

"ఆదిత్యా ! మనమొక చోటికి వెళ్ళాలి. నా వెంటరా."

"పదండి సర్..."

ఇద్దరూ వసంత ఇల్లు చేరారు. అతని కారు హార్న్ ఆమెకు చిరపరిచితమే.

పరుగు, పరుగున వచ్చింది.

"ఉదయం నుండి నన్నేడిపించినందుకు శిక్ష ఏమిటో తెలుసా...!" అంటూ వచ్చి ఆదిత్యను చూచి ఆగిపోయింది.

"అదిత్యా ! నువ్వు కూర్చో..." అతను లోపలికి వెళ్ళాడు.

"అతనెవరు ?"

"ఈరోజే ఫిజియోథెరపి చేయించటానికి చేరాడు. అతని బంధు కెవరికో బాగాలేదుట, నువ్వు చాలాసార్లు ఫోన్ చేశావని తెలిసింది. వెళ్దాం అని."

"ఆ పేషెంటును చూచిరా."

"అలా వీలుకాదనే వచ్చాను వసూ! ఏమిటో త్వరగా చెప్పు."

అతని అసహనము, తొందర ఆమె అహాన్ని దెబ్బతీశాయి.

"మీ ఆవిడ... కాబోయే ఆవిడ చూస్తుందని భయమా?" అన్న వెటకారంగా. అతను కూర్చుని సిగరెట్టు వెలిగించాడు.

"ఇన్నాళ్ళు ఎలాగో సాగింది, ఇకముందు అలా సాగదు వసూ. మనము ఎక్కువగా కలుసుకుని అందరి నోళ్ళలో ఎందుకు నానాలి" అన్నాడు.

"వారెవ్వా! చాలా బావుంది. స్వార్థానికి మారుపేరు మగాడు. ఇన్నాళ్లు నీకో స్త్రీ కావలసివచ్చింది. నన్ను వాడుకున్నావు. ఇప్పుడు నీ భార్య వస్తుందేమో! నా అవసరం అంతగా ఉండదేమో."

"నువ్వు అలా పెడర్థాలు తీస్తే నేనేం చెప్పలేను. మనము ర స్యంగా కలుసుకుంటూ ఎవరికంట పడినా అసహ్యంగా ఉంటుంది.

"ఇన్నాళ్ళు లేదా!"

"ఇన్నాళ్ళు ఉన్నా, 'వీళ్ళకేం పోయేకాలం' అనుకుని ఉంటా ఇప్పుడు నా భార్య కళ్ళు నామీదే ఉంటాయి." అని లేచాడు.

"ఏమిటీ... నీ భార్య..." వెటకారంగా నవ్వింది.

"చూడు వసూ! కొన్ని మనకు తెలియకుండా జరిగిపోతా దీనికి మీవారు బాధ పడవల్సింది కాని అతను పడలేదు. మనము దయినా జాగ్రత్తగా ఉండాలి. అదే నేను చెప్పదలిచింది." అతను బయ వచ్చాడు.

ఆదిత్యను తీసుకుని బయలుదేరాడు. ఆదిత్యను వెంట ఎందు



తీసుకువెళ్ళాడు. ఆమెనుండి తనను, తాను రక్షించుకోవాలని తెచ్చాడా! అన్యాయం!

ఆదిత్యను దింపేసి ఇంటికివచ్చాడు. అతను వచ్చేసరికి అరవింద్ ఏడుస్తున్నాడు. యెవర్నీ దగ్గరకు రానియ్యటంలేదు. శివాజి వెళ్ళి అడిగాడు. తండ్రిని కొట్టి దూరంగా వెళ్ళాడు.

"ఏమిటి నాన్నా!"

"నన్ను... నన్ను జూకు తీసుకువెళ్తానన్నావ్..."

"సారీ...ఇప్పుడు రాత్రి అయింది. రేపు తప్పకుండా తీసుకు వెళ్తాను. అరవింద్ ఈజ్ ఎ గుడ్ బాయ్... అరవింద్ ఈజే డార్లింగ్ బాయ్..." కితకితలుపెట్టి, నవ్వించాడు.

అతను స్నానం చేసి, కొడుకుతో కబుర్లు చెబుతూ భోజనం చేశాడు.

"డాక్టరుగారూ... డాక్టరుగారూ..."

శివాజి అటు తిరిగాడు. అందమైన యువతి చిగురుటాకులా వణికి పోతున్నది. ఆమెను చూస్తుంటే చిత్రమైన భావం కల్గింది.

"ఎవరమ్మా!"

"నందనరావు అమ్మాయినండి. నాన్నగారు మాట్లాడటంలేదు..."

ఆమె కళ్ళలో నీళ్ళు కిందికి దూకడానికి సిద్ధంగా ఉన్నాయి.

శివాజి లేచి, బట్టలు వేసుకున్నాడు.

"డాడీ... నేను వస్తాను" అరవింద్ తయారయ్యాడు.

"నువ్వు తాతయ్యతో కబుర్లు చెప్పుతూ ఉండు- నేను వెళ్ళి పేషెంటును చూచివస్తాను" కొడుకు బుగ్గపై ముద్దు పెట్టాడు. తన కారు తీయబోయి, ఇంటిముందు కారు చూచి, వెళ్ళి ఆమె ప్రక్కన కూర్చున్నాడు. ఇద్దరూ కృష్ణకుంజ్ చేరేసరికి చిన్న ఒక్కడే ఉన్నాడు.

"ఇంట్లో ఎవరూ లేరా?"

"మా అమ్మ ఒక దేవుడు డాక్టరుగారూ !"

"అః! నాగలింగం ఒకసారి చెప్పారు. ఇంకా ఒకరిద్దరు కూడా చెప్పారు. మీ అమ్మగారి దర్శనం చేసుకుందామని మరిచేపోయాను" అన్నాడు.

"ఆమెభక్తుల కెవరికో, ఆస్తి కలిసివచ్చింది. కనకాభిషేకం చేస్తామని తీసుకువెళ్ళారు. తాలూకా లెవెలులో సన్మానం కూడాను. ఎందుకో నాన్న మాట్లాడటం మానేశారు."

శివాజి నందనరావును పరీక్ష చేశాడు.

"ఆస్పత్రికి తరలించాలి, గ్లూకోజు ఇవ్వాలి..."

"అవసరం వస్తుందని స్టాండు తెప్పించాను. మీరు అయిదు నిమిషాలుంటే నేను తీసుకువస్తాను" అన్నది నీలిమ.

మరో పదిహేను నిమిషాలకు నందనరావుకు గ్లూకోజు ఎక్కింది. శివాజికి నీలిమను చూస్తే వదిలిపోదామనిపించలేదు.

"మీరు వెళ్ళండి డాక్టరుగారూ !"

"ఫరవాలేదు. ఆదిత్య ఎంతో అవసరం కదా! అతన్ని ఎందుకు పంపారు!" అన్నాడు.

"డాక్టరుగారూ! అదంతా చెప్పానా, మీరు నన్ను ట్రీట్ చెయ్యాల్సి ఉంటుంది. మరోసారి చెబుతాను. మీకు కాఫీ, టీ..." అన్నది.

"అవసరం అనుకుంటే అడుగుతాను. కూర్చో..." మరోసారి నందనరావును పరీక్షించాడు.

"ఆయన స్థితి ఎలా ఉంది!" కంగారుగా అడిగింది.

"నువ్వేం విచారించకు. ఈ పేషెంట్ల స్థితి ఇదీ అని చెప్పలేము" అన్నాడు. ఆమె చెమర్చిన కళ్ళు తుడుచుకుంది.

"కార్డ్స్ ఉంటే పట్టా... మిస్... నీలూ..."

నీలిమ చిన్నగా నవ్వింది.



"మిస్సు. మిస్ చేసినా నేనేమీ అనుకోను."

"థ్యాంక్యూ..." అన్నాడు. ఆమె కార్డ్స్ తీసుకువచ్చింది. అతను పంచాడు. అరగంటకోసారి నందనరావు పరిస్థితి పరిశీలిస్తూ, ఇద్దరూ కార్డ్స్ ఆడారు. రెండుసార్లు టీ కాచి తెచ్చింది నీలిమ.

ఉదయం అయిదు గంటలకు అతను లేచాడు. నీలిమను వదిలి, ఆమె సమక్షం వదిలిపోవాలని లేదు.

"మీ నాన్నకేం ప్రమాదం లేదు నీలూ! నీతో కార్డ్స్ ఆడటానికయినా వస్తాను" అన్నాడు.

"థ్యాంక్యూ వెరిమచ్! మీ అమూల్యమయిన కాలం ఇక్కడ గడిపారు..." అన్నది.

"అదేం లేదమ్మా! ఈ మధ్య ఏనాడు పొందని రిలీఫ్ ఏదో కల్గింది. ఎందుకు అంటే ఇందుకు అని చెప్పలేను." అతడు తమాషాగా భుజాలు ఎగురవేశాడు. అతడిని ఇంటిదగ్గర దింపి వచ్చింది.

"పేషెంటుకెలా ఉంది శివా!" పార్థసారథి అడిగాడు.

"హి ఈజ్ అవుటాఫ్ డేంజర్, ఒక్క గంట పడుకుంటాను." అని పోబోతుంటే పనివాడేదో చెప్పబోయాడు.

పార్థసారథిగారు చెప్పనీయలేదు.

శివాజి రెండు గంటలు నిదురబోయి లేచాక, స్నానం, ఉపాహారం, అయ్యాక మెల్లగా చెప్పాడు.

"మిసెస్ చంద్రసేన్ రాత్రి ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. రాత్రి ఒంటిగంటకి నర్సింగ్‌హోమ్ తెచ్చారు. నౌ అవుట్ ఆఫ్ డేంజర్..."

శివాజి ముఖం మలినమయింది.

"మీరు అటెండ్ అయ్యారా!"

"అవును. ఆమె అపస్మారకం స్థితిలో చాలాసార్లు నన్ను గుర్తు

చేసింది. శివా, మనకు బలహీనతలుంటే ఉండవచ్చు. వృత్తికి చాలా దూరంగా ఉంచాలి." అన్నాడు.

"సారీ..." అనగలిగేడు. అరగంట తరువాత అతను నర్సింగ్ హోమ్‌కు వెళ్లాడు. ముఖ్యమయిన వారు, బాగా ముట్టచెప్పేవారు, వారిని చూచి, పదకొండు గంటలకు వసంత గదికి వెళ్ళాడు.

నీరసంగా దిండ్లనానుకుని కూర్చుంది.

"చాలా సాహసం చేశావట."

"నేను... నాకు స్పృహలేని స్థితిలో ఇక్కడికి తెచ్చారా..." అన్నది ముఖం అటు తిప్పుకొని.

"కాని పిరికిగా ప్రవర్తించావు."

"అంతకంటే మార్గం లేదు."

"నాకు నమ్మకం లేదు."

"నువ్వు... నువ్వు మగాడివి శివా! నా హృదయం అర్థంచేసుకోలేవు. అందమైన పువ్వు మీద వాలి లేచిపోవటం తుమ్మెదల పని. నేను మాత్రం నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను — ప్రేమిస్తాను."

"వసూ!"

"దీనివల్ల వచ్చే పాప పుణ్యాలు, కష్ట నిష్ఠూరాలు అన్నీ నీకే చెందుతాయి." అన్నది నిష్ఠూరంగా.

"వసూ..." అతను అప్రయత్నంగా హృదయానికి హత్తుకున్నాడు. అయిదు నిమిషాలు అలాగే ఉండిపోయాడు.

"లే శివా... నేను అంటే అన్నింటికి తెగించినదాన్ని. నీకు పరువు — మర్యాద ఉన్నాయి." అన్నది.

"నిష్ఠూరమా!"

"నిజం" అన్నది.

"రెస్ట్ తీసుకో..." అని బయటికి వచ్చేశాడు. రౌండ్స్ పూర్తి



చేసుకుని తన గదికి వచ్చాడు. అతని బల్లమీద అందమైన ఎ్రరడబ్బా ఉంది, దాని క్రింద బిల్ ఉంది. బిల్లు పైన అందమైన అక్షరాలు, పొందికగా కూర్చినట్టుంది.

"డాక్టర్‌గారూ!

నమస్తే! దిద్దులు కొనుక్కుని, ఈరోజు నా పుట్టినరోజు మిమ్మల్ని ఆహ్వానించాలని వచ్చాను. మీరు వసంతను మరిచిపోలేదు. మరిచిపోలేని బంధం అని అర్థం అయింది. మరిచిపొమ్మనే హక్కు నాకు లేదు. అందుకే వెళ్ళిపోతున్నాను. ముప్పై సంవత్సరాలు గడిచాయి - మరో పదేళ్ళు గడువక పోవు, మిమ్మల్ని ఇబ్బంది పెడుతూ, నేను ఇబ్బంది పడలేను.

—స్వతంత్ర"

అతనికి ఏంచేయాలో తోచలేదు.

వసంత అత్యాశకు పోలేదు. ఆమె పరిధిలో ఆమె రైట్.

స్వతంత్ర ఆలోచనా సబబయినదే! తనే...తనే తప్పటడుగు వేశాడు. 'అక్రమసంబంధాలతో అనుబంధాలు పెంచుకోరాదు బ్రదర్' అని ఓ కవి అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. ఉత్తరం పదే...పదే చదువుతూ కూర్చున్నాడు.

# 14

**ఆరోజు** కృష్ణకుంజ్ అవరణంతా కలకలలాడిపోతున్నది. ఒక గొప్పింటి కోడలు అర్పణ చేయిస్తున్నది. అయిదేళ్ళుగా వాయిదాపడిన పెళ్ళి జరిగింది. అది కృష్ణభగవానుని అనుగ్రహంతో అయిందని ఆమె భావన.

బంగళాలోని జనం అంతా మందిరం ముందే ఉన్నారు.

నీలిమ కృష్ణకుంజ్ వైపు వెళ్తూ, తండ్రికి అందుబాటులో అన్నీ అమర్చింది.

"నాన్నా ! ఈరోజు అమ్మ అవతారం చాలించాలి."

"అదొక వ్యసనం నీలూ ! చాలించదు."

"నేను చాలింప జేస్తాను."

"మీకు యెలా ఉందంకుల్ !" ఆదుర్దాగా వచ్చాడు ఆదిత్య.

ఆదిత్యను చూడగానే నందనరావు కళ్ళు మిల, మిలలాడేయి.

"రా బాబూ ! ఇంకా ఆ దేవుడికి నా కాగితం దొరకలేదేమో!" అన్నాడు నవ్వుతూ.

"డాక్టరుగారు ఆయన పనులలో ఉండి మరిచిపోయారు. ఈరో మాటల సందర్భంలో చెప్పారు" వచ్చి నందనరావు వడిలో కూర్చున్నది. ఆయన ప్రక్కన కూర్చున్నాడు.

అదెంతో రిలీఫ్ ఇచ్చిందతనికి.

"ఆదిత్యగారూ ! నా పేరు నీలిమ, నందనరావు కూతుర్ని"

"అలాగా ! అంకుల్ కూతురింత ఉండేది. ఇప్పుడు చాలా పె దయినట్టుందే."

"ట్యూబ్‌లైటు అనుకున్నాను."

నందనరావు పక్కున నవ్వాడు.

"బావుంద్రా మీ వాదన, వెళ్ళమ్మా ! ఆదిత్య వచ్చాడు కదా."

"అంకుల్‌ని నేను చూచుకుంటాను."

"చూచుకుంటానంటే కాదు, నేను వచ్చే వరకు ఉండాలి."

"ఆజ్ఞ..." తల వంచాడు.

"అతనికి వెళ్ళాని ఉందా ! మీ అమ్మకు జడిసె వెళ్తాడు, కదయ్యా!" అన్నాడు నవ్వుతూ.

"అంటికి కాదంకుల్ ! నీతికి, నిజాయితీకి భయపడ్తాను." అత నీలిమను బయటికి రమ్మని కళ్ళు చికిలించటం గమనించకపోలేదు. ఆ వెళ్ళిన ఒక నిముషానికి తనూ లేచాడు.



"ఇప్పుడే వస్తానంకుల్...ఒక్క నిముషం"

"ఎక్కడికి ?"

"ఎందు బోయెదవన్న ఎదురు తంబలి కన్న..."

నందనరావు పకా, పకా నవ్వేడు.

"కమలాకర్ ! ఈ వారసత్వం నీకు వదిలేలాదా !" అన్నాడు.

మందిరం ముందు వేణూ నాదం వినిపిస్తున్నది. మోహన రాగంలో ఎంతో మనోహరంగా వినిపిస్తున్నది. వేణూ నాదం వినిపించే సరికి సాధారణంగా నీలిమ అక్కడుండాలి. నీలు, ఆదిత్య ఒకరినొకరు చూసుకుంటున్నారు.

"వెళ్ళు నీలూ !"

"వెళ్తాను. నువ్వు దుర్మార్గుడివి" అన్నది.

"నిన్ను చూడకుండా ఉండాలని యెంత శ్రమపడ్డానో నీకు తెలియదు నీలూ..." అన్నాడు, ఆ బాధ అంతా గొంతులో ధ్వనింపజేస్తూ.

"నాకు తెలుసు ఆదిత్యా ! అమ్మ ఎందుకంత పట్టుదలగా ఉందో అర్థం కాదు. నామీద తనకు ఒక్కదానికే అధికారం ఉన్నట్లు చేస్తుంది. నాన్న నీ సమక్షంలో ఎంత హాయిగా నవ్వుతాడు. అలా నవ్వగల్గిననాడు ఆయన ఆరోగ్యం ఎంతో బావుంటుంది. ఆయన కోసమయినా నేను నిన్ను కట్టి బంధించాలి."

"దేనిలోనో..."

"చేతులతో..." చటుక్కున తన రెండు చేతులు అతని మెడకు వేసి, బుగ్గపై చుంబించింది.

"నీలూ..." అతను నుదురు చుంబించాడు.

వేణూనాదం ఆగిపోయి నాదస్వరం ప్రారంభం అయింది. వెంటనే ఇద్దరూ దూరంగా జరిగారు.

"వస్తాను ఆదిత్యా !"

"ఒక ఆసక్తికరమైన విషయం చెబుతాను. త్వరగా వచ్చెయి." అని వెళ్ళి వెదురుబొంగులు ముందేసుకుని కూర్చుంది. ముకుందాదేవి తీక్షణంగా చూచింది. సత్యవతి చిన్నగా నవ్వింది. నీలిమకు ఆ వాతావరణంలో ఏదో మార్పు కనిపించింది.

ఏనాడూ భగవంతుడి అవతారం ఎత్తాక, జనం ప్రశ్నలతో విసిగించే వరకు ఆమె ముఖంపై విసుగు చూడలేదు.

అలాగే ఏనాడూ సత్యవతి నవ్వగా చూడలేదు.

"అదేమిటమ్మా ! లెక్కలేనన్ని వెదురు బొంగులిచ్చావ్!" అన్నాడొక భక్తుడు.

"ఓ...పొరపాటు..." చైనులు లేదు.

ముకుందాదేవి చేతికర్ర కోల్పోయిన ముసలి పాంధుడిలా తడుముకుంటున్నది. నీలిమ ధైర్య చేసింది.

"భక్తులారా! ఈ రోజు భగవంతుడికి అనారోగ్యం...మీరు ప్ర గించకూడదు" అన్నది.

ఒకతను ఫక్కున నవ్వాడు.

"భగవంతుడికేం జబ్బు! నువ్వు మాట్లాడకు" అందరూ నవ్వినా కొందరు కోపంగా చూచారు.

అన్నతను చైనులు బంధువు అని గ్రహించింది నీలిమ. ఆమె ఆరాటంగా, అశాంతిగా ఉన్నది. అనుభవజ్ఞురాలయిన తల్లి, ఏదో విధంగా నెట్టుకువస్తుందని, డబ్బులు తీసుకుని వెదురుబొంగులు ఇచ్చింది. నింగా తెలివిగా నెట్టుకు వస్తున్నది ముకుందాదేవి.

"నీ కష్టం నేను గ్రహించాను బిడ్డా !" అన్నదామె.

"మీరు ఎంత గ్రహించినా, నా కష్టం ఊహించలేరు స్వామీ! మా వారు పూర్తిగా మారిపోయారు. అమ్మ, అమ్మంటూ అల్లాడతారు. మం మాకో పెట్టారు స్వామీ..."



ముకుందాదేవి మొహాన చిరునవ్వు వెలిసింది.

"నాకు తెలుసు బిడ్డా ! మా అమ్మను నువ్వు గౌరవించకపోతే, మీ వాళ్ళు రావద్దంటున్నాడు..."

"పదివేలుస్వామి...పదివేలు అచ్చు అలాగే అంటున్నాడు.

"నిన్ను వదిలితే నాకు మరో భార్య దొరుకుతుంది కాని, మరోఅమ్మ దొరకదు..."

"అంటున్నాడు, నిజమే స్వామీ...ఎలా గ్రహించారు. నా కాపురం కాపాడండి!..." ఆ స్త్రీ సాష్టాంగపడి నమస్కరించింది.

"ఒక నమస్కారం చేసి వెళ్ళు. అంతా చక్కబడుతుంది."

"నమస్కారం ఏమిటి స్వామీ! నా కాపురం చక్కబడితే అభిషేకం, అర్పణ చేస్తాను."

"కాని ఒక్కమాట..."

"సెలవీయండి."

"మీ వారితో వాదనకు దిగకు – ప్రేమగా ఉన్నట్టు నటించు. అది ముఖ్యం."

"మంచిది స్వామి..."

ఆమె వెళ్ళిపోయింది. నీలు హృదయంపై పెద్దభారం దిగింది. ఆమె తేలికగా నిట్టూర్చి ఇటుతిరిగి పక్కలో బల్లెం దిగినంతగా ఉలికిపడింది.

రాయుడి భార్య కూర్చున్నది.

ఆమె నీలిమను చూచి, వెటకారంగా నవ్వింది.

"భగవాన్ ! నా కష్టం గ్రహించాలి."

"గ్రహించాం బిడ్డా !"

"చెప్పండి స్వామీ..."

"ఈ విభూతి ధరించు అన్ని కష్టాలు హరించిపోతాయి."

"నా కష్టాలు ఏమిటో చెప్పు...చెప్పు స్వామీ, ఇదిగో నా స్నేహితురాలు, మీరు భగవంతుడు కాదని పందెం కాసింది."

"అజ్ఞానంలో ఉన్నావు బిడ్డా! ఎందరు, ఎన్నిరకాల పందెంకాసినా ఉన్నది లేకుండా పోదు."

"వేదాంతం చెప్పటం దేనికి? కష్టం ఏమిటో చెప్పు."

"ఏ కష్టం అయినా దానికి మూలం ఆశ..."

"అంత డొంక తిరుగుడు వద్దు. సూటిగా చెప్పండి. నా బాధ ఏమిటో."

"నీ బాధ ఏమిటో నీకు తెలియదా!" తీక్షణంగా చూచాడు భగవంతుడు.

"అజ్ఞానంచేత వాళ్ళేదో అంటున్నారు. జవాబు ఇవ్వండి స్వామీ" అన్నది సత్యవతి.

ముకుందాదేవికి కృష్ణ పరమాత్మ వేషంలోకి వెళ్ళిపోగానే ఏదో ఒక మైకం, ఆవేశం కల్గి పాత్రలోకి వెళ్ళిపోయేది. ఈ రోజు కాస్త జంకుగా చూచింది.

ఆ క్షణంలో నీలిమకు జూలియస్ సీజర్ నాటకం గుర్తుకు వచ్చింది. బ్రూటస్‌ను నమ్మిన సీజర్ అతను పోటు పొడవగానే "యూ టూ బ్రూటస్" అంటూ ఆశ్చర్యపోతాడు. అలాంటి భావనే తల్లి కళ్ళలో చూచింది. సత్యవతికూడా ఎదురు తిరుగుతుందని ఊహించలేదు.

ఇదీ ఒకందుకు మంచిదే. కొంచెం దుష్ప్రచారం జరిగినా తల్లి త్వరగా అవతారం చాలిస్తుంది అనుకుంది.

ముకుందాదేవి కళ్ళు మూసుకుని ముఖం చిట్లించి, విభూతి చేతిలో వేసింది. విభూతి చేతిలో వేయటం అంటే వచ్చేవారం రమ్మని అర్థం అన్న మాట.

వాళ్ళు ముకుందాదేవి వాయిదావేస్తే ఏం చేయాలో ఆలోచించుకు



రాలేదు. అందుకే వెనుక ఉన్న భక్తుల యాగికి కదిలిపోయారు. వాళ్ళు వెళ్ళిపోగానే తలనొప్పి సాకుతో సత్యవతి వెళ్ళిపోయింది.

ముకుందాదేవి బేలగా చూచింది. నీలిమ కళ్ళతోనే ధైర్యం చెప్పింది. ఆరోజు మామూలు తంతు జరుగగానే, అభిషేకానికి ఏర్పాట్లు చేశారు. అప్పుడే సత్యవతి వచ్చి కడుపులో నొప్పి అంటూ ముకుందాదేవి పాదాల దగ్గర వాలిపోయింది.

"సత్యా!"

"భగవాన్! మీ సత్యనే కడుపులో నొప్పి."

ముకుందాదేవికి మండిపోయింది. సత్యవతి చేస్తున్నది నటన అని తెలుసు. అందుకే ఒక పొడితీసి నోట్లోవేసి, పాలు పొయ్యాలని ఎత్తింది. సత్యవతి వెనక్కు తగ్గింది. ఆ పొడి ఏమిటో తనకు తెలుసు. ఆ పొడి తీసుకుంటే ఏమవుతుందో కూడా తెలుసు.

వెనక్కు తగ్గింది.

"స్వామివారి ప్రసాదం కాదంటావా?" ఒక భక్తురాలు బలవంతంగా సత్యవతి నోరు తెరిపించి పొడి, పాలు మింగేవరకు పట్టుకుంది. అది మింగుతూ, సత్యవతి గాఢ నిదురలోకి జారుకున్నది. ఆమెను ప్రక్కనేఉన్న సోఫాలో పడుకోబెట్టారు.

ముకుందాదేవి ఒక గాఢమైన నిట్టూర్పు వదిలింది.

నీలిమ సమయం చూచింది పదకొండు గంటలు కావచ్చింది. అభిషేకానికి మరోగంట. తప్పదు అనుకుంది. ఇంట్లో ఆదిత్య ఉన్నాడు. కాని అతన్ని చూచి సావిత్రమ్మ ఏమంటుందో! అనుకోని. ఈ రోజు అంతా తేల్చివేస్తుంది. పన్నెండు గంటలకు అభిషేకం ముగిసింది.

సత్యవతి లేదు. పనివారి సాయంతో సామాన్లు తీసుకుని ఇంటికి వచ్చింది. ఆమె ఊహించినట్టు హాల్లో ఆదిత్యలేడు. సావిత్రమ్మ కాగాలు, మిరియాలు నూరటంలేదు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నది.

"సావిత్రీ !"

"తల్లీ కొడుకు మొదటాట సినిమా కెళ్ళారమ్మా."

"రెండో ఆటకెళ్ళినా ఇంటికి వచ్చే సమయం అయింది కదే." అన్నది ముకుందాదేవి.

నందనరావు గుర్రు పెడుతున్నాడు.

ముకుందాదేవి అలసటగా గదిలో అడుగుపెట్టి సర్పద్రష్టలా ఆగిపోయింది. బీరువా తలుపులు బార్లా తీసి ఉన్నాయి. తలుపులో ఉన్న లోపలి స్టోర్ తలుపులు తీసి ఉన్నాయి. సామానులన్నీ బయటికి కనిపించేవి. బోసిగా, కనిపించింది. ఆమె కాళ్ళలో సన్నగా వణుకు ప్రారంభం అయింది.

"నీలూ !"

నీలిమ చేతిలోని వస్తువులు క్రిందపెట్టి వచ్చింది.

"ఏమిటమ్మా..."

ముకుందాదేవి మాటలు రానట్టు చేతలుడిగినట్టు, చేత్తో బీరువావైపు చూసింది.

"అమ్మా !" ఒక్కంగలో లోపలికి వెళ్ళింది నీలిమ, మళ్ళీ వచ్చింది.

"అమ్మా...అమ్మా ... ఏం వదిలిపెట్టలేదు ... పిసరంత కూడా లేకుండా తీసుకుపోయారు..." అన్నది అరిచినట్టే.

"ఏమిటి తీసుకుపోయారా ?" ఆమె వెళ్ళింది. ఏం మిగలలేదు. బీరువాలో చీరలు హాంగ్ చేసే రాడ్స్ తప్ప ఏం మిగల్లేదు.

"దోపిడి...దగా...మోసం..." పిచ్చిగా అరిచింది ముకుందాదేవి.

"అవునూ, వీళ్ళంతా ఏరి ? ఆదిత్య ఏడి ? ఆదిత్యా...ఆదిత్యా..." పిలుస్తూ బయటికి వచ్చింది. జవాబు లేదు.



చీమ చిటుక్కుమన్నా మేలుకునే నందనరావు శవంలా పడి ఉన్నాడు.

"అమ్మా !...దోపిడీ జరిగింది – దోపిడీ..."

"నా ఏళ్ళ కష్టార్జితం నీలూ...సావిత్రీ..."

"ఏమిటే అలా కేకలు వేస్తున్నావ్ ?" అప్పుడే టాక్సీ వాడికి డబ్బులిచ్చి వచ్చింది సావిత్రి.

"నువ్వు...నువ్వు ఇంతసేపు...ఎక్కడున్నావ్ ?"

"అదేం ప్రశ్నే పిచ్చి ప్రశ్న. నువ్వేకదా చెప్పి పంపావు. ఇంట్లో మీకు బోరుగా ఉంటుంది, సెకండ్ షో చూచిరమ్మని."

"నేనా...నేను...యెవరితో చెప్పాను ?"

"ఉత్తరం రాసి, మీ అసిస్టెంటు తెచ్చిందే..." అన్నది.

"నా అసిస్టెంటా !" ముకుందాదేవి ఆశ్చర్యపోయింది.

"మీ అసిస్టెంటే, నన్నూ బయటికి పంపింది మేడమ్! చిన్నబాబుకి యాక్సిడెంటు అయిందని చెప్పింది." అన్నాడు, అప్పుడే అక్కడకు వచ్చిన ఆదిత్య.

ముకుందాదేవి అతడిని దీక్షగా చూచింది.

"నువ్వెప్పుడు వచ్చావ్ ?"

"నందనరావుగారికి బాగాలేదంటే చూచిపోదాం అని వచ్చాను."

"ఇంతకుముందు నువ్వు ఇంట్లో ఉన్నావన్న మాట."

"అవునమ్మా ! నేనే నాన్నగారి దగ్గర ఉంచి వచ్చాను." అన్నది నీలిమ.

ముకుందాదేవి తల పంకించింది: "అర్థం అయిందే అంతా అర్థం అయింది." అని గొణుక్కుంటూ వెళ్ళిపోయి ఫోన్ చేసింది.

"అమ్మా...యెవరికి ?"

"పోలీసులకి..."

"నీకేమయినా మతిపోయిందా! ఆ డబ్బు పోలీసులకు తెలియదు." అన్నది, ఫోన్ లాగుతూ.

"నువ్వు నోరుముయ్యి..." కూతుర్ని నెట్టేసి, ఫోన్ చేసింది. ఫోన్ పెట్టేసి వచ్చి ఆదిత్య కాలరు పట్టుకుంది.

"ఒరేయ్...చెప్పు...చెప్పరా! ఇప్పటికయినా మించిపోయిందేం లేదు. నా డబ్బు నాకిచ్చెయి, నా వస్తువులు అక్కడ పెట్టు...క్షమించేస్తాను..." ఆమె ఆవేశంతో మాట్లాడలేకపోతున్నది.

"మీరు...మీరేమంటున్నారు ?"

"నేను అన్నది అర్థంకావటంలేదా! బుద్ధీ జ్ఞానం ఉన్నాయా! అన్నం పెట్టిన ఇంటికి కన్నం వేస్తావా! వెళ్ళిపోయినవాడివి ఎందుకు వచ్చావు ?" కోపంగా ఊపేసింది.

"అమ్మా! వదులు..." నీలిమ వదిలించింది.

"అయితే నీ కూతురే పిలిపించుకుందన్న మాట. ముకుందా, తొందరపడి రిపోర్ట్ ఇచ్చావు. అతనితో కలిసి నీ కూతురే కాజేసిందేమో." సావిత్రమ్మ అన్నది వెటకారంగా.

"మమ్మీ! ఆ బిచ్‌కు బుద్ధి చెబుతానన్నావు. ఇప్పుడు చెప్పు." అన్నాడు చిన్నబాబు నవ్వుతూ.

"యెవరు...బిచ్ యెవరు!" ఆవేశంగా అరిచింది నీలిమ.

"ఇంకెవరు ? నువ్వే...నువ్వే..." అన్నాడు, కోపంగా.

నీలిమ పురుగును చూచినట్టు చూచింది. వెళ్ళి, ఆ చెంప, ఈ చెంప పెడా, పెడా వాయించేసింది.

"ఈడియెట్! గెటవుట్..."

"నా కొడుకును...ఫారిన్ రిటన్డ్‌ను కొడతావుటే..."



"ఫారిన్‌లో పాకీదొడ్లు కడిగినా గొప్పే..." కోపంగా ఇంకా ఏదో అనబోయింది. అప్పుడే పోలీసులు వచ్చారు.

"మా అమ్మాయికి కట్నం ఇవ్వాలని దాచిన డబ్బు, భక్తులు సమర్పించిన కానుకలు పోయాయి..." అంటూ అంతా చూపింది.

"ఎంత డబ్బు, బంగారం పోయిందమ్మా!" ఇన్‌స్పెక్టరు అంతా చూస్తూ అడిగాడు.

"భక్తులు ఇచ్చింది అక్కడ పడశానే తప్ప నేను ఏనాడు లెక్క చూడలేదు" అన్నది ఏడుస్తూ.

"ఓ లక్ష రూపాయలు ఉంటాయా!"

"ఉండే ఉంటాయి..." అన్నది మనసులో అంచనావేస్తూ. ఎంత లేదన్నా పది, పదిహేను లక్షలకు తక్కువ ఉండదు. ఆ విషయం తలుచుకోగానే ఆమె గుండెలు దడదడలాడేయి.

అతను అంతా తిరిగి చూచాడు. అందరి స్టేట్‌మెంట్లు తీసుకున్నాడు. నందనరావుకు నిదుర మాత్రల డోసు ఎక్కువయింది. అతనికి ఫ్లాస్క్‌లో పాలు తాగించాడు ఆదిత్య.

నీలిమ ఆదిత్యకే ఇల్లు అప్పగించింది. తను వచ్చేవరకుండమన్నది. ఆదిత్య ఇల్లు వదిలాడు, దొంగతనం జరిగింది. ముకుందాదేవి అతని పేరే చెప్పింది. పరిస్థితి అతనిపైకే త్రోసింది.

అతన్ని అరెస్ట్ చేయక తప్పలేదు.

"ఇన్‌స్పెక్టర్‌గారూ! పరిస్థితులు అలా వచ్చాయి. అతనికేం తెలియదు. మా అమ్మదగ్గర పనిచేసేవారే ఇదంతా చేశారు..." అని నీలిమ చెప్పినా వినలేదు. ఆదిత్యను అరెస్టు చేశారు.

"ముకుందా! ఏదో చెడిపోయిందానవని... దయతలచి నీ చరిత్ర తెలిసి పిల్లను చేసుకుందాం అనుకుంటే, నా కొడుకును కొడుతుందా! విధే

మిమ్మల్ని కొడుతుందే! ఓహో! తమరు దేవుడేమో, రక్షించను వేమో..." అన్నది వెటకారం చేస్తూ.

ముకుందాదేవికి జవాబు ఇచ్చే అవకాశం ఇవ్వలేదు. ఆమె ఇచ్చే స్థితిలో కూడా లేదు.

సావిత్రి కొడుకుతో వెళ్ళిపోయింది.

"అమ్మా...పాలు తాగుతావా !" నీలిమ అడిగింది.

ముకుందాదేవి కూతురి చేతులలో ముఖం దాచుకుని బాపురుమన్నది.

"అయిపోయిందే... అంతా అయిపోయింది. ఏ నటీ నటించని పాత్ర నటించాను. సంపాదించాను... అంతా పోయింది..."

"అమ్మా ! ఇది ఆ చైనులు, రాయుడిగాడి పనే. అనవసరంగా ఆదిత్యను ఇరికించావు" అన్నది కోపంగా.

"నన్ను... నన్నేం అనకు..." ఆమె డొక్కఎగిరిపడేట్లు ఏడుస్తూనే ఉంది. బలవంతంగా పాలు తాగించి, నిదుర మాత్ర ఇచ్చింది. ఆమె నిదురబోయేవరకు అలాగే కూర్చుంది. ఆమె మనసంతా శూన్యంగా ఉంది. ఏం జరుగుతుందో ఊహించలేకపోయింది.

# 15

**శివాజి** స్వతంత్రతతో తెగతెంపులు అయ్యాక, వివాహమే చేసుకోవాలని అనుకున్నాడు కాని పార్థసారథి గొడవ ఎక్కువయిపోయింది. వసంతకు దూరంగా ఉంటున్నాడు. ఆమె నిందలు నిష్ఠూరాలు వేస్తున్నది. అయినా తప్పించుకు తిరుగుతున్నాడు. ఇంట్లో ఒక స్త్రీ అండదండలు కావాలి. అందుకే తన విషయాలు స్పష్టంగా తెలుపుతూ పత్రికలో ప్రకటన ఇచ్చాడు.

"భార్య మరణించిన నలభై మూడేళ్ళ డాక్టరుకు వధువు కావాలి. విడాకులిచ్చినవారు, విధవలు అయినా ఫరవాలేదు. డాక్టరుగారితోపాటు



అతని ఎనిమిది సంవత్సరముల కొడుకు బాధ్యత వహించాలి" అని అడ్రసు కూడా ఇచ్చాడు.

శివాజి కూర్చుని, రోజూ వచ్చిన అప్లికేషన్స్ పరిశీలిస్తున్నాడు. ఒక్కటీ నచ్చలేదు. మరీ వయసులో చిన్నవారో, పెద్దవారో వస్తున్నారు. అతని అంచనా ప్రకారం ముప్పై సంవత్సరాలు దాటి ఉండాలనుకున్నాడు. కాని అలాంటివారు దొరకలేదు.

ఆ రోజు పోస్టులో రెండే, రెండు ఉత్తరాలు వచ్చాయి.

ఒకావిడ ముప్పై సంవత్సరాలు ఉద్యోగం చేసిందట, అన్నదమ్ము లను చదివించిందట. అక్క, చెల్లెళ్ళను ఆదుకున్నదట ఇప్పుడు తనకు తాను మిగిలిపోవాలనుకుంటున్నదట. ఉద్యోగం, మాని బాదర బందీలేక, ఇల్లాలి జీవితం గడపాలనుకుంటోందట.

అతను వయస్సు చూశాడు. సిన్సియర్‌గానే వ్రాసింది. నలభై ఎనిమి దేళ్ళట. నలభైఎనిమిదేళ్ళు ఉండటం ఆమె తప్పు కాదు కాని, ఆ వయ సులో ఆమె ఇల్లాలుగా స్థిరపడగలదా ?

అతనికి అర్థం కాలేదు.

రెండో అప్లికేషన్ తీశాడు. లోకల్ పోస్టు. 'నందనరావు' చిరపరి చితమైన పేరుగా కనిపించింది. వివరాలు చదివాడు. "వధువు నీలిమ, తండ్రి నందనరావు, పెరాలసిస్ పేషెంటు" ఆసక్తిగా చదివాడు.

"రోజూ అవి చూచి పడెయ్యటమేనా! దాన్ని సెటిల్ చేసేది ఏమ యినా ఉన్నదా !" అన్నాడు పార్థసారథి.

"ఈ నందనరావు మన పేషెంటు కదు మామయ్యా !"

"మన పేషెంటే. అతని మాట నమ్మి మనము అతను పంపిన వ్యక్తికి ఉద్యోగం ఇచ్చాము..."

"ఆదిత్య గురించా! మంచి వర్కర్..."

"అతని సంగతి పూర్తిగా తెలియదు. అతను దొంగల ముఠా తయారుచేశాడట." అన్నాడు పార్థసారథి.

"ఈజిట్..."

"ఆ నందనరావు భార్య దేవుడ్ని, దేవుడిని అంటూ సంపాదించిందంతా దోచిపెట్టి, జైలుకు వెళ్ళాడు" అన్నాడు.

"నిజమా! కాని ఆదిత్యను చూస్తే అలా అనిపించదు మామయ్యా! చాకులాంటి కుర్రాడు."

"మెరిసేదంతా మేలిమి కాదన్న సామెత ఉందికదా. ఆ నందనరావు భార్య ఈరోజు రోడ్డున పడింది. ఆ పిల్ల అప్లై చేసి ఉంటుంది."

"అవును మామయ్యా!" అన్నాడు. అతని కళ్ళముందు ఒక్కసారి తండ్రి ఆరోగ్యం గురించి తపనపడే ఆ అమ్మాయి కనిపించింది. ఆ రాత్రంతా కార్డ్సు ఆడారు. ఆమెను చూడగానే ఎందుకో ఒక విధమైన అనురాగం, ఆత్మీయత కలిగాయి. కొందరిని చూస్తే అంతేనేమో!

"ఆ పిల్లను గురించి మరిచిపో. వాళ్ళ సమస్యలు మనమెక్కడ నెత్తిన వేసుకుంటాము" అని పార్థసారథి వెళ్ళిపోయాడు.

శివాజీకి ఎందుకో ఆ అమ్మాయిని చూడాలనిపించింది. వెంటనే రిప్లై రాశాడు. ఆదివారం తన ఇంటికివచ్చి కలుసుకుని మాట్లాడమన్నాడు. అతను ఆ ఉత్తరంపై అడ్రసు రాస్తుండగానే నర్సింగ్‌హోమ్‌నుండి ఫోన్ వచ్చింది.

అతను వెళ్ళాడు. అపెండిసైటిస్ పేషెంటును తీసుకువచ్చారు. సర్జన్‌తో కలిసి ఆపరేషన్ పూర్తిచేశారు.

అతను బయటికి వచ్చేసరికి చంద్రసేన్, వసంత కూర్చున్నారు.

"హల్లో..." విష్ చేశాడు.

"హల్లో..." అన్నాడు చంద్రసేన్. వసంత బుద్ధిమంతురాలిలా తల వంచుకుని కూర్చుంది.



"డాక్టరుగారూ! ఒక సంతోష వార్త. మాకు...అదే మా వసంతకు...అదే మా వసంత ఫ్యామిలీ వేలో ఉంది."

"ఈజిట్! కంగ్రాచ్యులేషన్!" అన్నాడు.

"మేము కొన్నాళ్ళు ఢిల్లీలో కాపురం పెడదాం అనుకుంటున్నాము. నేను అక్కడ ఉంటున్నాను వ్యాపార రీత్యా. వసంత లోన్‌లీగా ఫీలవుతుంది" అన్నాడు అతను.

"ఐడియా ఈజ్ గుడ్."

"అందుకే ఆదివారం అందరి స్నేహితులకు భోజనాలకు చెప్పాను. మీరు రండి డాక్టరుగారూ!"

"విత్ ప్లెజర్..." వారిని పంపించాడు. వసంతను లేడీడాక్టరు దగ్గరకు పంపి పరీక్ష చేయించాడు. మందులు రాసిచ్చి పంపించి వేశాడు.

"వసంతగారిప్పుడు మీ కంపెనీ కోసం తాపత్రయ పడరులెండి. స్త్రీలు భలే చిత్రమైనవారు. తమ సంతానంపట్ల చూపిన అభిమానం దేనిమీదా చూపరు" అన్నాడు.

"పురుషులు తక్కువేం కాదు" అన్నది చురుకుగా.

"మా వసంతకు నోటి పదును ఎక్కువయింది. మీరేం అనుకోకండి."

"మరేం ఫరవాలేదు. పేషెంటుగా మీకన్నా నేను ఆమెను బాగా ఎరుగుదును" అన్నాడు శివాజీ.

"చూడండి వసంతగారూ! బయటతిరిగే మగాడికి వృత్తిరీత్యా, మోహమాటానికి, కొన్ని బలహీనతలువల్ల కొన్ని అనుబంధాలు ఏర్పడతాయి. అవి శాశ్వతం చేసుకోలేడు" అన్నాడు.

"అంగీకరించాం. భోజనానికి రండి."

వాళ్ళు వెళ్ళిపోయారు. ఆ వారమంతా ఒక్క నిముషం తీరిక దొరకలేదు.

యూనివర్సిటీ ఆడిటోరియమ్‌లో మెడికల్ కాన్ఫరెన్స్ జరిగింది. ఆదివారం ఉదయం లేస్తూనే వసంత ఇంటికి వెళ్ళాడు. ఆమెకో రాధాకృష్ణుల బొమ్మకొని బహుమతిగా ఇచ్చాడు. చంద్రసేన్‌గారి స్నేహితులు కూడా వచ్చారు. అందరూ లైట్‌గా డ్రింక్ తీసుకుని భోజనానికి లేచారు. భోజనం చేస్తుండగా గుర్తుకు వచ్చింది. తను నీలిమకు అప్పాయింట్‌మెంటు ఇచ్చిన సంగతి. వాచి చూసుకున్నాడు. రెండు గంటలు కావస్తుంది. పదిన్నరకు టైమ్ ఇచ్చాడు.

"ఓ గాడ్..." అతను లేచి, అందరి దగ్గరా సెలవు తీసుకుని వచ్చాడు. అతను నీలిమ ఉంటుందనుకోలేదు.

అతను వరండాలో అడుగుపెట్టి ఆగిపోయాడు. నీలిమ పేపరు చదువుతూ, ఫేము కుర్చీలో ఓ ప్రక్కకు ఒదిగి నిదురబోతున్నది.

"నీలిమా !...నీలిమగారూ..."

ఉలిక్కిపడి లేచింది.

"అయామ్ సారీ...వెళ్ళిపోయి ఫోన్ చేసి రావల్సింది" అన్నాడు.

"నమస్తే..." కళ్ళు నులుపుకుని కంగారుగా లేచింది.

"మీరు వెళ్ళిపోవాల్సింది."

"ఇంటి దగ్గరయినా ఇదే పని చేయాలి డాక్టరుగారూ !" అన్నది.

"కూర్చోండి..." అన్నాడు. ఆమె కూర్చుంది. తను కూర్చున్నాడు. ఆమె ముఖం వాడిపోయినట్టు పీక్కుపోయింది.

"మీరు మొదట వెళ్ళి భోజనం చెయ్యండి" అన్నాడు.

"నేను వంటచేసి, అమ్మ, నాన్నలకు పెట్టి, నేను భోజనం చేశాను" అన్నది ధన్యవాదాలు చెబుతూ.

"అయితే కాఫీ తీసుకోండి." వంటావిడచేత కాఫీ, బిస్కెట్లు తెప్పించాడు. ఆమె తీసుకున్నది.

"మీరు అసహాయులయి ఈ నిర్ణయం తీసుకున్నారా !"



"మిమ్మల్ని ప్రేమించానంటే మీకు తృప్తిగా ఉంటుందా !" ఎదురు ప్రశ్న వేసింది.

అతను నవ్వాడు.

"పరస్పరం అవసరం డాక్టరుగారూ ! సొమ్ము పోయి, దిమ్మ పట్టినట్టు అవుతుంది. కారమ్మిన డబ్బు అంతా లాయర్లకే పెట్టాము. ఇంట్లో ఒక భాగం అద్దెకిచ్చాం. దాంతో మా బ్రతుకు గడవాలి . నిజానికి ఆ వచ్చే అద్దె మా నాన్న ఒక్కనెల మందులకు సరిపోదు. మీ ఇల్లు చూసుకుని, మీ అవసరాలు నేను తీరుస్తాను. నాన్నగార్ని నర్సింగ్‌హోమ్‌లో ఉంచి ట్రీట్‌మెంటు మీరివ్వండి" అన్నది. ఆ మాటలో ఎక్కడా జంకు, భయం లేవు.

"నీ నిర్ణయం మీ అమ్మా, నాన్నలతో చెప్పావా !"

"చెప్పాను."

"వాళ్లేమన్నారు ?"

"అవకాశాలు లేకపోయినా, ఆశలుంటాయి. కొన్నాళ్ళక్రితమే వారిని కాదని నా నిర్ణయం, నేను తీసుకుంటే, ఈ నాడు ఎంతో సంతోషంగా ఉండేదాన్ని." అన్నది నీలిమ.

"బాగా ఆలోచించుకున్నావా ! నీకంటే రెండింతలుంది నా వయసు."

"సుఖపడాలనుకుంటే వయసు అడ్డురాదు. నాకేం అభ్యంతరం లేదు. మీకేమయినా ఉంటే చెప్పండి." అంత ఖచ్చితంగా మాట్లాడుతున్న ఆ అమ్మాయిని ముగ్ధుడయి చూచాడు.

"మా అమ్మ విదేశీ మోజులోపడి, తన స్నేహితురాలి కొడుకుతో పెళ్ళి అంటే, కాదని నాకు నచ్చినవాడిని చేసుకుని, ఆమెను ఆ దేవుడు నాటకం నుండి తప్పించవలసింది."


యక్షగానం

"మీ అమ్మగారి దగ్గర మహత్తు లేదా !"

"హేతువాదంతో శాస్త్రం చదివే మీరు నమ్ముతారా !"

"నమ్మక ఏం చేయను ! చెప్పే విషయాలు వింటుంటే న
పోయేది." అన్నాడు.

"అదే మనిషి బలహీనత ! మంచిగా బ్రతుకుతాం అంటే యెవరు
నమ్మరు. కాని మోసం చేస్తే అందరిని ఆకర్షిస్తారు. అయినా మోసంతో
వచ్చిన ఆస్తి మోసంతోనే పోయింది." అన్నది.

"మీరు ఎవరినయినా ప్రేమించారా !"

"డాక్టరుగారూ ! 'నువ్వా' అనండి చాలు. ఫలించని ప్రేమ
గురించి చర్చలు -మాటలు దేనికి !" అన్నది అతను ఏం మాట్లాడలేక

"నాకు ప్రమాణాలపై, వాగ్దానాలపై నమ్మకం లేకపోయినా
ప్రమాణం చేసి ఓవాగ్దానం చేస్తున్నాను. మీతో వివాహం అయ్యాక మీ
దాసిగానే మిగిలిపోతాను." అన్నది.

"ఓ...నో ! అలాంటి అపనమ్మకంతో కాదు. మరి రిజిస్టర్
మేరేజ్ కు సిద్ధమేనా !"

"మీరు గుడిలోగాని, నలుగురి పెద్దలముందు దండలు మార్చుకుందా
అన్నా, నాకేం అభ్యంతరం లేదు." అన్నది.

"అయితే మా మామగారు చాలా భక్తులు. మనము క్లుప్తంగా ఏ
యినా గుడిలో దండలు మార్చుకుందాం." అన్నాడు.

"అలాగే" అన్నది

"ముహూర్తం చూచి ఫోన్ చేస్తాను."

"థ్యాంక్యూ..." లేచింది నీలిమ.

"థాంక్స్ నేను చెప్పాలి నీలిమా !" అన్నాడు ఆమె బయట
రాగానే డ్రాప్ చేస్తానన్నాడు.

"వద్దు. నేను వెళ్ళగలను. మీరిప్పుడే వచ్చారు." అన్నది.



ఆమెనే చూస్తూ నిలబడిపోయాడు. కొన్ని రోజుల క్రితం తండ్రిని
చూడటానికి యువరాణిలా కార్లో వచ్చి తీసుకు వెళ్ళింది. ఈ రోజు నడిచి
పోతున్నది. విధి లీలలు విచిత్రమైనవి.

శివాజి ఇంట్లోకి వచ్చి, విషయమంతా పార్థసారథికి చెప్పాడు.

"మనిషి మంచిదేనా !"

"నాకు మంచిదానిలాగే కనిపించింది. రెండు మూడు సార్లు
చూచాను" అన్నాడు.

"సరేలే. ఒక స్త్రీ అంటూ ఇంటికి ఉంటే చాలా మంచిది" అన్నాడు.

శివాజి గదిలోకి వచ్చి సిగరెట్టు వెలిగించుకున్నాడు. స్వతంత్రవి
వాహం చేసుకుందాం అనుకున్నప్పుడు, కల్గిన ఊహలు కలగటం లేదు.
మనసు స్తబ్దంగా ఉండిపోతుంది. కారణం ఆ అమ్మాయికి, తనకు వయసులో
తేడా ఉండటం మూలంగానా !

అతను పొగ వదలుతూ అలాగే ఉండిపోయాడు.

మర్నాడు అతను బ్రేక్ ఫాస్ట్ చేసి నర్సింగ్ హోమ్ కు బయలుదేరు
తుండగా నీలిమ ఫోన్ చేసింది.

"హల్లో ! డాక్టర్ గారా ! నేను నీలిమను !"

"ఎస్, నీలూ ! వ్వాట్ కెన్ ఐ డూ ఫర్ యు ?"

"డాక్టర్ గారూ ? ఒక్క విషయం ! మీరేమనుకోనంటే..."

"డాక్టరుగారూ !... బాలేదు. శివా అను."

"ఊహూ ! అనలేను. డాక్టరుగారూ ! మా అమ్మ డబ్బు పోయి
దాదాపు పిచ్చిదయినట్టుంది. రెండవ సంబంధం అని గొడవ చేస్తుంది. నేను
పట్టుబట్టాను. దాంతో ఒక కోరిక కోరింది."

"చెప్పు నీలూ !"

"తను మిమ్మల్ని చూచి శాటిస్ ఫై అవ్వాలట..."

"ఐ సీ..."

"ఆమెను మీరు తప్పక నచ్చుతారు. కాని ఒక చిన్న అబద్ధం..." నసిగింది.

"చెప్పు నీలూ !"

"రెండో సంబంధం అయినా ముప్పై రెండేళ్ళని చెప్పాను."

"మైగాడ్ ! పదేళ్ళు తక్కువ చెప్పావా !"

"వీళ్ళు సాంప్రదాయం అంటారు, ఫలితాలు ఆలోచించరు. ఈడు, జోడు అంటారు. పరిస్థితి ఆలోచించరు. అందుకే... అందుకే..."

"నేను చెబితే గుర్తించదా!"

"అవకాశం లేదు. మీరు ముప్పై రెండేళ్ళ వారిలా కనిపిస్తారు" అన్నది.

"థాంక్స్ ఫర్ ద కాంప్లిమెంట్స్."

"కాంప్లిమెంట్స్ కాదు. నిజం అంతే డాక్టరుగారూ ! అరవిందని చూచి కూడా అనుమానించటానికి వీలులేదు."

"ఓ. కె... కేసు ఏమయింది ?"

"ఆదిత్యకే ఉచ్చులు బిగుస్తున్నాయి. పూర్ ఫెలో. వాళ్ళు చాలా పకడ్‌బంధీగా ప్లాన్ వేశారు. నాన్న తాగే పాలలో నిదుర మాత్రలు వాళ్ళ వేశారు. ఆదిత్య ఇచ్చాడు."

"పూర్ గయ్ !"

"డాక్టరుగారూ ! మొన్న మీరు అడిగారు ఎవరినయినా ప్రేమిం చావా అని. నేను ఆదిత్యను ప్రేమించాను..." ఆమె గొంతు భారంగా వినిపించింది. అతను మౌనంగా ఉండిపోయాడు.

"వినటానికి మీకు ఇబ్బందిగా ఉన్నా, వినక తప్పదు. మిమ్మల్ని మభ్యపెట్టలేను. అతనంటే అమ్మకు మొదటి నుండి కోపం" అన్నది.

"అతను నిర్దోషిగా తిరిగివస్తే..."



"రానివ్వండి. కాలం కరిచిన వ్యక్తులలో ఒకడు అవుతాడు" అన్నది. అతడు జవాబు ఇవ్వలేదు.

"మీకింకా అనుమానంగా ఉందా !"

"అదేంలేదు. మీ అమ్మగార్ని ఎక్కడ చూద్దాం."

"రేపు నాన్నగార్ని చూడటానికి వచ్చినట్టు మా ఇంటికి రండి" అన్నది.

"ఓకే." అన్నాడు. ఫోన్ పెట్టేశాడు.

యెన్ని మార్పులు వచ్చినా, రాకెట్ యుగంలో కూడా స్త్రీకి పెళ్ళి అంటే ఓ యజ్ఞం అయింది. ఇక యెప్పుడు మారుతుంది ఈ సమాజం ! అతను ఒక్క నిమిషం ఆలోచిస్తూ నిలబడిపోయాడు.

రేపు తను ముసలివాడయితే వసంతలా నీలిమ కూడా...

చేస్తే తప్పేమిటి ! అంతరాత్మ నిలదీసింది.

అతను ఇక ఆలోచించక ఆస్పత్రికి వెళ్ళిపోయాడు.

"సర్ మీకు ట్రంక్ కాల్..." సిస్టర్ చెప్పింది.

"హల్లో...శివా హియర్...వసూ...ఏమిటి కొడుకు పుట్టాడా ? కంగ్రాచ్యులేషన్స్... చంద్రసేన్‌గార్ని అడిగానని చెప్పు...నాదేముంది రొటీన్...ఆ కుదిరిందో సంబంధం... వివరాలు ఉత్తరం రాస్తాను... నిజంగా...ఉంటాను..." ఫోన్ పెట్టేశాడు.

అతను గదిలో నుండి బయటికి పోబోయాడు.

"సర్ ఫోన్..."

"మళ్ళీ యెవరు ?"

అతను ఫోన్ ఎత్తగానే అతని ముఖం ప్రసన్నంగా మారింది.

"హల్లో నీలూ ! ఏమిటి ?" అన్నాడు.

"డాక్టర్‌గారూ ! ఎల్లుండి సాయంత్రం అమ్మే మీ ఇంటికి వస్తుం దట, మిమ్మల్ని ఒంటరిగా చూడాలట..."

"కంగారెందుకు డియర్ ! అలాగే రానీ."

"గుర్తుందిగా. మీకు ముప్పై రెండేళ్ళే..." అన్నది కాస్త మెల్లగా.

"ఓ. కె." అన్నాడు నవ్వుకుంటూ. ఎంత చిత్రం ? ఇంత చిన్న విషయం కోసం అబద్ధం ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అతను ఫోన్ పెట్టేశాక అనిపించింది. టుది పాయింట్ ఆన్సర్ చేశాడు. ఆ అమ్మాయి ఏమనుకుంటుందో ఏమో !

మళ్ళీ తను ఫోన్ చేశాడు.

"హల్లో ! ముకుందాదేవిని...ఎవరు కావాలి !"

అతను ఒక్క నిముషం ఉలిక్కిపడ్డాడు. ఈ గొంతులో మధుర గాంభీర్యం ఎప్పుడో, ఎక్కడో విన్నట్టుంది. ఎక్కడ...యెవరిదా కంఠం! యెవరిది ?

"మాట్లాడరేం ?"

"నీలిమ కావాలండీ..."

"ఒక్క నిమిషం...నీలూ !..." అంటూ పిలిచింది.

ఆ పిలుపులో ప్రత్యేకత, ఆప్యాయత గమ్మత్తుగా ఎక్కడో, ఎప్పుడో చవిచూచినట్టు అనిపించింది. ఎక్కడ...అతని స్మృతిపథంలో పొరలు విచ్చుకోవటానికి చాలా శ్రమపడ్డాయి.

"హల్లో ! డాక్టరుగారా !"

"అవును నీలూ ! నేనేనని యెలా ఊహించావు."

"నాకు ఫోన్ చేసే మగాళ్ళెవరండీ ?"

"ఇందాకా త్వరగా ఫోన్ పెట్టేశాను. ఏమయినా అనుకున్నావేమోనని."

"అనుకోవటానికేముందండీ ! మీరు బిజీ డాక్టరని తెలియదా ! మీ ప్రియుకాంత్రడు రోగులేకదా" అన్నది నవ్వుతో.

"థాంక్స్ ఫర్ యువర్ అండర్‌స్టాండింగ్ !" అన్నాడు.



నీలిమ అలాగే నిలబడిపోయింది. ఈ మాత్రం గ్రహింపు ఉన్న మగాడయితే చాలు, తను సుఖపడగలదు.

"నీలూ ! ఒక చిన్న ఇన్‌ఫర్‌మేషన్ కావాలి."

"ఏమిటది !"

"మీ అమ్మగారెప్పుడయినా బొంబేలో ఉన్నారా !"

"ఎందుకడిగారా మాట. బొంబే కాదు కదా, ఆంధ్రదేశంలోనే ఏ ఊళ్ళు చూడలేదు అమ్మ" అన్నది.

"అయినీ...మీ అమ్మగారికి స్వాగతం పలుకుతాం" అన్నాడు నవ్వుతూ. అతనే ఎక్కువ మాట్లాడాడు.

## 16

**ఆరోజు** ఆదిత్యను ఇంటరాగేట్ చేస్తారు కోర్టులో. అందుకే త్వరగా తయారయి వెళ్ళింది నీలిమ. అతను దొంగ కాదని తెలుసు. కాని న్యాయం దృష్టిలో అది తను నిరూపించలేదు. పోలీసుల వెంట వస్తున్న అతన్ని కోర్ట్ ఆవరణలో కలుసుకుంది.

"ఆదిత్యగారూ !" ఆమె కళ్ళు నిండుకున్నాయి.

"నీలూ !"

"ఆదిత్యా ! ఆ పిలుపులోనే అర్థం అయింది. నువ్వు నన్ను అపార్థం చేసుకోలేదని. థ్యాంక్యూ...థాంక్యూ..."

"ఆదిత్యా !... నేనొక విషయం చెప్పాలి."

"చెప్పు నీలూ...సందేహించకు. నిండా మునిగాక, చలేమిటన్నట్టుంది. ఎంత చేదయినా భరిస్తాను."

"ఆదిత్యా ! ఈ రోజు మాకంటూ ఒక్క పైసాలేదు, ఆ ఇల్లు తప్ప. పూజా మందిరంలోకి మేం మారి, మిగతా ఇల్లు అద్దెకిచ్చినా గడవటం కష్టంగా ఉంది ...నాన్నకు వైద్య సదుపాయం కావాలి..."

"చెప్పు నీలూ !"

"నన్ను అపార్థం చేసుకోకు. అసహాయురాలని...నేను...నేను..." అన్నది.

"నాకు తెలుసు నీలూ ! నేను నిర్దోషినని నువ్వు గ్రహిస్తే చాలు."

"నాకు తెలుసుకాని, నా సాక్ష్యం నీకు ఏ విధంగా ఉపయోగించదు. నిన్ను ప్రేమించాను కాబట్టి నీ తరఫున సాక్ష్యం చెప్పాను అనుకుంటారు."

"నాకింకా ఆరిపోతున్న ఆశ చిగురిస్తుంది నీలూ ! న్యాయం నిదుబోతుంది. చచ్చిపోలేదు" అన్నాడు.

"ఏమిటో...కాలమే తేల్చాలి...నేను...నేను..."

"చెప్పు నీలూ !"

"నేను...నేను డాక్టర్ శివాజీని పెళ్ళి చేసుకుంటున్నాను."

"ఎవర్ని...ఎవర్ని ?" ఉలిక్కిపడి అడిగాడు.

"డాక్టర్ శివాజీగార్ని...లేకపోతే నా కుటుంబం వీధిలో నిలుస్తుంది."

"కంగ్రాచ్యులేషన్స్ ! అతను చాలా మంచి డాక్టరు. మంచి వ్యక్తి కూడా..." అన్నాడు అతి కష్టంమీద.

"నా స్థితి దృష్టిలో ఉంచుకుని ఆలోచించు" అన్నది.

"పదండి..." పోలీసులను తనే తొందర చేశాడు. నీలిమ కూడా ఆపే ప్రయత్నం చేయలేదు. సరిగ్గా పదిన్నరకు అందరూ హాజరు అయ్యారు. ఇంటరేగేషన్ ప్రారంభం అయింది.

బోనులో ఆదిత్య నిలబడ్డాడు. అతనిచేత ప్రమాణం చేయించారు. అతనిలోని ఆ స్థిరత్వమే ఆమెకు నచ్చింది. యెప్పటి చిరునవ్వుతో, ఠీవిలా నిలబడి ఉన్నాడు."

"మీ పేరు ?"

"ప్రణతుల ఆదిత్య."



"మీ నాన్న పేరు ?"

"కమలాకరరావు. ఆయన హెచ్. ఎమ్. టి.లో ఇంజనీరుగా పని చేస్తూ చనిపోయారు" అన్నాడు.

"మీ అమ్మ !"

"అమె నాకు డిగ్రీ వచ్చేవేళకు తప్పుకుంది."

"నీవేం ఉద్యోగం చేసేవాడివి ?"

"ఉద్యోగ ప్రయత్నం చేస్తూ, చేస్తూ ఒకరోజు కృష్ణకుంజ్‌లో పాటలు వినిపిస్తే వెళ్ళాను. అప్పటికి రెండు రోజులయింది భోజనంలేక. స్పృహతప్పి పడిపోతే, నందనరావుగారు నాకు ఆశ్రయం ఇచ్చి, నా వివరాలు విన్నాక, నాకు ప్రభుత్వ ఉద్యోగం కాని, పర్మనెంటు ఉద్యోగం వచ్చేవరకు, తన దగ్గర పనిచేయమన్నారు" అన్నాడు.

"అది ఆయన భార్యాబిడ్డల ఇష్టంతో జరిగిందా !"

"నాకు తెలియదుకాని, అంకుల్‌కి నేనంటే ఎంత అభిమానమో ఆంటీకి కోపంగా ఉండేది" అన్నాడు.

"ఆమె కోపం బహిర్గతంగా ప్రకటించిందా !"

"లేదు. నా అనుమానం మాత్రమే."

"ఆమెని దేవుడు ఆపహిస్తాడని అవతారం ఎత్తేవట. దాని గురించి నీకేం తెలుసు ?"

"నాకేం తెలియదు. దాని గురించి ఆలోచించే సమయం, అవసరం నాకు కలుగలేదు" అన్నాడు నిబ్బరంగా.

"అక్కడికి వచ్చే భక్తులతో నీకు పరిచయం కల్గిందా ?"

"నాకు పని కట్టుకుని పరిచయం పెంచుకోవలసిన అవసరం కలుగలేదు. యెవరన్నా పలుకరిస్తే పలికేవాడిని" అన్నాడు.

"వాళ్ళు నిన్నేం అడిగేవారు."

"యెక్కువమంది ముకుందాదేవి ప్రత్యేక దర్శనము ఇప్పించమని కోరేవారు. ఒకరిద్దరు ఇంక్విజిటివ్‌గా దేవుడున్నాడా అని అడిగేవారు."

"నీవు ఏం చెప్పావ్ ?"

"నేనక్కడ మామూలు గుమస్తాను. లెక్కలకంటే కూడా నాకు నందనరావు సేవ ముఖ్యం అనుకున్నాను. ఆయనతోనే ఎక్కువ కాలం గడిపేవాడిని." అన్నాడు.

"ఆయన కూతురితో కూడా గడిపేవాడివని అభియోగం ఉంది."

ఆదిత్య ఒక్కసారి తలఎత్తి నీలిమ వంక చూచాడు. వెంటనే కళ్ళు దించుకున్నాడు. అతని ముఖం జాజు పూసినట్టు ఎర్రగా మారింది

"ఒక ఇంట్లో ఉంటున్న మాకు పరిచయం అయింది. పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాము. నందనరావుగారి కిష్టమే. ముకుందాదేవిగా రిష్టపడలేదు." అన్నాడు.

"ఆవిడిష్టపడలేదని, ఆస్తిదోచావని నీమీద నేరం మోపారు."

"కేవలం భ్రమ మాత్రమే" అన్నాడు.

లాయర్ దగ్గర అతను చేశాడు అనుకోవటానికి అవకాశాలున్నాయి గాని, సాక్ష్యాలు లేవు.

"ముకుందాదేవి డబ్బు, నగలు దాచే గది నీకు తప్ప మరెవరికయినా తెలుసా ?" లాయర్ ప్రశ్నించాడు.

"నాకు తెలియదు."

"ఈ స్థలం నీకు యెవరు చూపారు ?"

"ముకుందాదేవిగారి కూతురు నీలిమ."

"మరి దొంగతనం జరిగిననాడు ఎక్కడున్నావు ?"

"అంతకుముందే నీలిమగారు నాతో మాట్లాడారని, ముకుందాదేవి నన్ను వెళ్ళిపొమ్మన్నారు. నేను వెళ్ళిపోవటం నందనరావుగారి కిష్టంలేదు. ఆయనకు ట్రీట్‌మెంటు ఇచ్చే డాక్టరుగారితో నా విషయం చెప్పి ఉద్యోగం



ఇప్పించారు అక్కడే పనిచేస్తున్నాను. దొంగతనం జరిగిననాడు ఉదయం డాక్టరు శివాజీ నందనరావు ఆరోగ్యం బాగా దెబ్బతిన్నదని చెప్పాడు. అతని సహాయం గుర్తుకువచ్చింది. వెంటనే కృష్ణకుంజ్‌కు వెళ్ళాను. ఆ రోజు అర్చన జరుగుతుంది. అందరూ చాలా బిజీగా ఉన్నారు. నేను ఇంట్లోకి వెళ్ళాను. బయటి వరండాలో నందనరావుగారు ఒక్కరూ అసహాయంగా పడుకున్నారు. నన్ను చూచి ఆనందంగా క్షేమము అడిగారు. ఆయనను నడిపించటం నాకు అలవాటు. అందుకని కాసేపు నడిపించాక పాలు త్రాగించాను. అప్పటికే పాలలో నిదుర మాత్రలు కలిపి ఉంచారేమో ! అతని పక్కబట్టి సరిచేస్తుండగా మనిషి వచ్చి ముకుందాదేవికి కాబోయే అల్లుడు చిన్నబాబుకు దెబ్బలు తాకాయని చెప్పాడు అప్పుడప్పుడు అతను తాగి పడుంటే తీసుకురావటం అలవాటు. అందుకే తీసుకురావటానికి వెళ్ళాను. అతను చెప్పిన ప్రదేశంలో యెవరూ లేరు. తప్పుగా విన్నానేమో అని చిన్నబాబు ఎప్పుడూ వెళ్ళే బార్‌కు వెళ్ళాను అక్కడా లేడు. తిరిగి వచ్చేసరికి రోబరీ జరిగింది. ముకుందాదేవిగారున్నారు, సావిత్రమ్మ, ఆమె కొడుకు ఉన్నారు." అన్నాడు ఊపిరి తీసుకుంటూ.

అతని కథనము విన్నారు.

"క్రాస్ ఎగ్జామ్ చేయవచ్చు" నని లాయర్ కూర్చున్నాడు.

ప్రాసిక్యూషన్ లాయర్ లేచాడు.

"మిస్టర్ ఆదిత్యా ! మీకు నందనరావు, మీ నాన్న స్నేహితుడని తెలియదు, అతని భార్యను దేవుడు ఆవహిస్తాడని తెలియదు, అతనింట్లో అందమైన అమ్మాయి ఉందని తెలియదు. అవునా !"

"అవును."

"తెలియకపోయినా అతని కాంపౌండులోకి యెలా రాగలిగావు !"

"యాదృచ్ఛికం..."

"కాదు ప్రీప్లాన్డ్ ! వాళ్ళ దగ్గరున్న సంపద వివరాలు తెలుసు.

వాళ్ళు ఇన్‌కమ్‌టాక్స్ వారికి భయపడి, ఇంట్లో డబ్బు, నగలు, సంప దాచిపెడతారని తెలుసు. అందుకే శోషవచ్చినట్టు నటించావు..."

"నో...నో..."

"ఆర్డర్ ! ...ప్రొసీడ్ !" న్యాయమూర్తి ఆదేశించాడు.

"ఆ ఇంట్లో చేరి అదనుకోసం కాచుకున్నావు. నీలిమతో ప్రేమ నటించావు, అన్ని వివరాలు చక్కగా సేకరించావు..."

"అబ్‌జెక్షన్ యువర్ ఆనర్? మా స్నేహితుడు, ఆ ఇంట్లో ఉండే ముకుందాదేవి పరివారాన్ని ఇంటరాగేట్ చెయ్యకుండానే ఓ కంక్లూజన్‌కి రావటం నాకేకాదు, యెవరికీ ఆమోదయోగ్యం కాదు."

"అబ్‌జెక్షన్ సస్టయిన్డ్..."

"వారి నందరినీ రప్పించటానికి కొంత సమయం కావాలి మిలార్డ్" అన్నాడు.

"ఎస్ - గ్రాంటెడ్ అండ్ కేసు వాయిదా వేయడం జరుగుతుంది" అని న్యాయమూర్తి లేచాడు.

ముకుందాదేవి లాయర్ చక. చక, ఆమె దగ్గరకు వచ్చాడు.

"మిస్ నీలిమా! చైనులు, రాయుడు, సత్యవతి, రుక్మిణి తదితరుల రప్పించాలని అమ్మతో చెప్పు" అన్నాడు.

"మంచిది" అన్నదామె. లాయరుని వదిలించుకుని వచ్చేసరికి ఆదిత్యను తీసుకువెళ్ళారు.

ముకుందాదేవి అతనికి బెయిల్ ఇవ్వకుండా చేసింది. డబ్బుతో న్యాయం అమ్ముతున్నారు - కొంటున్నారు.

నీలిమ శివాజి సహాయంతో లాయర్ని ఏర్పాటు చేసింది. అది యె రికి తెలియదు. ఆదిత్య ఊహించగలిగాడు.

ఆమె ఒక నిట్టూర్పు వదిలి, మెల్లగా బయలుదేరింది. ఆమె



తెలుసు. వాళ్ళెవరూ దొరకరని, కాని వాళ్ళు కనిపించనిదే... ఆదిత్యకు శిక్ష పడదని. అందుకే ధైర్యంగా ఇంటికివచ్చి, తల్లితో విషయం చెప్పింది.

"వీళ్ళంతా ఎక్కడికి వెళ్ళారంటావు. ఒక్కరూ వచ్చి కని పించరేం ?" ముకుందాదేవి అడిగింది.

"మన డబ్బు, నగలు పట్టుకెళ్ళింది వాళ్ళేనమ్మా - అనవసరంగా ఆదిత్యను అనుమానించి జైలుపాలు చేశావు." అన్నది నిష్ఠూరంగా.

"నీకు మహా తెలిసినట్టు. రేపు వెళ్ళి సత్యవతిని చూచిరా. వాళ్ళ అన్నగారిల్లు మారేడ్‌పల్లిలో ఉన్నది." అన్నది ముకుందాదేవి.

హాల్లో నందనగావు దగ్గుతున్నాడు.

ఐశ్వర్యం పోయి బాధపడుతున్న తల్లిని ఇంకా బాధపెట్టటం భావ్యంకాదు అనుకుంది, నీలిమ

మర్నాడు దాదాపు అందరి అడ్రసులు పట్టుకుని వెతకటానికి బయలుదేరింది. సత్యవతి అన్నగారింటికి వెళ్ళింది.

"ఓహో ! ముకుందాదేవి కూతురువా ! సత్యవతి మా అమ్మాయికి పురుడు పొయ్యటానికి అమెరికా వెళ్ళింది." అన్నాడు.

నీలిమ ఉసూరుమంటూ వెనక్కు తిరిగింది.

సత్యవతి రావటం, సాక్ష్యం ఇవ్వటం కల్ల.

అక్కడనుండి చైనులు ఇంటికి వెళ్ళింది. అక్కడ మరెవరో కాపురం ఉంటున్నారు.

"మాకు తెలియదమ్మా ! ఎక్కడో నిజామాబాద్, జగ్గయ్యపేటో అన్నారు అక్కడ పొలాలు చవకగా దొరుకుతుంటే వెళ్ళి వ్యవసాయం చేసుకుంటున్నారట" అన్నాడు.

"సరియైన అడ్రసు ఇస్తారా !"

"మాకు తెలియదమ్మా." అన్నారు.

ఆమెకు మరెవరూ దొరకరని తెలిసినా, మళ్ళీ అనుమానం ఎందు

కని రాయుడి అత్తగారింటికి వెళ్ళింది. అతని అత్త ఎవరని కూడా అడగలేదు. "వాడి అమ్మ కడుపుకాలా! నన్ను మోసంచేసి నా బిడ్డ గొంతు కోశాడు. వాడి అసలు సంగతి తెలియక నా బిడ్డనిచ్చాను. "అదెవ్వతో దేవదని అర్థమైన నాటకాలు ఆడాడు, ఇప్పుడు మద్రాసు వెళ్ళాడు" అన్నది.

"అడ్రసుందా?"

"వాడి అడ్రసు ఎందుకు! అది నాకు చచ్చిన దాన్కిందే లెక్క." అన్నది నాల్గు తమలపాకులు ఒకేసారి నోట కుక్కుకుని, గచ్చకాయంత సున్నం తీసి వేలుకు రాసుకుంది.

నీలిమ త్వరగా అక్కడినుండి వచ్చింది. ఏ ఒక్కరి అడ్రసు సరిగ్గా కనుక్కోలేకపోయింది.

ఆమె వచ్చేసరికి తల్లి లాయరుతో మాట్లాడుతుంది.

"వారంపరిమీద మీకు అనుమానం అప్పుడే రావల్సింది. మీకు రాకపోయినా పోలీసులు ఎందుకు అనుమానించలేదు!" లాయర్ అడిగాడు.

ముకుందాదేవి జవాబు చెప్పలేకపోయింది.

"మీ లాయరుగా మీకు సహాయం చేయటం నా విధే కాని ఒక నిర్దోషిని జైలుపాలు చేసి, దొంగలను వదలటం అన్యాయం. డాక్టరుకు రోగం గురించి, లాయర్‌కు కేసుల గురించి, స్పష్టంగా చెప్పాలమ్మా!" అన్నాడు.

"వారి విషయం వదిలివేసి ముందుకు పోలేమా!"

"ఒక్క అడుగు కూడా ముందుకు పోలేము. ఒక ఇంట్లో పది మంది ఉండగా ఒక్కడే దొంగతనం చేశాడంటే, యెవరయినా నమ్ముతారా?" అన్నాడు లాయర్.

"నన్నిప్పుడేం చేయమంటారు?"

"పోలీసులకు మరో కంప్లేంటు ఇవ్వండి. వారంత వారే ఇన్వెస్టిగేషన్ చేయాలి. చేయలేదంటే వారికి మీ పనివారి ద్వారా చాలానే ముట్టింది. వాళ్ళు కూడా పట్టించుకోరు. ఒకసారి కమిషనర్ని కలిసి చూడండి." అన్నాడు లాయరు.



"అలాగే..." అన్నదామె నిస్పృహగా.

"ఏమయినా కొత్త విషయాలు తెలిస్తే నాకు ఫోన్ చెయ్యండి." అని లాయర్ వెళ్ళిపోయాడు.

"నీలూ! పోలీసులకు లంచం పెట్టారో లేదో కాని మన లాయరుకు ఆ ఆదిత్యగాడు పెట్టినట్టున్నాడు."

"అమ్మా!"

"అవునే. లేకపోతే ఆదిత్యగాడిని సపోర్ట్ చేయవలసిన అవసరం ఏముంది!"

"అంతా నీ అనుమానం. నీ అనుమానంతో అసలు కేసే తప్పుదారి పట్టింది. అమ్మా! ఆదిత్య అంటే ఎందుకంత కోపం!"

ముకుందాదేవి జవాబు చెప్పలేకపోయింది.

"నీలూ! ఆ ప్రశ్నకు జవాబు నేను చెబుతానమ్మా" నందనరావు గోడను పట్టుకుని వచ్చాడు.

"నాన్నా!" నీలిమ లేచి చప్పున అతన్ని పట్టుకుంది.

"మా వివాహమైన కొత్తలో ఆదిత్య తల్లిదండ్రులతో చాలా చనువుగా ఉండేవాడిని. ఆదిత్య తల్లి గుర్తుంచుకోతగిన వ్యక్తి. ఆత్మీయతకు, ఆప్యాయతకు నిర్వచనం ఆమె. ఆమెకు, నాకు ఏదో సంబంధం అని, అతను నాకు పుట్టిన కొడుకే కావచ్చునని మీ అమ్మ అనుమానం" అన్నాడు కాస్త కోపంగా, వెటకారంగా.

"నాన్నా!" నీలిమ వారించింది.

"అలాంటి సంబంధమే ఉంటే నేనే ఎందుకు ప్రోత్సహిస్తాను... నిన్నిచ్చి పెళ్ళి ఎలా చేస్తాను. అసహాయుడనయి తనపై ఆధారపడ్డానని, తన ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తుంది. ఆ ఆదిత్య ఏం అపకారం చేశాడు!"

"వద్దు నాన్నా వద్దు...బ్లడ్ ప్రెషర్ ఎక్కువ అవుతుంది" అని నీలిమ తండ్రిని తీసుకుని వెళ్ళింది బయటికి. ముకుందాదేవి గదిలో అస హాయంగా ఏడుస్తూ పడుకుంది.

"ఏమిటి నాన్నా మీరు కూడా ! అమ్మ అప్‌సెట్ అయ్యింది."

"ఈ పదిహేను సంవత్సరాలలో నేనెంత అప్‌సెట్ అయ్యానో మీకు తెలియదు..." అన్నాడు అతను ఆవేశంగా. నీలిమ ఇద్దరికి చెప్ప లేక కూర్చుండిపోయింది.

# 17

**శివాజి** త్వరగా కేసులు ముగించుకుని బయటికి వచ్చాడు. రెండు రోజులు ముకుందాదేవిని కలువాలంటే రెండుసార్లు వీలుకాలేదు. మొదటిరోజు తనకే అర్జంటు ఆపరేషన్ కేసువచ్చింది. రెండవసారి ఆమె కేసువిషయంలో బయటికి వెళ్ళింది. ఈ రోజులోగా ఎలాగయినా కలుసుకోవాలి. అందుకే త్వరగా వెళ్ళి ఫోన్ చేయాలి. తనలో ఏమిటీ విచిత్రమైన మార్పు! నీలును చూడకుండా ఉండలేనేమో అనిపిస్తుంది.

అతను త్వరగావచ్చి ముకుందాదేవి ఇంటికి ఫోన్ చేశాడు.

"హల్లో! డాక్టరుగారా!" నీలిమ ఎత్తింది ఫోన్.

"నేనే...అమ్మకోసం కారు పంపిస్తున్నాను నీలూ !"

"థాంక్స్ !" అన్నది ముక్తసరిగా.

మరో పది నిముషాలకు కారు వెళ్ళింది. పార్థసారథిని నర్సింగ్ హోమ్‌కి పంపించాడు. అతను విచిత్రమైన మనిషి. ఒక్కొక్కసారి నిజం మాట్లాడుతున్నాను, ఫ్రాంక్‌గా మాట్లాడుతున్నాను అనుకుని-ఇష్టం వచ్చి నట్టు మాట్లాడుతాడు.

అరవింద్‌ను తయారు చెయ్యమని ఆయాకి పురమాయించాడు. వంటావిడను పిలిచి టిఫిన్ ఏదయినా తయారుచేయమని చెప్పాడు. తన



జీవితం ఎన్నో ఒడుదుడుకులతో గడిచింది. ఇంకా ఎలాంటి ఒడిదుడుకులు ఓర్చుకునే సహనం, శక్తి లేదు తనకు. ఎవరితో సంబంధబాంధవ్యాలు లేకుండా, నీలిమను వివాహం చేసుకుని సెటిల్ అయిపోవాలనుకున్నాడు.

అరవింద్ ఉండనే ఉన్నాడు. ఒక్క అమ్మాయి కల్గితే చాలు. నర్సింగ్‌హోమ్ ఫుల్ స్వింగ్‌లో నడుస్తున్నది. హాయిగా కాలక్షేపం జరుగు తుంది. తనతోమాట్లాడి ముకుందాదేవి తన అభిప్రాయం మార్చుకుంటుందన్న అనుమానమే లేదు.

అతను బట్టలు వేసుకుని వచ్చి, ఒకసారి ఫ్లవర్‌వాజు సర్దాడు.

"అరవింద్ !"

"ఎస్ డాడీ..."

"మనింటికి ఈ రోజు ముఖ్యమయిన గెస్టులు వస్తారు. నమస్తే చెప్పు."

"ఓ...కె. డాడీ."

అతని మాట పూర్తికాక ముందే వాకిట్లో కారు ఆగింది. శివాజి హడావుడిగా ఎదురువెళ్ళాడు. తెల్లని వెంకటగిరి జరీచీర కట్టుకుని, తల పైదుగా పమిట లాక్కుంటూ దిగిందో స్త్రీ.

అతను ఎదురు వెళ్తూ ఆలోచించాడు. 'నమస్తే' అనాలా 'హల్లో' అని అనాలా అని ఆలోచిస్తూ నిలబడ్డాడు. ఆమె ఇటు తిరిగింది. కాళ్ళు నేలకు అతుక్కుపోయినట్టు నిలబడిపోయింది.

అతను అలాగే నిలబడిపోయాడు. అతని జ్ఞాపకాల పొరలు తెరలు, తెరలుగా లేచిపోయాయి. ముకుందాదేవి స్థలంలో అందమైన అమ్మాయి, అదే రూపంతో, పొడుగాటి జడతో, మెడలో రెండు పేటల గొలుసుతో, దోసగింజ బొట్టుతో నిలబడింది. మెల్ల, మెల్లగా ఆ అందాలబొమ్మ రూపు మారి, షేపు మారి, ముకుందాదేవిగా మారింది. వాల్డస్థలంలో పలుచబడిన

వెంట్రుకలు కొప్పుగా చుట్టింది. షిఫాన్‌చీర స్థానంలో వెంకటగిరి చీర ఉంది.

"మీరు... మీరు... దేవీప్రియకదూ..."

"మీరు... మీరు... చక్రవర్తి కదూ..."

ఇద్దరూ ఒకేసారి ఒకరిని ఒకరు ప్రశ్నించుకున్నారు. జ్ఞాపకాల తెరలు తొలిగిపోయాయి. ఒక్కసారి ఇద్దరూ ఇరవై రెండేళ్ళు వెనక్కు వెళ్లారు. ఇద్దరి కళ్ళల్లో ఆశ్చర్యం! ఇద్దరి కళ్ళల్లో అభిమానం, ఇద్దరి కళ్ళల్లో ఆరాధన కనిపించాయి.

ముకుందాదేవి తను నలభై అయిదు దాటిన సతివయస్కురాలని మరిచిపోయింది. చక్రవర్తి పేరు వింటూనే ఆమె అణువణువు పులకరించి పోయింది. తన జీవితంలో వసంతం కురిపించిన వ్యక్తి!

తనకు జీవితం అంటే దుఃఖం కూడా ఉంటుందని తెలియచేసిన ప్రేమికుడు!

కొందరితో ఏళ్ళ జీవితం యాంత్రికంగా గడిచిపోతుంది.

చక్రవర్తితో గడిపింది, ఒక సంవత్సరంలో కొన్నిరోజులు మాత్రమే. ఆ రోజులు సజీవమయి, నిలిచాయి తన జీవితంలో.

"దేవీ... రా, లోపలికి... రండి..." అన్నాడు కంగారు, కంగారుగా.

"నమస్తే..." అరవింద్ చేతులు జోడించాడు.

"నమస్తే..." అని వాడి నెత్తుకొని రెండు బుగ్గలు గట్టిగా ముద్దు పెట్టుకుంది. వాడు సిగ్గుపడిపోయాడు. తండ్రి తప్ప ఎవరూ అలా ముద్దు పెట్టుకోరు.

ఆమె లోపలికి వెళ్ళి, అరవింద్‌ను దించింది.

"పైకి వెళ్దాం రండి..."

"అదేం మాట చక్రీ! మర్యాద ఎందుకు?"



అతన్ని అనుసరించి పై గదిలోకి వెళ్ళింది. ఆమెకు సోఫా చూపించాడు. ఎదురుగా తాను కూర్చున్నాడు.

"దేవీ... నీలిమ..."

"మన బిడ్డ..."

"ఓ గాడ్..." అతని గొంతులో పెద్ద ప్రమాదం తప్పిపోయిన రిలీఫ్ కనిపించింది. గాఢంగా నిట్టూర్చాడు..!

"నీకు ముప్పై రెండేళ్ళని చెప్పావుట."

అతను పదే పదే నవ్వాడు.

"నేను చెప్పలేదు, నీలూ చెప్పమన్నది." అతని ముఖంలో ఒక రకమైన ప్రసన్నత కనిపించింది.

"నీలూ!...నీలూ చెప్పమన్నదా!"

"అవును నీలూయే" అన్నాడు.

ఇద్దరూ మళ్ళీ ఒకరిని ఒకరు చూసుకున్నారు ఇరవై ఏండ్ల తరువాత... "దేవీ! థ్రిల్లింగ్‌గా, గమ్మత్తుగా లేదూ!"

"అవును మళ్ళీ మనమిలా కలుసుకుంటామని కలలో కూడా అనుకోలేదు" అన్నది ముకుందాదేవి.

అతని సమక్షంలో ఆమెకు గాలిలో తేలిపోయినట్టు ఉంది. పదేళ్ళ వయసు తరిగినట్టు అనిపించింది.

"నువ్వేం చేశావ్ చక్రీ?"

"చదువెలా సాగించానో నీకు తెలుసు కదా! మెడిసన్ పూర్తి చేసి, నీ సహాయం నీలాంటి దయామయి సహాయంతో అమెరికా వెళ్ళాను. అక్కడ పార్థసారథి కుటుంబంతో పరిచయం అయింది. నీకు తెలుసు కదా. నాకు హిందీ వచ్చే దప్పట్లో. పార్థసారథి తెలుగువారు. ఆ పరిచయమల్లా, ఆయన కూతురితో అనుబంధంగా మారి పెళ్ళి చేసుకున్నాను. పెళ్ళి అయిన మొదలు ఒక్కనాడు నా భార్య ఆరోగ్యంగా లేదు. నేను

మామగారు ఇద్దరం సంపాదించాం. సంపాదించింది చాలనుకుని వచ్చినా అరవింద్‌ను నాకు తనకు సర్తుగా మిగిల్చి ఆమె మరణించింది. మా అత్తగారుండగా బాగానే గడిచింది. ఆమె మరణించాక ఇల్లు చూచుకునే వారు లేరు. అందుకే..."

"అందుకే వయసు తగ్గించి రెంతో పెళ్ళికి సిద్ధపడ్డావన్న మాట."

"దేవీప్రియా! నేను నా వయసు గురించి నిజమే చెప్పాను. ఈ పెళ్ళి కావాలంటే నా వయస్సు తగ్గాలని నీలిమే చెప్పింది" అన్నాడు.

"దానికి కుటుంబం తప్ప మరేధ్యాసలేదు."

"నాకు గమ్మత్తుగా ఉంది. నీలు మనమ్మాయి అంటే నమ్మలేకపోతున్నాను." అతను సిగరెట్టు వెలిగించాడు.

"అదృష్టం బావుండి మనం కలుసుకున్నాం — లేకపోతే..."

"ఏం కాదు, పెళ్ళి ముందు మనం తప్పక కలుసుకునేవారం..." అతను లేచాడు. అసహనంగా పచార్లు చేశాడు.

"దేవీ! ఈ అవతారం ఎందుకు ఎత్తినట్టు!"

"కోటి విద్యలు కూటికొరకని వినలేదా!"

"నిజంగా దేవుడు అవహించేవాడా నిన్ను!"

"లేదు"

"మరి"

"ప్రజల నమ్మకాన్ని కేష్ చేయటమే."

"మై గాడ్!"

"యెవరికయినా దేవుడనేవాడుంటే ఇన్ని కష్టాలు రావు చక్రి... బీదరికంలో బ్రతికి, అందకత్తెనని నంచనరావు వివాహం చేసుకుంటానంటే ఎంతో ఎంతో సంతోషించాను. నా సంతోషం ఆరు నెలలు మిగల్లేదు. వియ్యానికయినా నెయ్యానికయినా సమ ఉజ్జీలు కావాలి. మా అత్తగారి బంధువులు లేనిదాన్నని ప్రతి నిమిషం హేళన చేశారు" నిట్టూర్చింది



శివాజి వచ్చి ఆమె ప్రక్కన కూర్చున్నాడు.

"ఆ తరువాత నన్ను వదిలించాలని, పిల్లలు పిల్లలో అని గొడవ చేశారు. అప్పుడేం చేయాలో తెలియలేదు. పనిమీద బొంబాయి వచ్చాం. అక్కడ నా స్నేహితురాలుండేది."

"సావిత్రిగారా!" అన్నాడు.

"పిల్లలకోసం ఏం చేయాలో తోచని స్థితిలో ఒక డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళింది. ఆయనకు పిల్లలు అయ్యే యోగం లేదని చెప్పారు. అదంతా నా బలహీనత కప్పిపుచ్చుకోటానికి చెబుతున్న కథ అని కొట్టిపారేశారు. వారి ఆటలు సాగనియ్యవద్దనుకుని, సావిత్రి చెప్పిన సలహా పాటించాను. అదంతా నీకు తెలుసు."

"అవును. ఇద్దరం ఒకర్ని, ఒకరం మార్లు పేర్లు చెప్పి మోసగించుకున్నాము." అన్నాడు శివాజి.

పనిమనిషి టిఫిన్ తీసుకు వచ్చింది.

"తీసుకో..." అన్నాడు.

"చక్రి! నిన్ను చూస్తే నా కడుపు నిండిపోయింది. ఇంక నాకేం వద్దు" అన్నది.

ఆమె మాటల్లో అతిశయోక్తులు, అబద్ధాలు లేవు.

"తీసుకో..." రెట్టించాక తీసుకున్నది. నామకార్థం తిన్నాను అనిపించి, టీ త్రాగింది.

"నాకు కూతురు పుట్టింది. కొండంత ఆనంద పడిపోయాను. ఒక యాక్సిడెంటులో ఆయనకు పక్షవాతం వచ్చింది. అప్పుడు మా బ్రతుకులు బజార్నబడే పరిస్థితి వచ్చింది. చేసేదేంలేక, అవతారం ఎత్తాల్సివచ్చింది."

ఆఖరు మాట అంటుంటే ఆమె గొంతు వణికింది.

"సారీ... అయామ్ సారీ..." అన్నాడు అతను.

ఇద్దరూ ఓ అయోమయ పరిస్థితిలో ఉన్నారు. ఒకరిని ఒకరు గౌరవించుకోవాలా – దసువుతో మసలాలో అర్థం కాలేదు.

"దేవీ...మరేం ఆలోచించకు...నీలిమ బాధ్యత నాది" అన్నాడు.

ముకుందాదేవి చిన్నగా నవ్వింది.

"ఆ విషయం నువ్వు చెప్పకపోయినా, నీలు బాధ్యత అప్పగించి నిశ్చింతగా ఉంటాను చక్రీ..." అన్నది, ఆప్యాయంగా అతని చేయి నిమురుతూ. అతను కూడా నవ్వాడు.

"మరి నేను వెళ్ళిరానా !"

"అప్పుడేనా !"

"నీలు ఎందుకు చూస్తుంటుంది."

ఆమె మాట పూర్తికాక ముందే ఫోన్ మ్రోగింది శివాజీ వెళ్ళి ఎత్తాడు.

"హల్లో ! నేను .. నీలూ నేను..." నేను నీ తండ్రి అని చెప్ప గలడా ! చెప్పలేదు.

"అమ్మ బయలుదేరిందా !"

"ఊహూ ! ఇక్కడే ఉన్నారు. అంతా సవ్యంగా జరుగుతుంది నువ్వేం కంగారుపడకు బేబీ..." అన్నాడు.

నీలిమ ఫోన్ పెట్టేసింది.

"నీలు కదా ! దానికి ఎంత తొందరో చెప్పలేను" నవ్వింది. చాలా రోజుల తరువాత ముకుందాదేవి హృదయపూర్వకంగా నవ్వింది. ఆమె ముఖంలో ఒక రకమైన తృప్తి కనిపించింది.

"పదండి, డ్రాప్ చేస్తాను."

ఇద్దరూ క్రిందికి వచ్చారు. డ్రైవరు వచ్చి కారు తీయబోయాడు.

"నేను వెళ్తాను" అతని చేతిలో కీస్ తీసుకున్నాడు. కారు కదిలింది.



"ఈ ఇరవై సంవత్సరాలు, నా జీవితం అపతారంలోనే గడిచి పోయింది చక్రీ ! అనుభవాలు, అనుభూతులు ఏమీలేవు. ఒక విధంగా అదే మంచిదేమో. యెందుకంటే, అంత బిజీ కాకపోతే పిచ్చిదాన్నో, తాగు బోతునో అయ్యేదాన్ని. కాని ఎంత కష్టపడి సంపాదించినా, పదిరూపాయ లయినా దక్కించుకోలేకపోయానే..." అన్నది దిగులుగా. అతను జాలిగా చూచి, ఒక చేత్తో స్టీరింగ్ కంట్రోల్‌చేస్తూ రెండో చేత్తో ఆమె భుజాలు తట్టి ధైర్యం చెప్పాడు.

"నిజంగా కొన్ని జీవితాలకు అర్థం ఉండదు చక్రీ..."

"అర్థం మనం కల్పించుకోవాలి."

"పురుషుడివి. చట్టం, న్యాయం, సమాజం, నీకు, నాకు వేరు, వేరుగా నియమాలు పెట్టారు" అన్నది.

అతను మాట్లాడలేదు.

"పురుషుడు తన కోరిక తీర్చుకుంటే రసికత అంటారు. అదే స్త్రీ అయితే రంకుతనం అంటారు" అన్నది నిట్టూరుస్తూ.

"ఎంతోమంది విముక్తికి పాటుపడ్డారు. కాని ఇంకా స్త్రీ స్థానం మార్చలేకపోయారు." నిట్టూర్చాడు శివాజీ.

"నిన్ను చూడగానే నీ అభిప్రాయం నా అభిప్రాయం అడుగు తుంది నీలు" అన్నది ముకుందాదేవి.

"తెలుసు."

ఆమె అతని జవాబు ఇంకా ఉందన్నట్టు చూచింది.

"నీలు ఆదిత్యను అభిమానించేదని తెలుసా !"

"నీతో చెప్పిందా !"

"చెప్పటమే కాదు. వయసు మళ్ళిన వాడిని పెళ్ళి చేసుకోవటానికి రెండు కోరికలు కోరింది. ఒకటి నందనదాసుకు వైద్యం చేయాలని, రెండు ఆదిత్యకు లాయర్ని పెట్టమని."

"లాయర్ని నువ్వు పెట్టావా!"

"అవును. అతడిని నువ్వు అపార్థం చేసుకున్నావేమో దేవీప్రియా! చాలా మంచి కుర్రాడు."

"మంచివాళ్ళు సుఖపడలేరన్న నిజం కూడా తెలుసు."

"వద్దు. అలాంటి ఆలోచన రానియ్యకు. అయామ్ ప్రౌడ్ ఆఫ్ హర్. అంత చిన్నపిల్లకు అంతటి ఆలోచన ఉండటం గొప్ప."

"ఆదిత్యను విడిపించి పెళ్ళి చేస్తానంటావా!"

"అవును. అమ్మాయి భవిష్యత్తుపట్ల నీవు వేసిన ప్రణాళిక ఫలించలేదు. నాకు వదిలివెయ్యి."

ఆమె మాట్లాడలేదు. వారు ఇంటి దగ్గరకు వచ్చారు.

"తండ్రీ కూతురు ఆదిత్య అంటే నావేవో అనుమానాలు అనుకుంటారు."

"అనుకోవటంలో అర్థం ఉంది."

"నువ్వూ ఆమాటే అంటావా చక్రీ!"

"నీకు కూతురు భవిష్యత్తుపట్ల ఉన్న అభిమానం, ఆరాటం నేనెరుగుదును" అన్నాడు భుజం తట్టి.

కారు దిగేకన్న ముందు, అతని తల వంచి, ఒక్కసారి ముద్దు పెట్టుకుని వదిలి వేశారావిడ. కారు దిగి చర, చర లోపలికి వెళ్ళింది.

## 18

**నందనరావు,** నీలిమ కళ్ళు పొగలు, సెగలు కక్కుతున్నాయి. ఆయన వంకరపోయిన మూతి మరింత ఒంకరిగా, అసహ్యంగా కనిపిస్తుంది.

"అసలు నీ ఉద్దేశం ఏమిటి?"

"నా ఉద్దేశం ఏముంది. నాకు అయిష్టం అని నేను అనలేదు. అతనికిష్టం లేదంటే నేనేం చేయాలి!" అన్నది ముకుందాదేవి.



నందనరావుకు మండిపోయింది. ఈ రెండు రోజుల నుండి చూస్తున్నాడు. ముకుందాదేవి ముఖంలో దైన్యం లేదు. నిశ్చలంగా, రాజ్యాలు గెలిచిన మహారాణిలా ఉంది. ఆ నిశ్చింత ఎందుకో అతనికి అర్థం కాలేదు.

"అతనికి ఆ రోజు వరకు ఇష్టం అయింది. ఇప్పుడెందుకు కాలేదు! అమ్మా నువ్వే ఏదో చెప్పి ఉంటావ్!" నీలిమ కూడా చురుకుగా అన్నది.

శివాజీ ఫోన్‌చేస్తే ఆనందంగా వెళ్ళింది. అతను ఆనందంగానే ఆహ్వానించాడు. స్వయంగా తనకు, వాళ్ళబ్బాయికి స్వీట్లు పెట్టాడు.

"నీలూ! నీవు రాజీపడి పెళ్ళి చేసుకోవటం నాకిష్టం లేదు. నీవు ప్రేమించిన వాడిని తెచ్చి, చేసే బాధ్యత నాది సరా" అన్నాడు ప్రేమగా.

నీలిమ ఒక్కసారి ఉలిక్కిపడింది.

"మీ అమ్మలాగే, నీ కష్టం సుఖం నాకు చెప్పుకోవచ్చు." అంటూ చెప్పాడు. అక్కడ ఉండలేక వచ్చింది.

శివాజీ రోజూ శ్రద్ధగా వచ్చి నందనరావుకు ట్రీట్‌మెంటు ఇస్తున్నాడు. మందులు తనే ఇస్తున్నాడు.

"నీలూ! మా వంటామె కూతురు పెళ్ళట. అమ్మాయి చీరలబాధ్యత నామీద పెట్టింది." అని ఆమెను వెంట తీసుకువెళ్ళి అక్కడ బొమ్మకున్న చీర బావుందని, కొనిచ్చాడు.

ఆదిత్యను తను ప్రేమించిందన్న కోపం ఉంటే ఇంత ఇదిగా, చనువుగా ఉండడు. తల్లి బాధపడి ఉంటుంది. అందుకే అతను వద్దంటున్నాడు, అని ఓ నిశ్చయానికి వచ్చింది.

అల్లుడి దగ్గరయితే చనువుగా అన్నీ అడిగి తీసుకుంటాడు. అతను దయతో ఇప్పుడిచ్చినా బాధగానే ఉంది నందనరావుకు.

"నీలూ! ఆమెకు నియంతనన్న అహం పెరిగిపోయింది. మనము ఈ ఇంట్లో ప్రాణం లేని బొమ్మలం. ఆమె చెప్పినట్టు ఆడాలి. నీ పెళ్ళి

అయితే ఇంట్లో చాకిరికీ యెవరూ ఉండరు. నా బాధ్యత స్వీకరించాలన్న భయం" అన్నాడు నందనరావు.

"అమ్మా ! కావాలంటే, నాన్న బాధ్యత నాదేనని రాసిస్తాను" అన్నది నీలిమ

ముకుందాదేవి ముఖం బాధతో గిల, గిలలాడింది.

"నీలూ ! ఏమిటే నువ్వనేది ? అతను నీ పెళ్ళి బాధ్యత తీసుకుంటా నన్నాడమ్మా."

"నా పెళ్ళి బాధ్యత తీసుకుంటానని అతను దయతో అంటే ఈ వారందరి ఉపకారం పొందవలసిన అవసరం నాకేంలేదు" అన్నది విసురుగా. వాదోప, వాదాలు తీవ్రంగా జరుగుతుండగానే డాక్టరు శివాజి వచ్చాడు.

అందరూ ఒక్కసారి మూగబోయినట్టు ఆగిపోయారు.

"హల్లో నీలూ !"

అబ్బా, ఆ గొంతులో ఎంత ఆప్యాయత ! యెంత అనురాగం !

"నమస్తే డాక్టరుగారూ !" అన్నది.

"నీలూ ! నాకు అర్జంటుగా అటెండ్ కావల్సిన కేసులు కొన్ని ఉన్నాయి. అరవింద్ స్కూల్‌డే అట. నువ్వు వెళ్ళాలి" అన్నాడు.

"ష్యూర్...అలాగే వెళ్తాను" అన్నది. నీలిమ బుర్ర చురుకుగా పని చేస్తున్నది. ఆమె తల్లిపై దెబ్బ తీయాలనే నిశ్చయించుకుంది.

తన జీవితం ఏమయినా సరే 'ఆనదాని కొంగు తాకితే జగాన టీ పోని ధీరుడెవ్వడూ' అనుకుంది.

"ముకుందాదేవిగారూ ! నాకు ఒక కప్పు టీ ఇస్తారా ! నందనరావు గారు ఫీజు...ఫీజు అని గొడవ చేస్తుంటారు. అదే ఫీజనుకుంటాను" అన్నాడు.

"అలాగే..." నవ్వుతూ లోపలికి వెళ్ళిందామె.

నందనరావును పరీక్షించి, నవ్వుతూ కబుర్లు చెప్పాడు. టీ త్రాగి



అతను లేచేసరికి నీలిమ అతను కొనిచ్చిన చీర కట్టుకుని, తయారయి వచ్చింది.

"అబ్బా ! చాలా బావుంది నీలూ ! కొంటూ అనుకున్నాను. ఇది కట్టుకుంటే నువ్విలా ఉంటావని. అలాగే ఉంది" అన్నాడు.

"థాంక్స్..." అతనివెంట బయలుదేరింది.

"ఈవిడగారికి చాదస్తం బలిసిపోయింది. ఈడు, జోడు, ఎంత బావున్నారో !" అనుకున్నాడు నందనరావు.

ముకుందాదేవి ముఖం ఎప్పుడూ లేనంతగా వెలిగిపోయింది. ఆమె వంటింట్లోకి వెళ్ళింది. ఈమధ్య ఆమెకు పనుల అలవాటు తప్పింది. కూతురు కోసం చేస్తున్నది.

నీలిమ, అరవింద్ స్కూల్లో ఫంక్షన్ అయిపోయేవరకూ ఉన్నది. అరవింద్ సంతోషంగా అందరికీ మా అక్క అంటూ పరిచయం చేశాడు.

"అక్కా !" నీలిమ ఆశ్చర్యపోయింది.

"అవును డాడీ చెప్పారు" అన్నాడు. ఆమె ముఖం వెల, వెలబోయింది. ఏం అర్థం కానట్టు ఉండిపోయింది. ఆమె ఆలోచనలతోపాటు కారు సాగింది.

ఆమె కారు దిగి ఇంట్లో అడుగు పెట్టేసరికి ఆదిత్య కూర్చుని వున్నాడు.

"నీలూ !"

ఆమెకు ఎందుకో చెప్పలేనంత దుఃఖం వచ్చింది. అతని ప్రక్కన కూలబడిపోయి వెక్కి, వెక్కి ఏడ్చింది.

"ఊర్కో నీలూ..." అతను, ఆమె భుజంతట్టి ఓదార్చాడు.

"హల్లో ! అరవింద్ యెలా గడిచిందిరా మీ ఈవినింగ్ !"

"ఫైన్ డాడ్..."

నీలిమ ఆదిత్యకు దూరం జరిగి కూర్చున్నది.

"నీలా ! నువ్వు మొదటిరోజు ఆదిత్య విషయం చెప్పగానే బెయిల్ మీద విడిపించేవాడిని. అసలు దొంగతనం చేసినవాడు ఏమాశించాడు! మీమీద ప్రతీకారం తీర్చుకోవాలనా, లేక మీ డబ్బు కోసమా ! ఒకవేళ ఏ కుటుంబంతో వైరం వుంటే ఆదిత్యను అంతం చెయ్యటానికి చూస్తాడు. అతను జైలులో ఉండటమే క్షేమమనుకున్నాను" అన్నాడు కూర్చుంటూ.

"థాంక్యూ డాక్టరుగారూ..." అన్నది నీళ్ళు నిండిన కళ్ళతో.

"మెన్షెన్ నాట్ డియర్ ! ఆదిత్యా ! కేసు జరుగుతూ ఉంటుంది. నీ విషయం చెప్పు; ఉద్యోగం చేస్తావా, వ్యాపారమా !" తనూ వాళ్ళకెదురుగా ఉన్న సోఫాలో కూర్చుని అడిగాడు.

"ఉద్యోగమా ! నా చరిత్రచూచి ఉద్యోగం యెవరిస్తారు డాక్టరుగారూ ! వ్యాపారం చెయ్యటానికి పెట్టుబడి పని ! అసలు నన్ను ఎందుకు విడిపించారు !" అన్నాడు ఆవేదనగా.

"రిలాక్స్ ఆదిత్యా ! రిలాక్స్. ఇప్పుడు ఏది కావాలో చెప్పటం నీ వంతు, చేయటం నా వంతు."

"డాక్టరుగారూ ! మీ అపారమైన ఈ అభిమానికి... బదులు..." ఆ తరువాత మాట రానట్టుండిపోయాడు.

"అంతంత పెద్దమాటలు వద్దులెండి. నాకు ఆత్మీయులు లేరు. మీరో నా వాళ్ళనుకుంటే తప్పా ?"

"అది మా అదృష్టం అనుకుంటాను" అన్నాడు ఆదిత్య.

"నువ్వు ఏం చెప్పలేవు. స్వంతంగా వ్యాపారమే మొదలుపెట్టు. సిమెంటు డీలర్ ఒకతను ఉన్నాడు. అతను నా పేషెంటు. పార్టనర్‌కోసం వెతుకుతున్నాడు. అక్కడ పనిచెయ్యి" అన్నాడు.

"నా మనసు, మెదడు మొద్దుబారిపోయాయి. నేనేం ఆలోచించే స్థితిలో లేను. మీదేది ఉచితం అనుకుంటే అదే చేస్తాను" అన్నాడు ఆదిత్య.

"ఆదిత్యా! పురాణేతిహాసాలు చదువమన్నది, వారి పద్ధతులు పాటించమని కాదు. వారి జీవితంలో కొన్ని ఘట్టాలు ఉదాహరణగా తీసుకుని బ్రతకటానికి బలం సంపాదించాలి" అన్నాడు.



ఆదిత్య వింటున్నాడో లేదో తెలియదు. అతను శివాజీరావింట్లో డైనింగ్‌హాలు కిటికీవైపుగా వున్న దీపపు సెమ్మెలు చూస్తున్నాడు.

"ఆదిత్యా ! నువ్వు అంతగా అభిమాన పడవల్సిందేంలేదు. కాలం కలిసిరానప్పుడు ఎన్నో నిందలు – నిష్ఠూరాలు ఎదుర్కోవాలి." అన్నాడు అతని భుజాలుపట్టి కుదుపుతూ.

"అవును... మీరు చెప్పిందంతా నిజమే కాని, దొంగన్న ముద్ర వేసుకుని ఎలా తలెత్తుకు తిరగను" అన్నాడు అతని గొంతులో బాధ గరగరలాడింది.

"చూడు ఆదిత్యా ! నీవు ఆలోచించినట్టే ఆలోచిస్తే, నేనీపాటికేం మిగలను ! నాకు చిన్నప్పుడే తల్లితండ్రులు పోయారు. మహారాష్ట్రలో పుట్టి, హైదరాబాద్‌లో కొన్నాళ్ళు మా బాబాయితో వున్నాను. బాబాయి ఇంట్లో పడిన కష్టాలు చెబితే నువ్వు అదిరిపోతావు. ఆయన నల్గురు పిల్లలు విడిచి పెట్టిన అన్నం కలిపి పెట్టేవారు. మొదట మొదట అభిమానపడ్డాను, అసహ్యపడ్డాను. కాని ఆకలి, బ్రతకాలన్న కాంక్షతో అన్నీ మరిచిపోయాను. అది ఎంగిలా, విషమా అనే ఆలోచనేలేదు. అది కడుపులోకి వెళ్తే చాలు అన్న ధోరణిలో మింగాను. నాకున్న ఎస్సెట్స్ ఏమిటో తెలుసా ! ఫస్ట్ మార్కులు."

"అబ్బా !" అన్నది నీలు.

"అవును నీలూ ! నా ఫస్ట్‌మార్కులు భరించలేక, ఆ ఎంగిలి కూడు కూడా పెట్టనన్నది. నేను చేసేపని పందరూపాయలు ఆ రోజులలో ఇచ్చినా యెవ్వరూ చెయ్యరని మా అత్త తీసుకువెళ్ళింది. అక్కడ తిండి, బట్టలు ఇచ్చారు. ఇంటర్ పాసయి, మెడిసన్‌లో చేరాను. అత్తకో విధవ కూతురుండేది. ఆమె కోరికలు తీర్చాలి. నన్ను నేను అమ్ముకోవాలి. స్త్రీ, పురుషుల

కలియక క్రమబద్ధమైన సృష్టికార్య మయితే దానికో ఆనందం ఉంటుంది. అనుభూతి ఉంటుంది. ఏ అనుభూతి లేక ఆమె కోర్కె తీర్చే యంత్రంగా మారిపోయాను. ఆమెను చూస్తే చలిజ్వరం వచ్చేది. ఏం చేయాలో తోచేది కాదు. పరువుకు నాకు తేడా లేదేమో అనిపించేది" అంటూ ఆగాడు శివాజీ.

"అబ్బా! చెప్పొద్దు డాక్టరుగారూ!"

"చెప్పనియ్యమ్మా. ఆమె నుండి ఎలా తప్పించుకోవాలన్నదే నా తపన. సాయంత్రం అయిందంటే ఏదో ఒక వంకతో బయట పడాలని కోరుకునేవాడిని. నేను ఎన్ని ఎత్తులువేసి బయట పడాలని చూసేవాడినో, ఆమె అన్ని ఎత్తులువేసి, నన్ను ఆపేది. అత్తయ్య ఇంటికో స్మగ్లర్ వచ్చే వాడు లగన్‌భాయి అని. అతను నా అవస్థ పసికట్టాడు.

"ఈ ఉంకిణిని నువ్వెం భరిస్తావు! మా గరాజులో ఉండి, వంట చేసుకో. స్కాలర్‌షిప్ వస్తుంది. మా పిల్లల చదువు చూడు. నేను కొంత ఇస్తాను" అన్నాడు. సంతోషించాను. అత్తయ్య ఇంట్లో నుండి బయట పడాలి అదే నా ధ్యేయం. అందుకే లగన్‌భాయి వెంట వెళ్ళాను" అన్నాడు అతను ఊపిరి పీల్చుకోవటానికి ఆగాడు.

ఆదిత్య ఆసక్తిగా వింటున్నాడు. ఒకనాడు ఎంగిలి కూడు తిన్న శివాజి, ఈనాడు లక్షల కధికారి. ఓ నర్సింగ్ హోమ్‌కు ప్రొప్రయిటరు. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న నానుడి నిజమేనేమో!

"చెప్పండంకుల్...ఓ సారీ డాక్టరుగారూ!

"నీలూ! నువ్వు అంకుల్ అన్నా, డాడీ అన్నా పలుకుతానమ్మా. ఐ ఫీల్ ప్రౌడ్!" అన్నాడు శివాజి.

అతని సహృదయతకు జోహార్లు అర్పించింది.

"లగన్‌భాయి నీడలో ఒక్క సంవత్సరం ఏ చీకుచింతా లేకుండా గడిపాను. సాయంత్రాలు అతనిద్దరి పిల్లలకు పాఠాలు చెప్పి, నేను చదువు కునేవాడిని. పూరి, లస్సీ, స్వీట్స్ అందేవి. అవి వారికి ఉపాహారం. నాకు



మాత్రం ఆహారమే. విధికి క్రూరంగా ఆటలాడుకోవటం సరదా. ఒకనాడు ఆయనకు గుండెనొప్పి వచ్చి అకస్మాత్తుగాపోయారు. అతని బావమరిదివచ్చి, భార్యా పిల్లలను తనతో తీసుకు వెళ్తానని, ఇల్లు అమ్మకానికి పెట్టాడు. ఇల్లు కొనేవారికి నేను సంవత్సరాంతం వరకుంటానని చెప్పమన్నాను. లగన్ భార్య అంగీకరించింది. రూబీ, ఆమె భర్త వచ్చి దిగారు ఆ ఇంట్లో. నా పరీక్షలయి మూడో సంవత్సరంలో అడుగు పెట్టాను. అప్పటికి కాని గరాజు ఖాళీ చేయాల్సి ఉందని గుర్తుకు రాలేదు. బొంబాయిలో అపాటి అకామడేషను దొరకటం కష్టమే. ఏం తోచలేదు. రూబీ తెల్లగా, అందంగా గౌను వేసుకుని తిరిగేది ఆమెనే ఏదైనా పని చూపమంటే, అని అడుగు దామని దగ్గరగా వెళ్ళాను.

"హల్లో జంటిల్‌మేన్! మీ పరీక్షలయిపోయాననుకుంటాను." అన్నది. యెప్పుడు ఖాళీ చేస్తున్నావని డైరెక్టుగా అడగలేదు.

"మేము టొయాటా కరోలా కొంటున్నాము. గరాజు కావాలి" అన్నది.

నా ప్రశ్న నా నోట్లోనే ఉండిపోయింది. చేసేది లేక మెల్లగా అత్తయ్య ఇంటికి వెళ్ళాను. ఆమె ఇంటి ముందు జనం గుమిగూడి ఉన్నారు.

"ఏమయింది?" అడిగాను.

"కామ పిశాచి, ఆ ఇంటామె కూతురు. ఆ డ్రయివర్‌గాడిని పొట్టన బెట్టుకుంది." అన్నారు నిరసనగా. మా అత్త కూతురు డ్రైవరుతో అక్రమ సంబంధం పెట్టుకుందట.

ఏమయిందో అతను ఆమెకు దూరం వెళ్ళాడట. ఆమె పిలిచింది. ఇద్దరికీ తీవ్ర వాగ్యుద్ధం జరిగిందట. ఆమె నెట్టిందో, అతనే పడ్డాడో మేడ మీద నుండి డ్రైవరు పడిపోయాడట. తల్లీ, కూతుళ్ళు పరారయ్యారట.

వారి బంధువునని చెప్పుకున్నా, నా తల మీదికేం వస్తుందోనని, నేను వచ్చేశాను. ఏం చేయాలి! తెలిసిన వారందరిని అడిగాను.

"గతిలేకపోతే డాక్టరీ చదువటం దేనికయ్యా! మా ఇంట్లో గుమాస్తా పని ఉంది చెయ్యి" అని సలహా ఇచ్చారు.

చివరి ప్రయత్నంగా రూబీ దగ్గరకే వెళ్ళాను.

"ఎస్ జంటిల్ మేన్! వ్హాట్ కెన్ అయి డూ ఫర్ యు?"

కుక్కకు బిస్కట్లు తినిపిస్తూ అడిగింది.

'మనిషిలా పుట్టేకంటే రూబీ ఇంట్లో కుక్కలా పుట్టటం నయమేమో' అనిపించింది.

నా పరిస్థితి అంతా చెప్పాను.

"నాకు చదువు మీరే చెప్పించారనుకుంటాను. మీ కారు పెట్టుకొండి. ప్రక్కనున్న కాస్త స్థలంలో సర్దుకుంటాను" అన్నాను.

"మరి భోజనం!"

"ఎక్కడయినా ట్యూషన్స్ చూచుకుంటాను."

"ట్యూషన్స్ చేస్తూ చదువుకోవటం మాటలా! నో...నో...నువ్వు నిశ్చింతగా చదువుకోవటానికి నేను ఏర్పాటు చేస్తాను. నాకు అవసరం అయినప్పుడు నీ సహాయం కోరుతాను" అన్నదామె.

"థాంక్యూ మేడమ్! నా ప్రాణం అయినా ఇస్తాను" అన్నాను.

"ప్రాణం అక్కరలేదు. నేను చెప్పినట్లు వింటే చాలు" అన్నది.

ఆరునెలలు గడిచాయి. నెల, నెల యాభై రూపాయలిచ్చేది రూబి. ఆ యాభై రూపాయలు అప్పుడు పెద్ద మొత్తమే. నిశ్చింతగా గడిచిపోయేది" అన్నాడు శివాజి.

"ఆమె స్మగ్లింగ్ గ్యాంగ్ వ్యక్తేనా!" ఉత్సాహంగా అడిగాడు ఆదిత్య.

"అంతకంటే గ్రంథసాంగురాలు. ఆమె మేల్ ప్రాస్టిట్యూషన్ ప్రవేశపెట్టిందనుకుంటాను. చాలా గుట్టుగా జరిగేది. ఆమె ఇంటికి వచ్చే వారంతా అందంగా, ఆరోగ్యంగా, దృఢంగా ఉన్న యువకులే."



"మైగాడ్..." అన్నది నీలిమ.

"నా బస ఓ గదిలోకి మారింది. మంచం రెండు కుర్చీలు ఇచ్చింది. ఒకరోజు నేను సీరియస్‌గా చదువుకుంటున్నాను. రూబీ వచ్చింది. ఆమె నా దగ్గర కూర్చుని ఉపోద్ఘాతం లేకుండా అసలు విషయం చెప్పింది.

"జంటిల్‌మేన్! నా ఋణం తీర్చుకుంటానన్నావు. ఆ తరుణం ఆసన్నం అయింది. డాక్టరు చుగానీ సభియాటిస్ట్‌కు నీతో కాస్త పనిట. వెళ్తావా!"

"తప్పకుండా మేడమ్!" అన్నాను.

"అతను చెప్పిన పని ఏదయినా నిరాకరించకు శివాజీ! అయి నో యు కీప్ అప్ మై ప్రామిస్..."

"ఓ...అలాగేనండీ..." అన్నాను.

తయారయి చుగాని ఇంటికి వెళ్ళాను. అతను సాదరంగా ఆహ్వానించాడు. అతనింటికి అనుకునే క్లినిక్ ఉంది. అతను క్లినిక్‌కు అనుబంధంగా ఉన్న ఒక గదివైపు నడిచాడు. ఆ గదిలో ఓ అందమైన అమాయకమైన అమ్మాయి నిలబడి ఉంది.

"గుడ్ మార్నింగ్ సుమన్!" అన్నాడు.

ఆ అమ్మాయి నవ్వి ఊరుకుంది.

"ఈ అమ్మాయి కీమధ్యే పెళ్ళి అయింది శివాజీ. భర్త నరాల బలహీనతతో బాధపడుతున్నాడు. ఆమె అలా పిచ్చిగా చూస్తుంది. జబ్బేం లేదు. ఆమె వాంఛలను అణుచుకోవటానికి అలా చేస్తుందనిపిస్తుంది. తల్లిదండ్రులు చాలా ఆందోళన పడుతున్నారు. ఓ నాలుగయిదు రోజులు ఆమెతో గడిపితే రియాక్షన్ నా కర్థం అయిపోతుంది."

నాకు అర్థం అయింది. ఆ పనే స్త్రీ చేస్తే వేశ్యావృత్తి అంటారు.

నాకు వేరే మార్గం లేదా? ఏమిటి? ఎంత కష్టమైనా నా డిగ్రీ పూర్తి చేయాలి.

అదే నా దీక్ష! ఒకసారి అత్త కూతురితో తిరిగినవాడికి మడి ఏమిటి! నవ్వేసి ఊరుకున్నాను. అలా నా జీవితం ప్రారంభం అయింది."

"వద్దండి...ప్లీజ్ వద్దు..." వినలేనట్టు తల విదిలించింది నీలిమ.

"నీలూ! ఇది విని, నువ్వు నాకు సానుభూతి చూపాలని కాదమ్మా. ఒకొకరి జీవితంలో యెంత విషాదం, ఎంత కష్టసుఖాలుంటాయో తెలుసుకొమ్మని చెబుతున్నాను" అన్నాడు.

"సారీ సర్! మీ జీవితంలో ఇంత విషాదం ఉందని నాకు తెలియదు" అన్నాడు ఆదిత్య.

ఇద్దరూ ఒకేసారి ఆయనవంక చూచారు.

"నీలూ! కొన్ని అభిమానాలకి, అనుబంధాలకి అర్థం చెప్పలేము. అర్థాలు వెతకాలని ప్రయత్నించకు. నేను చెప్పినట్టు విను. నందనరావుగారి దగ్గర చనువుతో ప్రవర్తించినట్లే నన్ను అడుగు, ప్రశ్నించు..."

"అలాగే..." అన్నది అప్రయత్నంగా.

ఇద్దరినీ సాగనంపాడు శివాజి. అతని ముఖం చాలా గంభీరంగా ఉన్నది.

నీలు ఆలోచిస్తున్నది. ఇతను పూర్వాశ్రమములో తన తల్లికి క్లాసుమేటా?

కాదు. వయసులో ఎంతో వార ఉంది. ఏమయి ఉంటుంది! ఆమె ఊహించలేకపోయింది. ఆదిత్యను అతని గదివరకు వెళ్ళి వదలి వచ్చింది.

"నీలూ! శివాజిగారిదంతా మానవతా దృక్పథంతోనే చేస్తారంటారా!"

"నాకదే అర్థం కావటం లేదు."

ఇద్దరూ చాలా సేపు చర్చించారు.



"నిశ్చింతగా నిదురపో మై డియర్ ఫ్రెండ్..." అన్నది, అతని చెయ్యి నొక్కుతూ.

"థాంక్స్..." ఆమె చేయి చుంబించి వదిలాడు. ఆమె వెళ్ళి కార్లో కూర్చుని చిరునవ్వుతో చేయి ఊపింది.

# 19

డిసెంబరు ముప్పై ఒకటవ తేదీ రాత్రి అది. తెల్లవారితే కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, కేరింతలు కొడతారు యువతరంగిణి మెంబర్లు. అంతా యువతీ యువకులే. ఈ రొటీన్‌నుండి, ఆదిత్యను, నీలిమను తప్పించాలని శివాజి ప్రయత్నం. అయిదు నూటపదహార్లు లైఫ్ మెంబర్‌షిప్ కట్టి, ఇద్దరిని యువతరంగిణిలో చేర్చాడు.

"ఈరోజు మీది. వెళ్ళి హాయిగా డాన్స్ చేసి, పాటలు పాడి గడిపి రండి" అన్నాడాయన.

"నాకు క్లబ్బులు, డాన్సులు అలవాటు లేదండి."

"మాకున్నాయనుకుంటున్నావా! ఈ రొటీన్‌నుండి కాస్త బయట పడాలి. కారు తీసుకువెళ్తారా!"

"వద్దండీ... ఆటోలో వెళ్ళిరాగలం" అన్నారు ఆదిత్య, నీలిమ. ఇద్దరూ బయటికి వచ్చారు.

"యెలా ఉంది వ్యాపారం?"

"చాలా ఫ్లరిషింగ్‌గా ఉంది. జనంలో కూడుగుడ్డతోపాటు గూడు ఏర్పరుచుకోవాలన్న తపన కూడా బాగా పెరిగినట్టుంది. ఎంత సిమెంటు తెచ్చినా, ఎంత బ్లాక్ చేసినా ఖర్చు అవుతూనే ఉంటుంది." అన్నాడు.

"మనీ వాల్యూ తగ్గింది, వస్తువు ధరలు పెరిగాయి అంటున్నారు." అన్నది ఇద్దరూ ఒక ఆటోరిక్షాలో కూర్చోవటం ఇదే మొదటిసారి. ఇద్దరూ విచిత్రమైన భావనకు లోనయ్యారు. అతని అణువణువు హాయి ననుభ

వించాయి. అందుకేనా, జనం స్త్రీ పురుషుల సంబంధం కోసం అంతగా తపించిపోతారు.

నీలిమకు అలాంటి భావం కల్గిందేమో దూరం జరిగి ఒక మూలకు ముడుచుకుని కూర్చుంది.

"నీలూ!"

"ఊం..."

"ముహూర్తం ఎప్పుడు!"

"ఫిబ్రవరి నాల్గున అంటున్నారు అంకుల్."

"అబ్బా! అంతవరకు నీకు దూరంగా ఉండాలా!" అన్నాడు.

వారి మాటల్లోనే ఆటో యువతరంగిణి క్లబ్బు ముందు వెళ్ళి ఆగింది. దాని సెక్రటరీ ఎదురువచ్చి ఆహ్వానించాడు. అతను తెల్లగా అందంగా ఉన్నాడు.

"వెల్‌కమ్...వెల్‌కమ్ మిస్టర్ ఆదిత్యా, మిస్ నీలిమా!" అన్నాడు.

"గుడ్ ఈవినింగ్!" అన్నారు.

"నా పేరు చంద్రబాబు" చేయి కలిపాడు. అప్పటికే హాలు నిండుగా యువతీ, యువకులు గుమిగూడి ఉన్నారు.

గౌన్లు వాళ్ళు, మాక్సీల వాళ్ళు, మినీలు వేసుకున్న యువతులు, ప్యాంట్లు షర్టులు వేసుకున్నవారు, పంజాబీ డ్రస్సులు వేసుకున్నవారు, చీరలు కట్టినవారు, రకరకాల మనుషులున్నారు. అక్కడ మినీ భారతదేశం చూచినట్టుంది.

అలాగే యువకులలో ప్యాంట్లు, లూజ్ షర్టులు, పైజామాలు, రంగు రంగుల లుంగీలు కట్టుకున్నారు.

చంద్రబాబు తన టై సవరించుకుని, వేదిక నెక్కాడు.

"లేడీస్ అండ్ జంటిల్ మెన్!

ఈ సాయంత్రం మనది...అంటే యువతీ యువకులది. నవత



కోరే యువత... సమత కోరే యువత నేడిక్కడ సమావేశం అయింది. మనము కొత్త సంవత్సరానికి స్వాగతము పలుకుదాం... సుస్వాగతం పలుకుదాం..."

అతను కవిత్వం ధోరణిలో చెప్పుకుపోతున్నాడు. మధ్య, మధ్య యువతీ యువకులు కేరింతలు కొట్టి నవ్వుతున్నారు.

"వీళ్ళు ఇంగ్లీషు క్యాలెండర్ ఎందుకు అనుసరిస్తారు!" అన్నది నీలిమ.

"ఏది తెలుగుతనంతో కూడినది చెప్పు! ఈ హాలా, వ్యక్తులా, వారి వేష, భాషలా!" ఆదిత్య నవ్వాడు.

"వెల్‌కమ్. విష్ వెల్‌కమ్

న్యూ ఇయర్... ప్రాస్పరస్ ఇయర్... డియర్..." అంటూ ఇంగ్లీషు పాట మొదలుపెట్టారు.

"కమాన్ ఫ్రెండ్స్! గివ్ యువర్ వాయిస్! జాయిన్ విథ్ అస్..." చంద్రబాబు ఆహ్వానించాడు.

అందరూ పాట అందుకున్నారు. ఏడెనిమిది నిముషాలు స్వాగతం పలుకుతూ గడిపారు.

"ఎనీపేర్స్! హూవాంట్ టు డాన్స్!" చంద్రబాబు ప్రశ్నకు చాలామంది యువతీ యువకులు లేచారు. వాయిద్యానికి అనుగుణంగా డాన్స్ ప్రారంభం అయ్యింది.

నీలిమ నుదుట పట్టిన చెమట తుడుచుకుంది. థాంక్స్, గాడ్ తనొక్కర్తి కాదు. ఇంకా కొందరున్నారు అనుకుంది.

ఆ డాన్స్ ముగిసింది. అందరూ మిన్నుముట్టే చప్పట్లు కొట్టారు.

"రిలాక్స్! అండ్ హేవ్ ఎ డ్రింక్" అన్నాడు.

"కోల్డ్ డ్రింకా! హాటా!" అంటూ, బేరర్స్ అడిగి చక, చక సర్వ్ చేయటం మొదలుపెట్టారు.

"డ్రింక్స్ హాట్‌గా ఉంటాయా! టీ, కాఫీ..." అమాయకంగా అడిగింది నీలిమ.

చిన్నగా నవ్వాడు ఆదిత్య.

"బ్రాందీ, విస్కీ, కాక్‌టేల్ లాంటివి హాట్ డ్రింక్స్" అన్నాడు.

ఉత్సాహానికి మారు పేరన్నట్లు, కోలాహలంగా తిరుగుతున్నారు యువతీ యువకులు! ఆ ప్రపంచమే వేరు. అలాంటి ప్రపంచం ఉంటుందని కూడా తెలియదు నీలిమకు. ఆమెకు కష్టాల వరవడిలో అనుభవం ఉన్నా శుభాలకు మాత్రం నోచుకోలేదు.

ఇన్ని రకాల ఆనందాలు ఉంటాయని కూడా మరిచిపోయిందామె, అదో విచిత్రమైన ప్రపంచం.

కృష్ణకుంజ్ కొచ్చేవారంతా తమ కష్టాలను తీసుకుని, విచారంగా వస్తారు. వారి ముందు తను అదృష్టవంతురాలిననే ధీమా ఉండేది నీలిమకు. ఈ క్లబ్బులో అంతా యువతీ యువకులే. వారిని చూస్తే తను వెదురు బొంగులమ్ముతూ ఏం పోగొట్టుకుందో అర్థం అయింది. ఆమె కడుపులో తిప్పినట్లయింది.

"ఆదిత్యా! మనము వెళ్ళిపోదాం" అన్నది.

"అప్పుడేనా!"

"ఈ వాతావరణం నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది" అన్నది.

"కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలి డియర్"

"పోదాం పద...ఏమిటో ఇదంతా మరో లోకం" అన్నది లేస్తూ. యెవరి సంతోషంలో వారున్నారు. యెవరి ఆనందం వారిది. వీళ్ళను గమనించనే లేదు. ఇద్దరూ బయటికి వచ్చారు.

ట్యూబ్ లైట్ల కాంతి వెన్నెలలా పరుచుకుని ఆవరణంతా కళకళలాడింది. అకస్మాత్తుగా ఆదిత్యవంక చూచింది. అతని సైడ్ బర్న్స్ దగ్గిర ఒకటి రెండు తెల్ల వెంట్రుకలు వెండిలా మెరిశాయి.



"అప్పుడే తెల్ల వెంట్రుకలా !"

"మీ అమ్మగారి ప్రసాదం"

"మనిషి ఆలోచిస్తే తెల్ల వెంట్రుకలు వస్తాయి కదూ !" అన్నది ఆర్తిగా అతని నడుము చుట్టూ చేయి వేసి, తల అతని భుజానికి ఆనించింది.

"ఊఁ..." ఇద్దరూ బయటికివచ్చి, ఆటోను పిలిచారు. ఆటో ఎక్కాక కూడా ఆమె ఏం మాట్లాడలేదు. అతన్ని ఆనుకుని కూర్చుంది.

"ఆదిత్యా ! డాక్టరుగారి కారిక్కడ పార్క్ చేసి ఉందేం ? ఆటో ! ఆపు" అన్నది. ఆటో రిక్షా ఆగిపోయింది. కృష్ణకుంజ్‌కు నాల్గిళ్ళ అవతల శివాజి కారుంది.

"నాన్నగారికి మళ్ళీ సుస్తీచేసిందో ఏమో." కంగారు పడింది.

"అంత కంగారెందుకు ! పద..." అతని మాట వినిపించుకోకుండానే నీలిమ పరుగున తన ఇంటివైపు వెళ్ళింది. గేటు దగ్గరగా వేసి ఉంది. నెమ్మదిగా త్రోసింది. ఆమె కళ్ళు చురుకుగా పనిచేసాయి. లతా మంటపము వైపు నుండి ఏడ్పు వినిపించింది.

ఎవరయినా ఉంటారు. అప్రయత్నంగా ఆమె కాళ్ళు అటు వెళ్ళాయి.

"దేవీ...దేవీ...నువ్వు ఏడిస్తే నేను భరించలేను."

"నాకేం మిగిలింది చెప్పు...నీతో గడిపిన ఆ కొద్దిరోజులు తప్ప నా జీవితంలో ఏం మిగిలింది !"

"ఇప్పుడేమయింది !"

చీకటిని చీల్చుకుని నీలిమ కళ్ళు లతా మంటపంలోని వ్యక్తులను చూచాయి. డాక్టర్ శివాజీ పైజమా, లాల్చీతో కూర్చున్నాడు. అతని ఒడిలో తల పెట్టుకుని పడుకున్నది ముకుందాదేవి.

కళ్ళు చిట్లించి మరీ చూచింది నీలిమ.

అతను ఆర్తిగా ఆమె బుగ్గ చుంబించి తల నిమురుతున్నాడు.

"చక్రీ...చక్రీ! ఈ సాంప్రదాయాలకు సభ్య సమాజానికి దూరంగా తీసుకు వెళ్ళు...నేనీ నరకంలో ఉండలేను..."

"దేవీ! ఇప్పుడు మనము ఆలోచించేది మన గురించి కాదు. మన పిల్లల గురించి" అన్నాడు అతను.

"ఎన్నాళ్ళీ దొంగ బ్రతుకు!"

అతని నుండి గాఢమైన నిట్టూర్పు వెలువడింది.

ఆటోవాడికి డబ్బులిచ్చి వచ్చిన అదిత్య ఇటు చూడలేదు. సరాసరి ఇంటికి వెళ్ళి బెల్ కొట్టాడు.

ఆ బెల్ శబ్దానికి, సన్నగా వినిపించినా ముకుందాదేవి, శివాజీ ఉలిక్కిపడి లేచారు. ఎదురుగా నీలిమను చూచి, కాళ్ళు భూమిలోకి పాతుకు పోయినట్టు ఆగిపోయారు.

"నీ...నీలూ." శివాజియే తేరుకున్నాడు.

"నన్నా పేరుతో పిలువవద్దు...ప్లీజ్..." గిరుక్కున తిరిగి ఇంటివైపు పరుగెత్తింది. "నీలూ! నీలూ" అంటూ శివాజీ ముందుకు వచ్చాడు.

"చక్రీ! నువ్విప్పుడెళ్ళిపో... నిన్నది అవమానిస్తే నేను... భరించలేను" అన్నదామె.

ఇద్దరు ఇంటిముందుకి వచ్చారు. ఇంటి ముందు వరండాలో కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తుంది నీలిమ.

"నీలూ! ఏమయింది?" అదిత్య అడుగుతున్నాడు.

"ఆదిత్యా! చాలాసేపయింది .వెళ్దాం పద." శివాజీ పిలవగానే అదిత్య తల పంకించి అతడిని అనుసరించాడు.

ముకుందాదేవి వణుకుతున్న చేతులతో ఇంటి తాళం తీసింది. నీలిమ లేచి లోపలికి వెళ్ళింది. వరండాలో అన్నీ మరిచి నిదురమాత్ర



ప్రభావంతో నిశ్చలంగా నిదురబోతున్న నందనరావును చూడగానే తల్లిపై రోతపు అసహ్యము, తండ్రిపై జాలి, గౌరవము కలిగాయి.

"నాన్నా!" అతని మంచం దగ్గర కూర్చుని బావురుమన్నది నీలిమ. తల్లి వంచకి, తండ్రిని మోసం చేసింది. తన మలినమైన చరిత్ర బయట పడరాదని, ఎంత నాటకం ఆడింది. దేవుడయి వెలిసింది.

అందుకే అన్నారేమో, రంకునేర్చినస్త్రీ బొంకు నేరుస్తుందని.

నిజాయితీగా నువ్వు నాకొద్దు. నీ వల్ల నా కోరికలు తీరటం లేదని చెబితే ఏం? ఈ దొంగ బ్రతుకెందుకు! ఆమె అలాగే కూర్చుంది. ముకుందాదేవి మాట్లాడక, తలుపు లోపలినుండి బోల్ట్ వేసి వెళ్ళిపోయింది. తనను పలుకరించే ధైర్యం యెక్కడిది అనుకుంది నీలిమ.

'నా బ్రతుకు ఇలాంటిదని చెబితే ఏం పోయింది!' ఆమె అలా ఏడుస్తూ ఎంతసేపు కూర్చుందో ఆమెకే తెలియదు. తనే పిచ్చిది. తనమీది ప్రేమచేత ఏదో అంటుందని భ్రమ పడింది.

అంతా మోసం! అంతా దగా! అంతా వేషం!

నాల్గు గంటలు కొట్టింది కూడా వినిపించుకోలేదు

నందనరావు మేలుకునే సమయమది. అతను, అటు, ఇటు దొర్లాడు.

"నాన్నా!" ఉలిక్కిపడింది.

"నువ్వు ...నువ్వింకా నిదురపోలేదా తల్లీ."

"లేదు నాన్నా!"

"కొత్త సంవత్సరం ఫంక్షన్ ఏదో ఉందన్నది మీ అమ్మ."

"అక్కడనుండే వస్తున్నాను."

"ఫంక్షన్ బాగా జరిగిందా!"

"ఊఁ..." అన్నది యెటో చూస్తూ.

"మంచి నీళ్ళిచ్చి పడుకో..." అన్నాడు.

మెల్లగా నీరసంగా లేచింది. నీలిమ వంటింట్లోకి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. అతని చేత త్రాగించి, అతను త్రాగాక, తల్లి గదిలోకి తొంగి చూడబోయింది. ఈ మధ్య ఇల్లు అద్దెకిచ్చాక, వరండాలో నందన రావు, విగ్రహాలున్న గదిలో ముకుందాదేవి పడుకుంటున్నారు. ఉన్న ఒక్కగానొక్క గదే నీలిమది. కాని ఆమె కా క్షణంలో తల్లిని చూడాలని పించలేదు. అందుకే వెళ్ళి ముసుగుతన్ని పడుకుంది. ఆలోచించి అలసి పోయిన మెదడు నిదురపోయింది.

## 20

**ఆనాటికి** వారం రోజులయింది ముకుందాదేవి, సత్యసాయిబాబా ఆశ్రమం పుట్టపర్తికి వెళ్ళిపోయి. ఆనాటి రాత్రి జరిగిన సంఘటన తరువాత తల్లీ కూతురు మాట్లాడుకోలేదు. వెళ్ళేటప్పుడు మాత్రం కన్నీటితో ఒకే మాట చెప్పింది.

"నీకే అవసరం వచ్చినా డాక్టరుగారిని అడగటం మరిచిపోకు."

తనేం అనలేదు. తన హృదయంలో స్పందనలేదు. అనుభూతిలేదు. కరుడు కట్టిపోయింది.

తండ్రి మొదటిరోజు బాగానే ఉన్నాడు. మర్నాటినుండి అతను మారిపోయాడు. చాలా గంభీరంగా ఉంటున్నాడు. కూతురు కనిపిస్తే చిరాకు పడుతున్నాడు.

తల్లికి, శివాజీకున్న సంబంధం తండ్రికి తెలుసేమో. అందుకే అంత గంభీరంగా ఉండి పోయాడేమో. తనమూలంగా తల్లి దూరం అయిందన్న దిగులా ! ఏమయి ఉంటుంది. ఆమెకు అర్థం కాలేదు.

అలాగే ఆలోచిస్తూ నిలబడింది. వంటింట్లో పెద్ద శబ్దం అయింది పరుగున వెళ్ళింది నీలిమ. కాఫీ చేసుకోబోతూ, గిన్నె పడేసాడు రావు.

"అదేమిటి నాన్నా, నేను చెయ్యనా !"

"నాకెవరి దయా భిక్ష అక్కరలేదు."



"నాన్నా ! అమ్మ అలా వెళ్ళింది. మీరు ఇలా అంటీ, ముట్టనట్టు ఉంటే నా కెంత బాధ కల్గుతుందో ఆలోచించారా !"

ఉషస్సు మెల్ల, మెల్లగా మాయంఅవుతోంది వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంది.

"నా బాధ ఎవరికి చెప్పుకోను" అన్నాడు ఎటో చూస్తూ.

"నాన్నా ! మనము ఒకరి కొకరం మిగిలాం. బాధలు, సంతోషాలు ఏవయినా కలిసే పంచుకుందాం" అన్నది, వెళ్ళి అతని భుజంపై చేయివేసి.

కంగారుగా, ఏదో అంటరాని వస్తువు కంటపడినట్టు, తన ఒంటిని అంటుకున్నట్టు దులపరించుకున్నాడు.

"నాన్నా !"

"నాన్నా ! నాన్న అమ్మ ఇద్దరూ చచ్చిపోయారు. ఫో...ఆ డాక్టరు దగ్గరకు వెళ్ళమన్నదిగా వెళ్ళరాదూ !" అన్నాడు.

"నాన్నా ! నామీద ఎందుకింత కోపం వచ్చిందో అర్థం కావటం లేదు. ఏమయింది నాన్నా !"

"ముందు నా కళ్ళముందు నుండి ఫో" గిన్నె ఎత్తాడు.

ఆమె కా క్షణంలో అతడిని రెచ్చకొట్టడం భావ్యం కాదనిపించింది. మౌనంగా వచ్చేసింది. బయట ఏడుస్తూ కూర్చుంది. ఆమె అయిదు నిమిషాలు కనిపించకపోతే తల్లడిల్లి పోయే నందనరావు ఆమె ఉనికిని మరిచినట్టు ఊరుకున్నాడు.

పదకొండు గంటలు దాటాక, ఊగుతూ బయటికి వచ్చాడు. పడి పోతాడేమోనని భయపడింది కాని, తను వెళ్తే ఇంకా రెచ్చిపోతాడని, చూస్తూ కూర్చుండి పోయింది.

అతను ప్రక్కింటి డ్రైవరు కనిపిస్తే పిలిచాడు.

"చూడు రాములూ ! నా చేతి క్రిందకో కుర్రవాడిని చూడు, అలాగే నువ్వు రోజూ క్యారియర్ తెచ్చిపెట్టు" అన్నాడు.

"అలాగేనయ్యగారూ!"

"కుర్రాడిని మాత్రం త్వరగా చూడు."

అతను డబ్బులు క్యారియర్ తీసుకుని వెళ్ళిపోయాడు. అతను ఇంట్లోకి వచ్చాడు. అరగంట తరువాత రాములు క్యారియర్ తీసుకువచ్చాడు. ఆబగా తిన్నాడు నందనరావు.

"రాములూ! బయట ఎక్కడో ఆ అమ్మాయి ఉంటుంది. ఈ మిగిలిన అన్నం తినమని చెప్పు."

నీలిమ గుండెల్లో ముండ్లబాకు దిగింది.

"మీ అమ్మాయా!"

"మా, మీ అని ఏముంది! ఎవరో ఒకరు. ఎవరికీ ఎవరూ లేరు" అన్నాడు.

నీలిమ లేచింది. తనిప్పుడు పంతానికిపోయి సాధించేదేముంది! అందుకే లోపలికి వెళ్ళి, అవన్నీ సర్ది పెట్టి, స్నానంచేసి, మిగిలిన అన్నం తిన్నది. క్యారియర్ కడిగిపెట్టింది.

"నాన్నా! క్యారియర్ ఎందుకు" అని అడగబోయి ఊరుకున్నది. తనేమడిగినా తప్పులు వెతుకుతాడు తండ్రి. ఆమెకేం పని తోచటంలేదు. ఒకప్పుడు ఊపిరి తీసుకునే సమయముకూడా ఉండేదికాదు. ఇప్పుడు...ఇప్పుడు ఒక్కొక్క క్షణం దొర్లించటానికి మహా అవస్థ పడుతున్నది.

శివాజీని చూడాలంటే అసహ్యంగా ఉంది.

సాయంత్రం వేళకు ఓ పనమ్మాయి, కుర్రాడు కుదిరాడు.

"కుర్రాడు దినమంతా ఉండాలయ్యా! జీతం ఎక్కువ ఇవ్వు."

"నాకొచ్చే అద్దెలో అన్నీ గడవాలి. నేను దేవుడిని దయ్యాన్ని కాను" అన్నాడు కఠినంగా.

నీలిమ లోపలి గదినుండి తొంగి చూచింది. తండ్రి ముఖం వికృతంగా, అసహ్యంగా ఉంది.

ఎందుకిలా మారాడు! అమ్మే కారణం అనుకుందామె. ఆ రోజంతా



మాట్లాడుకోలేదు. రాత్రి అతను నిదరపోయాక, కాసేపు అతని కాళ్ళదగ్గర కూర్చుంది. తల్లిని తప్పుపట్టలేదు కాని ఆమె పిరికితనాన్ని, హిపోక్రసీని తప్పుపట్టింది. ఫలితంగా ఆమె ఇల్లు విడిచింది.

తెల్లవారి పనిమనిషి చేతే అన్ని పనులు చేయించుకున్నాడు.

"నాన్నా!" అన్నది జాలిగా. అతను వినడానట్టే ముఖం తిప్పుకున్నాడు.

తనేం తప్పు చేసింది.

"అమ్మా...టీ పెడతావు రాజా?"

"పనికుర్రాడు ఉన్నాడుకదా. అమ్మాయిని ఎందుకు విసిగిస్తావు?" అనేది తల్లి. ఆయన చిన్నగా నవ్వేవాడు.

"ముకుందా! తల్లి కొట్టినా, తిట్టినా తల్లిని హత్తుకుని తృప్తి పడతాడు పసిపిల్లడు. ఈనాడు నా పరిస్థితి అలాగే ఉంది. నా తల్లి చేత్తో ఇస్తే అమృతము" అన్నాడు.

ఆ మాట విన్నాక ఏనాడు తండ్రి పనులు నిర్లక్ష్యం చేయలేదు.

"అమ్మడూ! నీ చేతి స్పర్శతో నా అణువణువు కొత్త రక్తం పోసుకుంటుంది. నీలూ! నీ చిరునవ్వు చూస్తూ నా వ్యధలు, బాధలు మరిచిపోతాను. ఈ ప్రాణం ఎప్పుడో పోయేదమ్మా. నీ కోసం, నీ పెళ్ళి చూడాలని, నీ బిడ్డలచేత తాతయ్యా అనిపించుకోవాలని బ్రతుకుతున్నాను."

అలాంటి తండ్రి తన ఉనికినే అసహ్యించుకుంటున్నాడంటే తను ఏం చేసింది!

"నాన్నా!" అతని భుజాలు నిమిరింది.

"ఏమిటి?" ఆ కంఠంలో మార్దవం లేదు, మామూలు పలకరింపు కూడా లేదు.

"ఎందుకు నాన్నా అంత కోపం! నేను వెళ్ళి అమ్మను తీసుకువస్తాను. జరిగింది మరచిపోదాం..." అన్నది.

"ఆమె లేదు. కావాలని ఏడుస్తున్నాననా నీ శాపం ! పనివాళ్ళు నాకు వండి పెడతారు. ఉండాలనుకుంటే ఉండు."

"నాన్నా !"

"నన్నా పేరుతో పిలువ వద్దు."

"నాన్నా ! కోపమెందుకో చెప్పు నాన్నా !"

"నా కెవరిపైనా కోపం లేదు. నాపై నాకే కోపం. అసహ్యం, జాలి" అనుకుంటూనే గోడపట్టుకుని వెళ్ళిపోయాడు.

ఆమె అలాగే అతను వెళ్ళినవైపు చూస్తూ నిలబడిపోయింది.

"నీలూ !"

ఆమె చప్పున తల ఎత్తింది. డాక్టర్ శివాజి నిల్చున్నాడు. అతని ముఖాన కళలేదు.

"డాక్టర్‌గారూ ! మేము మీకేం అపకారం చేసామని మమ్మల్ని సాధిస్తున్నారు ! మా అమ్మ ఊరెళ్ళింది. నాన్న విపరీతమైన వేదాంతం పెంచుకున్నాడు. ఇంకా నేను ప్రాణంతో మిగిలి ఉన్నాననా మీ బాధ!" అన్నది కోపంగా

"నీలూ ! శాంతంగా నా మాట వింటావా !"

"మీరు చెప్పాల్సింది, నేను వినాల్సిందేం లేదు. మీరు వెళ్ళిపొండి. మళ్ళీ ఈ ఇంటి ఛాయలకు రాకండి..." అన్నది టప్పున చేతులు జోడించి.

"నీలూ ! ఒక్కమాట వినమ్మా !"

"అరమాట కూడా వినను గాక వినను" అన్నది. పిచ్చిపట్టినట్టు అరిచింది.

శివాజి ఏం చేయలేనట్టు వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాక కుర్చీలో కూర్చుంది చాలాసేపు. ఆమెకు చెప్పుకోదగిన దగ్గిర బంధువులు లేరు. స్నేహితులూ లేరు. సావిత్రమ్మ కొడు



కును మెంటల్ ఆస్పత్రిలో చేర్పించారీ మధ్యే. ఆమె మనసు విరిగి తీర్థయాత్రలు చేస్తున్నది. ఏదో ఒక పని చేయాలి. ఏం చేయాలి!

ఆమె ఆలోచిస్తూండగానే వారంరోజులు గడిచిపోయాయి. నందన రావు పని కుర్రాడి సహాయముతో పనులు చేసుకుంటున్నాడు. పనిమనిషి వంట చేస్తున్నది. అతను తిన్నాక యాంత్రికంగా భోజనం చేస్తున్నది. అతని కోపం తగ్గకపోతుందా అని ఎదురుచూస్తున్నది. కానీ రోజుకు, రోజుకి ఎక్కువే అవుతున్నది.

ఒక్కొక్కసారి బూతులు తిడతాడు. చేతిలో ఏదిఉంటే అది నీలిమ పైకి విసురుతాడు. నీలిమ చూస్తుండగా పళ్ళు, మిఠాయిలు తెప్పించుకు తింటాడు. మిగిలితే పనివారికి పెడతాడు.

ఆమె కతని ప్రవర్తన ఒక్కముక్క అర్థం కాలేదు. వీలయినంత వరకు అతన్ని తప్పించుకు తిరుగుతున్నది. ఇంట్లో అద్దెకున్న వాళ్ళతో కలివిడిగా తిరిగింది.

రెండురోజులకే మొహం మొత్తింది. ఆ యజమానురాలు శ్రీవత్స విచిత్రమైన స్త్రీ ! యెదుటివారు శ్రోతలు, తను రేడియో అనుకుంటుంది. రెండురోజులలో తన పుట్టింటివారు తన పెళ్ళి ఎంత ఘనంగా చేశారో ఇరవై రెండుసార్లు చెప్పింది.

"అమ్మో ! పురాణం విప్పింది" పనిమనిషి పరుగులు పెట్టేది. చేసేది చిన్న పని అయినా పెద్ద కలరిచ్చి చెబుతుంది. వినేవారికి ఓపికకు పరీక్ష పెడుతుంది.

"అక్కా ! మా ఇంటికి రావటం మానేశావేం ?" వాళ్ళమ్మాయి అడిగింది.

"ఏం లేదమ్మా."

"నాకు తెలుసు. మా అమ్మ సోది భరించటం కష్టం. అసలు ఆర్ట్ ఆఫ్ టాకింగ్ అని క్లాసులు పెట్టాలి" అన్నది. ఆ అమ్మాయి పేరు హేమ.

"అక్కా ! నాకు తెలుగు రాదు. కాస్త చెప్పవూ !" అన్నది.

ఆ రోజు ఆ అమ్మాయికి తెలుగు పాఠం చెబితే ఎంతో రిలీఫ్‌గా తన సమయం సద్వినియోగం అయినట్టుగా అనిపించింది. మెల్ల, మెల్లగా అన్ని సబ్జెక్ట్సు చెప్పేది.

ఒకరోజు హేమ తల్లి శ్రీవత్స వచ్చింది.

"అమ్మాయ్ ! మా హేమకు ఒక్క టీచరు నచ్చదు. నీకు తోచదు అంటున్నావు కదా. ట్యూషన్ చెప్పరాదూ !"

"అలాగేనండీ..." అన్నది. ఆవిడే ఫీజు అది నిర్ణయించింది. ఏ మాట కామాటే చెప్పుకోవాలి. ఫీజు అది నిర్ణయించింది గాని, ఖచ్చితమైన మనిషే. ఒక్క మాట్లాడేటప్పుడే రాచకొండ కథలూ, పురాణం నవలలా ఎక్కడో మొదలుపెట్టి, ఎక్కడికో తీసుకువెడుతుంది.

ఆమె మోపెడు చీరలు మోసుకుని వెళ్తోంది ఎక్కడికో.

"చీరలు డ్రైవాష్‌కా పిన్నిగారూ !"

"పిచ్చిపిల్లా ! ఇన్ని చీరలు డ్రైవాష్‌కిస్తే ఆరిపోతారు. అలా అని ఇచ్చేవారు లేరనుకోకు. మా సుబ్బమ్మ పిన్ని కూతురుంది. దాని భర్త విజయవాడలో పెద్ద లాయరు. గోగినేని రంగారావు అంటారు. వినే ఉంటావు. అతని భార్య అన్నపూర్ణ మా సుబ్బమ్మ పిన్ని కూతురు. రుమాలుగుడ్డ డ్రైక్లీనింగ్‌కు వేస్తుంది. నిజానికి ఆయన రెండు చేతులా సంపాదిస్తున్నాడు కాబట్టి, తట్టుకుంటున్నాడు..."

"పిన్నిగారూ !" మాట తప్పించబోయింది.

"నువ్వుండమ్మా ! మీ బాబాయిగారూ ఎప్పుడూ అంటుంటారు. 'శ్రీవత్సా నీవు అన్నీ పొదుపుగా చేస్తావు,' అంటూ. నేను పొదుపు చెయ్యబట్టే ఈనాడు ఈ స్థితిలో ఉన్నాము అమ్మాయి, మీ బాబాయి..."

"పిన్నిగారూ ! మరి ఈ చీరలు... చీరలు బయటికి ఎందుకు



తీసుకువెళ్తున్నారు ?" అన్నది చీరలు స్ట్రైన్ చేస్తూ చీరల విషయం తప్ప వేరే విషయం చెప్పొద్దన్నట్లు.

"ఫాల్ కుట్టటానికి అమ్మాయ్ ! మహారాష్ట్రీలావిడ, మూడు రూపాయలు తీసుకుంటుంది గాని చక్కగా కుడుతుంది. నా పెళ్ళి అయిన దగ్గర నుండి అక్కడే కుట్టిస్తున్నాను. అసలావిడ చదువుకోలేదు. ఆ సలహా ఇచ్చింది నేనే. కాని ఏం ప్రయోజనం ! ఇప్పుడు ఒక్క నిముషం తీరిక వుండదు. మన పని అంటే చేస్తుంది..."

ఆ సంభాషణ సాగి, తీగ పాకంగా మారి, ఆ మహారాష్ట్రీలావిడ చరిత్రను తిరగవేసి, మళ్ళీ తన పెళ్ళి దగ్గర ఆగి, ఎంత ఘనంగా జరిగిందో, తల్లి ఎంత శ్రమపడ్డారో చెబుతుంది.

"పిన్నిగారూ ఒక్కమాట..."

"ముందు నా మాట వినమ్మాయ్... అసలా మహారాష్ట్రీలావిడ..."

"ఆవిడ సంగతి వదిలెయ్యి. ఆ ఫాల్స్ నేను కుట్టి పెడతాను." గబుక్కున చీరలు లాక్కుని ఇంటికి వచ్చింది.

తన పొదుపు గురించి చెప్పుకోవటమేగాని, ఒక్క విషయంలో పొదుపు పాటించగా చూడలేదు. న్యాయంగా ఒక గంట కూర్చుంటే ఫాల్ కుట్టవచ్చు. ఒక గంట నోరు ఆడించగలదు కాని, చెయ్యి ఆడించలేదు శ్రీవత్స.

అలా ఒక వ్యాపకం కల్పించుకున్నది.

ఆ రోజు పనమ్మాయి రాలేదు. తండ్రి మెప్పు పొందాలని, గబ గబ వంట చేసింది. కాఫీ కాచింది. కాఫీ పని కుర్రాడి చేతికిచ్చి పంపింది.

"పనమ్మాయికూడా మా అభిరుచులు నేర్చుకుంటుందిరా." అన్నాడు నందనరావు.

"పనామె రాలేదయ్యా."

"మరి కాఫీ, వంట నువ్వు చేశావా ?"

"నేనెందుకు చేస్తాను ! నీలమ్మ చేసింది."

"ఓహో ! ఎందుకు...ఎందుకు దానిచేత పని చేయించావురా...అది వండింది తింటానా !" గోడ ఆసరాగా చేసుకొని వంటింట్లోకి వెళ్ళి అన్నం కూరలు ఎగజిమ్మాడు. గిన్నెలు నేలకేసి కొట్టాడు.

"నాన్నా !...నాన్నా ! మనసు బాగాలేదు. కోలుకుంటారని ఊరు కుంటే రోజుకు, రోజుకు మితిమీరిపోతున్నారు. ఏమిటిది !" వెళ్ళి అతడిని పట్టుకుంది.

"ఖబడ్దార్ ! నన్ను ముట్టుకుంటే..." ఆమెను ఒక్క నెట్టు నెట్టాడు.

"నేను...నేను ఏం చేస్తే నీకు సంతోషం కల్గుతుందో చెప్పు నాన్నా !" అన్నది.

నేలమీదినుంచి మెల్లగా లేస్తూ. గాజులు చిట్లి, చేయి గీరుకుపోయి రక్తం వచ్చింది.

"నువ్వు...నువ్వు చచ్చిపోతే నాకు మనశ్శాంతి..."

"నాన్నా !"

"నన్నా పేరుతో పిలువవద్దు..." శాసించినట్టే అన్నాడు.

"నీ కోరికమేరకే చచ్చిపోతాను నాన్నా ! చచ్చిపోతాను." ఆమె చర, చర బయటికి పోబోయింది.

"మరీ చిన్నపిల్లలా ఏమిటి నీలూ !" శ్రీవత్స వచ్చి ఆపుచేసింది. తనింటికి తీసుకువెళ్ళి ఓ అరగంట లెక్చర్ ఇచ్చింది.

"అతను మెంటల్ అని తెలిశాక నువ్వు తొందరపడితే యెలా ! సైకియాట్రిస్టుకు చూపించి ఏదయినా ఆలోచిద్దాం" అన్నది.

ఏరు, వాగు తెంచుకుని వచ్చినట్టు దుఃఖం వచ్చింది నీలిమకు. వెళ్ళి తల్లికి ఘాటుగా ఉత్తరం రాసింది.

# 21

ఆదిత్య అప్పుడే నల్గొండ నుండి వచ్చాడు. అక్కడ అతను ప్రభుత్వ ఆస్పత్రి బిల్డింగ్ కంట్రాక్టుకు తీసుకున్నాడు. అక్కడ పని చేస్తున్నాడు. ఈ రోజు వచ్చాడు.

"వర్క్ యెలా ఉంది ఆదిత్యా ?"

"నీలిమ యెలా ఉంది సార్ ?"

శివాజీరావు ఫక్కున నవ్వేశాడు. వెంటనే సర్గ్గా కూర్చున్నాడు.

"నీలిమ బాగానే ఉందని అనుకుంటున్నాను. ఉంటావుగా రేపు వెళ్ళి చూడు."

"సార్ ! నేను ఈ పనిలో ఎక్కువ రోజులు ఉండలేనేమో."

"ఆదిత్యా !"

"అవును సర్ ! మనిషి తనకు కొంత మిగుల్చుకోవాలనే పని చేస్తాడు. కాదనను కాని, మా పార్టనర్ ఇచ్చిన పాళ్ళు చూస్తే నాకు మతి పోతున్నది."

"మరి కంట్రాక్టు అంటే ఏమిటనుకుంటున్నావ్ ? దోపిడీ."

"ఈ దోపిడీ నావల్ల కాదు. వర్కర్స్‌ను ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నారు. అటు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. యెవరు బాగుపడుతున్నట్టు ! మధ్యవర్తులు."

"చూడు ఆదిత్యా ! నిన్ను అక్కడికి పంపింది, అన్యాయం చేయమని కాదు. అనుభవం సంపాదించమని. ఈ కంట్రాక్టు అయిపోగానే స్వతంత్రంగా చేద్దువుగాని" అన్నాడు.

"సర్ ! మీ ఋణం..."

"తరుణం వచ్చినప్పుడు తీర్చుకుందువుగాని."

"అది కాదు సర్..."

"నాకంతా తెలుసు ఆదిత్యా! ప్రతీ ప్రొఫెషన్‌లో నిజాయితీగా చేయవచ్చు, అడ్డదార్లు తొక్కవచ్చు. నిజాయితీగా ఉంటూ సంపాదించగల నని నువ్వు నిరూపించాలి."

"మీ ఆశీస్సులు, అండ దండలుంటే అలాగే నిరూపిస్తాను."

"విష్ యు ఆల్ ద బెస్ట్! మారేడుపల్లిలో నాదొక ప్లాటుంది. అది నీలు పేర ట్రాన్స్‌ఫర్ చేస్తాను. ఇల్లుకు ప్లాను నీ ఇష్టప్రకారం ఇవ్వాలి."

"రేపు నీలుతో మాట్లాడుతాను."

"ఆ అమ్మాయి నందనరావును వదలి రావటం అంటే ఇబ్బంది పడుతుంది."

"నిజమే..." అన్నాడు. ఫోన్ అయినా చేద్దాం అంటే ఫోన్ లేదు. అతనికి ఇంకా తనను దొంగగా మార్చిన వ్యక్తులను పట్టుకోవాలనే ఉన్నది.

మర్నాడు బజారుకు వెళ్ళి, నీలిమ అభిమాన రచయిత్రి నాల్గు పుస్తకాలు కొని ప్యాక్ చేయించాడు. 'నీలుకి. ప్రేమతో ఆదిత్య' అని రాశాడు. పండ్లు, స్వీట్స్ నందనరావు కోసం కొన్నాడు.

అతను వాకిట్లోనే ఆగిపోవల్సి వచ్చింది. నందనరావు నోట విన కూడని దుర్భాషలు వినిపిస్తున్నాయి. నీలిమ మాత్రం ఏదో చెప్పాలని తెగ ప్రయత్నిస్తున్నది.

"అమ్మో అవతారం ఎత్తితే, కూతురు మరో అవతారం ఎత్తుతుంది. సిగ్గూ, బిడియం లేని మనుషులు. ఏ హుస్సేన్‌సాగర్‌లోనో పడి చావ రాదూ!"

"నాన్నా! నా మాట వినండి. మీ దగ్గర డబ్బులు తీస్తానా?"

"షటప్ డర్టీ రాస్కెల్! యెవరు! యెవరే నీకు నాన్న? రంకు నేర్పినమ్మ బొంకు నేర్పదా! ఆ ఆదిత్యగాడితో ఆటలు సాగించావు మళ్ళీ



సిగ్గు ఎగ్గు లేక..." అతని మాటలు దారుణంగా మొండి బాకుల్లా దిగబడు తున్నాయి.

"నందనరావుగారూ!" ఆదిత్య లోపలికి వెళ్ళాడు. అక్కడ దృశ్యం చూచి అక్కడే ఆగిపోయాడు. పడక కుర్చీలో నందనరావు కూర్చున్నాడు. అతని ముందు, అసహాయంగా నేలమీద కూలబడి ఉంది నీలిమ. ఆమెను తాకి క్రింద పడ్డాయనటానికి నిదర్శనంగా అక్కడ వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి.

నీలిమ నుదురు అద్దుకుంది.

"ఓ...నువ్వా" నందనరావు ముఖంలోని వికృత తత్వాన్ని చిరు నవ్వుతో జయించాలని చూచాడు. సాధ్యం కాలేదు. పక్షవాతముతో తీసు కుంటున్నా మనిషి అందంగా శుభ్రంగా కనిపించేవాడు. ఇప్పుడు ముఖంపై ఎముకలు తేలి అసలు మనిషి మరింత వికృతంగా తయారయ్యాడు.

"నేనేనండీ. నేను వస్తూనే వినకూడని మాట విన్నాను."

"అది...అది నిన్ను కాదు...ఆదిత్యా రా..." ప్రక్కన కుర్చీ చూపాడు. ఆ పరిస్థితి పరాయివాడి కంటపడినందుకు నీలిమ తల భూమి లోకి వంగి పోయింది. ఆమె అతడిని పలుకరించాలని కూడా మరిచిపోయి, గదిలోకి దూరింది.

పెద్దవాడు నిన్ను కాదు. అన్నాక ఏం వాదిస్తాడు? తను చెవులారా విన్నాడు. మాట్లాడక వెళ్ళి ప్రక్కన కూర్చున్నాడు.

"ఏమిటంకుల్ ఏమయింది?"

"డబ్బు అయిపోయిందని ఆ సన్యాసురాలు వెళ్ళి పుట్టపర్తిలో కూర్చుంది. ఈవిడను తిని కూర్చో అంటే ఏదో ఒకటి తెస్తుంది. దొంగ తనాలు చేస్తుంది..."

"అదేమిటంకుల్? నీలిమకు దొంగతనం చెయ్యాల్సిన అవసరం ఏముంది! పొరపాటు పడి ఉంటారు?"

"అది నిజమే, ఇంట్లో డబ్బు ఎక్కడికి పోతుంది."

"పనివాళ్ళు తీసి ఉండవచ్చు."

"ఏమో ! నాకు నమ్మకం కలగటంలేదు."

"మీ కూతుర్ని మీరు అనుమానిస్తున్నారా ?"

"నా కూతురు !..." అతను వికృతంగా నవ్వాడు.

"ఆర్థిక ఇబ్బందులుకూడా మనిషిని అసహాయుడిని చేస్తాయి అంకుల్ ! నీలిమను ఏదయినా చిన్న ఉద్యోగం చెయ్యమనండి."

"దానికెవడిస్తాడు ఉద్యోగం ! అదొక్కటే పని చెయ్యాలి. బ్రోతల్ హౌస్ పెట్టుకోవాలి." అన్నాడు కసిగా.

"అంకుల్ !" ఆశ్చర్యంగా చూచాడు.

"అదంతా ఎందుకు కాని, నీ పని యెలా ఉంది ?"

"చాలా బాపుంది అంకుల్, ఆత్మ, మనసు అనేవి లేకపోతే ఒక్క సంవత్సరంలో లక్షలకు, లక్షలు సంపాదించవచ్చు." అన్నాడు.

నందనరావు మాట్లాడలేదు

"డాక్టరుగారి ప్రోత్సాహమే లేకపోతే..."

"డాక్టరుగారా ! అవును అయన ఎవరికి ఏం కావాలో కనుక్కొని మరీ చేస్తారు." అన్నాడు వెటకారంగా. పని కుర్రాడిని పిలిపించి కాఫీ తెమ్మని చెప్పాడు.

"అంకుల్! నేనొకసారి నీలిమతో మాట్లాడతాను, అభ్యంతరమా !"

"నాకేం అభ్యంతరం..." అన్నాడు యెటో చూస్తూ.

"నీలూ!" అతను చేరవేసిన తలుపులు తోశాడు.

ఆమె జవాబుగా వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఛ...ఛ...ఏడుస్తారా ! ఇంతకంటే దారుణమైన పరిస్థితి ఎదురుకో లేదూ !" అన్నాడు మృదువుగా ఆమె భుజం తట్టి.



"పరిస్థితికి బాధ కాదు. నాన్న...ఎందుకిలా మారిపోయాడో అర్థం కావటంలేదు..." అన్నది.

అతను డ్రస్సింగ్ టేబుల్ వెతికి, దూది తీసుకుని, ఆమె నుదురు తుడిచాడు.

"అయొడిన్ లేదా ?"

"క్రింది అరలో ఉంది చూడు."

క్రింది అరలోని అయోడిన్ తీసుకుని, గాయంపై రుద్దాడు. "ఏది" అంటూ తల పట్టుకున్నాడు.

"అమ్మో!..." కెవ్వుమన్నది. అతను అదిరిపడ్డాడు.

"ఏది చూడనియ్యి..." తలనిండా బొప్పిలే, వీపుమీద బెల్ట్ దెబ్బలు అట్టకట్టాయి.

"ఏమిటి నీలూ !"

"నా దురదృష్టం ఆదిత్యా !"

"నీలూ !" అతని కళ్ళు చెమర్చాయి.

"నేను బండబారి పోయాను" అన్నది బాధగా నుదురు రాసుకుంటూ.

"నువ్వు, నువ్విక్కడ ఒక్క క్షణం ఉండవద్దు నీలూ ! వెళ్దాం పద."

"ఎక్కడికి ?"

"నా వెంట పద. నా భార్యగా..." అన్నాడు ఆవేశంగా.

"ఇద్దరికీ ఠికానా లేదు."

"కొందరు అన్ని హంగులతో జీవితం ప్రారంభిస్తారు. మరికొందరు ఏమీ లేకనే ప్రారంభిస్తారు మనమలాగే ప్రారంభిద్దాం నీలూ !"

"ఆదిత్యా !" ఆవేశంగా అంటున్న అతని హృదయంలో తలదాచుకుందామె.

"చాలు ఆదిత్యా ! హాయిగా చచ్చిపోవటానికీ ధైర్యం చాలు."

"ధైర్యం కాదు...నిజం నీలూ! నా జీవితంలో రెండేరెండు కోరికలు మిగిలాయి. నిన్ను నాదాన్ని చేసుకుని యెవరూ కనీ వినీ ఎరుగనంతగా ప్రేమించాలి, నీకు సుఖమయ జీవితం అందించాలి. ఇక, నాపై నేరం మోపిన వారిని పట్టుకుని వారి అంతు తేల్చాలి" అన్నాడు.

ఆమె 'సాధ్యమా' అన్నట్టు చూచింది.

"పాతికేళ్ళు ఒక ఎత్తు! ఈ సంవత్సరం ఒక ఎత్తు నీలూ! చాలినంత అనుభవం గడించాను" అన్నాడు.

అతని భుజంపై తల వాల్చింది.

"ఆదిత్యా ! ఏమో ! నేను మాత్రం వయసుకంటే ముందుగా పండిపోయాను, నాకు...నాకు విశ్రాంతి కావాలి."

అతనామె నుదురు చుంబించాడు. మెల్లగా నుదుట పడిన వెంట్రుకలు సవరించాడు.

"మన పెళ్ళి విషయము డాక్టరుగారితో చెప్పాలి నీలూ ."

"నా గురించి ఆలోచించే స్థితిలో లేను. అలసిపోయాను. ఏం చేసినా నీ ఇష్టం." అతను ఆమె పరిస్థితి అర్థం చేసుకున్నాడు. నందనరావే కాదు, ఆమె కూడా చిక్కిశల్యమయింది.

"నీలూ...నువ్వు ధైర్యంగా ఉండాలి."

ఆమె జవాబుగా అతని అరచేయి చుంబించింది.

"వస్తాను..." అతను బయటికి వచ్చేసరికి నందనరావ్ గంభీరంగా ఉన్నాడు. అనవసరంగా తగాదా ఎందుకని అతనితో పెళ్ళివిషయం చెప్పాలనే నిశ్చయించాడు.

"అంకుల్ !"

"చెప్పు."

"నేను, నీలు పెళ్ళి చేసుకుందాం అనుకున్నాం."



"ఆదిత్యా ! ఒకమాట చెప్పేదా ! నువ్వు, నువ్వు మనిషిగా బ్రతకాలంటే పెళ్ళి విషయం మరిచిపో - కాదు ఈ నీలిమను మరిచిపో. నీకు తగినవారెవరు దొరికినా చేసుకో."

"అంకుల్"

"అవును ఆదిత్యా ! వీళ్ళంతా వ్యభిచారులు. నిలకడలేనివారు. నా మాట విను. కమలాకర్ కొడుకువు నీకు ద్రోహం చెయ్యలేను."

"కన్న కూతురు..."

"యీ ప్రపంచంలో నా కూతురు, నా వస్తువు అనుకోవటం మూర్ఖత్వం."

"ప్రతి తండ్రి ఇలాంటి వేదాంతం చెబితే..." నవ్వాడు ఆదిత్య.

"తండ్రి..." అతని ముఖం కండరాలు బిగుసుకున్నాయి.

"చూడండి, కారణాలు ఏవయినా కావచ్చు, ఆమె తల్లిని మీరు అసహ్యించుకుంటున్నారు. ఆమె జీవితం నాశనము చెయ్యాలని చూడకండి. యెవరు ఏమనుకున్నా, నీలును నేను పెళ్ళిచేసుకుంటాను." అన్నాడు ఆవేశంగా.

"అయితే... నీ ఇష్టం..." అన్నాడు పళ్ళు పట, పట కొరుకుతూ. ఆదిత్య చర, చర బయటికి వచ్చాడు.

## 22

**ఆదిత్య,** నీలిమల పెళ్ళి నిరాడంబరంగా, నర్సింగ్‌హోమ్ పైనున్న కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. 'నాకు ఆశీర్వదించే హక్కు ఉన్నదో, లేదో, పెళ్ళికి వస్తే నీకు, నీలుకు వ్యథే. నీ ఇష్టప్రకారం పెళ్ళి చెయ్యి శివా" అంటూ ఉత్తరం రాసింది ముకుందాదేవి.

శివాజీరావు నిట్టూర్చాడు.

నీలిమను తీసుకువెళ్ళి చీరలు కొనుక్కోమ్మంటే ఆమె మొహమాట పడుతూ నాలుగయిదే తీసుకున్నది. ఆదిత్యకు కొనిచ్చాడు. ఒక బంగారు గొలుసు, ఉంగరం కొన్నాడు. గాజులు ఆమె కున్నాయి.

జిల్లా కలెక్టరు ఆనాటి పెళ్ళికి ఆధ్వర్యం వహించాడు.

ఇద్దరిచేత ప్రమాణాలు చేయించాడు. నీలిమ మనసు మహాసాగర మయినా, ఆమె అతిథుల కోసం, నవ్వుతూ కూర్చుంది. తనకు, తల్లి, తండ్రి ఉండికూడా అనాథగా పెళ్ళి చేసుకుంటున్నది.

మెల్లగా, యెవరికీ కనిపించకుండా, ఆదిత్య ఆమె చెయ్యి పట్టు కున్నాడు. ఆ చేతి స్పర్శలో ఎన్నో ఓదార్పులు, నేనున్నానని ధైర్యం చెప్పినట్టు అనిపించింది. అంతకుముందే శివాజీ పట్ల అసహ్యం పెంచుకో పద్దని అర్థించాడు. అందుకే చిరునవ్వుతో కూర్చుంది.

ఆమె తెల్ల పట్టుచీరకు మరూన్ రంగు అంచు ఉన్నది కట్టుకుంది. తెల్ల జాకెట్టు వేసుకున్నది. అంతకంటే తెల్లని మల్లెలు ముడుచుకున్నది. నిరాడంబరంగా, అందంగా కనిపించింది.

ఆదిత్య కూడా తెల్లని చొక్కా, ప్యాంటు వేసుకున్నాడు. ఇద్దరూ ఒకరికోసము ఒకరు పుట్టినట్టున్నారు.

పెళ్ళి సందర్భంగా మాట్లాడిన వారంతా అదే మాట అన్నారు. ఆ తరువాత శివాజీ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

"మా ఇంట్లో మీరుంటే ఇంట్లోని నిశ్శబ్దం పారిపోతుంది, మా ఇంటికే రండి" అని పార్థసారథి ఆహ్వానించాడు. నీలిమ నిరాకరించ బోయింది.

"మీరంతగా చెప్పాలా తాతయ్యా." అన్నాడు ఆదిత్య.

శివాజీ ఇంట్లో పై గదులు వారికిచ్చారు.

"వెళ్ళి ఒక్కసారి అంకుల్‌కు నమస్కారం చేసివద్దాం నీలూ !"



"ఆయన తిరస్కారం యీ శుభసందర్భంలో భరించలేను. సారీ..." అన్నది. అతను మాట్లాడలేదు. భుజం తట్టాడు.

"దాంపత్య జీవితం మొదలు పెట్టిన రోజునే నీ మాట తిరస్క రించటం బాధగా ఉన్నది."

"నీ అభిప్రాయం చెప్పావు. నాకయితే యెవరూ లేరు..."

"నాకు అందరూ ఉన్నారు, తల్లివి, తండ్రివి, తోబుట్టువి అన్నీ నువ్వే. కొందరి జీవితాలు అందరిలా హాయిగా గడిచిపోవు. మనము, మన కోసం బ్రతుకుదాం" అన్నది. ఆమె తల్లి తండ్రులపట్ల ఎంత నిరసన పెంచుకుందో అర్థం అయింది.

మారు మాట్లాడక ఆమె వీపు నిమిరాడు. తన సామాన్లు ఆ గదిలో సర్దింది నీలిమ.

"రేపు సర్దుకోవచ్చు. రా నీలూ !"

"నాకు వస్తువులు చిందర వందరగా, చీదరగా ఉంటే నచ్చదు" అన్నది జరీచీర విప్పేసి మామూలు చీర కట్టుకుంది.

"అదేమిటి సినిమాల్లో మొదటిరాత్రి ఖరీదయిన చీర, మంచంనిండా పూలు ఉంటాయి" అతను డ్రస్సు మార్చుకుని, లుంగీ కట్టుకున్నాడు.

"సినిమాలో ఉండే డ్యూయెట్లు, పట్టు చీరలు నిజజీవితంలో ఉన్నాయా !" నవ్వుతూ వచ్చి అతని ప్రక్కన కూర్చుంది.

"నన్ను అన్నావు, నువ్వేమిటీ అవతారం ! హిందీ సినిమా అయితే జరీ బుటాల శేర్వాని చుడీదారీ పైజమా వేసుకుంటారు. తెలుగు సినిమాలో అయితే లాల్చీ, ధోవతి..." నవ్వింది.

"అవునవును లడ్లు, పండ్లు కూడా కావాలి. పాట పాడుదామా !"

"పాపం ! పార్థసారథి తాతయ్య పోలీసులకు ఫోన్ చెయ్యాలి. నిదుర వస్తున్నది" ఆమె దిండు పైకి వాలిపోయింది. ఆమె ప్రక్కనే

ఒరిగాడు. ఆమెను చేరుపగా వెళ్ళాలంటే కాస్త భయంగా, కాస్త గమ్మత్తుగా ఉంది.

"నీలూ..."

"ఊఁ..." ఆమె చనువుగా అతని చేతిపై తల ఆన్చింది.

మెల్లగా అతని చేయి ఆమె చుట్టూ పడింది. ఆమె కళ్ళు మూసుకుంది ఆమె కళ్ళు చుంబించాడు.

రాత్రి పన్నెండు గంటలు దాటి ఉంటాయి. అతని చేతులలో హాయిగా నిదరపోతున్న నీలిమకు తలుపు శబ్దం వినిపించింది.

యెవరబ్బా అనుకుంటూ, ఆదిత్య చేయి తొలగించింది.

మళ్ళీ కాస్త గట్టిగా కొట్టారు.

"ఆఁ...వస్తున్నాను" లైటు వేసి, గబగబ చీర కట్టుకుని, వెంట్రుకలు సవరించుకున్నది. వెళ్ళి తలుపు తీసింది.

పార్థసారథి నిల్చున్నాడు.

"నీలూ ! మీ నాన్నగారు స్లీపింగ్ టాబ్లెట్లు మింగారట. పరిస్థితి ప్రమాదంగా ఉందని నర్సింగ్‌హోమ్‌లో అద్దెకున్నవారు చేర్చారు. శివాజి వెళ్ళాడు. మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యొద్దనుకున్నాను కాని, ఇప్పుడే శివాజి ఫోన్ చేశాడు. అతని పరిస్థితి అంత బాగా లేదుట" అన్నాడు.

"ఓ మై గాడ్ !" అన్నది. ఆమె గదిలోకి తొంగి చూచింది. ఆదిత్య హాయిగా, ఈ ప్రపంచంతో సంబంధం లేనట్టు నిదరపోతున్నాడు

"నేను ఆస్పత్రికి వెళ్తాను. ఆదిత్యను లేపకు తాతయ్యా !"

"నేను డ్రాప్ చేస్తాను పదమ్మా" అన్నాడు.

ఆమె మెల్లగా తలుపులు చేరవేసి, క్రిందికి వచ్చింది. పార్థసారథి ఆమెను నర్సింగ్‌హోమ్‌కు తీసుకు వెళ్ళాడు.

అప్పుడే శివాజి యెదురు వచ్చాడు, అతని ముఖం విచారంగా ఉంది.



"సారీ నీలూ ! ఛాన్సెస్ ఆర్ వెరి పూర్" అన్నాడు.

ఆమె వెళ్ళి "నాన్నా" అంటూ అతని హృదయంపై తల పెట్టింది. ఆమె చిన్నప్పుడు అతను లాలించిన తీరు, అన్నీ గుర్తుకు వచ్చాయి.

"ఈ ఉత్తరం పోలీసులకు ఇవ్వు" అన్నారమ్మా అంటూ పనివాడు ఉత్తరం ఇచ్చాడు.

"నా మరణం నాకు శాంతి నివ్వాలని నేను నిదుర మాత్రలు మింగాను. నా మరణానికి ఎవరూ బాధ్యులు కారు. నా ఒంటరితనం, నా అసహాయత నన్ను కృంగదీసింది. నా కెవరూలేరు."

"నాన్నా !...యెందుకు...యెందుకు నాపై ఇంత నిర్దయ పెంచుకున్నావు !" బావురుమన్నది నీలిమ. కళ్ళు తుడుచుకుని మళ్ళీ చదివింది.

"నా భార్య ఉన్నా నాతో విడిపోయింది. ఆమెకు, నాకు యెలాంటి సంబంధంలేదు. నాకు మిగిలిన ఆస్తి, ఈ మేడ ఒక్కటే. అది ప్రభుత్వం స్వాధీన పరుచుకుని, తల్లి, తండ్రిలేని అనాధలకు ఆశ్రమమో, బిడ్డలు లేని నాలాంటి వృద్ధులకో సంక్షేమ హాస్టలుగా మార్చాలని నా కోరిక..."

నీలిమ హృదయంలో చెయ్యిపెట్టి కెలికినట్టయింది.

'బిడ్డలు లేని' అన్నచోట ఆమె దృష్టి నిలిచిపోయింది. నా భార్య అన్న మనిషికి నా బిడ్డ అని చెప్పుకోలేక పోయాడా! అంతా తన దురదృష్టం. దానికి ఏం చేయలేదు.

"నా ఇష్టపూర్వకంగా రాసి, లాయర్ దగ్గర వీలునామా ఉంచాను. ఈ ఆఖరు దశలో నన్ను కనిపెట్టుకున్న పనివారిద్దరికి నా బట్టలు, నా గడియారం ఇస్తే, నా ఆత్మ సంతోషిస్తుంది..."

మరిచిపోయి కూడా తన పేరెత్తలేదు తండ్రి. యెంత కాఠిన్యము ? చాలాసేపు అలా కూర్చుండిపోయింది.

"ఏం రాసిండ్రమ్మా !" పని కుర్రవాడు అడిగాడు.

"తన చావుకు తనే కారణం అని రాశాడు" అన్నది కళ్ళు తుడుచుకుని.

"పాపం ! ఆరుగంటలదాకా కబుర్లు చెప్పారమ్మా, ఆరుగంటలకు పడుకుంటానని గదిలోకి తీసుకువెళ్ళమన్నారు. తీసుకువెళ్ళాక, ఈ ఉత్తరం ఇచ్చారు. నేను పోలీసుల కెందుకయ్యా అంటూ అడగలేదు. పక్కింట్లో టీ. వి. చూడాలనుకున్నాను. తొందరగ పన్లు ముగించుకుందామని వెళ్ళిపోయాను."

"మాత్రలు మింగినట్టు ఎప్పుడు చూచావ్ ?"

"టి. వి. చూచి వచ్చి, భోజనంచేసి పడుకున్నాను. రోజూ తెల్లవారేసరికి రెండుసార్లు లేపేవాడు. ఆ సమయానికి టక్కున మేల్కొన్నాను. వెళ్ళి అయ్యా...అయ్యా ! అని యెంత పిలిచినా పలుకలేదు. భయం వేసింది. వెళ్ళి శ్రీసత్యమ్మను లేపాను. ఆమె, ఆమె పెనిమిటి వచ్చి చూచారు. పక్కనే నిదురగోలీల ఖాళీసీసా ఉందట. టాక్సీకి పంపారు. అందరం కల్సి నర్సింగ్‌హోమ్‌కు తెచ్చినాము" అన్నాడు.

"ఎంతపని చేశావు నాన్నా !" మరోసారి అతని హృదయంపై తలవాల్చింది. చాలా బలహీనంగా కొట్టుకుంటుంది గుండె. అతని జేబులో కాగితాలు, ఒత్తుగా ఆమె చెంపకు గుచ్చుకున్నాయి. ఆమె లేచి కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

"చి॥సౌ॥ నీలిమకు" అన్న కవరు కనిపించింది. తండ్రి తన పేరెత్తలేదని బాధపడింది. కాని, తనకు ఉత్తరం రాసేడా ! అతను ఎడమ చేత్తో కెలికినట్టు రాస్తాడు. ఆ అక్షరాలు కుదురుగా ఉన్నాయి. ఆదుర్దాగా విప్పి చూచింది.

అది తల్లి ఉత్తరం. అమ్మ నాకు ఉత్తరం రాసిందా ! తిప్పి చూసింది. నలిగి శిథిలావస్థలో వున్నది. ఆత్రంగా విప్పింది.



చి॥ నీలూకి,

అమ్మ ఆశీస్సులు

నీలూ ! నువ్వు నన్ను డాక్టరంకుల్‌తో చూచి నాపై అంతులేని అసహ్యం పెంచుకున్నావని తెలుసు. నీలూ ! శాంతంగా, నీ తల్లి చరిత్రగా కాక, ఒక స్త్రీగాథ, బాధా పూరితమైన వ్యథతో కూడిన గాథ అర్థంచేసుకో. మొదట పూర్తిగా చదువు. ఆ తరువాత నీకు అసహ్యంవేస్తే నేనేం చేయలేను. మనిషిగా నీముందు తిరుగలేక దూరంగా వెళ్ళిపోతున్నాను. నాకక్కడ సుఖశాంతులు దొరుకుతాయని కాదు, నీకు ముఖం చూపించలేక.

నీలూ ! నేనొక మామూలు కుటుంబంలో పుట్టి, పడరానిపాట్లు పడ్డాను. నాకున్న ధనం, వరం, ఏదయినా అనుకో, అందమే. ఆ అందాన్ని చూచి, శ్రీ సంపదరావుగారు నన్ను పెళ్ళి చేసుకున్నారు. వారు బాగా ఆస్తిపరులకి, ఏకయిక పుత్రుడు. వారికి పిల్లలంటే ఆపేక్ష. వారి తలిదండ్రులకి ఒక్కరే కొడుకు. కాని ఆ కొడుక్కు చాలామంది పిల్లలు పుట్టాలని వారి ఆకాంక్ష. నేనుకూడా వారి అభీష్టం నెరవేరితే చాలు అనుకున్నాను. ఎందుకంటే కట్నకానుకలు, లాంఛనాలు లేవని నిరాశపడేవారికి జవాబు చెప్పాలనుకున్నాను. దురదృష్టం అక్కడా నావెంటే ఉన్నది. రెండు సంవత్సరాలు తిరిగినా పిల్లలు కాలేదు.

సంపదరావుగారి తల్లి వ్రతాలు, పూజలు, ఉపవాసాలు మొదలు పెట్టించింది. కనిపించిన మంత్రగాడికల్లా చూపింది. వారికి డబ్బు కావాలి. ఏదో ఒకటి చెప్పేవారు.

అమ్మాయిని శని పీడిస్తున్నదని కొందరు చెప్పారు.

కాదు గర్భదోషం వుందని యజ్ఞం చేయించారు. అరటి ముఖం చూచి, స్నానం చేసింది. అరటి చెట్టుకు ప్రదక్షిణం చేయాలన్నారు.

మర్రిచెట్టుకు ప్రదక్షిణంచేసి, మర్రిపాలు త్రాగాలన్నారు.

నా కాపురం నిలబెట్టుకోవాలని ఏది చెబితే అది చేశాను. లాభం కని

పించలేదు. స్త్రీ కాపురం నిలబెట్టుకోవటాని కిన్నిపాట్లు పడాలా – అని జీవితంపై విరక్తి కలిగింది. రెండు మూడేళ్ళు గడిచేసరికి నందనరావులో కూడా మార్పు కన్పించింది. అతను జీవితంలో ఏదో మార్పు కోరుకుంటున్నారు.

"ముకుందా ! ఆ ఎదురింటి పిల్లను చూడు..." అనేవారు. వారి చిలిపి చేష్టలకు మైమరిచిపోయేవారు. అప్పుడే నా చిన్నప్పటి స్నేహితురాలు సావిత్రి వచ్చింది. దాని కొడుక్కు అనారోగ్యం, బాగుచేయించుకోవాలని మనింట్లో ఉన్నది. వారం రోజులలో నా అవస్త గమనించింది.

"అన్నయ్యగారూ ఈ మంత్ర తంత్రాలకంటే డాక్టరును చూస్తే మంచిదేమో..." అని సలహా ఇచ్చింది. ఇద్దరం డాక్టరును చూచాం.

"ఇతనికి పిల్లలు పుట్టరు..." అని చెప్పాడు డాక్టరు.

"ఒరేయ్ అబ్బాయి ! తనను తన్ని తరిమేస్తామని, నీ భార్య వేసిన ఎత్తురా ఇది !" అని నందనరావు తల్లి ఇంత ఎత్తున ఎగిరిపడింది.

డాక్టరు నాపట్ల సానుభూతిగా మాట్లాడటం వారికి నచ్చలేదు.

"నేను పిల్లలకోసం మళ్ళీ పెళ్ళి చేసుకున్నా నిన్ను అన్యాయం చేయను." అని హామీ ఇచ్చారు.

నాకు తలపై పిడుగు పడినట్టు అయింది. ఏం చేయలేకపోయాను. నందనరావు నామాట నమ్మరని అర్థం అయింది.

అప్పుడే సావిత్రి రమ్మని రాసింది. ఆయనకు వ్యాపారం పనికూడా ఉందట.

ఇద్దరం బొంబాయి వెళ్ళేము. అక్కడ పరీక్ష జరిగింది. అదే రిపోర్ట్ వచ్చింది.

"మీ ఆయనకు పిల్లలు అయ్యే యోగం లేదమ్మా ! నీకే జబ్బు లేదు." అని భారతదేశంలో ఒకరుగా ఎన్నతగిన గైనకాలజిస్టు చెప్పింది. కాని ఆయన నమ్మరు. సావిత్రి ఏదో చేసిందని అనుమానిస్తారు.

"మీకంతగా కావాలని ఉంటే ఇతర పద్ధతులున్నాయి. మనము



పవిత్రంగా పూజించే భారతంలోనే కుంతి పుత్రులకోసం..." అంటూ సలహా ఇచ్చింది.

దిగాలుగా బయటికి వచ్చాను. హిపోక్రసీతో బ్రతుకుతున్న సమాజం ఇది. కుంతి కన్యగా తల్లి అయిందని ఇప్పటికి సానుభూతి చూపుతారు. అదే కలియుగంలో ఒక కన్య తల్లి అయితే కాకుల్లా పొడుస్తారు. కుంతీదేవి యమధర్మరాజు, ఇంద్రుడులాంటి పెద్దల నాశ్రయించిన ఘట్టం ఎంత రసవత్తరంగా వర్ణిస్తారో, ఈనాడు స్త్రీ అలాంటి పనిచేస్తే అంత దారుణంగా వెలివేస్తారు.

ఇంటికి రాగానే నందనరావు అమ్మగారు –

"రిపోర్ట్ ఏది !" అన్నారు.

"రేపు రమ్మన్నారు." అప్రయత్నంగా అబద్ధం ఆడాను.

"సరే ! నువ్వు నీ చెకప్ పూర్తి చేసుకో. నేను మారిషస్ వెళ్ళాల్సిన పని వుంది." అని ఆయన బిజినెస్ టూర్ వెళ్ళిపోయారు.

సావిత్రి సలహా ఇచ్చింది.

"అసలు విషయం చెప్పినా నమ్మరు. డాక్టరమ్మ అన్న మాటలు విన్నావుగా" అన్నది. నాకు మతిపోయింది.

"నన్నేం చేయమంటావు ? ఆయనతప్ప నాకు పరిచయస్తులులేరు" అన్నాను.

"పరిచయస్తులతో ప్రమాదం." అన్నది ఆలోచిస్తూ.

"ఏం చేయాలి?" అన్నాను.

"నువ్వు త్వరగా తయారవ్వు. ఒకచోటికి వెళ్దాం." అన్నది. తయారయ్యాను. ఇద్దరం టాక్సీలో ఒక బంగళాకు వెళ్ళాం.

"ముకుందా! ఈవిడ రూబీ అని సోషియల్ వర్కర్. ఒకటి రెండు బ్యూటీ క్లినిక్‌లు నడుపుతుంది." అని పరిచయం చేసింది.

నా చరిత్ర అంతా రూబీకి చెప్పింది. రూబీ చిన్నగా మందహాసం చేసింది.

"మీ సమస్యలు నాకు చెప్పి నిశ్చింతగా ఉండండి. సాయంత్రం ఇక్కడికి రా. పరాయి పురుషుడు అని భయపడవద్దు, మన దేశంలో స్త్రీ పురుషులు పరిచయమయ్యేది మొదటి సమాగంలో." అన్నది. ఇంగ్లీషులో. నేను జంకుతూ చూచాను.

"నో ఫియర్ అయామ్ హియర్. ఇక్కడ మదమెక్కి మగువలను పాడుచేసే యువకులుండరు. రోగాలతో రొష్టులతో నీరసించిన దుష్టులూ ఉండరు. అంతా జెంట్స్. బ్రతుకుతెరువు కోసం, తమ చదువుల కోసం పరస్పరం సహకరించేవారే ఉంటారు" అన్నది. ఆమెకో అయిదు వందలు అడ్వాన్స్‌గా ఇచ్చి బయటికి వచ్చేము. నాకెందుకో భయం వేసింది.

"చూడు ముకుందా! నువ్వు దబ్బుకాశించి ఒళ్ళు కొవ్వి ఈ పని చేయలేదు, అవసరం. నీ భర్త నీ మాట నమ్మడు. పురుషాహంకారంతో మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు. అప్పుడు ఒరిగేది ఏమీ ఉండదు. నిత్యం కీచులాటలు, పోట్లాటలు, గొడవలు. నువ్వు కాస్త ధైర్యం చెయ్యి." అన్నది సావిత్రి. చెయ్యక తప్పదు. గతం తలుచుకుంటే ఆ జీవితం ఎవరికి వద్దు అనిపిస్తుంది.

రూబీ చెప్పినట్టుగా ఆమె ఇంటికి వెళ్ళాను. ఆమె ఓ గదిలోకి తీసుకు వెళ్ళింది. అక్కడ ఓ యువకుడు కూర్చుని చదువుకుంటున్నాడు.

"మిస్టర్ చక్రీ! ఈమె మిసెస్ దేవీప్రియ. ఈ సంవత్సరం నీ చదువు ఖర్చు భరిస్తుంది. పిల్లలు లేరు. భర్త మళ్ళీ పెళ్ళి చేసుకుంటానని బెదిరిస్తున్నాడట... దేవీ మీరు మాట్లాడుతుండండి... వస్తాను." అని వెళ్ళిపోయింది, ఆమె రాదని తెలుసు.

"టీ తీసుకుంటారా!" అతని కంఠంలోని ఆప్యాయతకు కరి



...యాను. నాలో సన్నగా వణుకు ప్రారంభం అయింది. నాకంటే చిన్న ...రాడు.

"వద్దు" అన్నాను మొహమాటంగా.

"ఇది టీ టైమ్ కాదని తెలుసు. అయినా పాలు, కూల్‌డ్రింక్ ఇచ్చే ...పతలేదు" అన్నాడు. మా సంభాషణ హిందీలో జరిగింది.

నా ఉనికి యెవరికి తెలియరాదని కాబోలు, రూబీ నన్ను దేవిప్రియగా ...చయం చేసింది అనుకున్నాను.

అరగంటలో ఎంతో సన్నిహితులం అయినట్టు, మా అనుబంధం ...ఒక్క జన్మది కాదన్నట్టు అనిపించింది.

అతనితో వారంరోజులు గడిపాను. అతడిని విడిచి వెళ్ళాలంటే నాకు ...స్కరించలేదు.

"రైలు ప్రయాణంలో ఎందరో సన్నిహితులవుతారు. వారందరిని ...పెట్టుకుంటామా!" అని సావిత్రి మందలించింది.

నందనరావుగారు మారిషస్ టూర్‌నుండి తిరిగి వచ్చారు.

"అన్నయ్యగారూ! మీకు పిల్లలు అవుతారట. కాని మీరు రాక ...యినా, అప్పుడప్పుడు ముకుంద డాక్టరు దగ్గరకు రావలసి ఉంటుంది" ...న్నది, సావిత్రి.

"అలాగే వస్తుందమ్మా!" అన్నారు.

హైదాబాద్ వచ్చినా నా మనసు అంతా చక్రధర్ చుట్టే తిరిగింది. ...నను నిజంగా... యెలా చెప్పను. చెప్పుకోలేను. అంతగా ప్రభావితురాలిని ...డు.

డాక్టరు రమ్మన్నదని నెలకొకసారి వెళ్ళేదాన్ని.

డాక్టరు నేను గర్భవతిని అని చెప్పింది. ఇంట్లోవారి ఆనందానికి ...అంతులేదు.

నందనరావుగారు పొంగిపోయారు.

"డాక్టర్లంతా ఏదో మొనగాళ్ళని భ్రమపడ్డావు చూచావుగా..." అన్నారు.

అసలు విషయం ఆయనకు తెలిస్తే... నన్ను చంపి, తనూ ఆత్మహత్య చేసుకుంటారు. ఒక్కసారి చక్రధర్‌ను కలవాలి. ధన్యవాదాలు చెప్పాలనుకున్నాను.

నందనరావుతో డాక్టరును కలుస్తానని చెప్పాను. తనూ వచ్చి ఆవిడకు కృతజ్ఞతలు చెబుతానన్నాడు.

"మీరు వ్యాపారం వదిలి రావద్దు" అన్నాను. అతడితో ఎన్నో అబద్ధాలు ఆడి, బొంబాయి ప్రయాణం అయ్యాను. రూబీని కలుసుకున్నాను.

"చక్రధర్ లేడా ?" అన్నాను ఆదుర్దాగా.

"లేడు. అయినా అతనితో ఏం పని ?" అన్నది. తెల్లబోయాను. నా అవస్థ గమనించిన రూబీ సన్నగా నవ్వింది.

"మీరు అతనికి ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నారు అవునా! అతను మిమ్మల్ని ప్రేమించి ఆరాధించి తిరుగలేదు. అవసరం, పరస్పర సహకారం అంతే. ఇంకా అనుబంధాలు పెంచుకోవటం అర్థరహితం" అన్నది.

"కావచ్చు...కాని..."

"నాకు తెలుసు. అతను కొందరికి మానసిక స్థితి మెరుగు చెయ్యాలని, మరికొందరితో నపుంసకుడయిన భర్త ఇవ్వలేని సుఖాలు ఇవ్వాలని తిరిగాడు. అందరిని గుర్తు పెట్టుకుంటే జీవితం ఏముంది! ఫర్ గెట్ ఇట్..." అని భుజం తట్టింది. నాకు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. అవును అతను ఎందరితోనో తిరిగాడు. అందరినీ గుర్తు పెట్టుకుంటే యెలా!

ప్రేమ పేరుతో పబ్బం గడుపుకుంటారు కొందరు. అవసరం తీరగానే అవతల పడతారు. ఇది అలాంటి కేసు కాదు.



పెళ్ళిచేసుకుని ఏదో కారణంగా విడిచిపెడతారు మరికొందరు. అలాంటి కేసు కాదు.

అతి విచిత్రమైన కేసు. భారమైన హృదయంతో వెనుతిరిగాను.

"దేవీ! నాకు పెద్ద డాక్టరునయి, నాలాంటి నిరాశ్రయులను ఆదుకోవాలని అనిపిస్తుంది."

"దేవీ! నీ మెడ శంఖంలా ఉంది" అని చుంబించేవాడు.

అతని ఒక్కొక్క మాట తేనెల ఊట! మరిచిపోవాలి తప్పదు.

"దేవీ! విదేశాలకు వెళ్ళి ఇంకా కొత్త విషయాలు కనుక్కోవాలని ఉంది. యెలా ?" అనేవాడు. అతని ఆర్థిక ఇబ్బంది నాకు తెలుసు.

నా దగ్గరున్న డబ్బు రూబీ చేతిలో పెట్టాను.

"మిసెస్ రూబీ! చక్రికి విదేశాలలో చదువాలని ఉంది. ఈ డబ్బు అతనికి అందజేయవా!" అన్నాను కన్నీటితో.

"ష్యూర్!" అన్నది. డబ్బిచ్చి, భారంగా తిరిగి వచ్చాను. ఇంట్లో అందరూ ఆనందడోలికలలో ఊగులాడుతున్నారు. నాకు మాత్రం అతనొక్కసారి కనిపిస్తే బాగుండును అనిపిస్తుంది.

అలా ఎదురు చూస్తూండగానే నువ్వు పుట్టావు. వంశోద్ధారకుడు కావాలనుకుంటే మహాలక్ష్మి పుట్టింది. ఈసారి కొడుకును కనాలమ్మాయ్ అన్నారు. నవ్వి ఊరుకున్నాను.

"వాళ్ళ మాటలకేలేం ముకుందా! మనిద్దరి ప్రేమ చిహ్నం పాప. ఏ పాపయితేనేం!" నందనరావుగారు నిన్ను అపురూపంగా చూచేవారు. నా హృదయం కలవరపడేది. నిజం చెప్పి భారం దింపుకుందాం అనిపించింది. కాని నిజము చెప్పిన మరుక్షణం, ఏమవుతుందో నాకు తెలుసు. ఒకనాడు ధైర్యంచేసి రూబీ అడ్రసుకు చక్రధర్ పేరున ఉత్తరం రాశాను. జవాబు లేదు. నీకు రెండు సంవత్సరాలు వచ్చాయి. మళ్ళీ పెద్దవారి ఆరాటం

పారంభం అయింది. వారికి జీవితంలో మరే ధ్యేయం లేదు. పిల్లలు తప్ప
న్నట్టు ప్రవర్తించారు.

ఏం చేయాలో తోచలేదు. అప్పుడే సావిత్రి భర్తతో విదేశాలకు
ళ్ళింది. వెళ్తూ నీకు ఖరీదయిన బహుమతులు ఇచ్చింది. 'మా కోడలు'
న్నది. అదో అపూర్వమైన అనుభూతి.

"మా ఇంటికి మీ అబ్బాయే రావాలి" అన్నాడు నందనరావుగారు.
నందంగా వారిని సాగనంపాను.

ఆ రోజు నిన్నెత్తుకొని నందనరావుగారి కోసం చూస్తున్నాను.
యన వ్యాపార నిమిత్తం వేరే ఊరు వెళ్లారు. రాగానే యెదురుగా నీవు
నిపించాలని ఆయన తపన. అందుకే నిన్ను తీసుకుని నిల్చున్నాను.
్రైవర్ ఒంటినిండా గాయాలతో వచ్చాడు.

"అమ్మా...అయ్యగార్కి యాక్సిడెంటు..." అన్నాడు. కుప్పలా
ూలిపోయాను. తెలిసిన వారి సహాయంతో ఆయనను ఆస్పత్రిలో చేర్చాను.
కవైపు పూర్తిగా పడిపోయింది. ఇంట్లోని నగదు, ఖరీదయిన వస్తువులు,
న్నీ ఆయన వైద్యం కోసం కరిగించాను. తిరుగరాని చోట్ల తిరిగాను.
ంత్రాలు, తంత్రాలు, మొక్కుబడులు అన్నీ అయ్యాయి. ఆయన స్థితి
ూరలేదు. ఆస్తి అంతా కరిగిపోయింది.

నందనరావు తల్లి పోయింది. అసహాయంగా నువ్వు, నందనరావు,
ేను మిగిలాము.

ఒక భాగం అద్దెకిచ్చినా రెండు పూటలు తినటానికి సరిపోలేదు. ఏం
ేయాలో తెలియలేదు. నా ప్రాణం, నాకు జీవితంలో చేదు కాదు మధురిమ
ూడా ఉంటుందని తెలిపిన వ్యక్తి చక్రధర్. అతని తీపి గుర్తువు నీవు.
న్ను పెంచాలి. అపురూపంగా పెంచాలి. అదే నా ధ్యేయం! ఏం
ేయాలి! నా చదువుకు వచ్చే ఉద్యోగం చాలా తక్కువ. చిన్న చిన్న



ఉద్యోగాలకు వెళ్తే అక్కడ కాస్త క్రింది తరగతి జనం ఉంటారు. వారి
మనసుల్లో ఏం లేకపోయినా, వెకిలిగా మాట్లాడతారు.

ఒక బీడీ ఫ్యాక్టరీలో చేశాను. ఆ వాతావరణంలో అయిదు నిమిషాలు
ఉండలేకపోయాను. బయటికి వచ్చాను. ఫారిన్‌లో పిల్లలను చూచుకున్నా
బోలెడు సంపాదించ వచ్చట. సావిత్రికి రాశాను.

"నందన్నయ్యను వదిలి వస్తే నీకు స్పాన్సర్ చేస్తాను" అన్నది.
ఈ విషయం నందనరావుతో ప్రస్తావించాను.

"ముకుందా! నువ్వు నీలును తీసుకుని వెళ్తాననుకుంటే, దాని చేతు
లతో ఇంత విషం ఇప్పించు. అది లేకుండా బ్రతుకలేను" అన్నారు. ఏం
చేయాలో తోచలేదు.

ఒకొక్కసారి ఆయన మొండికేసి, మందు త్రాగనంటే నిన్ను
పంపేదాన్ని. నీ ముఖం చూచి త్రాగేవారు.

"ఎందుకు బ్రతకాలమ్మా... నాకెవరున్నారు ?" అంటూ ఏడ్చే
వారు.

"నేనున్నాను." అనే దానివి. అది ఆయనకు టానిక్కులా పని
చేసేది. అతని నుండి నిన్ను దూరం చేయటం భావ్యం కాదు. నాకేం తోచ
లేదు. ఒకతను మనింట్లో అద్దెకు దిగాడు. అతను తను ప్రారంభించే
కంపెనీలో పని ఇస్తానన్నాడు. తన అవసరాలు నన్ను తీర్చమన్నాడు.
చేసేదిలేక అంగీకరించాను.

ఒక రోజు ఇద్దరం దొరికిపోయే స్థితి ఏర్పడగానే, అతను నన్ను
దేవుడిగా మార్చి, నా కాళ్ళ దగ్గర మోకరిల్లాడు.

"ఏమేమో మాట్లాడుతుంది. నా గతం అంతా చూచింది చూచినట్టు
చెప్పింది అందుకే ఇక్కడ ఉన్నాను..." అన్నాడు. చుట్టుపక్కల
వారు ఆశ్చర్యపోయారు.

"కృష్ణపరమాత్మ ఆవహించాడు"

ఈ దేశంలో నీతిని, నిజాయితీని, ఉనికి నమ్మరుగాని, దేవుడిని మాత్రం ఏ రూపంలో ఉన్నా నమ్ముతారు. దైవభీతి, ప్రీతి కాదు, వారిలో దాగిన పాపభీతి.

అప్పుడే నా దృష్టి ఇద్దరు స్త్రీలపై పడింది. వారు కొత్తగా ఆ పేటకు కాపురం వచ్చారుట. వారిద్దరూ పడుపువృత్తి చేస్తారని విన్నాను, నాకొకటే ఆలోచన వచ్చింది.

"నా పదహారువేల గోపికల నుండి వెళ్ళిపోయి, వెలయాండ్రుగా మారారా !" అన్నాను. అంతే కనికరించండి స్వామీ అంటూ నా కాళ్ళపై పడి ముడుపు సమర్పించుకున్నారు.

నేను నెలంతా కష్టపడితే రాని డబ్బులు ఒక్క రోజులో వచ్చాయి. మనింట్లో అద్దెకున్న చైనులు వ్యాపారం అంతంత మాత్రమేనని అర్థం అయింది. అతను నాకు సలహా ఇచ్చాడు.

"మనమో ప్రయత్నం చేద్దాం. విజయం సాధిస్తే నిశ్చింతగా బ్రతుకుతాము. లేకపోతే మళ్ళీ ఏవైనా చూద్దాం" అన్నాడు.

ఆ పరిస్థితిలో అంగీకరించక తప్పలేదు. అతని చరిత్ర అంత మంచిది కాదు. అందుకే అతనితో ఖచ్చితంగా చెప్పాను.

"వచ్చిన డబ్బులో వాటా ఇస్తానుగాని, నా జోలికి రావద్దు" అన్నాను. అలాగే అన్నాడు.

మర్నాడు ప్రక్కింట్లో పేరంటం అంటే వెళ్ళాను. వాళ్ళపాప ఎక్కిళ్ళో ఊపిరి బిగపట్టింది. కంగారులో వారు నీళ్ళు ఇవ్వాలని మరచిపోయారు. నేనిచ్చాను. పాప ఏడ్చింది.

"నిజంగా మహత్తుంది స్వామీ..." అంటూ నన్ను కూర్చోబెట్టి దండం పెట్టి, పదిరూపాయలు, పళ్ళు చేతిలో పెట్టారు.

నాకు మతిపోయింది. మనుష్యుల్లో ఇంత మూఢనమ్మకం ఉందా ! ఈ మూఢనమ్మకాలను క్యాష్ చేసుకోవటం తేలికే ననిపించింది. అందుకే పటిష్ఠంగా ప్లాను వేసాము.



చైనులు వేరే ఇల్లు తీసుకుని, మన ఇంట్లో గుడికి ఏర్పాటు చేశాడు. కొందరు మాలాగే పొట్టగడవక, ఉద్యోగాలిచ్చేవారు లేక మా చుట్టూ చేరారు. అందరం కలిసి దేవుడు అవతారం ఎత్తి జయప్రదంగా ముగించాము. ప్రజలను దేవుడి పేరిట మోసం చెయ్యటం ఎంత తేలికో అర్థం అయింది. నా దగ్గరకు వచ్చేవారి సమస్యలు కనుక్కునేవారు కొందరు, నా శక్తిని, మహిమను ప్రచారం చేసేవారు మరికొందరు తయారయ్యారు. అందరికి జీతాలు మాట్లాడి ఉంచాను.

నిజంగా నీకు తెలుసు, నాదగ్గర ఏ మహత్తు లేదని. అయినా భక్తులు ఏర్పడ్డారు.

నాకు తెలుసు భవిష్యత్తు చెప్పలేనని. కాని, కనకవర్షం కురిపించేవారు. నాకు తెలుసు, వారి సమస్యలను నేను తొలగించలేనని, వారు నమ్మారు. నమ్మకంతో నన్నాశ్రయించేవారు. మనిషికి తన ఆచరణ పట్ల నమ్మకం పోయింది. వాళ్ళు గుడ్డిగా దేవుడు, అవతారం అంటూ నమ్ముతున్నారు. అందుకే నమ్మకాన్ని కొన్నాళ్ళు ఆసరాగా చేసుకోవాలనుకుని, కొన్ని మాత్రలు పొడిగా చేసి, విభూతితో కలిపి పెట్టుకున్నాను. ఆయా రోగాలు గ్రహించి ఇచ్చేదాన్ని. నువ్వు పెరిగి చేతికి అందివచ్చే వరకు నాకు అదొక సర్కస్‌ఫీట్లలా ఉండేది. సత్యవతి, రుక్మిణి, వీళ్ళంతా మెల్లి, మెల్లగా నా చుట్టూ చేరారు. చైనులు వివరాలు సేకరించేవాడు. ఒక్కొక్కసారి వివరాలు మరిచిపోయి, నా పరువు కాపాడుకోవటానికి ఎన్నో శ్రమలు పడవల్సి వచ్చేది.

నీలూ ! ఇన్ని శ్రమలకోర్చినా, ఆ డబ్బు నా కందేదికాదు. ఏదో కొంచె అందేది. కష్టపడేది నేను. అనుభవించేది యెవరోనా ! బాగా ఆలోచించి, కృష్ణపరమాత్మకు ప్రీతిపాత్రమైన వెదురుబొంగులు ప్రవేశ

పెట్టాను. అదొచ్చాక కొన్ని రోజులు రాబడి లెక్కలు బాగానే ఉన్నాయి. కాని బయటినుండి వెదురుబొంగులు తెప్పించి పెట్టడము మొదలు పెట్టారు.

అప్పుడే నువ్వు ఎదిగివచ్చావు. తరువాత సంగతులు నీకు తెలుసు నీలూ ! ఎప్పటికప్పుడు నువ్వు హెచ్చరిస్తూనే ఉన్నావు. అవతారం చాలించమని. కాని నీలూ ! నా అవతారంవల్ల ఎందరో బ్రతుకుతున్నారు. వారిని నిరుద్యోగులను, నిరాశ్రయులను చేయవద్దని శ్రమించాను. ఒక్క నాడుకాదు. రాత్రింబవళ్ళు ఆలోచించాను. వాళ్ళే నన్ను వెన్నుపోటు పొడిచారు. నన్ను నిరాశ్రయురాలిని చేశారు. నా బాల్యం బీదరికంలో ఎంత హేయంగా నడిచిందో నువ్వు ఊహించలేవు.

ఈ ప్రపంచం డబ్బు చుట్టూ తిరుగుతుంది.

డబ్బుంటే తిమ్మిని బ్రహ్మ చేయవచ్చు. బ్రహ్మను తిమ్మి చేయవచ్చు. అందుకే ఆ డబ్బు నీకు సమకూర్చిపెట్టి, ప్రపంచం నీ చుట్టూ తిరిగేలా చేయాలనుకున్నాను. కాని విధి ఇక్కడ మళ్ళీ కోలుకోలేనంత బలంగా దెబ్బతీసింది.

అందుకే...అందుకే నీలూ ! విధితో సవాలు చేశాను. నా కూతురు ధనంలో తేలి ఆడుతుందని చెప్పటానికి, ఆదిత్యను దూరం చేయాలని చూచాను. అంతే...స్త్రీ ఒక్కొక్కసారి అమృతమూర్తి అయినట్టే అతిహీనమైన ఆలోచనలు చేస్తుంది. అతను దొంగ కాదని తెలిసినా, అతన్ని జైలుపాలు చేశాను. కేవలం...కేవలం నా స్వార్థం కోసం ! అక్కడా విధే గెలిచింది.

అమ్మా...నీలూ ! సావిత్రి నన్ను బ్లాక్‌మెల్ చెయ్యకూడదనేనమ్మా, నిన్ను ఇస్తానన్నది. సావిత్రి అభిమానిస్తే ప్రాణం ఇస్తుంది. కోపంవస్తే కొరగానివ్వదు. నల్లులను రాచినట్టు రాస్తుంది. బ్లాక్‌మెల్‌చేస్తూ నిన్నూ, నన్నూ ఎక్కడ బాధ పెడుతుందోనని ఆందోళన పడ్డాను. అదీకాక చిన్న



బాబు అంత అసమర్థుడని నాకు తెలియదు. పోనివ్వు జీవితంలో ఒక్క సత్యం ఆలస్యంగా గ్రహించాను నీలూ !

మనం కష్టపడనిదేది మనకు దక్కదు. అందరి విషయములో ఏమోగాని కొందరి విషయములో అది నిజం అవుతుంది.

నా కష్టార్జితం అంతా వూడ్చి పెట్టుకుపోయింది.

ఆ షాక్‌కు నేను చచ్చిపోవాల్సిందే, కాని కేవలం నీకోసం బ్రతికాను నీలూ !

చక్రి శివాజీ రూపంలో కనిపించి, నీ బాధ్యత స్వీకరిస్తానని అనగానే నేనెంతో సంతోషించాను. ఎంతో రిలీఫ్ పొందాను. నీ భవిష్యత్తు అతనికే వదిలేశాను. అది ఒక అధ్యాయం. అది అంతటితో ముగిసింది.

ఇక నా విషయం చెబుతున్నాను...నీలూ ! నీవు తప్ప నాకంటూ మిగిలిన వారీ ప్రపంచంలో యెవరూ లేరు.

సాటి స్త్రీగా సానుభూతితో నన్ను అర్థం చేసుకో నీలూ ! ఇక్కడ అబద్ధం చెప్పటంలేదు. నా హృదయం నీ ముందుంచుతున్నాను. కూతురుగా కాదు. తల్లి స్థానంలోకి వెళ్ళి నా సమస్యను సానుభూతితో అర్థంచేసుకో. పెళ్ళి కాగానే తల్లిని పోగొట్టుకున్న నేను, తల్లిని, తండ్రిని, ఆత్మీయులను నీలోనే దర్శించాను.

నాకు వివాహం అయ్యేనాటికి, నాకు పదిహేడు, మీ...సారీ నందన రావుగార్కి ముప్పై సంవత్సరాలు. అతనికి చిన్నప్పుడే పెళ్ళయి భార్య పోయిందట. ఆయనకు సంసార జీవితంపట్ల వున్న అభిప్రాయాలు వేరు.

కాపురం అంటే కటిక చీకటిలో, తప్పు చేస్తున్నట్టు, మూడు నిమిషాల్లో ముగించే బూతుకార్యం అని అర్థం. నాకు చిన్నప్పటినుండి చదివిన గ్రంథాల ప్రభావం కాని, మరేదయినా కాని, ఒక ఉన్నతమైన భావం, ఊహలలో తేలిపోయే అనుభూతులుండేవి.

ఆప్యాయంగా పిలవటంగాని, అందమైన భాషణంతో ఆకర్షించటం

కానీ ఏదిలేదు. యాంత్రికంగా గడిచిపోయేది. ప్రతీ పనిలో అందం ఉంటుంది నీలూ! కొంచెం భోజనం చేస్తుంటే, మనకు ఆకలి చుర, చుర మంటుంది. మరికొంచెం భోజనం చేస్తుంటే ఆకలి చచ్చిపోతుంది.

కొన్ని ఇళ్ళల్లో ఏ ఆడంబరం లేకపోయినా, నేలపై కూర్చుందాం అనిపిస్తుంది. కొన్నిచోట్ల ఖరీదయిన సోఫాలున్నా కూర్చోలేం. ఆ వాతావరణ ప్రభావమా!

మనిషికి మనసు, ఈస్తటెకో సెన్స్ ఓ శాపం అనుకుంటాను.

ప్రతీరోజూ, ఆయనతో యెలా మాట్లాడాలో, రిహార్సల్స్ చేసుకుని వెళ్ళేదాన్ని. ఆయన నా ఊహలు కూకటి వేళ్ళతో కూల్చేసేవారు.

"ఏమిటా వెర్రినవ్వు. కుదురుగా ఉండలేవా?"

"మనిద్దరం ఉండగా కుదురుగా ఉండలేవా అంటారేం?"

"ఇద్దరమే ఉంటే తైతక్కలాడాలా!"

ఆయన విసుగుచూస్తే నాకు ఏడ్పు వచ్చేది.

ముఖం మరోవైపు తిప్పుకుని పడుకునేవారు.

"ఏమండీ..." సిగ్గు విడిచి, భుజంపట్టి కుదిపేదాన్ని.

"నా ఆరోగ్యం బాగాలేదు" విదిలించుకునేవారు. భార్యాభర్తల అనుబంధం శారీరక సుఖాలకే కాదు. కష్టం, సుఖం మాట్లాడుకుంటారని అనుకున్నాను.

ఎక్కడలేని విసుగు వచ్చేది.

"నాకు ఎవరన్నా ప్రక్కనుంటే నిదురరాదు" అనేవారు. ఏం చేయలేక ప్రక్కకు, దూరంగా ఉన్న మంచంపై పడుకునేదాన్ని. ఎప్పుడో, ఏ అర్ధరాత్రో నాకు తెలియని, సుషుప్తావస్తలో ఆయన ఆక్రమించుకుంటే ఒంటిమీద చీమలు, తేళ్ళు ప్రాకినట్టుండేది. నేను నా అయిష్టతను వ్యక్తం చేయక మునుపే, ఆయన కోరిక తీర్చుకుని లేచేవారు. ఎంత జుగుప్స కలిగేదో చెప్పలేను.



అసహాయురాలిని. మన దేశంలో భర్త ఎలాంటివాడయినా భరించాలన్నది ఆచారం. నిస్సహాయంగా ఎన్ని రాత్రులు ఏడ్చానో!

దాంపత్యం అంటే ఇదేనేమో! సినిమాలలో, నవలల్లో వర్ణించినట్టు ఉంటుందా అనుకుని జీవితంతో రాజీ పడిపోయాను. మరబొమ్మలా మారిపోయాను. అనుభూతులు, ఆడంబరాలులేక, యాంత్రిక జీవితానికి అలవాటు పడ్డాను.

చక్రధర్...అదే శివాజీతో పంచుకున్న జీవితం చాలా తక్కువ అయినా అది మరిచిపోలేని అనుభూతి, మధురానుభూతి.

వయసులో చిన్నవాడయినా, మనసు ఎరిగిన మగవాడు. నాకే గనక దబ్బుంటే ఈ నందనరావును వదిలివేసి, అతనివెంట వెళ్ళి అతడిని చదివించేదాన్ని అనిపించింది.

అతను మాట్లాడితే మళ్ళీ, మళ్ళీ వినాలనిపిస్తుంది.

అతనికి టీ ఇచ్చినా కాఫీ ఇచ్చినా ధన్యవాదాలు చెప్పే పద్ధతికి ఎవరయినా ముగ్ధులవుతారు. వగలు అనుకుంటావేమో కాని అతన్ని మరిచిపోవటం సాధ్యం కాలేదు.

అసలే నీరసుడు నందనరావు. పక్షవాతం వచ్చింది. నేను పెద్దగా పోగొట్టుకున్నదేంలేదు అనిపించింది.

శివాజీతో పంచుకున్న ప్రతి నిమిషం నాకు విలువయింది. బ్రతుకటానికి బలం, స్ఫూర్తినిచ్చింది. ఇన్నేళ్ళు అతని జ్ఞాపకాలతో బ్రతికాను. అతను ప్రత్యక్షంగా కనిపిస్తే ఏమవుతానో ఊహించు. నీలూ! నాకు మతిపోయింది. అతని లాలసలో ఒక్కక్షణం నన్ను నేను మరచి పోవాలనుకోవటం అత్యాశా! దురాశా!

"దేవీ! నా వృత్తిలో, నేను బ్రతకటానికి, ఎందరితోనో అనుబంధాలు పెంచుకున్నాను. కాని నీతో గడిపిన ప్రతిక్షణం అమరమైనది" అన్నాడు శివాజీ.

శారీరక వాంఛలకు కరిగి, కాలి, బూడిదయింది నా శరీరం. సాంప్రదాయాలలో చిక్కుకుపోయిన నేను, నా సుఖాలు వెతుక్కోలేకపోయాను. ఒక్కసారి శివాజీ కనిపించగానే నన్ను నేను మరిచిపోయాను. వాంఛలతో కాదు. ఆత్మీయతకోసం అర్రులు చాచాను. నా కష్ట, సుఖాలు పంచుకునే ఆత్మీయుడు అనిపించింది. అందుకే...అందుకే అతనితో చనువుగా మసిలాను. కామంతో, మోహంతో కాదు. నీలూ ! ప్రేమకు నిర్వచనం చెప్పలేము.

అది బహుముఖంగా ప్రవహిస్తుంది. ప్రేమతో కేవలం ఆత్మీయులుగా మేం దగ్గరగా ఉంటగా నువ్వు చూచావు. నన్ను ఎంతో నీచంగా ఊహించావు !

నీలూ ! నీవు ఈ తరం యువతిగా ఒక పని చెయ్యమ్మా. నేనెక్కడున్నా సంతోషిస్తాను. స్త్రీ, పురుషులకు వేరు వేరుగా ఏర్పరిచిన ఈ సాంఘిక నియమాలను ఛేదించు.

ఆర్తి, ఆకలి, అనుభూతి, ఆవేదన, కోరికలు, స్పందన అందరికీ ఒకటేనని నిరూపించు.

తల్లీ ! నేను నిన్నొక స్నేహితురాలిగా భావించి, నా కథ ఏదీ దాచకుండా చెప్పాను..."

కళ్ళ కడ్డుపడుతున్న నీరు ఒత్తుకుని మళ్ళీ చదవబోయింది.

"సారీ నీలూ...లే..." శివాజీ వచ్చి ఆమె భుజాలు పట్టి లేపాడు.

ఏమిటన్నట్టు చూచి, మంచంవైపు చూచిందామె.

నందనరావుకు నిలువునా గుడ్లకప్పారు.

"నాన్నా !..." నిలువునా పడిపోయింది.

"నీలూ !..." ఆర్తిగా పిలిచాడు శివాజీ.

"నాన్నా ! ... నాన్నా ! నాకోసం...ఎన్నోసార్లు మందు తాగావు...ఈసారి... నాన్నా...నన్ను... ఒంటరిదాన్ని చేశావా !"

నీలిమ ఏడుస్తుండగా, శివాజీ, ఆదిత్య చెరోవైపు పట్టుకుని లేపారు.

# 23

**నీలిమ** కోరిక మేరకు, నందనరావు అంత్యక్రియలు ఆదిత్య చేతులమీదుగా జరిగాయి. ముకుందాదేవి దగ్గరకు కారు పంపించాడు శివాజీ. ఆమె దక్షిణదేశ యాత్రలకు బయలుదేరిందట. వారి జాడ సరిగ్గా ఎవరికి తెలియదు అన్నారు.

నీలిమ నిట్టూర్చింది.

తనకు ఎవరూలేరు అనుకుంటే, తనకోసం సర్వస్వం ధారపోసే తండ్రి, ప్రాణం ఇచ్చే భర్త ఉన్నారు. అందరూ ఉన్నారనుకున్న నందనరావు దిక్కులేనివాడు అయ్యాడు.

తనను అతను ఎంతగా ప్రేమించాడో తాను ఎరగనిదికాదు. అంత ప్రేమించి, ఆమె కోసమే, అవిటి బ్రతుకును అతి భారంగా ఈడుస్తున్న సమయాన, ఆమె తన కూతురు కాదని తెలిస్తే మనిషి ఎంతగా దిగజారిపోతాడో ఊహించగలదు.

ఆదిత్య అంటే అతనికి చాలా అభిమానం. అందుకే అతనిచేత అంత్యక్రియలు చేయించింది.

'నాన్నా ! ఈ క్షణం వరకు నువ్వు నాకు తండ్రివి కాదని తెలియదు. నేను నిన్నే ప్రేమించాను, గౌరవించాను.' అనుకున్నది పదే, పదే. ఆదిత్య అతని హస్తికలు నిమజ్జనం చేయటానికి తీసుకువెళ్ళాడు.

నీలిమ కృష్ణకుంజ్‌లో తండ్రికి చేయవలసినవన్నీ చేసింది. ఆమె లతాకుంజ్‌లో కూర్చుంది. అక్కడ కూర్చోబెట్టి, చిన్నప్పుడు తనకు కథలు చెప్పేవాడు నందనరావు. ఆమెకు ఒక్కొక్క ఘట్టం గుర్తుకు వచ్చింది. అలాగే కూర్చుండి పోయింది.

"నీలూ ! ఇంటికి వెళ్దామా !"

"పదండి అంకుల్..." లేచింది.

ఆమెను దగ్గరగా తీసుకుని, హృదయానికి హత్తుకున్నాడు, శివాజీ. "నీలూ! అంకుల్‌ని కాదమ్మా...మీ నాన్నని..." అన్నాడు.

నీలూ ఉలిక్కిపడింది. తను...తను నందనరావును తప్ప అన్యులను అలా పిలువగలదా? అతని ప్రేమ, లాలింపు మరచి పోగలదా! ఇదేం సినిమాకాదు. నిజమైన తండ్రి ఎవరో తెలియగానే 'నాన్నా!' అంటూ అతని వడిలో ఎలా వాలిపోగలదు! తను నందనరావును తప్ప అన్యులను నాన్నా అంటూ పిలువలేదు.

శివాజిని నిరసించటానికి కారణంకూడా కనిపించలేదు. అతను తన తల్లిని మోసంచేసిన వ్యక్తికాదు. ఆతడిని దూరం చేసుకోలేదు. అందుకే ఒక నిర్ణయానికి వచ్చింది.

అతని నడుముచుట్టు చేయివేసి ముందుకు నడిచింది.

"డాడీ! నా బాల్యమంతా ఇక్కడే గడిచింది. అమ్మకంటే నాన్నతోనే ఎక్కువ చనువు" అన్నది.

"నాకు తెలుసు నీలూ! తాతయ్య ఓ ప్రణాళిక వేశారు."

"ఏమిటి డాడి!"

"నందనరావు కోరినట్టుగానే ఈ ఇల్లు వృద్ధుల సంక్షేమానికి ఉపయోగించాలమ్మా. తాతయ్య ఇక్కడి వారికోసం తను పాటు పడతానంటున్నాడు."

"అంతకంటే కావల్సిందేముంది డాడీ."

"అలాగే నువ్వు అప్పుడప్పుడు వచ్చి పర్యవేక్షించాలమ్మా."

"అలాగే డాడీ. నాన్నగారిది లైఫ్‌సైజ్‌లో ఒక ఫోటో చేయించాలి"

"ఇప్పటివరకు నేను, తాతయ్య ఫోటోలన్నీ వెతికాం. ఆయనవి వయసులో ఉన్నప్పటివే ఉన్నాయి" అన్నాడు.

"లేటెస్టది నా దగ్గరుంది డాడీ" అన్నదామె.



ఇద్దరూ కృష్ణకుంజ్‌లోకి వెళ్ళారు. ఆమ డ్రాయరు సొరుగులాగి ఒక ఫోటో తీసింది.

వరండా గోడ కానుకుని నిల్చున్నాడాయన.

"ఆమధ్య ఆయన గోడ ఆసరాగా నిల్చుంటే నేను తీసాను" అంది.

"చాలా బావుందమ్మా."

అప్పుడే స్నానం చేసి బట్టలు వేసుకున్నాడేమో, ఫ్రెష్‌గా చిరునవ్వుతో నిల్చున్నాడు. ఆయన తనను చూచి నవ్వుతున్నట్టు అనిపించింది. ఫోటో పేపర్లో చుట్టిపెట్టాడు.

"ఇది చాలా బావుందమ్మా" అన్నాడు.

ఇద్దరూ శివాజీ ఇంటికి వచ్చారు. అరవింద్ వాళ్ళకోసం చూస్తున్నాడు. వచ్చి నీలును కౌగిలించుకున్నాడు.

"నన్ను పిక్చర్‌కు తీసుకువెళ్ళవా..."

"వెళ్దాం..." వాడిని ఆప్యాయంగా వీపు నిమురుతూ లోపలికి తీసుకు వెళ్ళింది.

ముగ్గురూ భోజనం చేశారు.

"నీలమ్మా మీ కుత్తరం..." అని పనివాడు ఆమెకు, శివాజీకి ఉత్తరాలు అందించాడు. ఇద్దరూ ఉత్తరాలు చదవటంలో నిమగ్నంకాగానే అరవింద్ విసుగ్గా వెళ్ళిపోయాడు.

"ఆదిత్యది అంకుల్...సారీ! డాడీ!"

"ఇది మీ అమ్మగారిది" అన్నాడు, ఉత్తరం ఆమె వైపు విసిరాడు.

"ఏం రాసారో చెప్పండి" అన్నది ఉత్తరం మడిచి అతనికిస్తూ.

"మనఃశాంతిని వెతుకుతూ యాత్రలకు వెళ్ళిందట. తన మనఃశ్శాంతి నీవేనని గ్రహించిందట. వీలుంటే ఒక్కసారి నిన్ను స్టేషనుకు తీసుకురమ్మన్నది. మద్రాసు ఎక్స్‌ప్రెస్ దిగుతూనే బెంగుళూరు బండి ఎక్కుతారట."

నీలిమ ఏం మాట్లాడలేదు. తలవంచుకుంది.

"ఆ అభాగ్యురాలిని క్షమించలేవా నీలూ!"

"ఛ...ఛ...అదేంమాట డాడీ! అమ్మ ఉత్తరం చదివాను కదా. ఆమె నాకోసం రాస్తే అది నాన్న చేతిలో పడింది. ఆయన ఆ ఉత్తరం చదివాక అంతగా మారిపోయారంటే నమ్మలేకుండా ఉన్నాను. అతని మరణ వార్త విని అమ్మ ఎలా తట్టుకుంటుందో..." అన్నది జాలిగా.

"అతని నమ్మకం, అతని ఆస్తి, సర్వస్వం నువ్వే అనుకుని బతికే వ్యక్తికి ఒక్కసారి అదంతా అబద్ధం, ఊహ అని తెలిస్తే ఎలా ఉంటుంది. పసిపిల్లడిని ఓదార్చటానికి రంగులబొమ్మ చూపినట్టు అయింది. బతకటానికి బలం నువ్వు. ఆ నువ్వు తనదానివి కావు, తన రక్తం పంచుకుని పుట్టలేదంటే ఎలా భరించగలడు!" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"అదిత్య ఏం రాశాడు! అసలు సమజ్ఞసం చేసి అక్కడ ఉండ కూడదు అంటారు కదా" అన్నాడు.

"అదే రాశారు డాడీ! అతనికి కృష్ణబడ్డున చైనులు కనిపించాడట. అతను అదిత్యను చూచి పారిపోయాడుట. అతని విషయం తేల్చుకుని వస్తాడట. అయినా ఆదిత్య పిచ్చిగాని అతను దొరుకుతాడా!" అన్నది.

"ప్రయత్నం చెయ్యాలమ్మా! ఆ పట్టుదల మంచిదే" అన్నాడు అతను.

"డాడీ!"

"చెప్పమ్మా!"

"నేనో ప్రశ్న అడిగేదా?"

"అడగమ్మా. అభ్యంతరం ఎందుకు?"

"ఈ నీతి నియమాలు చేసింది పెద్దలే కదూ!"

"అవును."



"మరి స్త్రీపట్ల ఇంత అన్యాయం చేశారేం డాడీ!"

"నాకు అర్థం కాలేదమ్మా."

"ఇప్పుడు అమ్మవచ్చి మీతో ఉంటేనేం?"

శివాజి లేచాడు. వెళ్ళి కిటికీ ఊచలు పట్టుకుని చాలాసేపు నిల్చున్నాడు. అనవసరంగా అతన్ని అడిగానేమో అనుకుంది నీలిమ.

"నీలూ! నా ఆస్పత్రిలో అస్పష్టరూపంలో ఓ స్త్రీ మూర్తి ఉంది చూచావా!"

"చూచాను."

"అది యెవరిది?"

"నాకు తెలియదు. మీ జీవితంలో తారసపడిన ఒక స్త్రీమూర్తిదని విన్నాను."

"ఆ స్త్రీమూర్తి మీ అమ్మ. నా కెందరితోనో పరిచయాలున్నాయి. అందరిలో ముగ్ధ, ముద్దబంతిపూవు ఆమె. అదికాక నాకు విదేశాలలో స్కాలర్‌షిప్ వచ్చింది. రూబీదగ్గరకు వచ్చిన యువకులలో, నేనొక్కడినే చదువుకుని పైకి వచ్చాను. దానికి రూబీ భర్తకు మంట. రూబీయే సహాయం చేస్తుందని అతని అభిప్రాయం. ఆ కోపంతో నాకు సహాయం నిరాకరించాడు. అప్పుడు మీ అమ్మ డబ్బిచ్చి వెళ్ళిందట..."

"డాడీ..."

"అవునమ్మా! ఆమె రావాలేగాని సంతోషంగా ఆహ్వానిస్తాను. ఈ దేశాచారాలు అంగీకరించకపోతే విదేశాలకు తీసుకువెళ్తాను." అన్నాడు ఆవేశంగా.

నీలిమ లేచింది. అతని గుండెల్లో తలదాచుకుంది.

"థాంక్యూ డాడీ... థాంక్యూ వెరీమచ్. నా ఒక్కదాని తరఫున కాదు – స్త్రీ లోకం తరఫున, ఆడదాన్ని అబల, ఆటబొమ్మ అనుకునే పురుషులలో పుణ్యపురుషులుగా ప్రగతి మార్గంలో పయనించే మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు."

"ఓ... స్టాప్ నీలూ!" అతను ఆప్యాయంగా ఆమె తలను హృదయానికి హత్తుకున్నాడు.

"అది కాదు డాడీ! స్త్రీని వంటింటి కుందేలు అని, అదని, ఇదని, ఆమెను నీరసురాలిని చేసారు. ఈనాడు మరొకరి సహకారం లేనిదే ఆమె ముందంజ వెయ్యలేదు" అన్నది.

"అది నిజమేనమ్మా. నాను చేతనయినంతగా సహకరిస్తాను."

"చాలామంది మగవారు, చెప్పేది ఒకటి, చేసేది ఒకటి. అందుకని మీరయినా..." ఆమె మాట పూర్తికాక ముందే వాకిట్లో ఓ ఆటోరిక్షా ఆగింది.

"డాక్టరుగారూ... మా అక్క... మా అక్క..."

శివాజీరావు ఇంటిముందు ఎమర్జన్సీ ఎక్జామినేషన్ రూమ్ ఉంది. పనివాడు చూపెంచగా ఒక స్త్రీని తెచ్చి, టేబుల్‌పై పడుకోబెట్టారు.

శివాజీ కంగారుగా ఆమె పల్స్ చూచాడు.

ఆ వెనుకే నీలిమ కూడా వెళ్ళింది.

"మైగాడ్...స్వతంత్రి" అన్నాడాయన.

"స్వతంత్రే డాక్టరుగారూ! మేమంతా ఆమె రక్త మాంసాలు కరిగించి, ఇంతవారం అయ్యాము. ఆమె ప్రాణం కూడా తీస్తేగాని..." అతను ఏడుస్తున్నాడు.

నీలిమ అతడిని బయటికి తీసుకు వచ్చింది.

"ఆమెకేం అయింది?" నీలిమ అడిగింది.

"ఏం తీసుకుందో... విషం తీసుకుంది..." అతను ఏడ్చాడు.

అరగంట తరువాత శివాజి బయటికి వచ్చాడు.

"ఇంకో గంట గడిస్తేగాని ఏం చెప్పలేం!" అని పనివాడిని నర్సింగ్ హోమ్‌కు పంపి, ఏమేమో తీసుకురమ్మని ఆదేశించాడు శివాజి.



"ఎందుకు స్వతంత్రి మందు మింగింది? ఆమె బలహీనురాలు, భయస్తురాలు కాదు" అన్నాడు.

"కాదు డాక్టరుగారూ! అక్క చాలా ధైర్యస్తురాలు. ఆమె ఆ మధ్య తాను పెళ్ళిచేసుకుని సెటిల్ అవుతానని చెప్పింది. ఏమయిందో మళ్ళీ మానేసింది. అది ఆసరాగా తీసుకుని మావాళ్ళు ఆమెను నానా హింసలు పెట్టారు. మాటలతో చంపారు" అన్నాడు.

శివాజీరావు నిట్టూర్చాడు. అతని ముఖంలో రంగులు మారటం నీలిమ గమనించింది.

మేల్ నర్స్ రాగానే స్వతంత్రికి సరియైన వైద్యంచేసి, ఆమెను నర్సింగ్ హోమ్‌లో పడుకోబెట్టి వచ్చాడు శివాజి మాన్వీకర్.

"డాడీ..."

"ఎస్ నీలూ!"

"ఈమె నీకు తెలుసా?"

"తెలుసు..." క్లుప్తంగా స్వతంత్రికి తనకు జరిగిన విషయాలు చెప్పాడు. ఆమె ఎంత నిక్కచ్చి మనిషో కూడా చెప్పాడు.

"ఓ...అయిసీ..." అన్నది నీలిమ.

అతను ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు.

## 24

**విజయవాడలో** ఓ చిన్న లాడ్జీలో చైనుల్ని పట్టుకున్నాడు ఆదిత్య. అతను ఎంత వ్యాపారం చేస్తున్నా, ఎంతమంది అభినందించినా, "వీడు దొంగతనం చేశాడు... దొంగతనం" అంటూ యెవరో అపహేళన చేసినట్లే అనిపిస్తుంది. అందుకే చైనులును కలుసుకున్నాడు.

"నమస్తే..."

"నమస్తే... నమస్తే... నువ్వు ఆదిత్యవు కదూ!"

"అవునండీ..." అన్నాడు దిగులుగా. మనసులో కసిగా ఉంది. మొదటిసారి తనను...

"యెవరువోయారు!" తను ఆదిత్యను ముద్దుపెట్టుకున్న సంగతి గుర్తు చేసుకుని.

"నందనరావు."

"అయ్యో! పాపం! ఆ ఇంట్లో అతను ఒక్కడేనయ్యా మనిషి అంటే."

"అవునండీ. అతనుండగా నాపై వచ్చిన నింద తప్పిస్తాడను కున్నాను. నన్ను విడిపించి అతను మరణించాడు" అన్నాడు.

"ఇప్పుడు నువ్వు..."

"పారిపోయి వచ్చాను."

"మరి మన దేవుడు..."

"నాకు తెలియదు."

చైనులు తీక్షణంగా చూచాడు వెంటనే తల పంకించాడు.

"ఆ పిల్ల యెలా ఉంది?"

"బాగానే ఉండి ఉంటుంది" అన్నాడు.

చైనులు భోజనం పెట్టించాడు. ఆదిత్య చేతిలో డబ్బులేనట్టే నటించాడు. ఆ రోజంతా అతడితోనే ఉన్నాడు.

"ఇంకా యెవరినయినా అనుమానిస్తున్నారా!"

"మిమ్మల్ని అనుమానించారు" అన్నాడు.

చైనులు విలాసంగా నవ్వాడు.

"ఆ మునుపటి సంగతి నాకు తెలుసు. దానికి మాపై కేసుపెట్టే ధైర్యం లేదు. నువ్వేం దిగులు పడకు. నేను చెప్పినట్టు వింటే నీకు మేలు జరుగుతుంది."



"ఇంకా ఏం మేలు జరగాలి. దొంగన్న ముద్రతో బ్రతకలేను..." అన్నాడు విసుగ్గా.

"దొరగా బ్రతుకుదాం పద..." అన్నాడు.

ఆ సాయంత్రమే ఇద్దరూ కలసి సామర్లకోట దగ్గరున్న పల్లెటూరుకు వెళ్ళారు.

అక్కడ చైనులు పొలం, ఇల్లు కొన్నాడు. అతను పిల్లలు, అతను హాయిగా ఉన్నారు. అతనున్న తీరుచూస్తే దొంగతనం చేసింది అతనే అనిపించింది. తన అనుమానాలు బయట పడనియ్యలేదు. ఇంట్లో వారంతా ఖరీదయిన బట్టలు వేసుకుని ఉన్నారు. ధనవంతుల ఇల్లని ఇంట్లో వస్తువులు చాటి చెబుతున్నాయి.

ఆరోజు భోజనాలు అయ్యేక చైనులు నిదురబోయాడు. బయట ఆరా తీసాడు. చైనులు ఈ మధ్యే వచ్చి అక్కడ పొలం ఇల్లు కొన్నాడని తెలిసింది. అతను తల పంకించాడు.

"ఏం ఉద్యోగం చేస్తావు!"

"ఏదయినా చేస్తాను!" అన్నాడు.

"మంచి ఉద్యోగం వేయిస్తాను. మా అమ్మాయిని పెళ్ళిచేసుకో. అది డొనేషన్ కట్టి మెడిసన్ చదువుతుంది తెలుసా!"

కొంపకార్చి డొనేషన్ కడతావు, దొరతనం వెలిగిస్తావు - అనుకొన్నాడు.

"మీ అమ్మాయి కిష్టమో కాదో..."

"నువ్వు ఊఁ అను అది ఎగిరిగంతేస్తుంది" అన్నాడు.

"ఊఁ..." అన్నాడు ఆదిత్య. వెంటనే నవ్వేశాడు, ఏది నీ కూతురు అన్నట్టు చూశాడు.

"భలేవాడివయ్యా..." భుజం చరచి నవ్వాడు.

"అవునండి ! ఆ ముకుందాదేవిని చిత్తుచేయాలి. కూతుర్ని చిన్న బాబుకు ఇస్తుందేమో"

"వెర్రిబాగులవాడు..." చైనులు బ్రాందీ తీశాడు. సోడా లేకుండా కొట్టేశాడు.

"నీకు ఓ పెగ్గు..."

"వద్దండీ, బాబ్ !"

"నో ప్రాబ్లమ్...నేనిక్కడే ఉన్నాను. నీవు కోరింది కాదనను... కూతుర్ని, కట్నం...ఇంకేం కావాలి!" మరో రెండు రౌండ్లు పడేసరికి గుర్రం ఎక్కాడు. మాటల దౌడు ప్రారంభమయింది.

"మేము...మేము...నీతో చెప్పొద్దు..." నోరు గట్టిగా మూసుకున్నాడు.

"అల్లునికీ...అల్లునికి చెప్పని రహస్యాలుంటాయా...మామా !"

"మామ...ఏది మల్లను...అను...నా బిడ్డకు పెళ్ళి అయ్యే యోగముందా ! అమ్మా కనకదుర్గా..." ఏడ్పులంఘించుకున్నాడు.

"ఏమయింది !"

"నా కూతురు...చిన్ని తప్పు చేసింది...అది ఈ కాలంలో తప్పు కాదు...ప్రగతి...అడ్వాన్స్‌మెంటు..." ఒక్కొక్క పెగ్గు పడుతుంటే ఒక్కొక్క మాటే బయటకి వచ్చింది.

"నా కూతురు...ప్రేమించిందయ్యా...ఫస్ట్‌క్లాసు స్టూడెంటుకు ఇదేం బుద్ధి...చెప్పు...చెప్పు..."

"పాడుబుద్ధి..." అన్నాడు ఆదిత్య.

"అవునా...మరి జాగ్రత్తగా వుండొద్దూ. మూడో నెలే కాబట్టి ఏదో చేశాం...భ్రూణహత్య మహాపాపం...ఆఁ..." ఏడ్చాడు చైనులు.

"అబ్బా ఏడ్వకు మామా..."

"ఇంక ఏడ్వను. నా బిడ్డ...కు పెళ్ళి అవుతుంది" అన్నాడు.



"డాక్టరు చదివే అమ్మాయి, ఎవరయినా చేసుకుంటారు" అన్నాడు ఆదిత్య.

"చేసుకున్న వాడు మంచివాడు కాదు...కావాలని...లేదు. నా ఇంట్లో ఉండాలి." అతను మెల్లగా కళ్ళు మూసుకున్నాడు.

ఆదిత్య లేచి అతని విషయం భార్యతో చెప్పాడు. ఆవిడ తిట్లతో వచ్చి అతడిని లేపి పడుకోపెట్టింది.

"జీవితమంతా అబద్ధాలతో గడిపాడు. ఏదో ఇప్పుడయినా నిమ్మళంగా ఉందామంటే తాగుడు నేర్చాడు..." అన్నది విసుగ్గా.

ఆదిత్య ఆమెను గమనిస్తున్నాడు. ఆమెను ఎప్పుడూ చూచినట్టులేదు.

"నువ్వా ఆ కృష్ణపరమాత్మ దగ్గర పనిచేశావా !"

"చేశాను" అన్నాడు ముక్తసరిగా.

ఆమె అన్నం పెట్టింది కానీ ఎక్కువ ఏం మాట్లాడలేదు. భర్త హెచ్చరించి ఉంటాడు.

ఆదిత్య బయట గదిలో నిదురపోయాడు. మర్నాడు అయిదు గంటలకే మేలుకున్నాడు. అతను పెరట్లోకి రాబోయి తన పేరు వినిపించటంతో ఆగిపోయాను. ఇద్దరు మగవాళ్ళు పందుమ్పుల్లతో పళ్ళు తోముతున్నారు.

"చైనులూ ! నువ్వు తాగుడుకు అలవాటుపడి, మంచి చెడులు ఆలోచించటం లేదు. అసలు ఆదిత్య సి. ఐ. డి. అని నమ్మకం."

"రాయుడు ! నాటకాలవాడికి అందరూ నాటకం ఆడినట్టే కనిపిస్తారు అయి పిటీయు..."

"చాల్లే ! ఆ పిల్లముండ వీడిని ప్రేమించింది. ఇదేదో గూడుపుఠాని ఉంది. వీడిని అరెస్ట్ చేశారని పేపర్లో చదవలేదా ?"

"ఆ నందననావు విడిపించి గుటుక్కుమన్నాడట. నేనేం అంత వెర్రి వాడిని కాను."

"చిన్న పామును పెద్ద కర్రతో కొట్టమన్నారు ఆ పిల్లది మన కోసం అందరిని అడిగిపోతుందట. సత్యవతి అన్న ఉత్తరం వ్రాశాడు. నువ్వు నిజామాబాద్‌లో సెటిల్ అయ్యావని తెలిసి అక్కడికి మనుషుల్ని పంపిందట..."

చీకటి పలచబడి పక్షుల కిలకిలారావం వినిపించింది. తను అక్కడ వుంటే పసిగడతారని వెనక్కు వచ్చి మంచంలో వాలాడు.

అతనికేం పాలుపోలేదు. ఇప్పుడు వారి చేతికి చిక్కితే వదిలిపెట్టరు. ఏం చేయాలో తోచలేదు.

బయట అలికిడి విని కళ్ళు మూసుకున్నాడు.

"ఆదిత్యా!...ఓ ఆదిత్యా..." చైనులు పిలిచాడు.

"ఈ రోజు ఫ్యాక్టరీకి వెళ్దాం" అన్నాడు అక్కడ దగ్గరలో చిన్న బెల్లం ఫ్యాక్టరీ ఉన్నది.

"అలాగే..." అన్నాడు.

అతను త్వరగా తయారయి వచ్చాడు. నీలిమకు ఉత్తరం రాసి పడేశాడు. చైనులు వెంట వెళ్ళాడు.

చిన్న గుమాస్తా ఉద్యోగం అది.

"నాకంటూ ఓ పని ఉంటుంది. చాలు మామయ్యా" అన్నాడు.

పనిలో చేరిపోయాడు ఆదిత్య. అక్కడ ఫ్యాక్టరీలో అతనికి భాగం ఉందని తేలిపోయింది. అక్కడ వారిద్వారా చాలా విషయాలు తెలిశాయి.

అతనికి వివాహమయిన రోజే, భార్యను వదలి రావటం చాలా బాధగా ఉంది. అయినా భవిష్యత్తు ఊహిస్తే ఈ వియోగం పెద్దదేం కాదు.

అతనా రాత్రి కష్టపడి వర్కర్స్ దగ్గర ఫారిన్ విస్కీ సంపాదించాడు. అది తీసుకుని, జీడిపప్పు తీసుకుని వచ్చాడు.

చైనులు కూతురు వచ్చింది. ఆ అమ్మాయి ఆదిత్యను కల్యపరీక్ష చేసింది.



"తీసుకోండి మామయ్యా! పని దొరక్కపోతే నేను దొంగతనం చేసేవాడిని..." అన్నాడు, లిక్కర్ అతని చేతిలో పెట్టి.

"చూచావా అమ్మడూ..." కూతురువైపు గర్వంగా చూచాడు. మరో గంటకు అతని ముఖం ఎర్రబడింది, త్రాగటం వల్ల.

"ఆదిత్యా! యు ఆర్ గ్రేట్...నాకు నచ్చావు...ఆ రాక్షసి, రాయుడుగాడు నీ గురించి ఏమేమో అన్నారు...వెధవలు..." అన్నాడు.

"ఏమన్నారు మామయ్యా!" కసిని మింగి, ఆప్యాయతను ఒలకబోస్తూ.

"యు డోంట్ వర్రీ! వాళ్ళ మాటలు ఎవరు వింటారు. అమ్మడు నా మొదటిభార్య కూతురు...ఆఁ...అందుకే...నా రెండవ భార్యకు కోపం. ముకుంద... షి ఈజ్ గ్రేట్. ఏ మాటకా మాటే చెప్పుకోవాలి" అన్నాడు ఏదో లోకాలకు తేలిపోతూ.

"ఏం మంచి...ఏం మంచి అయ్యా, నన్ను పోలీసులకు పట్టించింది."

"ఏదో కోపం ఉండి ఉంటుంది. నాకు తెలుసు...పాపం సందనరావుతో ఏం సుఖపడింది. నేనయినా ఇవ్వాలనుకుంటే...పాపం దేవత అయింది. ఈ దేవత, ఈ దేవుడి సంగతులు మీకు తెలియదు...అంతా... ఇంతే. పెద్ద స్మగ్లర్ పట్టుబడి దేవుడవుతాడు...తప్పుచేస్తూ పట్టుబడితే అమ్మ అవుతారు" అతను చెబుతూపోతున్నాడు.

ఆదిత్య ఆలోచించాడు. అతను ఎంత తాగినా తనపై ఓ కన్నేసి ఉంచుతాడు. త్వరపడాలి. చైనులు పట్టుబడితే అందరూ దొరుకుతారు. కాని పోలీసులకు రిపోర్ట్ ఇచ్చేదెలా!

"అబ్బాయ్...ఉత్తరం రాసేపాటి స్నేహితులెవరున్నారు?"

పిడుగులాంటి ప్రశ్న! నిజంగా తనను అన్నివేళలా గమనిస్తున్నాడు. అవును. లేనిదే చైనులు ముకుందాదేవిచేత అంతపెద్ద నాటకం ఎలా ఆడించేవాడు!

"అది కాదు మామయ్యా ! డాక్టర్ శివాజీ దగ్గర పనిచేశాను. ఆయన డబ్బిచ్చాడు, అతనికి డబ్బిస్తానని వ్రాయవద్దా !"

"అంతేనా !"

"మీలానే అతను మంచివాడు..."

"నాతో పోల్చకు... అతను కూతుర్నిచ్చాడా !"

"నిజమే..."

చైనులు వెయ్యిరూపాయలు తెచ్చి ఆదిత్య పైకి విసిరాడు.

"ఇంకా ఏమేమీ అప్పులున్నాయో తీర్చివెయ్యి" అన్నాడు.

"అలాగే" అన్నాడు. అతను నిదురబోయాక ఆలోచించాడు ఫ్యాక్టరీలో ప్రతి చోట తనపై నిఘా వేసే ఉంటాడు. యెలా శివాజీకి తెలిపేది ! మర్నాడు ఫ్యాక్టరీకి వెళ్ళేసరికి, ఫ్యాక్టరీ యజమాని నిప్పులు కక్కుతున్నాడు. అతని క్లర్క్ రాలేదుట.

"ఇప్పుడు సామర్లకోట వెళ్ళాలి, యెలా..." ఆయన గొణుక్కున్నాడు.

"మీ కభ్యంతరం లేకపోతే నేనొస్తాను సర్..." అన్నాడు ఆదిత్య.

"వీరాస్వామీ ! ఆ ఫైలు ఆదిత్యకు ఇవ్వు" అన్నాడు. అయిదు నిముషాలకు కారు కదిలింది. వెనుక సీట్లో యజమాని ప్రసాదరావు కూర్చున్నాడు. ముందు డ్రైవర్ ప్రక్కన ఆదిత్య కూర్చున్నాడు.

అక్కడ ప్రసాదరావుకు బంగళా ఉంది. అక్కడ దిగారు.

"నేను కొంచెం ఊర్లోకి వెళ్ళివస్తాను. నువ్వు విశ్రాంతి తీసుకో..."

"కార్లోనే వచ్చాను. విశ్రాంతి దేనికి సర్ !"

"ఏదయినా చదువుకో..." అని అతను వెళ్ళిపోయాడు.

అక్కడున్న పనివాడు పక, పక నవ్వాడు.

"ఏటి బాబూ ! కొత్తగా వచ్చేవేమిటి ! అయ్యగారిక్కడ రెండో పేమిలీ చెటప్పు చేశాడు. అడికెత్తంటే నేరెవర్ని కూడా వద్దంటరు..."



"మరి నాకేం తెలుసు."

"తెలియని విషయాలు నన్ను అడుగుతుండు...చెప్తాను." అతను ఠీవిగా చెప్పాడు.

"మంచిది." వారపత్రిక తీసుకుని కూర్చున్నాడు.

అతని దృష్టక్కడున్న ఫోన్‌పై పడింది. అతను ఒక్క క్షణం ఆలోచించాడు. అక్కడున్న బెల్లు కొట్టాడు. పనివాడు పరుగెత్తుకు వచ్చాడు.

"ఓ సిగరెట్టు పెట్టె తెచ్చి పెట్టు."

"అట్లాగే బాబూ ! ఇల్లు జాగ్రత్త..." అతను వెనుక తలుపులు వేసి వచ్చాడు. అతను గేటు దాటగానే ముందు తలుపు వేశాడు. గబా, గబా ఆదిత్య నంబర్ తిప్పాడు. కోడ్ నంబర్ రెస్పాన్ రాగానే అతనికి ప్రాణం లేచి వచ్చింది.

"హల్లో..."

"నీలూ..."

"హల్లో ఆదిత్యా...ఏమిటి...ఎప్పుడు వస్తావ్ !

"నీలూ..." చైనులు వివరాలు చెప్పి, పోలీసులకు కంప్లైయింటు ఇవ్వు అని చెప్పాడు. నీలిమ త్వరగా వచ్చెయ్యమన్నది.

"నీదే ఆలస్యం ! అక్కడ డిపార్ట్‌మెంటును మేపే వచ్చి ఉంటారు. జాగ్రత్త అనుమానిస్తే నా అంతం చూస్తారు." అని ఫోన్ పెడుతుండగానే బెల్ కొట్టారు.

ఆదిత్య తలుపు తీసి ఆశ్చర్యంగా నిలబడిపోయాడు. చైనులు !

"మీరెప్పుడు వచ్చారు మామయ్యా !"

"అక్కడ తెలిసింది నిన్ను ప్రసాదరావ్ తీసుకు వచ్చాడని." అతని ముఖంలో ఆందోళన కనిపించింది.

"అంత ఆందోళన దేనికి నేనేమయినా అమ్మాయినా !" అన్నాడు, తన కలవరం బయట పడనీయకుండా.

"అది కాదు...నాకు కొడుకులు లేరు. నిన్నే నా కొడుకు అను సుంటాను. అందుకని దయచేసి నువ్వు ఎక్కడికి వెళ్ళినా, చెప్పి వెళ్ళు రాయనా..." అన్నాడు.

"సారీ మామయ్యా..." అన్నాడు.

"ఈ ఇంట్లో పనివాడు ఉండాలి..."

"తవరా చైనులుగోరూ...", అంటూ విల్స్‌ప్యాకెట్టు పట్టుకుని వచ్చాడు, పనివాడు.

"సిగరెట్లెవరికిరా !"

"ఈ బాబుగోరు..." అన్నాడు ఆదిత్యను చూపి.

"ఓహో ! ఈ అలవాట్లు అన్నీ ఉన్నాయన్న మాట." చిరాకుగా చూచాడు.

ప్రసాదరావుకోసం అని అబద్ధం ఆడుదామనుకున్నాడు. ఆయనే బాండు వాడతారోనని, తల వంచుకున్నాడు.

"నా జీవితం ఆఖరు దశలో ఉన్నది. నేను తాగుతాను, తింటాను. వు ఇప్పుడే ప్రారంభించావు కదయ్యా" అన్నాడు విసుగ్గా.

"సారీ మామయ్యా" అన్నాడు.

వాళ్ళు కాఫీ తాగుతుండగా ప్రసాదరావు వచ్చాడు.

"చైనులూ ! ఏమిటిలా వచ్చేవ్ !"

"నా కాబోయే అల్లుడిని నువ్వు తీసుకొచ్చావు. అందుకే వచ్చాను."

"ఓహో ! అదా సంగతి, ఏమయ్యా ఆదిత్యా, ఆ ముక్క మొదటే చెప్పవద్దా !" అన్నాడు.

"రేపుగాని, ఎల్లుండిగాని వస్తామయ్యా."

"రెండు రోజుల పని ఉందా ?"

"నీ అల్లుడిని కొరుక్కుతిననులే..."



ఇద్దరూ నవ్వారు. ఆ రోజంతా అక్కడే గడిపి చైనులు వె పోయాడు. ప్రసాదరావు జాలిగా చూచాడు.

"ఆ పిల్ల కోసం నీకు వల విసిరాడా..." నవ్వాడు.

"అబ్బే..." ఏదో చెప్పబోయాడు.

"తప్పించుకోకు. ఎట్లాగయినా ఆ పెళ్ళి తప్పించుకో. ఇద్దరూ రా సులే. ఈ చైనులుగాడిని నమ్మొచ్చుగాని ఆ పిల్ల ముండను నమ్మలేం అన్నాడు.

ఆదిత్యకు అతను నిజం మాట్లాడుతున్నాడో, చైనులి గూఢచారి పనిచేస్తున్నాడో తెలియలేదు.

"ఆడపిల్ల ఒకసారి తప్పు చేస్తే క్షమించకూడదా."

"మళ్ళీ చేయదన్న నమ్మకం ఏమిటి? నువ్వు చూస్తే బుద్ధిమం డిలా ఉన్నావు." అన్నాడు అతను.

అలా ఆ రోజు గడిచింది. మర్నాడు సాయంత్రం ప్రసాదరా చెప్పిన లెక్కలు రాస్తుండగా హడావుడిగా వచ్చాడు పని అతను.

"అయ్యగారు ఫోనండి..." అందుకున్నాడు.

"ఏమిటి ? చైనుల్ని అరెస్టు చేశారా ! ఇల్లంతా సోదా చేశారా.. వస్తున్నా...నువ్వేమి కంగారుపడకు...అబ్బే అతనిక్కడే ఉన్నాడు. మరో రెండు నిమిషాలు మాట్లాడి ఫోన్ పెట్టేశాడు.

"ఆదిత్యా ! చైనులుని అరెస్టు చేశారుట."

"యెందుకు ?"

"ఏ విషయం తెలియదు. వెళ్దాం పద."

"మీరు పదండి. నేను తరువాత వస్తాను." అతన్ని పంపించివేశాడు ఆ నిమిషం చైనులు చెప్పిన వార్నింగ్ మాటలు మరిచిపోయాడు ప్రసా రావు.

# 25

**తల్లికి** భర్తతో కలిసి నమస్కరించింది నీలిమ. ముకుందాదేవి సజల నయనాలతో కూతురి, అల్లుడి తలలు నిమిరింది.

"మీ నాన్న బావున్నారా నీలూ !"

"అమ్మా !..." తల్లి హృదయంలో తల దాచుకుని బావురుమన్నది నీలిమ.

"ఏమిటమ్మా !" కూతురుని దూరం జరిపి అడిగింది ముకుందాదేవి.

"దేవీ ! నందనరావుగారు పోయారు..." దూరంగా నిలబడిన శివాజి కల్పించుకుని చెప్పాడు.

"ఏమిటి...నందనరావు...నందనరావు పోయాడా ?"

ఆమె అలా రాయిలా నిలబడిపోయింది.

"అవునమ్మా ! అతను కోరిన కోరిక ఏది తీరకుండానే పోయాడు. ఆఖరు క్షణంలో జోవచ్చుతానంద అంటూ పాడు తల్లీ అనేవాడు..." అంటూ మాట్లాడలేనట్లు బావురుమన్నది.

"ఎవరికేది ప్రాప్తమో మనము చెప్పలేము." నిట్టూర్చింది ముకుందాదేవి. ఒక్కనిముషం కళ్ళు మూసుకుంది.

"మన జీవితాలు ఎందుకిలా అయ్యాయి ! యెందుకమ్మా !"

"దానికి జవాబు నా దగ్గరలేదు నీలూ ! అవతల బండికి సమయం అయినట్టుంది, వెళ్ళాలి." అన్నదామె.

"దేవీ ! మీతో మాట్లాడవలసిన విషయాలు చాలా ఉన్నాయి. మీరు వెళ్ళటానికి వీల్లేదు."

"నేను వెళ్ళితీరాలి చక్రీ ! నేను అన్నీ వదులుకుని ఆ పరమాత్ము



డిని చేరుకోవాలనుకుంటున్నాను. నాకీ ఇహలోక బంధాలు, బంధనాలు వద్దు." అన్నది, ఆమె యెటో చూస్తూ.

"మీకు కనిపించే వ్యక్తుల కష్టసుఖాలు వద్దు, కాని పరలోక సౌఖ్యం కావాలా ముకుందాదేవిగారూ !" ఆదిత్య తీక్షణంగా అడిగాడు.

"అవునండీ...అతనిపై కొండంత నిందపడింది. దాదాపు నేరస్థులంతా అరెస్ట్ అయ్యారు..."

"కాలేదు, ప్రాణాలకు తెగించి, పట్టుకున్నాము. దయచేసి, మీ వేదాంతం కాస్త కట్టిపెట్టి మీ కూతురు జీవితం సుఖమయం చెయ్యండి. నన్ను ఈ నరక బాధనుండి తప్పించండి" అన్నాడు ఆదిత్య. ఆమె ఆశ్చర్యంగా చూచింది. మాట్లాడేది ఆదిత్యేనా ?

శివాజి ఆదిత్యవంక ఆపమని చూచాడు.

"మనసులోలేని మనఃశ్శాంతి యెక్కడో దొరుకుతుందనుకోవటం మూర్ఖత్వం. మనిషి మొదట ఈ లోకంలోని విషయాలను అర్థం చేసుకోవాలి. ఆ తరువాత పరలోక విషయాలు ఆలోచించాలి" అన్నాడు.

ఆమె మాట్లాడలేకపోయింది.

ఆమెకు నందనరావు మరణవార్తే బాధాకరంగా ఉన్నది. పైగా శివాజి మాటలకు తట్టుకోలేకపోతుంది. ఆమె మూగగా కన్నీరు కార్చింది.

"మిమ్మల్ని బాధ పెట్టాలనికాదు దేవీ ! ఆదిత్య ఎంతో కష్టపడి అందరిని పట్టించాడు. ఇందులో మీ సాక్ష్యం ఎంతో అవసరం."

"నిజమా ! అందరూ దొరికారా..." ఒక్కక్షణం సంతోషించినా, ఆమె ముఖాన నీలినీడలు కదలాడాయి.

"నాకు తెలుసు దేవీ ! మీరు మీ జీవితం గురించి ఆలోచిస్తున్నారు. ఈ వార్తలు పేపర్లకు ఎక్కుతాయని, అందరూ నిరసనగా చూస్తారని. మీ జీవితం రెండు భాగాలు గడిచింది. ఆదిత్యది ప్రారంభం అయింది..."

"చక్రీ...ఇంకేం చెప్పొద్దు...నేను...నేను వస్తున్నాను."

ఆమె వెళ్ళి తోటి ప్రయాణీకులతో మాట్లాడి తన బ్యాగు తెచ్చుకున్నది. అందరూ కలిసి మారేడుపల్లిలో నీలు ఉంటున్న ఇంటికి వెళ్ళారు.

నిలువెత్తు నందనరావు ఫోటో చూస్తూనే ఆమె విరుచుకుపడిపోయింది. అరగంట తరువాత తేరుకున్నది. ఆమె స్నానంచేసి వచ్చి మళ్ళీ ఏం అలంకరించుకోలేదు.

అలా సాదాగావున్న తల్లి ముఖం చూడలేక పోయింది నీలిమ.

"ఆదిత్యా! రా నాయనా..." మొదటిసారిగా ఆప్యాయంగా పిలిచింది ముకుందాదేవి.

ఆదిత్య వచ్చి కూర్చున్నాడు.

"మీ సత్యవతి గొప్పనటి. అమెరికా వెళ్ళిందన్నారు. పట్టుబడ్డ నాటి నుండి, పిచ్చిదానిలా నటిస్తూంది" అన్నాడు.

"నాకే ద్రోహం తలపెడుతుందని అనుకోలేదు."

"క్యాష్ అంతా ఖర్చు చేశారు. పొలాలు, ఇళ్ళు కొన్నారు. బంగారము, వెండి మాత్రం అందరి దగ్గరా దొరికింది."

ఆమె గాఢంగా నిట్టూర్చింది.

"మీకు తెలియకుండా ఓ చిన్న సాహసం చేశాము. ఈ బంగారం, వెండి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే అది వాళ్ళ బొక్కసంలోకిపోయి, లెక్కా పత్రం ఉండదు. మీరెంత కష్టపడి సంపాదించారు. ఏదయినా సత్కార్యం చేద్దామని...పోలీసు ఇన్‌స్పెక్టరుతో లాలూచి పడక తప్పలేదు" అన్నాడు.

"కొంత వారికిచ్చి, మనది, మనము తెచ్చుకున్నాము. మనము అంచనా వెయ్యలేదమ్మా! బంగారమే కొన్ని లక్షల ఖరీదు చేస్తుంది" అన్నది తల్లికి పాలు తెచ్చి ఇచ్చిన నీలిమ.

ముకుందాదేవి మాట్లాడలేదు.



"మీరేం విచారించకండి. ఈ కేసు బయటికి రాకుండా చూచే పూచి నాది." అన్నాడు ఆదిత్య.

ఆమె అపనమ్మకంగా చూచింది.

"ఈ విషయంలో మీరు నిశ్చింతగా ఉండండి. డబ్బుంటే ఏ పని అయినా తేలికగా చేయవచ్చు" అంటూ ఆమెపైకి ఓ వార్తాపత్రిక విసిరాడు.

ముకుందాదేవి తన గురించి ఏమయినా రాసారేమోనని తీసుకుని ఆత్రతగా చూచింది.

"ప్రముఖ వ్యాపారవేత్త పరశురామ్‌గారి పుట్టినరోజు పండుగ క్లబ్బులో ఘనంగా జరిగింది. దానికి పురప్రముఖులు, గవర్నరు, మంత్రులు విచ్చేసి పార్టీని జయప్రదం చేశారు" అని ఉంది. అతని ఫోటోతోపాటు వచ్చిన వార్త. అతని కూతురు నోట్లో కేకు పెడుతుంది.

"ఇతను సంవత్సరం క్రితం ఏదో అవినీతి కేసులో పట్టుపడి, విడుదల అయ్యాడు కదూ!"

"అవును."

"మరి గవర్నరు యెలా వచ్చినట్టు? ప్రభుత్వమేకదా, అతనిపై కేసులు పెట్టింది?"

"మన ప్రభుత్వం అంత ఘనంగా పని చేస్తుందన్నమాట. వాళ్ళకు డబ్బు తప్ప మరేం అక్కరలేదు."

క్రింద మరో ఉత్సవం చూచింది. 'శ్రీరామలింగేశ్వరరావు షష్టిపూర్తి మహోత్సవము' రామలింగేశ్వరరావు ప్రక్కన అంతా పోలీసు అధికారులు, గొప్పవారున్నారు.

రామలింగేశ్వరరావు తమ్ముడిని హత్య చేసిన నేరంపై అరెస్ట్ చేసింది ఈ పోలీసులే.

ఆమె నిట్టూర్చింది.

"వారికి ఓ కోడ్ ఆఫ్ కాండక్ట్ లేదు. యథా పాలకులు, తథా పాలితులు" అన్నాడు.

"నా కిప్పుడేం అర్థం కాలేదు...కాదు. నేను రెండు గంటలు ఒంటరిగా ఉంటాను" అన్నది ముకుందాదేవి.

"నీలూ ! నాకొక కప్పు కాఫీ కావాలి" ఆదిత్య భార్యను ప్రక్కకు పంపించివేశాడు.

"చూడండమ్మా ! నాకు తల్లి, తండ్రీ లేరు. ఉన్న పెద్ద, ఆత్మీయులు మీరు. మీపై ఎలాంటి నిందా పడకుండా, మీ బ్రతుకు బయట పడకుండా చూచే పూచి నాది. అన్ని అనర్థాలు సన్యాసి అనే కాషాయరంగు బట్టల క్రింద దాచిపెట్టటం అంత భావ్యంకాదేమో." అన్నాడు.

"నీవు చూచిన ప్రపంచం చాలా చిన్నది ఆదిత్యా ! నిజాయితీగా బ్రతికేవాడికి రెండు పూటలా అన్నం దొరకదు. వేషం వేసుకుని మోసం చేసేవాడికి అన్ని సుఖాలు అమరుతాయి. నేను దేవుడి అవతారమెత్తి మోసం చేసిననాడు యెవరూ ఏమిటని ప్రశ్నించలేదు. ఈ రోజు నేను మామూలు స్త్రీగా బ్రతకాలనుకుంటే అందరూ ఆక్షేపిస్తారు. అవమానిస్తారు."

"అది నిజమేనండి శాస్త్రవిజ్ఞానం ఇంత పురోభివృద్ధి చెందినా మనుష్యుల్ని ఎండమావులలాంటి నమ్మకాలనుండి రక్షించి, తార్కికజ్ఞానంవైపు మళ్ళించలేకపోతున్నాము." అన్నాడు ఆదిత్య ఆవేదనగా.

"ఆదిత్యా ! నాకు ఈ విషయాలేం చెప్పకు. 'అమ్మా ఈ పని చెయ్యి' అని ఆదేశించు చేస్తాను." అన్నది.

"నాపై ఆమ్మాతం గురి కుదిరినందుకు ధన్యవాదాలు..." అని ఆదిత్యలేచి లాయర్ దగ్గరకు వెళ్ళాడు.

ముకుందాదేవి రెండు రోజులు విశ్రాంతిగా గడిపింది. నందనరావు కోసం కొన్ని నిమిషాలు మౌనంగా ప్రార్థించింది.

శివాజీ వచ్చి వెళ్ళిపోతున్నాడు.



ఆ రోజు నీలిమ ధైర్యం అంతా కూడ గట్టుకుని తల్లితో మాట్లాడాలనే నిశ్చయించుకుంది. ఆమె రామకృష్ణ పరమహంస జీవిత చరిత్ర ముందేసుకుని కూర్చుంది.

"అమ్మా ! ఈ గ్రంథాలవలన మనఃశ్శాంతి లభ్యమవుతుందా !"

"ప్రయత్నించాలి కదా !"

"అంతా భ్రమ !"

"కావచ్చు."

"మనిషి కోరికలను బలవంతంగా చంపుకోవటం దేనికి ? అవకాశం ఉన్నప్పుడు తీర్చుకోవచ్చుగదా."

"తీర్చుకోవచ్చు..." ఆ ప్రశ్న ఎందుకడిగిందో అర్థం కాలేదు. ఈ నాలుగయిదు, రోజులలో కూతురు కాపురం క్షుణ్ణంగా అర్థం చేసుకుంది. సమర్థుడయిన పురుషుని సమక్షంలో ఆమె హాయిగా గడపగల్గుతుంది. అన్యోన్యంగా ఉంటున్నారు. మరి కోరికల ప్రసక్తి దేనికో అర్థం కాలేదు.

"నువ్వు యెవరి గురించి అడుగుతున్నావ్ నీలూ !"

"నీ గురించేనమ్మా..." తలవంచుకున్నది.

"నా గురించా !" దెబ్బతిన్న పక్షి ఆర్తనాదంలా వినిపించింది గొంతు.

"అవునమ్మా ! డాడీ ఒంటరివాడు. మీ ఇద్దరికి..." నీలు మాట పూర్తికాక పూర్వమె ఆమె చెంప చెళ్ళుమంది.

"అమ్మా !"

"అమ్మనే...నీకు...ఏ విషయము దాచకుండా రాసాను. దానికిదా నువ్వు నన్ను అడిగే ప్రశ్న !" నిప్పులు కురిసే కళ్ళతో అడిగింది.

"నా ఉద్దేశం అదికాదమ్మా..."

"నీ ఉద్దేశం ఏదయినా, నేనిప్పుడు ఎలాంటి మార్పు కోరను. నా జీవితం ఆ కృష్ణపరమాత్మలోనే లీనమౌతుంది." అన్నది దృఢంగా.

"మళ్ళీ నాటకం ఆడతారా !"

"లేదు, మౌనంగా ఆశీర్వదిస్తాను" అన్నది. తల్లి అభిప్రాయం అర్థం కాలేదు.

ఆమె మౌనంగా ఆ గదిలోనుండి నిష్క్రమించింది.

కృష్ణకుంజ్ లో యెప్పుడు యెవరు వెళ్ళినా మురళీనాదం వినిపిస్తుంది. ఎక్కువగా మోహనరాగం వినిపిస్తుంది. గేటు దాటగానే ఓ పెద్ద బోర్డు కనిపిస్తుంది

"నీకున్న దానితో తృప్తిపడు. ఉన్నదాంట్లో ఆ కృష్ణపరమాత్మ పేరుతో నల్గురికి పెట్టు" అన్న అక్షరాలు దానిపై కనిపిస్తాయి. నాల్గు అడుగులు వేస్తే 'భగవత్ దర్శనానికి దారి' అన్న బాణం గుర్తు ఉన్న బోర్డు కనిపిస్తుంది. దాని క్రింద నీలంరంగు అక్షరాలు స్పష్టంగా కనిపిస్తాయి.

"కష్టసుఖాలు రెండూ ఆ పరమాత్ముడి ప్రసాదాలే. చిరునవ్వుతో స్వీకరించిన వాడే స్థితప్రజ్ఞుడు."

అక్కడనుండి ముందు వెళ్తే లతాకుంజం కనిపిస్తుంది. "ఆ పరమాత్ముడొక్కడే అనేక రూపాలలో దర్శనమిస్తాడు. ఆ పరమాత్ముడినే దర్శించండి." అని దానిచుట్టూ ఉంటాయి. అది దాటివెళ్తే కృష్ణమందిరం, అక్కడి తూగుటుయ్యాలపై ముకుందాదేవి చిరునవ్వుతో పడుకుని ఉంటుంది.

ఆమె ఎదురుగా కూర్చున్న భక్తులు తమ కష్టసుఖాలను వెళ్ళబోసుకుంటారు. ఆమె చిరునవ్వుతో విని, వారి తలపై చేయివేసి నిమురుతుంది. అదే వారికి తృప్తి.

రోజులాగే ఒకసారి కృష్ణకుంజ్ అజమాయిషీకి వచ్చింది నీలిమ.



"ఒకప్పుడు ఇక్కడ తిరునాళ్ళగా ఉండేది. ఆమె చక్కపాల ఏ డాక్టరు బాగుచెయ్యని రోగాలు బాగుచేసేది."

"అంతేనా... పెళ్ళిళ్ళు కానివారికి పెళ్ళిళ్ళు చేసేది. ఏ కష్ట వచ్చినా తీర్చేది" అన్నారు మరెవరో.

"మరి ఇప్పుడు ఒక్కమాట మాట్లాడదేం ?"

"ఆమె పెట్టి, పోషించిన సన్యాసులే ఈమె ఆస్తికోసం గాల వేసి, అంతా దోపిడీ చేశారు. ఆమె భర్త గుండాగి మరణించాడు. ఈ ప్రపంచంపై విసిగి యాత్రలకు వెళ్ళింది."

"అవునట ! యాత్రలకు వెళ్తే అక్కడ ఆమెకు మనశ్శాం దొరకలేదుట. మానవసేవే మాధవ సేవని వచ్చేసింది."

"ఆయనగారి మహత్తుండబట్టేకదా, ఆ దొంగలు పట్టుపడ్డారు."

"అవునవును పోయిందంతా దొరికిందట. ఆ సన్యాసులకు శి పడిందట."

ఇలా రక, రకాల మాటలు విని గాఢంగా నిట్టూర్చిందామె. మనిషి మనిషిగా బ్రతుకనియ్యదు ఈ సమాజం. ఆమె వెళ్ళి 'కృష్ణ విద్యామందిర్' నిర్మాణం పర్యవేక్షించింది.

మిషనరీ స్కూల్ మోడల్ లో విద్య గరపాలని బడి కట్టిస్తున్నది. దానిలో ఇరవైమంది పిల్లలున్నారు. ప్రక్కనే స్థలం అమ్మితే కొన్నారు. ఇంట్లో 'శ్రీ కృష్ణ వృద్ధ సంక్షేమ గృహము' నడుపుతున్నారు.

పార్థసారథి కూడా ఒక గది తీసుకుని అక్కడ ఉంటున్నారు. 'నందన వనం'. అక్కడ విధిచేత దెబ్బతిన్న స్త్రీలకు వృత్తి విద్యలు నేర్పు తారు. వారుండటానికి వసతి గృహం కడుతున్నారు.

దానికి ఇన్ ఛార్జ్ స్వతంత్రి.

'సంగమం'...అక్కడ వికలాంగుల సంక్షేమ కార్యక్రమాలు జరుగుతాయి. ఉన్న రెండు గదులలో, పదిమంది వికలాంగులు ఉంటు

న్నారు. ఈ మధ్యే 'మురళి' అని ఒక పత్రిక స్థాపించారు. దాంట్లో ఎక్కువగా 'కృష్ణకుంజ్'లో జరిగే కార్యకలాపాల సమీక్ష ఉంటుంది. ఒకొక్కసారి ఇదంతా 'ఏమిటి' అని విసుగు వచ్చినా, భక్తులు సమర్పించిన కానుకల వల్ల తను సామాజిక అభివృద్ధి కార్యక్రమాలే చేస్తున్నది. ఆమెను దేవతని నమ్మి కానుకలు ఇస్తున్నారు కాని, సాంఘిక సంక్షేమానికంటే ఎవరూ ఇవ్వరు.

దానికి దేశంలోని విద్యాహీనతే కారణం.

ఆమె మెల్లిగా స్వతంత్రి గదివైపు నడిచింది. గదిలోనుండి శివాజీ బయటికి వచ్చాడు.

"స్వతంత్రీ ! బాగా ఆలోచించు. మనిషి ఒక్కసారి పొరపాటు చేస్తే క్షమించకూడదా ! నాకన్నీ ఉన్నా, ఒకొక్కసారి ఎంత ఒంటరిగా ఫీలవుతానో !" అన్నాడు. స్వతంత్రి జవాబు ఇవ్వలేదు. అతను వెళ్ళిపోయాడు.

"స్వతంత్రి గారూ !"

"ఏరా అమ్మాయిగారూ ! రండి..." ఆమె లోపలికి వెళ్ళింది. నీలిమ వెళ్ళి కూర్చోగానే, అక్కడున్న కాఫీ కప్పు తీసివేసింది.

"మీకు కాఫీ తెస్తాను."

"ఇప్పుడేం వద్దు."

మరేం ఫరవాలేదు. డాక్టరుగారు నా కాఫీ బావుందంటారు." అని ఆమె చిన్న వంటింట్లో దూరింది.

నీలిమకు ఆశ్చర్యంగా ఉంది. స్వతంత్రిని ఆస్పత్రి నుండి కృష్ణకుంజ్ తీసుకు వచ్చాడు శివాజీ.

ఆమె తల్లితండ్రులు, తమ్ముడు, మరదలు, మేనమామ అందరూ వచ్చి ఇంటికి రమ్మని ప్రాధేయ పడ్డారు.



"ఆమె అవసరం ఇప్పుడు మీకు లేదు కదా. ఎక్కడో ఒకచోట ఉండనివ్వండి అన్నాడు శివాజీ. అతనిమాట ఆజ్ఞగా స్వీకరించిందామె.

ఆమె విషయంలో అంత ఔత్సుక్యం ఎందుకో అర్థం కాలేదు.

వీళ్ళిద్దరూ ప్రేమికులా !

"తప్పు చేస్తే క్షమించకూడదా" అంటున్నాడు. పొరపాటు శివాజీ చేశాడా !

"అంతే అయి ఉంటుంది. స్వతంత్రి విలక్షణమైన యువతి.

"తీసుకోండి." ఆమె కాఫీ ఇచ్చింది.

"మీకు..."

"నాకు తాగాలని లేదు."

"నాకు మాత్రం తాగాలని ఉన్నదా !" అని ఆ కాఫీ రెండుగా చేసింది. ఇద్దరూ కాఫీ సిప్ చేయసాగారు.

"డాడీకి, మీకు పరిచయమా !"

"ఒకప్పుడు ఆయన నన్ను పెళ్ళి చేసుకోవాలనుకున్నారు."

యెంత సూటిగా ప్రశ్న వచ్చిందో, అంతే సూటిగా జవాబు వచ్చింది.

"మరి ఎందుకు ఆగిపోయింది."

"అతని పరిచయాలు ఇతర స్త్రీలతో నచ్చలేదు." అన్నది క్లుప్తంగా.

"అది చూచి, నేను పెళ్ళి వద్దన్నాను. ఒకటి రెండుసార్లు డాక్టరు గారు మా ఇంటికి వచ్చారు. అది ఆసరాగా తీసుకుని, మా అత్త, అదే మా మామయ్య భార్య ఇష్టం వచ్చినన్ని నిందలు, నిష్ఠూరాలు వేసింది. అయినా సహించాను. మెల్లగా అమ్మ, నాన్నలకు నూరిపోసింది. ఆ నరకం చెప్పలేను. నా బాధను, నన్ను అర్థం చేసుకున్న తమ్ముడిని నానా మాటలని 'నీ అక్కతోనే ఉండు' అన్నారు. దాంతో నాకు జీవితం పైనే విరక్తి కల్గింది. నేను బతికి ఉండి సమస్య లెందుకని ఆత్మహత్యా ప్రయత్నం చేశాను."

"స్వతంత్రిగారూ ! మీరు పిరికివారని అనను కాని చావు మాత్రం పరిష్కారం కాదు."

"నాకు తెలుసు. ఆ క్షణంలో అంతకంటే మార్గం తోచలేదు."

"శివాజీగారు నాకు తండ్రి అంటే నమ్ముతారా !"

"మీరు అభిమానంతో అతడిని డాడీ అంటారని తెలుసు."

"కాదు అతను నిజంగా నాకు తండ్రి." విషయాలు క్లుప్తంగా చెప్పింది.

"చూడండి స్వతంత్రీ ! కొందరి జీవితాలు విడదీయలేనంతగా ముళ్ళ కంపలలో ఇరుక్కుపోతాయి. వాటిని మానవతా దృక్పథంతో ఆలోచించాలి, నిజాన్ని దర్శించాలి" అన్నది.

"అయినా, ఇప్పుడు ఏం చేసినా, ఏమిటి లాభం ?"

"చూడండి, చిన్నది, ఈవిడకేం తెలుసు అనుకోకండి. వయసులో చిన్నదాన్ని అయినా పండిపోయినదాన్ని. అనుభవాల వరవడిలో జీవితాన్ని ఆకళింపు చేసుకున్నదాన్ని. ఇప్పుడు మీకు తోడు చాలా అవసరం. ఒక్కరికని కాదు. ఇద్దరికీ అవసరమే."

"ఇలా గడిపి వేయలేనంటారా !"

"ఇక్కడ మీకు ఉద్యోగం లేకపోయినా గడిపి వేయగలరు. అది కాదు. మన బ్రతుక్కి ఓ అర్థం, సార్థకత ఉండాలంటాను. యాంత్రికంగా గడిచే జీవితానికి, మనకు ఎవరో ఉన్నారనుకుని గడిపే జీవితానికి తేడా చాలా ఉంది."

స్వతంత్రి మాట్లాడలేదు.

"మీరు ఆలోచించుకోండి స్వతంత్రీ. మిమ్మల్ని బలవంతపెట్టే అధికారం నాకులేదు. మీ రాకవల్ల డాడీ జీవితం వొడి దొడుకులు లేకుండా గడుస్తుందని నా అభిప్రాయం."

"మీకు నాపై ఉన్న నమ్మకానికి ధన్యవాదాలు."

"మీకిష్టమైతే సాయంత్రం డాడీ ఇంటికి రండి. మీరు రాకపోతే ఇష్టం లేదనుకుంటాను." అని లేచి బయటికి వచ్చింది నీలిమ.



ఆమెకు అప్పుడు గుర్తుకు వచ్చింది. రాత్రి ఆదిత్య వైజాగ్‌నుండి టెలిగ్రామిచ్చాడు, వస్తున్నానని. తను లేకపోతే అతను అలక సాగిస్తాడు.

ఆమె కార్లో కూర్చుని యాక్సిలేటర్ నొక్కింది.

ఆమె కారు ఆగుతుండగానే మరో కారు ఆగింది. అందులోనుండి ఆదిత్య, మరో యువకుడు దిగారు.

"కిశోర్ ! మా మిసెస్ నీలిమ. నీలూ ! వైజాగ్‌లో పార్టనర్ కిశోర్." పరిచయం చేశాడు.

"మరి నేనొస్తాను ఆదిత్యా." అన్నాడు నమస్కారాలు అయ్యాక.

"ఇంట్లోకి రా..."

"మరోసారి వస్తాను బ్రదర్" అతను వెళ్ళిపోయాడు.

"కిశోర్ కారు వస్తుంటే వచ్చేశాను నీలూ...హాట్, హాట్ కాఫీ..." అన్నాడు.

నీలిమ అతనికి కాఫీ ఇచ్చింది.

ఆమె మనసంతా అదోమాదిరిగా అయింది. ఈ సంతోష సమయాన నందనరావు బ్రతికి ఉంటే చాలా బావుండేది.

తనంటే యెంత ప్రేమ ! యెంత అభిమానం !

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నీలూ ! సాయంత్రం వరకు లేపొద్దు. డామ్ టైర్డ్..." అని పడుకున్నాడు.

అతను అలసట మీదున్నాడేమో హాయిగా నిదురబోయాడు.

అతని ప్రక్కన పడుకుని నవల చదువుతున్నది నీలిమ.

ఫోన్ వచ్చింది.

ఆమె లేచి ఫోన్ అందుకుంది.

"హల్లో నీలూ...స్వతంత్రి ఇక్కడికి వచ్చింది. నీతో చెప్పమన్నది." అన్నాడు డాక్టర్ శివాజీ.

"ఓ... ఫెంటాస్టిక్ డాడీ...వెంటనే వచ్చేదాన్ని. ఆదిత్య ఇప్పుడే వచ్చాడు. సాయంత్రం వస్తానని చెప్పు. డాడీ...ప్రతీ క్షణం అమూల్యమయినది. మీరు గుడిలో వెంటనే దండలు మార్చుకోండి."

11 / 5 Ramana

అవతలనుండి సన్నగా నవ్వు వినిపించింది.

"అయామ్ నాట్ జోకింగ్ డాడీ..." సీరియస్‌గా అన్నది.

"నో నీలూ! నువ్వు జోక్ చేస్తున్నావని కాదు మన పరిస్థితిపై నవ్వు వచ్చిందమ్మా" అన్నాడు.

నిజమే. తండ్రి పెళ్ళి గురించి కూతురు ఆదేశాలు ఇవ్వటమా! అయిదు నిమిషాలు మాట్లాడి ఫోన్ పెట్టేసారు

శుక్రవారం ఉదయమే శివాజీ, స్వతంత్రి గుడిలో దండలు మార్చుకుని కృష్ణకుంజ్‌లో అడుగుపెట్టారు. అక్కడ నిలబడిన నీలిమ హారతితో స్వాగతం పలికింది.

అదే మోహనరాగం, అదే ప్రశాంత వాతావరణం, అదే అలౌకిక ఆనందం.

స్వతంత్రి ముకుందాదేవికి నమస్కరించటానికి వెనుకంజ వేసింది. శివాజి మాత్రం నమస్కరించాడు.

కారులో తిరిగి వస్తుంటే స్వతంత్రి ముభావంగా ఉంది.

"స్వతంత్రీ! నీ ఆలోచనలు నాకు తెలుసు. ఆ అభాగ్యురాలిని అర్థం చేసుకో. ఆమె కృష్ణపరమాత్మ కాదు. కాని ఆమెవల్ల కొన్ని సంస్థలు నడుస్తున్నాయి. కొన్ని మంచి కార్యాలు జరుగుతున్నాయి. అదే గుర్తుంచుకో..." ఆప్యాయంగా ఆమె చెయ్యి నొక్కాడు.

ప్రతీ అవతారానికో కథ ఉంటుంది. ఆ అవతారంవల్ల ఉపయోగం జరిగితే వదిలివేయాలి, అంతే. ముకుందాదేవి తెలిసి చేసిన తప్పేమిటి? ఏమో!

దూరంగా పార్కునుండి కృష్ణకుంజ్‌లో రికార్డయిన పాట విని పిస్తోంది...'కృష్ణంభజ ప్రాణి' అంటూ. స్వతంత్రి అతనికి చేరువగా జరిగింది.

—: అయిపోయింది :—

[library stamp]